
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 | వెల: ₹ 5.50 | సంపుటి: 18 | సంచిక: 146
శనివారం 16-8-2025
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'మట్టిని నమ్ముకున్న వ్యక్తి రాబోయే రోజుల్లో ధనవంతుడు కావాలి'



ద్వైపాక్షిక చర్చల కోసం శుక్రవారం అలాస్కాలోని యాంకరేజ్‌కు చేరుకున్న రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు స్వాగతం పలుకుతున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్



ఎంతకైనా దిగజారుతుంది

ఎన్నికల అక్రమాలను చూస్తే అధికారం కోసం బీజేపీ ఎంతకైనా దిగజారుతుందని అర్థమవుతోందని ఖర్గే మండిపడ్డారు.

వివరాలు 6లో ▸



ఏపీపీ పోస్టులకు నోటిఫికేషన్

రాష్ట్ర ప్రాసిక్యూషన్ సర్వీసెస్‌లో 118 అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోస్టుల భర్తీకి టీజీఎల్‌పీ ఆర్బీ నోటిఫికేషన్ విడుదల చేసింది.

వివరాలు 3లో ▸



పసి మొగ్గలు... బర్త్‌డే గార్డెన్

ప్రతి విద్యార్థి పుట్టిన రోజు నాడు కేక్ కోయించడానికి బదులుగా వారితో టీచర్లు గార్డెన్‌లో మొక్కను నాటిస్తున్నారు.

వివరాలు 16లో ▸



అర్జున్‌కు మూడో స్థానం

తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ అంతర్జాతీయ చెస్ టోర్నీలో మూడో స్థానంలో నిలిచాడు.

వివరాలు 15లో ▸

న్యూస్‌రీల్

'క్లౌడ్ బరస్ట్'లో 60కి చేరిన మరణాలు



జమ్మూకశ్మీర్‌లోని కిష్తవాడ్ జిల్లా చోసీతీ గ్రామంలో 'క్లౌడ్ బరస్ట్' ఘటనలో మృతుల సంఖ్య శుక్రవారం 60కి చేరింది. 30 మృతదేహాలను గుర్తించి, సంబంధిత కుటుంబాలకు అప్పగించారు. మరో 69 మంది జాడ ఇంకా లభించలేదు. అధికారులు సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు.

- వివరాలు 6లో▶

పాక్‌లో వర్ష విలయం



పాకిస్తాన్‌తోపాటు పీవోకేలో కురుస్తున్న భారీ వర్షాలు తీవ్ర ఆస్తి, ప్రాణనష్టం మిగిల్చాయి. గత 36 గంటల వ్యవధిలో 214 మంది చనిపోగా పదుల సంఖ్యలో జనం గల్లంతయ్యారు. అత్యధిక ప్రాణ, ఆస్తినష్టం ఖైబర్ ఫంక్తున్వా ప్రావిన్స్‌లోనే సంభవించింది.

- వివరాలు 6లో▶

గ్రేడ్ పేరెంట్స్ కాదు.. గ్రేట్ పేరెంట్స్!



మార్కులు తగ్గినందుకో, పరీక్ష తప్పినందుకో తల్లిదండ్రులు కోపంతో ఊగిపోవటం అన్నది ప్రతి ఇంట్లోనూ ఉండేదే. అయితే ఇప్పుడిప్పుడు కొందరు పేరెంట్స్ పిల్లల తరఫున ఆలోచిస్తున్నట్లు ఇటీవల సోషల్ మీడియాలో పిల్లలు విస్తృతంగా షేర్ చేస్తున్న తమ అనుభవాలను బట్టి తెలుస్తోంది.

- వివరాలు 5లో▶



శుక్రవారం ఢిల్లీలోని ఎర్రకోట నుంచి దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

> ప్రతి ఒక్కరమూ భారత్‌లో, మన తోటివారు చెమటోడ్చి తయారు చేసిన వస్తువులనే వాడతామని ప్రతినబూనుదాం. ఇతరులూ వాడేలా చేద్దాం. స్వదేశీ వస్తువులే అమ్ముతాం అంటూ ప్రతి చిరు వ్యాపారీ, దుకాణదారూ బోర్డు పెట్టాలి. ప్రతి రంగంలోనూ దేశీయ తయారీ వస్తువులే ఉండాలి. వాటిని ప్రపంచ దేశాలన్నింటికీ ఎగుమతి చేసే స్థాయికి చేరాలి. టారిఫ్‌లతో మన రైతులు, పశుపాలకులు, మత్స్యకారులతో సహా ఎవరూ నష్టపోకుండా అండగా నిలుస్తా.
> ...: మోదీ :..

దుస్సాహసానికి దిగారో... ఖబడ్దార్!

మర్చిపోలేని గుణపాఠం తప్పదు • పాక్‌కు ప్రధాని మోదీ హెచ్చరిక

- అణు బెదిరింపులు ఇక చెల్లవు
- పాక్ ఆర్మీ చీఫ్‌కు చురకలు
- 'సిందూర్'తో దాయాదికి నిద్రలేని రాత్రులు
- ఉగ్ర పోషకులూ ఇకపై ఉగ్రవాదులే
- ఇదే నయా భారత నవమంత్రం
- ఎర్రకోట సాక్షిగా మోదీ స్పష్టీకరణ
- సుదీర్ఘంగా 103 నిమిషాల ప్రసంగం
- భారీస్థాయిలో సరికొత్త జీఎస్టీ సంస్కరణలు తెస్తున్నాం
- ఈ దీపావళికి ప్రజలకు డబుల్ బొనాంజా ఇస్తాం
- యువత కోసం రూ. లక్ష కోట్లతో కొత్త పథకం తెస్తాం
- ప్రైవేటు రంగంలో ఉపాధి పొందే యువతకు రూ. 15 వేలు.. 3.5 కోట్ల మంది యువతకు ఉపాధి
- శ్రీకృష్ణుడి స్ఫూర్తితో మిషన్ సుదర్శన చక్ర.. 2035కి శక్తిమంతమైన సరికొత్త రక్షణ వ్యవస్థ ఏర్పాటు

6లో

కృష్ణా, గోదావరి జలాలపై
తగ్గేదే లేదు

గోల్కొండ కోట వద్ద పంద్రాగస్టు ప్రసంగంలో సీఎం రేవంత్‌రెడ్డి

- కృష్ణా, గోదావరిలో శాశ్వత హక్కులు సాధిస్తాం.. ప్రజల్లో సెంటిమెంట్ రగిల్చేందుకు కొందరి కుట్రలు
- ఎవరెన్ని ఎత్తులు వేసినా చిత్తు చేస్తాం
- ప్రపంచంతో పోటీ పడేలా తెలంగాణ విజన్ 2047 పత్రం
- సంక్షేమానికి కేరాఫ్ కాంగ్రెస్ పాలన..
- స్వాతంత్ర్య వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- గోల్కొండ కోటలో ఘనంగా వేడుకలు



సాక్షి, హైదరాబాద్: 'కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణ వాటా సాధించే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజీ పడదు. గత పాలకుల నిర్లక్ష్యంతో జరిగిన నష్టాన్ని భర్తీ చేస్తూనే.. జలాల్లో శాశ్వత హక్కులు సాధించేలా ప్రభుత్వం వ్యూహాత్మక ప్రణాళికతో ముందుకు సాగుతోంది. ఇందులో ఎవరు ఎన్ని ఎత్తులు వేసినా చిత్తు చేస్తాం. ప్రజల దృష్టి మరల్చేందుకు సెంటిమెంట్‌ను రగిలించాలని కొందరు చేస్తున్న కుట్రలను తిప్పికొడతాం. అందుకోసం నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు ప్రభుత్వానికి అండగా నిలవాలి'అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. భారత 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం గోల్కొండ కోటపై ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన గురించి దాదాపు గంటపాటు ప్రసంగించారు. గత పాలకులు రూ.లక్ష కోట్లతో కట్టిన ప్రాజెక్టు కూలిపోయి ఆ నిధులు

మిగతా 12వ పేజీలో ▶

మీ పెట్టుబడికి మాదీ భరోసా

- స్థానిక పెట్టుబడిదారులనూ ప్రోత్సహిస్తున్నాం
- నేను మధ్యతరగతి ఆలోచన ఉన్న సీఎంను.. సంపద దోచి విదేశాలకు తరలించాలన్న కోరిక లేదు: సీఎం రేవంత్‌రెడ్డి
- క్రెడాయ్ హైదరాబాద్ ప్రాపర్టీ షో ప్రారంభం

3లో

జీఎస్టీలో 2 శ్లాబులే

5 శాతం, 18 శాతం మాత్రమే

- లగ్జరీ వస్తువులపై మాత్రం 40% ప్రత్యేక రేటు
- కేంద్ర ఆర్థిక శాఖ ప్రతిపాదన.. దీనిపై మంత్రుల బృందం అధ్యయనం
- సెప్టెంబర్ జీఎస్టీ కౌన్సిల్ భేటీలో నిర్ణయం!
- అనేక వస్తువులు, సేవల ధరలు భారీగా తగ్గే చాన్స్

15లో



మధ్యతరగతి కలలకు కొత్త రెక్కలు

జీఎస్టీలో కీలక సవరణలు తెస్తామన్న ప్రధాని ప్రకటన నేపథ్యంలో దీపావళి నుంచి నిత్యావసరాల ధరలు తగ్గే చాన్స్

సాక్షి, అమరావతి: దీపావళి నుంచి నిత్యావసర వస్తువుల ధరలు తగ్గే విధంగా జీఎస్టీలో కీలక సవరణలు తీసుకురానున్నట్లు ఎర్రకోట వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించడంతో మధ్యతరగతి ప్రజల ఆశలకు కొత్త రెక్కలు వచ్చాయి. మధ్యతరగతికి ఊరట ఇలా...



➤ వ్యవసాయం, టెక్స్‌టైల్స్, ఫెర్టిలైజర్స్, ఆటో విడిభాగాలు, చేతివృత్తులు, వైద్య పరికరాలు, మెడికల్ ఇన్సూరెన్స్ వంటి రంగాల ఉత్పత్తులను 5 శాతం పరిధిలోకి తీసుకురావడం ద్వారా మధ్యతరగతి వర్గాలకు ప్రయోజనం కల్పించే యోచనలో ఉన్నారు.



➤ ప్రస్తుతం 12 శాతం శ్లాబులో వెన్న, నెయ్యి, పండ్లు, మొబైల్ ఫోన్స్ వంటి 14 ఉత్పత్తులున్నాయి. వీటిలో అత్యధిక భాగం 5 శాతం పరిధిలోకి తీసుకువస్తారని అంచనా.

➤ అలాగే 28 శాతం శ్లాబులో ఏసీ, ఫ్రిడ్జ్, కార్లు, మోటార్ సైకిల్స్, కూల్‌డ్రింక్స్, పొగాకు, లగ్జరీ వస్తువులుండగా వీటిలో కన్జూమర్ డ్యూరబుల్స్, ఆటో, కూల్‌డ్రింక్స్ వంటి ఉత్పత్తులను 18 % పరిధిలోకి తీసుకువచ్చి, పొగాకు, లగ్జరీ ఉత్పత్తులపై 40 శాతం వరకు భారం వేయవచ్చని తెలుస్తోంది.

➤ ప్రస్తుతం 18 శాతం శ్లాబులో ఉన్న కొబ్బరి నూనె, టూత్‌పేస్ట్, సబ్బులు, కార్న్ ఫ్లేక్స్ వంటి వస్తువులను కూడా 5 శాతం పరిధిలోకి తీసుకురావాలని పలు రాష్ట్రాలు ఇప్పటికే సూచించాయి.



ట్రెండ్‌కు తగ్గట్లు మారాలి


ఇంజనీరింగ్ బోధన తీరుపై ఏఐసీటీఈ

- ఫ్యాకల్టీకి ఆన్‌లైన్ శిక్షణ అవసరం.. డేటాసైన్స్ బోధన డల్‌గా ఉంది
- సైబర్ సెక్యూరిటీ ట్రెండ్ గుర్తించాలి

వర్సిటీలకు మార్గదర్శకాలు విడుదల

సాక్షి, హైదరాబాద్

ఇంజనీరింగ్ బోధన తీరులో మార్పు రావాలని అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) అభిప్రాయపడింది. దేశంలోని అన్ని యూనివర్సిటీలు, ఇంజనీరింగ్ కాలేజీలకు ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను ఇటీవల విడుదల చేసింది. ఎక్కువమంది విద్యార్థులు చేరుతున్న కంప్యూటర్ సైన్స్, దాని అనుబంధ ఎమర్జింగ్ కోర్సులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొంది. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా బోధన ఉండాలని తెలిపింది. ఫ్యాకల్టీ అప్‌గ్రేడ్ అవ్వాలని, కాలేజీలు, వర్సిటీలు ఈ దిశగా శిక్షణ కార్యక్రమాలకు పదును పెట్టాలని వివరించింది. ఇదే తీరుగా బోధన కొనసాగితే విద్యార్థుల్లో నాణ్యత ప్రమాణాలు దెబ్బతింటాయని, ఉపాధి అవకాశాలు సన్నగిల్లుతాయని తెలిపింది.



మారుతున్న ట్రెండ్

దేశవ్యాప్తంగా ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలు పెరిగాయి. 2020–21లో 12,86,725 ఇంజనీరింగ్ సీట్లు అందుబాటులో ఉండగా, 7,28,443 మంది విద్యార్థులు ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరారు. ఆ సమయంలో కంప్యూటర్ కోర్సుల్లో 42 శాతం మాత్రమే చేరారు. కోర్ గ్రూపుల్లో ఎక్కువ మంది సీట్లు పొందారు. 2024–25 నాటికి ఈ ట్రెండ్ పూర్తిగా మారిపోయింది. ఇంజనీరింగ్‌లో 14,97,653 సీట్లు అందుబాటులో ఉంటే, 12,52,627 సీట్లు భర్తీ అయ్యాయి. ఈ సంవత్సరం కంప్యూటర్, ఇతర ఎమర్జింగ్ కోర్సుల్లో చేరిన వారు 71 శాతం ఉన్నారు. కోర్ గ్రూపుల్లో ప్రవేశాలు సగం పడిపోయాయి. దాదాపు 7 లక్షలకు పైగా విద్యార్థులు కంప్యూటర్

మిగతా 3వ పేజీలో

ఇదండీ జోక్ / కార్టూన్



మనమెందుకు భుజాలు తడుముకోవాలి.. అననివ్వండి సార్!!



శుక్రవారం రాజ్‌భవన్‌లో జరిగిన ఎట్ హోం కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్

5లో

ముంపెంత.. ముప్పెంత..?



వరద ఉధృతిని అంచనా వేసేందుకు ఖమ్మం జిల్లా యంత్రాంగం ఫ్లడ్‌గేజ్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. దీనికితోడు సాంకేతికతను జోడించి ఎగువ జిల్లాల అధికారుల సహకారం తీసుకుంటోంది. గతేడాది అనుభవాల దృష్ట్యా మున్నేరు, ఆకేరు, పాలేరు పరీవాహక ప్రాంత జిల్లాల్లో ఫ్లడ్‌గేజ్‌లను ఏర్పాటు చేసింది.

16లో

నైరుతి కాదు.. సైరుతి

నాడు లోటు.. నేడు 10% అధిక వర్షపాతం

- ఐదు జిల్లాల్లో అత్యధికం, ఏడు జిల్లాల్లో అధికం
- మిగిలిన 14 జిల్లాల్లో సాధారణ వర్షపాతం
- ఇంకా ఏడు జిల్లాల్లో ఇప్పటికీ లోటు వర్షపాతం
- నెలాఖరుకల్లా సంతృప్తికర స్థాయికి వర్షపాత గణాంకాలు

సాక్షి, హైదరాబాద్: నైరుతి వర్షాలు ఆశాజనకంగా ఉన్నాయి. సీజన్ ప్రారంభం నుంచి రెండు నెలల పాటు నెలకొన్న వర్షాభావ పరిస్థితులు ఇప్పుడిప్పుడే గాడిన పడుతున్నాయి. వారం రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలతో చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. ప్రస్తుత సీజన్‌లో ఇప్పటివరకు ఉన్న లోటు వర్షపాతం నుంచి క్రమంగా సాధారణ స్థాయికి గణాంకాలు

మిగతా 5వ పేజీలో ▶



అధిక వర్షపాతం నమోదైన జిల్లాలు (సెంటీమీటర్లలో)

జిల్లా	నమోదు	సాధారణం	శాతం
యాదాద్రి భువనగిరి	46.50	29.82	56
నల్లగొండ	38.08	25.93	47
సూర్యాపేట	47.41	33.48	42
జోగుళాంబ గద్వాల	33.82	24.96	35
హైదరాబాద్	49.54	36.62	35
వికారాబాద్	50.97	38.35	33
వరంగల్	67.47	55.63	21

అత్యధిక వర్షపాతం నమోదైన జిల్లాలు (సెంటీమీటర్లలో)

జిల్లా	నమోదు	సాధారణం	శాతం
నాగర్‌కర్నూల్	45.79	25.88	77
మహబూబ్‌నగర్	52.68	30.36	74
వనపర్తి	46.98	28.67	64
రంగారెడ్డి	50.45	31.32	61
నారాయణపేట	46.38	28.74	61


విజయ్ సేల్స్
నమ్మకం ముఖ్యం
www.vijaysales.com
మెగా ఫ్రీడమ్ సేల్
కొనండి మరియు విమానంలో ప్రయాణించండి
₹3,000* వరకు ఫ్లైట్ వోచర్‌తో
Paytm Flight Tickets
క్రెడిట్ కార్డు / డెబిట్ కార్డు మరియు పేపర్ ఫైనాన్స్ పై
₹30,000/-* వరకు
తక్షణ డిస్కౌంట్ మరియు క్యాష్ బ్యాక్
AMERICAN EXPRESS
INSTANT DISCOUNT UPTO ₹20,000*
ON AMERICAN EXPRESS EMI TRANSACTIONS
HDFC BANK
INSTANT DISCOUNT UPTO ₹7,500*
WITH EASYEMI ON HDFC BANK DEBIT / CREDIT CARDS
UP TO ₹30,000/- INSTANT DISCOUNT & CASHBACK ON CREDIT CARD / DEBIT CARD & PAPER FINANCE
WE ACCEPT EMI CARDS
TELEVISIONS
RANGE AVAILABLE FROM 32 (80 cm) TO 100 (254 cm)
FULL HD | 4K | 8K | OLED | QLED | QNED | NanoCell | Mini LED | Google TV | webOS | TIZEN
UPTO 26% CASHBACK* UPTO ₹26,000
REFRIGERATORS
RANGE AVAILABLE FROM 190 LTRS TO 800 LTRS
Latest Models - Convertible and Inverter Technology
ON SIDE BY SIDE UPTO 15% CASHBACK* UPTO ₹20,000
ON FROST FREE UPTO 20% CASHBACK* UPTO ₹10,000
ON DIRECT COOL UPTO 5% CASHBACK* UPTO ₹2,500
WASHING MACHINES
RANGE AVAILABLE FROM 6.5 KG TO 14 KG
Latest Models with AI & Turbo Wash, Hygiene Steam, Refresh and many more multi tasking features at your finger tips!!
ON FRONT LOAD UPTO 20% CASHBACK* UPTO ₹10,000
ON TOP LOAD UPTO 10% CASHBACK* UPTO ₹5,000
ON SEMI AUTOMATIC UPTO 7.5% CASHBACK* UPTO ₹1,500
AIR CONDITIONERS
RANGE AVAILABLE FROM 1 T TO 3 T
UPTO 40% OFF
KITCHEN APPLIANCES
UPTO 60% OFF
IT & MOBILE ACCESSORIES
UPTO 70% OFF
PARTY SPEAKERS
STARTING FROM ₹12,999*
iPhone 16 (128 GB)
DISCOUNT ₹8,700*
CASHBACK ₹3,000*
PRICE ₹79,900
EMI Starting at ₹2,967
oppo
Reno14 Series 5G
AI Portrait Camera
Available Now
Starting from ₹37,999
0 Down Payment
ColorOS
vivo
Y400 5G
It's My Style
Available Now
Starting from ₹21,999
10% Cashback
OnePlus Nord 5
Light Speed. Night Legend.
Starting from ₹31,999*
₹2,250 Instant Discount
OxygenOS
MacBook Air
Sky high performance with
M4 Starting from ₹79,910*
M2 Starting from ₹69,310*
STUDENTS AND TEACHERS GET UPTO 12% OFF*
+ Exchange bonus Up to ₹10,000*
hp
PAVILION, VICTUS, SPECTRE, OMEN, ENVY
• Cashback Upto ₹15,000/-*
• One EMI Cashback Offer*
• 1st Year ADP @ ₹999/-*
DELL Technologies
INSPIRON, INSPIRON GAMING, XPS ALIENWARE
• Cashback Upto ₹10,000/-*
• Dell Stereo Headset @ ₹999/-*
• Canon Printer @ ₹1,999/-*
ASUS
ROG, STRIX, ZENBOOK, TUF GAMING, ZEPHYRUS DUO
• Cashback Upto ₹3,000/-*
• Gaming Warranty Srarting @ ₹699/-*
• Asus Wireless Mouse @ ₹99/-*
For special discounts on corporate and builder enquiries, please email us at b2b@vijaysales.com
LED TVs | Large Appliances | Air Conditioners
Mobiles | Laptops | Desktops | Printers | Accessories
Kitchen Appliances
విజయ్ సేల్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్
హైదరాబాద్ | వరంగల్ | విజయవాడ | విశాఖపట్నం | రాజమండ్రి | తిరుపతి | కాకినాడ | ముంబై | ఢిల్లీ | థానే | నవీ ముంబై | పూనే | సూరత్ | వడోదర | అహ్మదాబాద్ | గురుగ్రామ్ | ఫరీదాబాద్ | నోయిడా | ఇందిరాపురం
SCAN FOR STORES
Scan to Shop Online
www.vijaysales.com

మీ పెట్టుబడికి మాదీ భరోసా

- స్థానిక పెట్టుబడిదారులనూ ప్రోత్సహిస్తున్నాం
- పాలసీల్లో పారదర్శకత ఉంటేనే అభివృద్ధి సాధ్యం
- నేను మధ్యతరగతి ఆలోచన ఉన్న ముఖ్యమంత్రిని
- సంపద దోచి విదేశాలకు తరలించాలన్న కోరిక లేదు
- సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టీకరణ
- హైటెక్స్‌లో క్రెడాయ్ హైదరాబాద్ ప్రాపర్టీ షో ప్రారంభం



మాదాపూర్: రాష్ట్రంలోకి వచ్చే పెట్టుబడులకు పూర్తి రక్షణ కల్పించే బాధ్యత తన ప్రభుత్వానిదేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పారిశ్రామికవేత్తలకు భరోసా ఇచ్చారు. స్వదేశీ పెట్టుబడిదారులను నిర్లక్ష్యం చేస్తున్నామని కొందరు తమపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. దేశ దేశాలు తిరిగి పెట్టుబడులు తెస్తున్న తాము.. మనదేశంలోని పెట్టుబడిదారులను ఎందుకు ప్రోత్సహించం అని ప్రశ్నించారు. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో మూడు రోజులపాటు నిర్వహించనున్న క్రెడాయ్ హైదరాబాద్ ప్రాపర్టీ షోను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. 'ప్రభుత్వాలు తీసుకునే విధానపరమైన నిర్ణయాల్లో పారదర్శకత ఉండాలి. అప్పుడే పెట్టుబడులు వచ్చి అభివృద్ధి దానంతట అదే వేగంగా జరుగుతుంది. గతంలో పాలించినవారు పాలసీ పెరాలసిస్ లేకుండా చూడడం వల్లనే నేడు మన హైదరాబాద్ నగరం ప్రపంచంతో పోటీ పడగలుగుతోంది. మీరు అపోహలకు లోబడితే అది అంతిమంగా రాష్ట్రానికి, దేశానికి కూడా నష్టాన్ని కలిగిస్తుంది. పోటీ పడండి, పాలసీలు అడగండి, అభివృద్ధి ఎలా చేయాలో సూచనలు ఇవ్వండి. మీ అనుభవాన్ని మాతో పంచుకోండి'అని పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు.

ఎయిర్‌పోర్టులు పెరిగితే మరింత అభివృద్ధి

గత పాలకులు కాళేశ్వరం కార్పొరేషన్ పేరుమీద 11.5 శాతం వడ్డీకి రూ.1 లక్ష కోట్ల అప్పు తెస్తే.. తాను 50 సార్లు ప్రధానమంత్రిని కలిసి రుణ పునర్వ్యవస్థీకరణ చేయించి, వడ్డీని 7.5 శాతానికి తగ్గించానని సీఎం తెలిపారు. 'తెలంగాణలో ఒక్కటే ఎయిర్‌పోర్టు ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో ఆరేడు ఉన్నాయి. మహారాష్ట్రలో 40 ఉన్నాయి. తెలంగాణకు అదనంగా వరంగల్‌లో ఒకటి, ఆదిలాబాద్‌లో మరొక ఎయిర్‌పోర్టుకు అనుమతులు తెచ్చాం. ఎయిర్‌పోర్టులు వస్తే రెండు, మూడోస్థాయి నగరాలు కూడా అభివృద్ధి చెందుతాయి. పారిశ్రామికాభివృద్ధి జరిగితే ప్రజల, ప్రభుత్వాల ఆదాయాలు పెరుగుతాయి. ఆటోమొబైల్ ఇండస్ట్రీని మన రాష్ట్రానికి ఆహ్వానిస్తే పోర్ట్ ఎంతదూరం ఉందని అడుగుతున్నారు. ఔటర్ రింగురోడ్డు 160 కిలోమీటర్ల నిర్మాణం జరిగితే రాష్ట్ర ఆదాయం రూ.3 లక్షల కోట్లకు చేరింది. అందుకే 360 కిలోమీటర్ల రీజినల్ రింగు రోడ్డు కోసం కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడుతున్నాం. రీజినల్ రింగురోడ్డుతోపాటు రీజినల్ రింగ్‌రైల్, ఫ్యూచర్‌సిటీ టు అమరావతి, బందర్ పోర్ట్ లైన్ ఎక్స్‌ప్రెస్ హైవే, రైల్వే కనెక్టివిటీ ఏర్పాటు చేసి ఇరువైపులా పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేయాలని కేంద్రం ముందు ప్రతిపాదన పెట్టాం'అని వివరించారు. ఈ కార్యక్రమంలో క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎన్.జయదీప్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి క్రాంతికిరణ్‌రెడ్డి, కన్వీనర్ కుర్ర శ్రీనాథ్, కో కన్వీనర్ అరవింద్‌రావు, జాతీయ అధ్యక్షుడు రాంరెడ్డి, క్రెడాయ్ తెలంగాణ అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేను మిడిల్ క్లాస్ సీఎంను

తమ ప్రభుత్వం రాష్ట్రంలో ముఖ్యంగా హైదరాబాద్‌లో ఆధునిక మౌలిక సదుపాయాల కల్పనకు ఎంతో కృషి చేస్తోందని సీఎం తెలిపారు. 'నేను సగటు మధ్యతరగతి ఆలోచన ఉన్న ముఖ్యమంత్రిని. సంపద కొల్లగొట్టి విదేశాలకు తరలించుకుపోవాలన్న ఆలోచన నాకు లేదు'అని స్పష్టంచేశారు. ప్రయాణికులు అధికంగా ఉండే మార్గాల్లోనే మెట్రో రైల్ విస్తరణ ఉంటుందని తేల్చి చెప్పారు. 'హైటెక్ సిటీ పక్కన చెరువులు, అడవులే అధికం. ఇక్కడ మెట్రో రైల్ ఎవరు ఎక్కుతారు? అందుకే నాగోల్ నుంచి ఎల్బీనగర్, ఒవైసీ హాస్పిటల్, చాంద్రాయణగుట్ట, అగ్రికల్చర్ యూనివర్సిటీ, కొత్త హైకోర్టు, శంషాబాద్ నుంచి ఎయిర్‌పోర్టు వరకు మెట్రో రీడిజైన్ చేశాం. ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు, కూకట్‌పల్లి, బీహెచ్‌ఈఎల్, పటాన్‌చెరు దాటి మెట్రోను పొడిగించాలి. మెట్రోకి, మూసీ ప్రక్షాళనకు, ఎలివేటెడ్ కారిడార్స్‌కు అనుమతులతోపాటు నిధులు ఇవ్వాల్సింది కేంద్ర ప్రభుత్వమే. కేంద్రం నుంచి మేం తెచ్చిన అనుమతుల జాబితాను అసెంబ్లీలో పెడతాం'అని సీఎం తెలిపారు.

ట్రెండ్‌కు తగ్గట్లు మారాలి

▶ మొదటి పేజీ తరువాయి

విభాగాల్లో ఏటా పట్టాలు పొందుతున్నారు. ఈ ఏడాది (2025–26) ఇంజనీరింగ్ సీట్ల సంఖ్య 15,98,245కు చేరింది. ఏడాది కాలంలోనే ఏకంగా లక్ష ఇంజనీరింగ్ సీట్ల లభ్యత పెరగ్గా, వీటిల్లో 90% కంప్యూటర్ కోర్సుల్లోనే ఉన్నాయి.

క్రిప్టో కీలకం

విద్యార్థులు సైబర్ సెక్యూరిటీ, డేటాసైన్స్ బ్రాంచ్‌లకు ప్రాధాన్యమిస్తున్నారు. అయితే, ఈ కోర్సుల బోధన ఇప్పటికీ సాధారణంగానే ఉందని ఏఐసీటీఈ భావిస్తోంది. కొత్త కోర్సులు కావడం, ఫ్యాకల్టీలు వీటిపై మాస్టర్ డిగ్రీలు చేయకపోవడం ప్రధాన కారణాలుగా గుర్తించింది. సైబర్ సెక్యూరిటీ విధానాల్లో ప్రతిరోజూ గణనీయమైన మార్పులు వస్తున్నాయి. నెట్‌వర్క్ సెక్యూరిటీ సిస్టమ్‌ను కంపెనీలు మైక్రో చిప్‌లెవల్‌కు తీసుకెళుతున్నాయి.కోడింగ్ సమాచారం క్రిప్టోగ్రఫీ ద్వారా అందిస్తారు. ఈ విధానంలోనూ అత్యాధునిక మాడ్యూల్స్ ప్రవేశించాయి. బహుళజాతి సంస్థలు క్రిప్టోగ్రఫీని తరచూ మారుస్తున్నాయి. ఎథ్నికల్ హ్యాకింగ్‌లో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ వచ్చింది. హ్యాక్ విధానమే కాదు... ఫైర్‌వాల్ సెక్యూరిటీ తీరు ఏడాదికి ఇప్పటికీ పోలిక లేనంతగా మారింది. కొన్ని కోడ్స్ అర్థం చేసుకోలేనంతగా వస్తున్నాయి. డిజిటల్ ఫోరెన్సిక్‌పై ఇంజనీరింగ్ కాలేజీల్లో ఈనాటికీ సరైన అప్‌గ్రేడ్ లేదని ఏఐసీటీఈ నిపుణులు అంటున్నారు.

దడ పుట్టించే డేటా

డేటాసైన్స్ బోధనలో కీలకమైన టెక్నిక్స్‌లో పరిపూర్ణత ఉండటం లేదని ఏఐసీటీఈ భావిస్తోంది. ఇంటర్ మేథ్స్‌పై పట్టు లేకున్నా, ఇంజనీరింగ్‌లో డేటాసైన్స్ తీసుకుంటున్నారు. ఉద్యోగం తేలికగా వస్తుందనే విద్యార్థులు భావిస్తున్నారు. అయితే, బోధనలో సరైన మెళకువలు విద్యార్థులు నేర్చుకోవడం లేదు. బిగ్ డేటాసెంటర్స్‌లో లాంగ్వేజ్, లాంగ్వేజ్ మాడ్యూల్స్ అత్యాధునికంగా వినియోగిస్తున్నారు. ప్రోగ్రామింగ్‌లో పైథాన్ అండ్ ఆర్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ వచ్చింది. డేటా విజువలైజేషన్‌లో పవర్ బీఐ, డీ3 పాయింట్ జేఎస్ వంటి వేగవంతమైన టెక్నాలజీ వచ్చింది. డేటా టెక్నాలజీలు కూడా మారిపోయాయి. ఇంజనీరింగ్ కాలేజీల్లో ఇలాంటి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ బోధన జరగడం లేదు. దీంతో డేటా సైన్స్ పూర్తి చేసినా, కంపెనీలకు వారు సరిపోవడం లేదు.

అప్‌గ్రేడ్ అవ్వాల్సిందే...

ఇంజనీరింగ్ సిలబస్ కేవలం బేసిక్స్ మాత్రమే నేర్పుతుంది. ప్రొఫెషనల్ స్కిల్స్‌పై బోధకులకు ఇంకా లోతైన పరిజ్ఞానం ఉండటం లేదు. దీనిని దృష్టిలో ఉంచుకొని ఫ్యాకల్టీకి సరైన శిక్షణ ఇప్పించాల్సిన అవసరముందని ఏఐసీటీఈ సూచిస్తోంది. సాఫ్ట్‌వేర్ రంగంలోని ప్రొఫెషనల్స్‌తో ఓరియంటేషన్ తీసుకోవడం, ప్రపంచంలోని కొన్ని పరిశోధన సంస్థలు, బిగ్‌డేటా అందించే కంపెనీలతో ఆన్‌లైన్ శిక్షణ ఇప్పించాలని తెలిపింది. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా వస్తున్న సాంకేతికతను తెలుసుకునే డిజిటల్ లేబొరేటరీలను కూడా సూచిస్తోంది. ఈ దిశగా కాలేజీ యాజమాన్యాలకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని కోరింది.

నాణ్యత దిశగా అడుగులు



మార్పులకు అనుగుణంగా బోధన ప్రమాణాలు పెరగాల్సిన అవసరముంది. నాణ్యతకు ఇదే ప్రామాణికం అవుతుంది. ఈ దిశగా ప్రయత్నాలు వేగంగానే జరుగుతున్నాయి. అనేక మార్గాల్లో అధ్యాపకులను అప్‌గ్రేడ్ చేసే ప్రక్రియ మొదలైంది. ఇంజనీరింగ్ బోధన వేరు... ప్రొఫెషనల్ స్కిల్‌ను జోడించడం వేరు. ఈ రెండూ సమన్వయం చేయడానికి కృషి జరుగుతోంది.

– డాక్టర్ కె.విజయకుమార్‌రెడ్డి (జేఎన్‌టీయూహెచ్ రెక్టార్)

జలదిగ్బంధంలో దుర్గమ్మ ఆలయం



పాపన్నపేట (మెదక్): మెదక్ జిల్లాలోని ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయం జలదిగ్బంధంలో చిక్కుకుంది. సింగూరు ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయడంతో మంజీరా నది ఉధృతంగా ప్రవహిస్తోంది. సింగూరు నుంచి 20,265 క్యూసెక్కుల నీటిని దిగువకు వదలడంతో మంజీర ఉరకలెత్తి ప్రవహిస్తోంది. దీంతో ఘనపురం ఆనకట్ట పొంగిపొర్లుతోంది. శుక్రవారం ఏడుపాయల్లో పరిస్థితిని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఇరిగేషన్, పోలీసు, ఆలయ అధికారులతో సమీక్షించారు.

కుంగిన మూసీ బ్రిడ్జి రోడ్డు



బీబీనగర్: యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్–భూదాన్‌పోచంపల్లి మార్గంలోని రుద్రవెల్లి వద్ద మూసీ లోలెవల్ బ్రిడ్జిపై రోడ్డు పూర్తిగా కుంగింది. హైదరాబాద్‌లో కురిసిన భారీ వర్షాలకు నాలుగు రోజుల పాటు మూసీకి వరద పోటెత్తింది. బ్రిడ్జి పైనుంచి వరద నీరు ప్రవహించడంతో రుద్రవెల్లి వైపు రోడ్డు ఎక్కడికక్కడ కుంగిపోయింది. రహదారి ప్రమాదకరంగా మారడంతో అధికారులు రాకపోకలు నిలిపివేశారు.

పుణేలో 'ఖజానా' దొంగ పట్టివేత

- ఆరుగురు దొంగల్లో పుణేలో ఒకరి అరెస్ట్.... దొంగలకు ఆశ్రయం కల్పించిన వ్యక్తి కూడా అరెస్ట్
- దోపిడీదారులకు ఆశ్రయం ఇచ్చింది బిహార్ వాసి

చందానగర్ (హైదరాబాద్): నగరంలోని 'ఖజానా' నగల దుకాణంలో దోపిడీకి పాల్పడిన దొంగల్లో ఒకరిని.. వారికి సహకరించిన వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. దోపిడీకి పాల్పడింది బిహార్ వారేనని సైబరాబాద్ ఎస్‌వోటీ, సీసీఎస్ పోలీసులు నిర్ధారించారు. నాలుగు రోజుల తర్వాత.. ఆరుగురు దొంగల్లో ఒకడైన ఆశిష్‌ను పుణేలో అదుపులోకి తీసుకున్నారు. ఆరుగురు నిందితులు జగద్గిరిగుట్టలో.. బిహార్ రాష్ట్రానికి చెందిన దీపక్ కుమార్ వద్ద 15 రోజులు ఆశ్రయం పొందారు. చందానగర్ ఖజానా నగల దుకాణంలో దోపిడీకి రెక్కీ నిర్వహించారు. సుమారు రెండు వారాల పాటు జగద్గిరిగుట్ట నుంచే.. పక్కా ప్రణాళికతో ఖజానా దుకాణంలో నగలను దొంగిలించి ఉడాయించారు. చందానగర్ నుంచి ఆరుగురు నిందితులు.. రెండు బైకులపై కొంత దూరం వెళ్లాక విడిపోయారు. ఎట్టకేలకు ఒకరు పట్టుబడగా.. మిగతా వారికోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు.

భూముల రేట్ల పెంపుపై తుది కసరత్తు

- కోర్ అర్బన్ ఏరియాలో చకచకా ఏర్పాట్లు
- కలెక్టరేట్లలో సమావేశమైన రివిజన్ కమిటీలు
- 38 సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసుల పరిధిలో ప్రస్తుతానికి పెంపు
- స్థానిక ఎన్నికల తర్వాతే గ్రామీణ ప్రాంతాల్లో సవరణ
- ఈ నెల చివరలో లేదంటే సెప్టెంబర్ 1 నుంచి అమలు..?

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భూముల విలువ సవరణ అంశం మరోసారి తెరపైకి వచ్చింది. వీలైనంత త్వరగా భూముల ప్రభుత్వ విలువను సవరించే దిశలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ తుది కసరత్తు ప్రారంభించింది. సవరణ ప్రక్రియకు ఇటీవల జరిగిన రెవెన్యూ శాఖ సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. దీంతో రాష్ట్రంలోని కోర్ అర్బన్ రీజియన్‌లో భూముల విలువను సవరించే ప్రక్రియ ప్రారంభమైంది. ఈ ప్రక్రియ ద్వారా వారం రోజుల్లోపు పూర్తిస్థాయిలో ప్రతిపాదనలు సిద్ధమవుతాయని, అనంతరం జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో అనుమతి తీసుకుని ఈ నెలాఖరులో లేదంటే సెప్టెంబర్ 1వ తేదీ నుంచి కోర్ అర్బన్ రీజియన్‌లో కొత్త విలువను అమల్లోకి తెస్తారని తెలుస్తోంది.

రాష్ట్రమంతా స్థానిక ఎన్నికల తర్వాతే..

భూముల సవరణ ప్రక్రియను ప్రస్తుతానికి కోర్ అర్బన్ ప్రాంతంలోనే అమలు చేయాలని, స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తయిన తర్వాత రాష్ట్రమంతా వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఔటర్ రింగురోడ్డుకు అటు, ఇటుగా పట్టణీకరణ అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లోని 38 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో తుది కసరత్తును రిజిస్ట్రేషన్ల శాఖ ప్రారంభించింది. కోర్ అర్బన్ పరిధిలోనికి వచ్చే ప్రాంతాల్లో ప్రత్యేక సవరణ ప్రక్రియను చేపట్టేందుకు రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్‌గాంధీ హనుమంతు ఈ నెల 13న జీఓ నంబర్ 90 జారీ చేశారు. ఓఆర్‌ఆర్‌కు ఇరువైపులా ఉన్న జీహెచ్‌ఎంసీ, కంటోన్మెంట్‌తో పాటు 20 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ల పరిధిలో సెంట్రల్ వాల్యుయేషన్ అడ్వైజరీ కమిటీ (సీవీఏసీ) సిఫారసు మేరకు తెలంగాణ మార్కెట్ విలువల సవరణ నిబంధనలు, 1998 ప్రకారం ఈ ప్రక్రియ అమలవుతుందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ జీఓ మేరకు గతంలో భూముల విలువల సవరణ కోసం రూపొందించిన మార్గదర్శకాలతో డీఐజీలు, హైదరాబాద్, హైదరాబాద్ (సౌత్), రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల పరిధిలోని జిల్లా రిజిస్ట్రార్లు, సబ్‌రిజిస్ట్రార్లకు ప్రత్యేక ఉత్తర్వులు కూడా పంపారు.

రివిజన్ కమిటీల భేటీ..

ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల పరిధిలోని అన్ని జిల్లాల్లో శుక్రవారం జిల్లా స్థాయి రివిజన్ కమిటీలు సమావేశమయ్యాయి. తాజా ఉత్తర్వుల ప్రకారం ఏ ప్రాంతంలో ఏ మేరకు వ్యవసాయ, వ్యవసాయేతర భూములు, ఆస్తుల విలువలను పెంచాలనే ప్రతిపాదనలపై చర్చించాయి. గతంలోనే సబ్‌రిజిస్ట్రార్లు, జిల్లా రిజిస్ట్రార్ల స్థాయిలో రూపొందించిన ఈ సవరణ ప్రతిపాదనలను జిల్లా రివిజన్ కమిటీ చైర్మన్ హోదాలో ఆయా జిల్లాల కలెక్టర్లకు అందజేశారు. ఈ ప్రతిపాదనలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం కలెక్టర్లు తుది ప్రతిపాదనలను స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు సమర్పించనున్నారు. ఈ తుది ప్రతిపాదనలను కేబినెట్ ముందుంచి అనుమతి తీసుకున్న అనంతరం కొత్త విలువలు అమల్లోకి రానున్నాయి.


సమాన వాటా లభిస్తేనే దేశం సస్యశ్యామలం

బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్

సాక్షి, హైదరాబాద్: బీసీలకు అన్ని రంగాల్లో సమాన వాటా లభించినప్పుడే దేశం సస్య శ్యామలం అవుతుందని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్ అన్నారు. ఇటీవల ఢిల్లీ పర్యటనను ముగించుకొని వచ్చిన దాసును పలువురు బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర ప్రతినిధులు, పలు జిల్లాల బీసీ నాయకులు అభినందించారు. ఈ సందర్భంగా సురేశ్ మాట్లాడుతూ బీసీలను విస్మరిస్తే తమకు రాజకీయ అధోగతేనన్న విషయం ఆయా పార్టీలకు అవగతమైందన్నారు.

118 ఏపీపీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల

టీజీఎల్‌పీఆర్బీ చైర్మన్ శ్రీనివాసరావు వెల్లడి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రాసిక్యూషన్ సర్వీసెస్ విభాగంలో 118 అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ (ఏపీపీ) పోస్టుల భర్తీకి తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (టీజీఎల్‌పీఆర్బీ) శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. మల్టీజోన్–1లో 50 పోస్టులు, మల్టీజోన్–2లో 68 పోస్టులు భర్తీ చేయనున్నట్టు టీజీఎల్‌పీఆర్బీ డైరెక్టర్ వీవీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలను తర్వలోనే వెల్లడిస్తామన్నారు. ఎల్‌ఎల్‌బీ లేదా బీఎల్ డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. తెలంగాణలోని క్రిమినల్ కోర్టుల్లో కనీసం మూడేళ్లు అడ్వొకేట్‌గా పనిచేసిన అనుభవం ఉండాలని సూచించారు. అభ్యర్థులు జూలై 1, 2025 నాటికి 34 ఏళ్లు మించి ఉండకూడదని తెలిపారు. రిజర్వేషన్ల వారీగా మినహాయింపులున్నాయని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ కేటగిరీలకు చెందిన అభ్యర్థులకు గరిష్ట వయోపరిమితిలో ఐదేళ్ల సడలింపు, దివ్యాంగులకు 10 ఏళ్ల సడలింపు, ఎక్స్ సర్వీస్‌మెన్ (ఇండియన్ ఆర్మీ లేదా ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ లేదా ఇండియన్ నేవీలో పనిచేసిన వారికి మాత్రమే) మూడేళ్ల సడలింపు వర్తిస్తుందని వెల్లడించారు. అదనపు వివరాలకు అభ్యర్థులు www.tgprb.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. దరఖాస్తు తేదీలు ప్రకటించిన వెంటనే హెల్ప్ లైన్‌ను అందుబాటులోకి తెస్తామని శ్రీనివాసరావు తెలిపారు.

“ సంశయాత్ముడై, శ్రద్ధ లేనివాడై, జ్ఞానశూన్యుడైన జనుడు తప్పక చెడును.
సంశయాత్మునకు ఇహ పరములలో ఎక్కడైననూ సుఖము లేదు.
– హిందూ ధర్మం

సాక్షి
శనివారం, 16 ఆగస్టు 2025

పారదర్శకతకు ‘సుప్రీం’ పట్టం

ప్రజాస్వామ్యంలో పారదర్శకతకు ప్రత్యామ్నాయం ఏమీ ఉండదని కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ)కి సుప్రీంకోర్టు తాజా ఆదేశాలతోనైనా అర్థమై ఉండాలి. బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ ఆ సంఘం ఆదరా బాదరాగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) పేరిట ఓటర్ల జాబితా సవరణ మొదలెట్టింది. ఎందరు ఎన్ని అభ్యంతరాలు చెబుతున్నా బేఖాతరు చేసింది. అసలు ఈ సవరణ తీరే వేరు. ఇంటింటికీ వెళ్లి కొత్త ఓటర్లను నమోదు చేసుకోవటం, జాబితాలో అప్పటికే ఉన్నవారిని సరిపోల్చుకోవటం, చిరునామాలో లేనివారిని తొలగించటం సాగిపోయేది. కానీ ఇప్పుడు ఆఖరుసారి ఓటర్ల జాబితా పూర్తి స్థాయి సవరణ జరిగిన 2003 జనవరి 1ని ప్రాతిపదికగా తీసుకుని, ఆ తర్వాత జాబితాల్లోకి ఎక్కినవారిని ఈసీ సంశయ ఓటర్లుగా పరిగణిస్తోంది. వారినుంచి రకరకాల ధ్రువపత్రాలు అడుగుతోంది. ఇవన్నీ 1955 నాటి జాతీయ పౌరసత్వ చిట్టా (ఎన్‌ఆర్‌సీ)లో నిర్దేశించిన పత్రాలు. సారాంశంలో ఈ ఓటర్లంతా ముందుగా దేశ పౌరులమని నిరూపించుకోవాలి. తమ పుట్టుకకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలతోపాటు తల్లిదండ్రుల జనన ధ్రువీకరణ పత్రాలు అందజేయాలి. ఆధార్, గతంలో ఈసీయే జారీచేసిన ఓటరు గుర్తింపు కార్డు కూడా పనికిరాదట. పనికొచ్చే పత్రాల్లో పాస్‌పోర్టు ఉంది. కానీ ఆ పాస్‌పోర్టు సాధించటానికి పౌరులు ఆధార్ కార్డే చూపుతారని ఈసీ మరిచింది. ఒకపక్క ఆందోళనలు సాగుతుండగానే సాగిన ఈ ‘సర్’ ప్రక్రియ తర్వాత ప్రకటించిన ఓటర్ల జాబితా ముసాయిదాలో ఏకంగా 65 లక్షలమంది పేర్లు గల్లంతయ్యాయి. 22 లక్షలమంది మరణించారని తేలిందని, రెండు చోట్ల ఓటుహక్కున్నవారు 7 లక్షల మంది కాగా, వలసపోవటం వల్లనో, ఇతర కారణాల వల్లనో 35 లక్షలమంది జాడలేదని అంటున్నది. అలాంటివారి పేర్లు తొలగించామని చెబుతోంది. నోటీసులిచ్చి, వాదనలు విని తొలగించామంటోంది. నిరుడు జూలై నుంచి డిసెంబర్ వరకూ ఓటర్ల జాబితాలను సరిచూసి, అవసరమైన సవరణలు చేసి ఈ ఏడాది జనవరిలో ఈసీ తుది జాబితా ప్రకటించింది. అందులో 7.90 కోట్లమంది ఓటర్లుండగా, తాజా ముసాయిదాలో 7.24 కోట్లమంది పేర్లున్నాయి. ఈ ఆర్నెల్లలో 22 లక్షల మరణాలు, మరో 35 లక్షల మంది వలసలు లేదా ఆచూకీ లేకపోవటం మాయాజాలం అనిపించటం లేదా? పైగా ఈసారి కేవలం నెల్లాళ్ల వ్యవధిలో... అంటే జూన్ 24న మొదలై జూలై 25 వరకే ఈ ప్రక్రియ సాగింది.

ఇంత తక్కువ వ్యవధిలో ఇన్ని కోట్లమంది అర్హతల్ని తేల్చిపారేయటం ఎలా సాధ్యమైందన్న సంశయాలు చాలామందికొచ్చాయి. ఈ విషయంలో నిందలు పడుతున్నా ఈసీ గంభీర వదనంతో ‘మీ దగ్గర ఆధారాలున్నాయా?’ అని ఎదురు ప్రశ్నించటం మరిన్ని సంశయాలకు దారితీసింది. ఇది ఈసీకీ, ఆరోపణలు చేస్తున్న నేతలకూ మధ్య పంచాయతీ కాదు. ఆ ఆరోపణలు అవాస్తమని రుజువు చేస్తే ఈసీ విశ్వసనీయతే పెరుగుతుంది. లేనట్టయితే విపక్షాలు చేసే ‘ఓట్ చోరీ’ ఆరోపణను జనం నమ్ముతారు. సుప్రీంకోర్టు గురువారం చెప్పింది కూడా ఇదే! తొలగించినవారి పేర్ల ఎదురుగా కారణమేమిటో పేర్కొంటూ జాబితా విడుదల చేయాలనీ, పేరు లేదా ఓటర్ క్రమ సంఖ్య టైప్ చేయగానే వివరాలు కనబడేలా ఆ జాబితా ఉండాలనీ ధర్మాసనం ఆదేశించింది. నిజానికి ‘ఓట్ చోరీ’ ఆరోపణ రాకముందు అలాంటి సదుపాయం ఉంది. అటు తర్వాత మాయమైందంటే ఏమనుకోవాలి? ఈ వివరాలతో పార్టీలకు జాబితా అందించామన్న ఈసీ వాదనలో పస లేదు. ఓటుహక్కు కోల్పోయినవారు కారణం తెలుసుకోవటానికి పార్టీల చుట్టూ తిరగాలా? జాబితా వెల్లడైతే ఓటర్ల గోప్యత హక్కుకు విఘాతం కలుగుతుందన్న సాకు అర్థరహితం. చనిపోయినవారి, ఆచూకీ లేనివారి హక్కులకై ఈసీకి ఎందుకంత తాపత్రయం?

‘సర్’ వల్ల ఎలాంటి పర్యవసానాలుంటాయో ఆ సంస్థకు అర్థమైనట్టు లేదు. బిహార్‌లోని 40 లోక్‌సభ స్థానాల్లో ఒక మీడియా సంస్థ తాజా ముసాయిదా ఆధారంగా విశ్లేషించగా దిగ్భ్రాంతికరమైన అంశాలు వెల్లడయ్యాయి. 2024 లోక్‌సభ ఎన్నికల్లో 24 చోట్ల నెగ్గినవారి మెజారిటీ కన్నా ఇప్పుడు తొలగించిన ఓటర్ల సంఖ్య అధికం! ఉదాహరణకు బెగుసరాయ్‌లో విజేత మెజారిటీ 81,480. కానీ అక్కడ తొలగించిన ఓటర్లు 1,23,178 మంది. షోహర్ స్థానంలో తొలగించిన వారు 1,09,723 అయితే, ఆ ఎన్నికల్లో విజేత మెజారిటీ 29,143! ఏ ఎన్నికల్లోనైనా అధిక ధరలు, నిరుద్యోగం వంటివి చర్చకొస్తాయి. ఈసీ నిర్వాకంతో రాగల బిహార్ ఎన్నికల్లో ఓటర్ల జాబితా తెరకాసే ప్రధాన అంశం కాబోతోంది. ఇది ఎన్డీయే కూటమికి మంచి పరిణామమైతే కాదు.

ఓటర్ల జాబితాలో పేరు తొలగించటమంటే పోటీ చేయటానికిగల హక్కును నిరాకరించటం కూడా. ఇది బిహార్‌తో ఆగదు. ఎన్నికలు జరగనున్న కేరళ, పశ్చిమ బెంగాల్, అస్సాం, తమిళ నాడులకు కూడా విస్తరిస్తుంది. ఇంత అస్తవ్యస్తంగా, ఇంత గోప్యంగా ఉండే ప్రక్రియ ద్వారా ఇంతకూ ఈసీ సాధించదల్చుకున్నదేమిటి?

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు శ్రావణ మాసం, **తిథి:** బ.అష్టమి రా.10.54 వరకు, తదుపరి నవమి, **నక్షత్రం:** భరణి ఉ.8.29 వరకు, తదుపరి కృత్తిక, **వర్జ్యం:** రా.7.39 నుండి 9.08 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.42 నుండి 7.27 వరకు, **అమృత ఘడియలు:** తె.4.33 నుండి 6.01 వరకు (తెల్లవారితే ఆదివారం), **శ్రీకృష్ణాష్టమి.**

సూర్యోదయం : 5.46
సూర్యాస్తమయం: 6.23
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

సోషల్ టాక్

నిలిచి గెలిచాం!



బ్రిటిష్‌వాళ్లు మన 3.5 కోట్ల మందిని చంపారు. 12 ఘోరమైన క్షామాలను సృష్టించారు. 45 ట్రిలియన్ డాలర్లు దోచుకున్నారు. ఇండియాను నల్ల మందు ఆర్థిక వ్యవస్థగా మార్చారు. దేశాన్ని రెండుగా విభజించారు. కేవలం 32 ఏళ్ల ఆయుః ప్రమాణాన్ని మిగిల్చివెళ్లారు. అయినా మనం నిలబడ్డాం. అందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు!

– ఆనంద్ రంగనాథన్, వ్యాఖ్యాత

ఇవీ కారణాలు



అమెరికా-భారత సంబంధాలు క్షీణించడానికి కారణాలు: యుద్ధం తగ్గించడంలో ట్రంప్ పాత్ర లేదని భారత్ ప్రకటించడం, పాక్ మాత్రం ట్రంప్ నోబెల్‌కు అర్హుడని చెప్పడం; రష్యా చమురుతో సంబంధం లేకుండానే ‘అమెరికా ఫస్ట్’ విధానంలో భారత్ తన సుంకాలను తగ్గించాలని ఒత్తిడి పెరుగుతోంది; పాక్‌లోని వనరులను ట్రంప్ అతిగా అంచనా వేస్తున్నారు; పాక్ లాబీయింగ్ భారత్‌ను మించిపోయింది.

– మ్యాక్స్ అబ్రహామ్స్, ప్రొఫెసర్

పరిపూర్ణ ఆనందం



జీవితం పర్వతాన్ని ఎక్కడం లాంటిది. అది పరుగు పందెం కాదు, పోటీ కాదు. దగ్గరి దారిని కనిపెట్టటం కూడా కాదు. జీవితంలోని పరిపూర్ణమైన ఆనందం... శిఖరాగ్రం పైన నిలబడటంలో కాదు, శిఖరాన్ని ఎక్కడంలో ఉంది.

– ఓ.పి. సింగ్, ఐపీఎస్ మాజీ అధికారి

తప్పేమీ లేదు



ఎల్లప్పుడూ యథాతథ స్థితిని సవాల్ చేస్తుండండి. నియమాలు ఉంటే ఉన్నాయి. వాటిని మీరు తప్పికొట్టవచ్చు. మీ పనిలో మీరు విజయం సాధిస్తున్నంత వరకూ మిమ్మల్ని ఎవరూ ప్రశ్నించరు. మీపై కన్ను వేయరు.

– విరాజ్ సేథ్, ఆంట్రప్రెన్యూర్

రెండు ఆలోచనలు



నిఖార్సైన మేధకు నిదర్శనం ఏమిటంటే, ఏక కాలంలో రెండు భిన్నమైన పనులకు సంబంధించిన ఆలోచనలను మనస్సులో ఉంచుకుని, రెండు పనుల నైపుణ్యాలనూ నిలుపుకోగల సామర్థ్యం.

– ఫల్గుణీ నాయర్, వ్యాపారవేత్త

నిర్ణయం-ఎంపిక



గొప్పతనం వ్యక్తిత్వం నుండి వస్తుంది. వ్యక్తిత్వం అన్నది ఒత్తిడిలో మనం తీసుకునే నిర్ణయాలు, చేసుకునే ఎంపికల నుండి వస్తుంది.

– ఆనంద్ చులానీ, వ్యక్తిత్వ నిపుణుడు

మన ముందున్న ఏఐ బాధ్యత

విశ్లేషణ



అరుణ్ సుబ్రమణియన్

కశ్మీర్‌లో మళ్ళీ హింసాయుత సంఘటనలు పెచ్చుమీరడం చూశాక, రణ తంత్రంలో టెక్నాలజీ, ముఖ్యంగా జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (జెన్ ఏఐ) పాత్ర గురించిన ప్రశ్నలు నా మెదడును తొలవడం ప్రారంభించాయి. మీరు బతకండి, ఇతరులను బతకనివ్వండి అనే తాత్త్వికత భారతదేశానికి పునాది. అంత మాత్రాన దురాక్రమణను చూస్తూ ఊరుకుంటామని కాదు.

ఫైనాన్షియల్ సర్వీసులు, ఏరోస్పేస్, సెమీకండక్టర్లు, వస్తూత్పత్తి వంటి కీలకమైన పరిశ్రమల్లో ఏఐని బాధ్యతాయుతంగా వర్తింపజేసే పనిలో ఉన్న వ్యక్తిగా, మేం అభివృద్ధి చేసే సాధనాలకున్న కలవరపరచే ద్వంద్వ వినియోగ సామర్థ్యం గురించి నాకు బాగా తెలుసు. సామర్థ్యానికి, నవీకరణకు చోదక శక్తిగా పనిచేసే అదే టెక్నాలజీ హానికరమైన ఆయుధంగానూ పరిణమించవచ్చు. మనం కీలకమైన ఘట్టంలో ఉన్నాం. జెన్ ఏఐ సాంకేతిక పురోగతిగా చెప్పుకొనే స్థాయి నుంచి చాలా వేగంగా ప్రగాఢమైన భౌగోళిక రాజకీయ సాధనంగా మారుతోంది.



- ‘జెన్ ఏఐ’ సాంకేతిక పురోగతిగా చెప్పుకొనే స్థాయి నుంచి చాలా వేగంగా ప్రగాఢమైన భౌగోళిక రాజకీయ సాధనంగా మారుతోంది.
- ఉదాహరణకు, చైనా ఏఐ దృక్పథం దాని జాతీయ విధాన వైఖరులను బలంగా చాటుతుంది. సరిహద్దు వివాదాలలో చైనా వైపునే న్యాయం ఉన్నట్లు చెప్పేస్తుంది.
- కృత్రిమ మేధ మానవ ఆలోచనకు సాయపడాలే కానీ, దాని స్థానాన్ని భర్తీ చేసేది కాకూడదు.

ఏ గూటి ఏఐ...

అధునాతన జెన్ ఏఐ సామర్థ్యాలను సంతరించుకున్న దేశాలకూ, విదేశాలలో అభివృద్ధి చెందిన సిస్టంలపై ఆధారపడిన దేశాలకూ మధ్యన కొట్టొచ్చినట్లు కనిపించే చీలిక వ్యూహపరంగా తీవ్రమైన రిస్కులను రేకెత్తిస్తోంది. ఏఐని అభివృద్ధి చేస్తున్న ప్రధాన దేశాలు, ముఖ్యంగా అమెరికా, చైనాల ప్రయోజనాలు, పక్షపాతాలతో రూపుదిద్దుకున్న మోడళ్ళు అనివార్యంగా వాటిని సృష్టించిన వారి కథనాలనే వ్యాప్తి చేస్తాయి. అవి తరచూ ప్రపంచ నిష్పాక్షికతను నీరుగారుస్తాయి.

ఓపెన్ ఏఐకి చెందిన జీపీటీ సిరీస్ లేదా చైనాకు చెందిన డీప్‌సీక్ వంటి ఏఐ మోడళ్ళలో అంతర్లీనంగా నిక్షిప్తమైన పక్షపాతాలనే పరిశీలించండి. అవి చాలా శక్తిమంతంగా భౌగోళిక రాజకీయ అభిప్రాయాలను ప్రతిబింబిస్తాయి. ఈ మోడళ్ళు వాటి మాతృదేశాలపై వచ్చే విమర్శలను తగ్గిస్తాయి. దానితో ఆగక పక్షపాతాల వల్ల అంతర్జాతీయ ఉద్రిక్తతలను మరింత పెంచుతాయి. ఉదాహరణకు, చైనా ఏఐ దృక్పథం దాని జాతీయ విధాన వైఖరులను బలంగా చాటుతుంది. సరిహద్దు వివాదాలలో చైనా వైపునే న్యాయం ఉన్నట్లు చెప్పేస్తుంది. సార్వభౌమాధికారం ఉన్న సంస్థలను కూడా చట్ట బద్ధమైనవి కావని తోసిపారేస్తుంది. ఫలితంగా, అస్తుబిస్తుగా ఉన్న దౌత్య సంబంధాలు మరింత జటిలంగా మారతాయి. కశ్మీర్ వంటి సున్నితమైన ప్రాంతాల్లో ఇది ఇంకా ఎక్కువ ప్రస్ఫుటమవుతుంది.

సుస్థిరత కోసం డిజిటల్ పోటీ

గతంలో పరస్పరం విధ్వంసాన్ని చవిచూడటం ఆ యా దేశాల వద్దనున్న అణ్వాయుధాలపై ఆధారపడి ఉండేది. నేటి ఆయుధాల పోటీలో ‘డిజిటల్’ ఆ స్థానాన్ని ఆక్రమించింది. అంతర్జాతీయ సుస్థిరతకు కొత్త రూపునిచ్చే సామర్థ్యంలో ఏఐ అణ్వాయుధాలతో సమానంగా ప్రాధాన్యం ఉన్నదే. కాలం చెల్లిన ఈ చట్రాన్ని మనం అత్యవసరంగా పునః పరిశీలించవలసి ఉంది. డిజిటైజేషన్ ద్వారా పరస్పరం పురోగతి సాధించే కొత్త విధానానికి మళ్ళాలని నేను చెప్ప దలచుకున్నాను. ఈ నమూనా విధ్వంసకర పోటీ నుంచి నలుగురితో కలసి అభివృద్ధిని, సాంకేతిక స్వావలంబనను సాధించేందుకు ప్రాధాన్యం ఇచ్చేట్లు చేస్తుంది.

ఈ కొత్త నమూనాను అనుసరించేందుకు దేశాలు, ముఖ్యంగా టెక్నాలజీపరంగా దుర్బలంగా ఉన్న అభివృద్ధి చెందుతున్న దేశాలు స్వతంత్రమైనవి, సాంస్కృతిక పరిజ్ఞానం ఉన్నవి అయిన ఏఐ దొంతరలను ఏర్పరచుకోవలసి ఉంటుంది. అటువంటి స్వయం ప్రతిపత్తి మాత్రమే స్థానిక చరిత్రలను, సంస్కృతులను, రాజకీయ పరమైన సూక్ష్మ భేదాలను ప్రతిబింబించగలుగుతుంది. అప్పుడే ఈ దేశాలు బాహ్యపరమైన మాయోపాయాలకు లోనుకాకుండా నిలబడగలుగుతాయి. సాంస్కృతిక వివరాలను పుష్కలంగా నిక్షిప్త పరచుకున్న ఏఐ, దుష్ప్రచారం నుంచి తమ దేశాన్ని కాపాడుకోవడమే కాదు సిసలైన అంతర్జాతీయ చర్చలను పెంపొందించ గలుగుతుంది. సమతూకంతో కూడిన బహుళపక్ష ఏఐ ల్యాండ్‌స్కేప్ ఏర్పడేందుకు తోడ్పడగలుగుతుంది.

ప్రపంచంలో ప్రాబల్యం వహిస్తున్న ఏఐ మోడళ్ళు ప్రాథమికంగా ఇంగ్లీషు, చైనా భాషల్లో రూపొందినవి. అవి 22 అధికార భాషలు, వందలాది మాండలికాలతో కూడిన, భాషాపరంగా, సాంస్కృతికంగా బహుళత్వంతో నిండిన భారత్ వంటి వైవిధ్యభరితమైన దేశాలను ప్రమాదకరమైన స్థితిలోకి నెడుతున్నాయి. భాషాపరంగా సూక్ష్మమైన భేదాలను పట్టుకోలేని ఏఐ అవగాహనా లోపాలను సృష్టించే అవకాశం ఎంతైనా ఉంది. అవి దౌత్యపరంగా తీవ్రమైన పర్యవసానాలకు దారితీయవచ్చు. దీన్ని నివారించడానికి సాంస్కృతిక చైతన్యం కలిగిన అధునాతన ఏఐ మోడళ్ళను అభివృద్ధి చేయడం ఆవశ్యకం. మరాఠీ-గుజరాతీ లేదా తమిళం-కన్నడం వంటి సంబంధిత భాషలలో ఉన్న సారూప్యాలను బహుభాషా ఏఐ సిస్టంలు వినియోగించుకుని తీరాలి. అప్పుడు ఆ యా భాషల్లో ఉండే గాఢతను, సూక్ష్మతరమైన భేదాలను విస్మరించకుండా వేగంగా ఆంతర్యాన్ని అందిపుచ్చుకోవడం సాధ్యమవుతుంది.

నిర్ణయాధికారం మనిషిదే కావాలి!

సామాజిక మౌలిక సదుపాయాలలోకి, నిర్ణయాలు తీసుకొనే ప్రక్రియలలోకి జెన్ ఏఐ మమేకం అయితే అది మానవ పాత్రలకు తప్పకుండా కొత్తరూపునిస్తుంది. సమర్థత విషయంలో ఆటోమేషన్ బ్రహ్మాండమైన ఆశలు రేపుతున్న మాట నిజమేకానీ, యుద్ధ తంత్రం వంటి జీవన్మరణ సందర్భాలలోనూ నిర్ణయం తీసుకునే బాధ్యతను ఏఐ సిస్టంలకు అప్పగించేయడం ఆందోళనలను రేకెత్తిస్తోంది. ఈ సందర్భంగా నాకు, ప్రచ్ఛన్న యుద్ధ కాలానికి సంబంధించి 1983 నాటి ఉదంతం ఒకటి గుర్తుకువస్తోంది. ఆనాటి సోవియట్ లెఫ్టినెంట్ కల్నల్ స్టానిస్లావ్ పెట్రోవ్ సాంకేతిక తార్కిక ప్రమాద హెచ్చరికల కన్నా మానవ అంతఃకరణనే ఎక్కువ లెక్కలోకి తీసుకున్నారు. ఫలితంగా, ఒక అణు వినాశనాన్ని నివారించగలిగారు.

మనుషులు ఒక నిర్ణయం తీసుకునే లేదా ఆలోచించే పనిని ఇష్టపూర్వకంగానే బీజగణితాలకు అప్పగించేస్తారేమోనని నన్నొక పెద్ద భయం వెన్నాడుతోంది. ఆ రకమైన భవిష్యత్తును మనం అంగీకరించకూడదు. మానవ విజ్ఞతకు ఏఐ ఉపయోగపడాలే కానీ, విజ్ఞత స్థానాన్ని అది ఆక్రమించకూడదని డిమాండ్ చేసే కర్తవ్యం, అలా జరగకుండా చూసే బాధ్యత నవీకరణవేత్తలుగా, టెక్నాలజిస్టులుగా, ప్రపంచ పౌరులుగా మనందరి మీదా ఉంది. మానవాళి విజ్ఞతను పక్కకు తోసేసే టెక్నాలజీని ఎన్నటికీ అనుమతించేది లేదని ఈ రోజే మనం ప్రతిన బూనుదాం.

వ్యాసకర్త ఏఐ కంపెనీ ‘ఆర్టికల్8’ వ్యవస్థాపక సీఈఓ
(‘ది హిందుస్థాన్ టైమ్స్’ సౌజన్యంతో)

పిల్లలు మంచి పౌరులుగా రూపొందాలంటే...

విద్యార్థులు ఏం చదువుకున్నా, ఎంత చదువుకున్నా విద్య ద్వారా అలవడాల్సిన సామర్థ్యాలు ముఖ్యంగా రెండు: ఒకటి తనపట్ల తనకు అవగాహన కలగడం, రెండోది సమాజం పట్ల అవగాహనకు రావడం. ఈ రెండూ తగిన పాళ్లలో ఉన్నప్పుడే విద్యకు సార్థకత. మార్కులు, గ్రేడ్లు, ప్లేస్‌మెంట్స్ వస్తే రావొచ్చుగాక! కానీ, సమాజంతో సంబంధ బాంధవ్యాలను సవ్యంగా నిర్వహించడం తెలియని చదువు నిరర్థకమే. ఎందుకంటే సాటి మనుషులతో సంబంధ బాంధవ్యాల నిర్వహణే జీవితంలో చాలా విజయాలకు మూలం. వ్యక్తిత్వ వికాస నిపుణుల పరిభాషలో ‘సోషల్ ఎమోషనల్ ఇంటెలిజెన్స్’గా పేర్కొనబడిన సామాజిక, భావోద్వేగ ప్రజ్ఞ లోపించడం వల్ల పిల్లలకు భవిష్యత్తులోఎదురయ్యే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు.

సామాజిక, భావోద్వేగ ప్రజ్ఞకు వెన్నెముక లాంటిది సహకారం (కొలాబరేషన్). సహకారానికి సమానార్థకాలైన భాగస్వామ్యం, సమన్వయం, బాంధవ్యం అనే భావనలు కేవలం భావనలు మాత్రమే కాదు... జీవితం అన్ని పార్శ్వాలతో ముడివడి ఉన్న అద్భుతమైన కార్యోన్ముఖతలు కూడా!

విద్యలో స్వీయావగాహన, సామాజిక అవగాహన రెండిటినీ నేర్చుకునే లేదా నేర్పే ప్రక్రియను సామాజిక, భావోద్వేగ అభ్యసనం (సోషల్ ఎమోషనల్ లెర్నింగ్–సెల్) అంటారు. ‘సెల్’ ఇవాళ మానవాళి సున్నితత్వాన్ని (సెన్సిబిలిటీ) సముద్ధరించే శిక్షణ కార్యక్రమం కూడా!



- ‘విద్యాబోధన పిల్లల పెంపకం లాంటిదే’ అన్న ప్రాథమిక సూత్రాన్ని విస్మరించడం వల్లనే... సామాజిక బాధ్యతలు నిర్వహించాలనే స్పృహ ఉన్న పౌరులూ, సదాశయాలు ఉన్న పౌరులూ కొరవడుతున్నారు.

సామాజిక భావోద్వేగ ప్రజ్ఞలో అతి కీలక విషయమైన ‘సహకార’ ప్రవర్తనను అనేక విధాల నేర్పించవచ్చు. ఇందుకు గ్రూప్ ప్రాజెక్టులు, టీమ్ మీటింగ్స్, ఫ్యామిలీ ఈవెంట్స్, స్పోర్ట్స్ గ్రూపులు, వర్చువల్ లెర్నింగ్ వంటివి ఉపయోగపడతాయి.

భావనగా, ఆచరణగానే కాకుండా ఒక నైపుణ్యంగా ‘కొలాబరేషన్’ విద్యార్థులకు అనేకచోట్ల అవసరమవుతుంది. వ్యక్తుల విభిన్న నైపుణ్యాలను, దృక్పథాలను కలుపుకోవడం ద్వారా కొలాబరేషన్ మానవ సంబంధాలను బలమైనవిగా మారుస్తుంది. వ్యష్టిగా చేయలేని పనులనూ, సాధించలేని పరిష్కారాలనూ సమష్టిగా నెరవేర్చేందుకు మార్గనిర్దేశం చేస్తుంది.

పిల్లల్ని ర్యాంకర్లుగా మార్చే వ్యాపారంలో సామాజిక, భావోద్వేగ ప్రజ్ఞకు గండిపడుతోంది. ‘విద్యాబోధన పిల్లల పెంపకం లాంటిదే’ అన్న ప్రాథమిక సూత్రాన్ని విస్మరించడం వల్లనే... సామాజిక బాధ్యతలు నిర్వహించాలనే స్పృహ ఉన్న పౌరులూ, సదాశయాలు ఉన్న పౌరులూ కొరవడుతున్నారు. ఇటువంటి వారు కాకుండా... మనోతాపం, హృదయ క్లేశాలు వెంటాడే జనం హెచ్చితే వ్యవస్థలన్నిటికీ ముప్పే. ఈ ప్రమాదం నుంచి బయటపడాలంటే ప్రతి విద్యాసంస్థ ‘సెల్’ను అనుసరించాలి.


– డా॥ బెల్లి యాదయ్య; ప్రధానాచార్యులు
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నకిరేకల్

సౌరశక్తి పరిశోధనా ద్రష్ట

విజ్ఞాన వేగుచుక్కలు - 28

దేశంలో సౌరశక్తిని కొలిచిన తొలి సృజనశీలి ‘అన్నా మొదయిల్ మణి’ (1918–2001). అప్పటి తిరువాన్కూరు సంస్థానంలో అంతర్భాగమైన పీర్మెడులో 1918 ఆగస్టు 23న అన్నా మణి జన్మించారు. వివాహం చేసుకోకుండా శాస్త్రవేత్తగానే మిగిలిపోయారు. అలాగే తొలితరం భారతీయ ఫెమినిస్టులలో ఆమె ఒకరు.

ఇంగ్లాండులో వాతావరణ విభాగపు పరికరాలు ఎలా రూపొందుతూ వచ్చాయో అధ్యయనం చేయడమే కాక; వాటి నిర్మాణం, సున్నితత్వం, కచ్చితత్వానికి సంబంధించిన విధానాలను ఆమె విశేషంగా శోధించారు. 1948లో స్వదేశం తిరిగి వచ్చి పుణెలోని ఇండియన్ మెటీరియొలాజికల్ డివిజన్‌లోని పరికరాల రూపకల్పన విభాగంలో మెటీరియోలజిస్టుగా చేరారు. భారతదేశంలో వాతావరణ శాఖ వాడే సైన్సు పరికరాలకు రూపకల్పన చేసి, నిర్మించి-దిగుమతి చేసుకునే అవసరం లేకుండా చేశారు! ప్రాంతాన్ని బట్టి, ఋతువును బట్టి విశేషంగా మారిపోయే సౌరశక్తి విస్తరణా వివరాలను కొన్ని ఏళ్ళ పాటు సేకరించి, అధ్యయనం చేసి వివరాలు రికార్డు చేశారు. ‘హ్యాండ్ బుక్ ఆన్ సోలార్ రేడియేషన్ డేటా ఫర్ ఇండియా’ (1980) వంటి పుస్తకాలను రాశారు. అంతేకాదు, పవన శక్తిని వినియోగించుకోవడానికి చాలా రకాల ప్రాజెక్టులు రూపొందించి అధ్యయనం చేశారు.



అన్నా మణి

ఇండియన్ స్టాండర్డ్స్ ఇన్‌స్టిట్యూషన్ (ప్రస్తుతం బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్) సంస్థకు, వాతావరణానికి సంబంధించిన ఎన్నో పరికరాలకు స్టాండర్డ్స్ ఏర్పరచడానికి ఆమె దోహదపడ్డారు. 1957–58 సంవత్సరం ‘అంతర్జాతీయ భూ భౌతిక విజ్ఞాన శాస్త్ర సంవత్సరం’. ఈ నేపథ్యంలో సౌర శక్తిని కొలిచే పరికరాల రూపకల్పన, నిర్మాణం బాధ్యతను ఆమె స్వీకరించారు. ఇందులో భాగంగా ఓజోన్‌ను కొలవగలిగే ‘ఓజోనోయిడ్’ను రూపొందించారామె. ఆమె కృషికి గుర్తింపుగా ఇంటర్నేషనల్ రేడియేషన్ కమిషన్ సభ్యత్వం లభించింది.

1976లో పుణెలోని ఇండియన్ మెటిరియొలాజికల్ డిపార్ట్‌మెంట్ నుంచి డిప్యూటీ డైరెక్టర్ జనరల్‌గా రిటైరయ్యి, బెంగుళూరులోని రామన్ రీసెర్చ్ లేబరేటరీలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. నందికొండల్లో టెలిస్కోపు రావడంలో ఆమె కృషి ఉంది. అలాగే పవనవేగం కొలిచే పరికరాల తయారీ కేంద్రాన్ని అన్నా మణి బెంగుళూరు సమీపంలో ప్రారంభించారు. ఇంతటి ప్రతిభాశాలి 2001 ఆగస్టు 16న కాలధర్మం చెందినా... భారత విజ్ఞాన శాస్త్ర వినీలాకాశంలో హరివిల్లుగా శాశ్వతంగా నిలిచిపోతారు.

– డా॥ నాగసూరి వేణుగోపాల్ । ఆకాశవాణి మాజీ ఉన్నతాధికారి

డేటా పాయింట్

పెరుగుతున్న చలామణీ నగదు

రిజర్వు బ్యాంకు లెక్కల ప్రకారం... 5 ఏళ్ల కిందటితో పోలిస్తే ప్రస్తుతం నకిలీ నోట్ల సంఖ్య పెరిగింది. 2020–21లో 2.08 లక్షల నకిలీ నోట్లను గుర్తిస్తే... 2024–25లో వాటి సంఖ్య 2.17 లక్షలకు పెరిగింది. ముఖ్యంగా రూ.500 (ఎమ్‌జీ కొత్త సిరీస్) అప్పట్లో 39 వేలకుపైగా ఉంటే... 5 ఏళ్ల తరవాత 1.17 లక్షలకు పైగా పెరగడం గమనార్హం. మరోపక్క డిజిటల్ లావాదేవీలు రోజురోజుకీ కొత్త రికార్డులు సృష్టిస్తున్నా... దేశంలో చలామణీలో ఉన్న నగదు ఏటా పెరుగుతోంది. 2018తో పోలిస్తే 2024లో ఇది దాదాపు రెండు రెట్లు పెరగడం విశేషం.

సంవత్సరాల వారీగా చలామణీలో ఉన్న నగదు విలువ.. (మార్చి 31 నాటికి) (రూ.కోట్లలో)

2018	18,29,318
2019	21,36,736
2020	24,47,280
2021	28,53,733
2022	31,33,691
2023	33,78,486
2024	35,11,428

కృష్ణాయ తుభ్యం నమః



దశావతారాలలో కృష్ణావతారం పూర్ణావతారం. పరిపూర్ణావతారం. కారాగారంలో కాళరాత్రి అవతారం ఆరంభమయినప్పటి నుంచీ, అన్నీ అద్భుతాలే. యమునను దాటి యశోదమ్మ పురిటింటికి చేరినప్పటి నుంచీ నిత్యమూ చిత్రమైన లీలలే.

చేత వెన్నముద్ద, చెంగల్వ పూదండ,/ బంగరు మొలతాడు, పట్టుధట్టితో ముద్దులొలికే పసివాడు... పరమ భీకరులైన పలువురు రాక్షసులను గుట్టుగా ఒక్కడే మట్టుపెట్టటమేమిటి! మహాలక్ష్మీ వల్లభుడు, మహానందాంగనా డింభకుడిగా మారి, గోప బాలురతో ఆటపాటలేమిటి, గోప కాంతలతో రాసక్రీడలేమిటి! గోవర్ధన గిరిని గొడుగులా ఎత్తడమేమిటి, కాళీయుడి పడగలే మండపంగా ఘల్లుఘల్లున నృత్యమేమిటి!

ముద్దుగారే యశోద ముంగిటి ముత్యమై అందరినీ సమ్మోహపరిచిన బాలుడే, పంతమాడే కంసుడి పాలిట వజ్రమై పరిమారుస్తాడు. బాలకృష్ణుడిగా, ఆ తరువాత రుక్మిణీ కాంతుడిగా, ఆపైన సత్యాపతిగా, అటు తరవాత అష్టపత్నులకు ఇష్టసఖుడిగా... భాగవత కృష్ణుడి లీలాగాథల పరంపరలు రసరమ్యాలు. ఆస్తికులకు కర్ణ రసాయనాలు. భాగవత కృష్ణుడు, ముఖ్యంగా సుభద్రా పరిణయం తరవాత, పాండు పుత్రులకు అత్యంత హితుడూ, సన్నిహితుడూ అయిన భారత కృష్ణుడిగా పరిణామం చెందుతాడు. కౌంతేయులను కంటికి రెప్పలా కాపాడుతూ, వారికి సారథీ, సచివుడూ, సఖుడూ, బాంధవుడూ, గురుడూ, దేవరా... అన్నీ తానే అవుతాడు.

కృష్ణావతారానికి మకుటాయమానం మాత్రం... కురుక్షేత్ర రణరంగంలో యోగీశ్వరుడుగా, జగద్గురువుగా నిలిచి ఆయన చేసిన గీతాబోధ. అర్జునుడికే గాక, ఆధ్యాత్మిక జిజ్ఞాసువులందరికీ, దాని ద్వారా ఆయన వేదాంత జ్ఞాన సర్వస్వాన్ని అరచేతి ఆమలకంగా చేశాడు. అందుకే అంటారు: **‘ఏకం శాస్త్రం దేవకీ పుత్ర గీతం,/ఏకః దేవః దేవకీ పుత్ర ఏవ,/ఏకః మంత్రః తస్య నామాని యాని,/కర్మా అపి ఏకా, తస్య దేవస్య సేవా!’** నేర్వవలసిన శాస్త్రం గీత ఒక్కటే. కొలవవలసిన దైవం కృష్ణుడొక్కడే. జపించాల్సిన మంత్రం ఆయన నామావళి ఒక్కటే. అనుష్ఠించాల్సిన కర్మ వాసుదేవుడి సేవ ఒక్కటే. (నేడు కృష్ణాష్టమి)

– ఎం. మారుతి శాస్త్రి

క్లుప్తంగా...

అమెరికాకు ఎమ్మెల్సీ కవిత

- చిన్న కుమారుడి అడ్మిషన్ కోసం..
- కేసీఆర్ దీవెనల కోసం ఎర్రవల్లికి..



సాక్షి, హైదరాబాద్: చిన్న కుమారుడిని కళాశాలలో చేర్పించేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కె.కవిత అమెరికాకు వెళ్లనున్నారు. అమెరికాలోని కళాశాలలో చిన్న కుమారుడు ఆర్యను గ్రాడ్యుయేషన్‌లో చేర్చేందుకు అమెరికా వెళ్తున్న కవిత.. 15 రోజుల పాటు అక్కడే ఉంటారు. శనివారం ఉదయం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి అమెరికాకు బయలుదేరి వెళ్తారు. ఆమె పర్యటనకు ఢిల్లీ రౌజ్ ఎవెన్యూ కోర్టు అనుమతి ఇవ్వడంతో పాటు పాస్‌పోర్టును కూడా విడుదల చేసింది. కాగా అమెరికా పర్యటన నేపథ్యంలో తన కుమారుడికి.. తండ్రి ఆశీర్వాదం తీసుకునేందుకు కవిత శుక్రవారం ఎర్రవల్లిలోని కేసీఆర్ నివాసానికి వెళ్లారు. అక్కడ రెండు గంటల పాటు తల్లిదండ్రులతో గడిపారు.

బీజేపీ నేతలు మూర్ఖులు: జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: అటల్ బిహారీ వాజ్‌పేయి, ఎల్.కె.అడ్వాణీ లాంటి విలువలున్న నేతలతో ఇప్పటి బీజేపీ నడవడం లేదని, ఇప్పటి బీజేపీ నాయకులు మూర్ఖులని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి విమర్శించారు. ఓట్ల చోరీ గురించి లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ మాట్లాడుతుంటే దానికి సమాధానం చెప్పలేని బీజేపీ నేతలు సోనియా గాంధీ గురించి వ్యక్తిగతంగా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. పొద్దున లేస్తే ధర్మం గురించి మాట్లాడే ఆ పార్టీ నేతలకు వారసత్వం గురించి తెలియదా? అని ప్రశ్నించారు. శుక్రవారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు సంగిశెట్టి జగదీశ్వరరావు, ఎస్సీసెల్ చైర్మన్ నాగరిగారి ప్రీతం, లీగల్ సెల్ వైస్‌చైర్మన్ వర్మలతో కలిసి జగ్గారెడ్డి మాట్లాడారు. దేశంలో బీజేపీ మూడు సార్లు అధికారంలోకి వచ్చేందుకు ఓట్ల దొంగతనమే కారణమని ఆరోపించారు. దీన్ని నిరూపిస్తూ రాహుల్ గాంధీ మాట్లాడుతుంటే బీజేపీ నేతల కాళ్ల కింద భూమి కదులుతోందని అన్నారు.

ఎమ్మెల్యేలను బీజేపీలోకి పంపుతున్నానని తప్పుడు వార్తలు

- మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజును బీజేపీలోకి పంపానని, మిగతా ఎమ్మెల్యేలను కూడా పంపిస్తానని వస్తున్నవన్నీ తప్పుడు వార్తలని మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి కొట్టిపారేశారు. సోషల్ మీడియా, టీవీ చానల్స్‌లో రూమర్స్ క్రియేట్ చేస్తున్నారని శుక్రవారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. తాండూరు ప్రజలు, బీఆర్ఎస్ కుటుంబ సభ్యులు ఈ పుకార్లు నమ్మొద్దని కోరారు. గతంలో వేల కోట్ల రూపాయల కాంట్రాక్టులు, ఎన్నో ఉన్నత పదవులు ఆశ చూపారని, తాండూరు, తెలంగాణ ప్రజల కోసం తాను పార్టీ మారలేదన్నారు. కేసీఆర్, కేటీఆర్ సైనికుడిగా పని చేయడమే తన లక్ష్యమన్నారు. చానెళ్లు తప్పుడు కథనాలు ప్రసారాలు చేయొద్దని హితవుపలికారు.

కాంగ్రెస్ పీఏసీ సమావేశం వాయిదా

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశం వాయిదా పడింది. స్థానిక సంస్థల ఎన్నికలపై పార్టీ పరంగా ఎలా ముందుకెళ్లాలనే విషయాన్ని తేల్చేందుకు శనివారం పీఏసీ సమావేశం నిర్వహించాలని గతంలో పార్టీ నిర్ణయించింది. కానీ సమావేశం ఇంకా ఖరారు కాలేదని గాంధీ భవన్ వర్గాలు తెలిపాయి. ఈనెల 16న జరగాల్సిన సమావేశం ఎప్పుడు జరుగుతుందో.. ఇంకా ఖరారు కాలేదని స్పష్టం చేశాయి. త్వరలోనే తేదీని ప్రకటిస్తామని వెల్లడించాయి.

'జీఎస్టీ' కేసులో అంబికా స్టీల్స్ భాగస్వామి అరెస్ట్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర జీఎస్టీ అధికారుల ఫిర్యాదు మేరకు, సీసీఎస్ పోలీసులు అంబికా స్టీల్స్ మేనేజింగ్ పార్టనర్ పంకజ్ అగర్వాల్‌ను అరెస్ట్ చేశారు. నిందితుడు సరుకుల వాస్తవ రవాణా లేకుండా ఈ-వే బిల్లులు సృష్టించి, నకిలీ ఇన్‌వాయిస్‌లు జారీచేసి, తప్పుడు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పొందినట్లు దర్యాప్తులో తేలిందని రాష్ట్ర వాణిజ్యపన్నుల కమిషనర్ హరిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నకిలీ ఇన్‌వాయిస్‌లతో తప్పుడు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పొందడం జీఎస్టీ చట్టానికి విరుద్ధమని పేర్కొన్నారు. ఈ కేసులో జూలై 30న సీసీఎస్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారని పేర్కొన్నారు. ఎఫ్ఐఆర్ నమోదు అయిన తరువాత, నిందితులు కేసును రద్దు చేయించుకోవడానికి హైకోర్టును ఆశ్రయించారని తెలిపారు. అయితే, హైకోర్టు వారి పిటిషన్‌ను కొట్టివేసిందని, అనంతరం పంకజ్ అగర్వాల్ గోవాకు పారి పోవడానికి ప్రయత్నిస్తుండగా పోలీసులు పట్టుకొని అరెస్ట్ చేశారని కమిషనర్ తెలిపారు.

గ్రేడ్ పేరెంట్స్ కాదు.. గ్రేట్ పేరెంట్స్!

పిల్లలు చక్కగా చదువుకుని, మంచి మార్కులు తెచ్చుకుని, పెద్ద ఉద్యోగం సంపాదిస్తే తల్లిదండ్రులకు ఎంత సంతోషం! నిజమే కానీ, కొన్నిసార్లు రేయింబవళ్లు కష్టపడి చదివినా కూడా పిల్లలు మంచి మార్కులు సాధించలేరు. అప్పుడు చూడాలి తల్లిదండ్రుల బాధ! ఆ బాధలో పిల్లల్ని కోప్పడతారు, అరుస్తారు. మాట్లాడ్డం మానేస్తారు. ఇతర పిల్లలతో పోల్చి మాట్లాడతారు. ఆ మాటకు పిల్లలు ఎంత బాధపడతారో ఆలోచించరు. కానీ ఇప్పుడీ పరిస్థితి క్రమంగా మారుతోంది!

సాక్షి, స్పెషల్ డెస్క్



మార్కులు తగ్గినందుకో, పరీక్ష తప్పినందుకో తల్లిదండ్రులు కోపంతో ఊగిపోవటం అన్నది ప్రతి ఇంట్లోనూ ఉండేదే. అయితే ఇప్పుడిప్పుడు కొందరు పేరెంట్స్ పిల్లల తరఫున ఆలోచిస్తున్నట్లు ఇటీవల సోషల్ మీడియాలో పిల్లలు విస్తృతంగా షేర్ చేస్తున్న తమ అనుభవాలను బట్టి తెలుస్తోంది. కర్ణాటకలోని ఒక కుటుంబం.. బోర్డు పరీక్షల్లో ఆరు సబ్జెక్టుల్లోనూ ఫెయిల్ అయిన తమ కుమారుడిని ప్రోత్సహించడానికి నలుగుర్నీ పిలిచి 'కేక్ కటింగ్' చేశారు. కొడుకుని అక్కున చేర్చుకున్నారు.

తక్కువ మార్కులు వచ్చినందుకు అమ్మానాన్న తమని కొట్టకుండా, తిట్టకుండా ఎంత ప్రేమగా చూసుకున్నారో

'ఈసారి వస్తాయిలే..!'

వెల్లడిస్తూ పిల్లలు సోషల్ మీడియాలో షేర్ చేసే కథనాలు స్ఫూర్తిదాయకంగా ఉంటున్నాయి. ఎన్ని మార్కులు వచ్చాయో తల్లిదండ్రులు పట్టించుకోవటం లేదు.. పిల్లల కష్టాన్ని అర్థం చేసుకుంటున్నారు. 'ఈసారి మంచి మార్కులు వస్తాయిలే' అని తల నిమురుతున్నారు. వారిలో ధైర్యం నింపుతున్నారు. పిల్లలు అప్పటికీ అదేపనిగా బాధపడుతుంటే వారి ధ్యాసను మళ్లించటానికి బయటికి తీసుకెళుతున్నారు.

బోర్డు పరీక్ష ఫలితాల సమయంలో తమ తల్లిదండ్రులు తమకు ఎంతలా మద్దతు ఇచ్చారో చెబుతూ విద్యార్థులు

ఇది మంచి పరిణామం

సోషల్ మీడియాలో పంచుకుంటున్న అనుభవాలు బాగా వైరల్ అవుతున్నాయి. పరీక్షల సమయంలో తల్లిదండ్రులు వహించవలసిన పాత్ర ఏమిటన్న దాని గురించి సంభాషణలు కూడా మొదలయ్యాయి. అవి మిగతా తల్లిదండ్రులకు ఉపయోగకరంగా ఉంటున్నాయి. ఆ సంభాషణల్లో సైకాలజిస్టులు కూడా ఉత్సాహంగా పాలు పంచుకుంటున్నారు. 'ఇది చాలా మంచి పరిణామం' అంటున్నారు మనో వైజ్ఞానిక నిపుణులు.

తక్కువ మార్కులొచ్చినా అక్కున చేర్చుకుంటున్నారు

పోల్చి తిట్టటం మాని "పర్వాలేదులే" అంటున్నారు

తల్లిదండ్రుల గొప్పతనాన్ని షేర్ చేస్తున్న విద్యార్థులు

సోషల్ మీడియాలో పేరెంట్స్‌పై అభినందనల జల్లు

మారుతున్న తల్లిదండ్రుల ఆలోచనా ధోరణి

'కేక్, పిజ్జా తెప్పించారు'

ఇటీవల, పరీక్షల్లో 83 శాతం మార్కులు స్కోర్ చేసిన సీబీఎస్ఈ 10వ తరగతి విద్యార్థిని సోషల్ మీడియాలో తన పేరెంట్స్ గురించి ఇలా షేర్ చేసుకుంది. ''ఇంకొంచెం ఎక్కువ మార్కులు వచ్చి ఉంటే బాగుండేదని.. మా అమ్మ మొదట నిరాశపడింది. ఆ వెంటనే, బాగా స్కోర్ చేశావ్ అని సంతోషపడింది. నాన్న నన్ను దగ్గరకు తీసుకుని, 'మార్కులకు, నిజ జీవితానికి సంబంధం ఉండదు. తక్కువ స్కోర్ చేసిన వారు కూడా గొప్ప జీవితాలను గడపొచ్చు'' అని చెప్పారు. ఆ రోజు అమ్మానాన్న కేక్, నాకెంతో ఇష్టమైన పిజ్జా ఆర్డర్ చేశారు. నాకు తక్కువ మార్కులు వచ్చినప్పటికీ వారు నన్ను మనస్ఫూర్తిగా దగ్గరకు తీసుకున్నందుకు నేను సంతోషంగా ఉన్నాను..'' అని రాసింది. 'ఇలాంటి చర్యలు పిల్లల్లో కాన్ఫిడెన్స్‌ను పెంచుతాయి' అని ఆమె పోస్ట్ కింద ఒక సైకాలజిస్టు కామెంట్ పెట్టారు.

'ముందే చెప్పేశా..'

మరొక విద్యార్థిని, తక్కువ మార్కులు వచ్చినప్పుడు తన తల్లిదండ్రులు తనను ఎలా ఓదార్చారో గుర్తుచేసుకుంది. ''కోప్పడితే పడనివ్వమని నా పేరెంట్స్‌కి మొదటే చెప్పేశాను. క్వొశ్చన్ పేపర్స్ అన్నీ కష్టంగా వచ్చాయి, సరిగా రాయలేదు, ఫెయిల్ అవుతాను అని చెప్పాను. ఆ క్షణం నుంచి, ఫలితాలు వచ్చే వరకు వాళ్లు అనుక్షణం నన్ను గమనిస్తూనే ఉన్నారు. 'పోతే పోయిందిలే' అని ధైర్యం చెబుతూ వచ్చారు. మొత్తానికి 62 శాతంతో పాసయ్యాను. అప్పుడు నాన్న నిరాశగా చూస్తూ అన్న మాట నాకు భలే నవ్వు తెప్పించింది. 'అదేంట్రా ఫెయిల్ అవుతావని ఎన్నో ఆశలు పెట్టుకుంటే, ఇలా చేసేవేంటి!' అన్నారు. అమ్మ కూడా నవ్వి నన్ను దగ్గరకు తీసుకుంది' అని ఆ అమ్మాయి షేర్ చేసింది. 'ఆంటీ, అంకుల్ సూపర్' అంటూ సోషల్ మీడియాలో కామెంట్ మీద కామెంట్లు!

వెల్‌డన్ పేరెంట్స్

తల్లిదండ్రులలోని ఈ సానుకూల వైఖరిని విద్యావేత్తలు, మానసిక ఆరోగ్య నిపుణులు స్వాగతిస్తున్నారు. వాళ్లు ఇంకా ఏమంటున్నారంటే..

పిల్లలు మంచి మార్కులు తెచ్చుకున్నా, తెచ్చుకోలేకపోయినా వారు తమ శక్తి మేరకు కష్టపడ్డారని తల్లి దండ్రులు గుర్తించటం, వారిలో నిరుత్సాహం తలెత్తకుండా దగ్గరకు తీసుకోవటం మంచి విషయం.

పరీక్షలు జీవితంలో ఒక భాగం మాత్రమే.. పరీక్షలే జీవితం కాదు. ఒకసారి విఫలమైపోతే జీవితం అక్కడితో ఆగిపోదు. మార్చి పోతే సెప్టెంబర్ ఎప్పుడూ ఉంటుంది. మళ్లీ రాయొచ్చు.. ఉత్తీర్ణులు కావచ్చు. కానీ, జీవితం పోతే.. మళ్లీ రాదు.

పిల్లల్లో ఆత్మవిశ్వాసం పోతే మళ్లీ అంకురించడం అంత సులభం కాదు. తల్లిదండ్రులు పిల్లలను తిట్టేశాక.. గాయపడిన లేత మనసు కోలుకోవడం చిటికెలో జరిగిపోదు. అది ఈ తరం తల్లిదండ్రులు గ్రహిస్తున్నారు.

తల్లిదండ్రులు కూడా ఒకప్పుడు విద్యార్థులే. వాళ్లూ.. ఈ మార్కులు తక్కువ రావడాలు, ఫెయిలవడాలు.. అన్నీ చూసే ఉంటారు. కానీ, వాళ్లు చదివేటప్పుడు పరిస్థితులు వేరు. ఇప్పుడు పిల్లలకు తాము అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నా, అంతంత డబ్బు వాళ్ల కోసం ఖర్చు చేస్తున్నా వారు రాణించకపోవడాన్ని చాలామంది తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇది మారాలి.

కొంతమంది మాత్రం.. ఫెయిల్యూర్ జీవితాలను ఎలా మార్చిందో ప్రముఖుల జీవితాలను ఉదాహరణలుగా తమ పిల్లలకు చెబుతున్నారు. తద్వారా వారిలో ఆత్మవిశ్వాసం తగ్గిపోకుండా కాపాడుకుంటున్నారు.

తిట్టినంత మాత్రాన మార్కులు పెరగవు. ఫెయిలైన వారు పాసైపోరు అని తెలుసుకుంటున్నారు.

ఇతరులతో పోల్చినంత మాత్రాన.. ఉన్నపళంగా తమ బిడ్డలో మార్పు వచ్చేయదు. పిల్లలను మనమే నలుగురిలో చులకన చేస్తే వారు రేపు తలెత్తుకుని ఎలా తిరగగలరు అని ఆలోచిస్తున్నారు.

నైరుతి కాదు.. సైరుతి

మొదటి పేజీ తరువాయి

పరుగులు పెడుతున్నాయి. తాజా సీజన్‌లో ఈనెల 15వ తేదీ నాటికి రాష్ట్రంలో సగటున 46.4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 50.92 సెంటీమీటర్ల వర్షం కురిసింది. సాధారణ వర్షపాతం కంటే 10 శాతం అధికంగా నమోదైంది. గత వారం వరకు వర్షపాతం దాదాపు 30 శాతం వరకు లోటు నమోదు కాగా... వారం రోజులుగా రుతుపవనాలు అత్యంత చురుగ్గా కదలడం, మరోవైపు వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలతో సాగుకు అనుకూల పరిస్థితులు కనిపిస్తున్నాయి.

- వాయవ్య బంగాళాఖాతం ప్రాంతంలో కొనసాగుతున్న అల్పపీడనం.. దక్షిణ ఒడిశా, దానికి ఆనుకొని ఉన్న ఉత్తరాంధ్ర కోస్తా తీర ప్రాంతానికి విస్తరించింది. దీనికి అనుబంధంగా ఉన్న ఉపరితల చక్రవాత ఆవర్తనం కొనసాగుతోంది. ఇది సముద్రమట్టం నుంచి సగటున 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు ఉంది.
- మరోవైపు బికనీర్, కోట, సియోని, రాయపూర్ మీదుగా ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రానున్న రెండు రోజులు చాలాచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వివరించింది. శనివారం దక్షిణ ప్రాంత జిల్లాల్లో కొన్నిచోట్ల భారీ వర్షాలు, ఒకట్రెండు చోట్ల భారీ నుంచి అతిభారీ వర్షాలు కూడా నమోదు కావొచ్చని వాతావరణ శాఖ వివరించింది.

నెలాఖరు వరకు వానలు..

రాష్ట్రంలో నైరుతి రుతుపవనాల కదలికలు ప్రస్తుతం అత్యంత చురుగ్గా ఉన్నట్టు వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలకు అనుకూల పరిస్థితులు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. సీజన్ ప్రారంభ సమయంతో పోలిస్తే ప్రస్తుతం బంగాళాఖాతంలో కూడా వర్షాలకు అనుకూల వాతావరణం ఉందని, దీంతో ఈ నెలాఖరు వరకు వివిధ ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయంటున్నారు. నెలాఖరు కల్లా రాష్ట్రంలో నైరుతి సీజన్‌లో కురవాల్సిన సాధారణ వర్షపాతానికి గణాంకాలు చేరుకుంటాయని, ఆ తర్వాత వర్షాలు అదనంగా భావించొచ్చని అధికారులు అభిప్రాయపడుతున్నారు. గత వారం రోజులుగా కురిసిన వర్షాలతో రాష్ట్రంలో లోటు ప్రభావం చాలావరకు తగ్గింది. రాష్ట్రవ్యాప్తంగా ఐదు జిల్లాల్లో అత్యధిక వర్షాలు నమోదు కాగా... ఏడు జిల్లాల్లో అధికం, 14 జిల్లాల్లో సాధారణ వర్షాలు కురిశాయి. మరో ఏడు జిల్లాల్లో లోటు వర్షపాతం ఉంది.

- మండలాల వారీగా వర్షాల తీరును పరిశీలిస్తే... 90 మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదు కాగా, 185 మండలాల్లో అధిక వర్షపాతం, 255 మండలాల్లో సాధారణ వర్షపాతం, 91 మండలాల్లో లోటు వర్షపాతం ఉన్నట్టు రాష్ట్ర ప్రణాళిక శాఖ నివేదిక చెబుతోంది.
- లోటు వర్షపాతం ఉన్న జిల్లాలు: ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి. ఈ జిల్లాల్లో ఇప్పటివరకు నమోదు కావాల్సిన సాధారణ వర్షపాతం 10 శాతానికి పైబడి తక్కువ వర్షాలు నమోదయ్యాయి.
- సాధారణ వర్షపాతం నమోదైన జిల్లాలు: కుమురంభీం ఆసిఫాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, హనుమకొండ, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్, జనగామ, మేడ్చల్–మల్కాజిగిరి, ఖమ్మం, ములుగు. ఈ జిల్లాల్లో వర్షపాతం సాధారణం కంటే దాదాపు 20 శాతం వరకు అదనపు వర్షాలు కురిశాయి.



ఎట్‌హోం విందులో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ దంపతులు, సీఎం రేవంత్‌రెడ్డి, హైకోర్టు సీజే జస్టిస్ ఏకే సింగ్. చిత్రంలో భట్టివిక్రమార్క, గుత్తాసుఖేందర్‌రెడ్డి, గడ్డం ప్రసాద్, పొన్నం ప్రభాకర్, వేంనరేందర్‌రెడ్డి, దత్తాత్రేయ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

రాజ్‌భవన్‌లో ఎట్‌హోం

- హాజరైన సీఎం రేవంత్, ప్రముఖులు

సాక్షి, హైదరాబాద్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం రాజ్‌భవన్‌లో ఎట్‌హోం కార్యక్రమం జరిగింది. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఇచ్చిన తేనీటి విందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపీలు కె.లక్ష్మణ్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో పాటు ఎమ్మెల్సీ విజయశాంతి, పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ రంగాల ప్రముఖులు కూడా హాజరయ్యారు. అతిథుల వద్దకు గవర్నర్ దంపతులు, సీఎం రేవంత్ స్వయంగా వెళ్లి పలకరించారు. అనంతరం వారితో కలిసి అల్పాహారాన్ని తీసుకున్నారు. జాతీయ గీతంతో కార్యక్రమం ముగిసింది. కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు గైర్హాజరు కావడం గమనార్హం. కాగా, శుక్రవారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పుట్టినరోజు కూడా కావడంతో.. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డితో పాటు పలువురు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

- లారీని వెనక నుంచి ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు
- నలుగురు దుర్మరణం.. 15 మందికి తీవ్రగాయాలు
- తెగిపడిన బస్సు డ్రైవర్ తల

జడ్చర్ల: మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం మాచారం గ్రామం వద్ద 44 నంబర్ జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శుక్రవారం తెల్లవారుజామున 4.20 గంటల ప్రాంతంలో ఓ ఫ్లైఓవర్‌పై జరిగిన ఈ ప్రమాదంలో నలుగురు దుర్మరణం చెందగా.. మరో 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. సీఐ కమలాకర్ కథనం ప్రకారం.. ఏపీలోని కడప నుంచి సీజీఆర్ ట్రావెల్స్ బస్సు గురువారం రాత్రి 9.15 గంటలకు 20 మంది ప్రయాణికులతో హైదరాబాద్‌కు బయలుదేరింది. ఈ క్రమంలో జడ్చర్ల సమీపంలోని మాచారం బ్రిడ్జిపై ముందు వెళ్తున్న లారీని వెనక నుంచి వేగంగా దూసుకొచ్చిన ఈ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సు ముందుభాగం పూర్తిగా నుజ్జునుజ్జు కాగా.. కడప జిల్లా కాసవర్తి గ్రామానికి చెందిన బస్సు డ్రైవర్ బాసుపాక నర్సింహ (50) తల తెగిపడింది. అలాగే బస్సులో ప్రయాణిస్తున్న హైదరాబాద్‌లోని మియాపూర్‌కు చెందిన గుర్రం రాధిక (49), కూకట్‌పల్లిలోని ప్రగతినగర్‌కు చెందిన క్యావర్సి లక్ష్మీదేవి(65) కూర్చున్న సీట్లలోనే మృతిచెందగా, తీవ్రంగా గాయపడిన క్లీనర్ నర్సింహులు(25) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. వీరితోపాటు మరో 15 మంది ప్రయాణికులకు తీవ్ర గాయాలవడంతో మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



లారీని ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు

డ్రైవర్ నిర్లక్ష్యమే కారణం!

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. మాచారం వద్ద జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ కొంత ఎత్తుగా ఉంటుంది. ఈ బ్రిడ్జిపై రాకపోకలు సాగించే వాహనాలు వేగం తగ్గించి బ్రిడ్జి దాటాలి. ఇలాంటి పరిస్థితిలో అధిక లోడ్‌తో వెళ్తున్న లారీని వెనక నుంచి వేగంగా వచ్చిన ట్రావెల్స్ బస్సు ఢీకొట్టడంతో ప్రమాదం చోటు చేసుకుంది. అయితే లారీ పక్క నుంచి మరో లైన్‌లో బస్సు వెళ్లాల్సి ఉన్నా లారీ వెనకనే వచ్చి ఢీకొట్టిందని చెపుతున్నారు. ఈ ప్రమాదంపై జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు.

క్యాబిన్‌లో ఇరుక్కుని..

- లారీడ్రైవర్ నరకయాతన
- ఢీకొన్న లారీ, బస్సు
- 17 మందికి తీవ్ర గాయాలు
- వరంగల్ జిల్లాలో ఘటన



క్యాబిన్‌లో ఇరుకున్న లారీ డ్రైవర్

రాయపర్తి: వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మైలారం, మొరిపిరాల మధ్యలో జాతీయ రహదారిపై లారీ, బస్సు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో 17 మంది తీవ్రంగా గాయపడ్డారు. లారీడ్రైవర్, క్లీనర్ తీవ్రగాయాలతో క్యాబిన్‌లో ఇరుక్కుపోయారు. పోలీసుల కథనం ప్రకారం.. శుక్రవారం మధ్యాహ్నం ఖమ్మం డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సు హనుమకొండనుంచి ఖమ్మం వైపు వెళ్తోంది. ఇదే సమయంలో ప్లాస్టిక్ వస్తువుల లోడ్‌తో ఓ లారీ విజయవాడ నుంచి హనుమకొండ వైపు వస్తోంది. ఈ క్రమంలో మైలారం, మొరిపిరాల మధ్యలో బ్రిడ్జి వద్ద గుంతలను తప్పించుకునే క్రమంలో లారీ, బస్సు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న 44 మందిలో 15 మందికి తీవ్ర గాయాలయ్యాయి. మిగతా వారికి స్వల్ప గాయాలయ్యాయి. అలాగే లారీ డ్రైవర్, క్లీనర్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను వరంగల్ ఎంజీఎం, వర్ధన్నపేట సీహెచ్‌సీకి తరలించారు. ఈ ప్రమాదంలో లారీ క్యాబిన్ నుజ్జునుజ్జయింది. డ్రైవర్, క్లీనర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోగా.. పోలీసులు జేసీబీ సహాయంతో గంట పాటు శ్రమించి క్యాబిన్‌ను విడగొట్టి వారిని బయటకు తీశారు. వైద్యంకోసం వీరిని ఎంజీఎంకు తరలించారు. ఈ ఘటన తో వరంగల్, ఖమ్మం జాతీయ రహదారిపై రెండు కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఎంజీఎం సూపరింటెండెంట్, వర్ధన్నపేట ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌లకు ఫోన్‌లో ఆదేశించారు.

కేసీఆర్ పన్నులు తగ్గిస్తే.. రేవంత్ పెంచుతుండు

- గతంలో సర్వీస్ ట్యాక్స్ రూ.100 ఉంటే.. ఇప్పుడు రూ.200
- మాజీ మంత్రి హరీశ్‌రావు



మాట్లాడుతున్న మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు

సాక్షి, సిద్దిపేట: పేదలను దృష్టిలో పెట్టుకొని ఆటోలు, వ్యవసాయానికి ఉపయోగించే వాహనాలకు పన్నులను కేసీఆర్ తొలగించారని.. ఇలా పన్నులు తగ్గిస్తే.. ప్రస్తుతం పన్నులను సీఎం రేవంత్‌రెడ్డి పెంచుతున్నారని మాజీమంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. మార్పు అంటే ఇదేనా అంటూ రేవంత్‌పై హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. శుక్రవా రం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లా డారు. రెండేళ్ల రేవంత్ పాలనలో ప్రజలపై అప్పులు, పన్నుల భారం ఎక్కువైందన్నారు. గతంలో ఆర్టీఏ సర్వీస్ ట్యాక్స్ రూ.100 ఉండగా, ఇప్పుడు రూ.200 చేశారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనావైఫల్యంతోనే ప్రజల కొనుగోలు శక్తి తగ్గిందని తెలిపారు. గతంలో రూ.7,100 కోట్లు పన్నుల రూపంలో వసూలు అయితే.. గతేడాది రూ.6,900 కోట్లు మాత్రమే వచ్చిందన్నారు. బడ్జెట్ రూ. 8 వేల కోట్లకు పైగా అంచనా వేశారని, ఇదేలా సాధ్యం అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

అసెంబ్లీలో పన్నులు పెంచబోమని చెప్పి..

అసెంబ్లీలో ప్రజలపై ఎలాంటి పన్నుల భారం మోపమని సుద్దపూస మాటలు చెప్పి...ఇప్పుడేమో అన్ని పన్నులు పెంచుతున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. రేవంత్‌రెడ్డి తుగ్లక్ చర్యల వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. పండుగలు వస్తే చాలు ఆర్టీసీ చార్జీలు డబుల్ చేస్తున్నారని, మద్యం ధరలు రెండుసార్లు పెంచారని తెలిపారు. ఢిల్లీకి డబ్బుల సంచులు మోసుడు తప్ప ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదని, ఆర్ఆర్ ట్యాక్స్ వల్ల రాష్ట్రంలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఆదాయం తగ్గిందని చెప్పారు. నంగునూరు మండలం పాలమాకుల వద్ద యూరియా కోసం రైతులు లైన్‌లో నిలబడగా, అటుగా వెళుతున్న హరీశ్‌రావు ఆగి వారితో మాట్లాడారు. యూరియా లభించక రైతులు ఇబ్బంది పడుతుంటే సీఎం రేవంత్‌రెడ్డి మొద్దు నిద్రపోతున్నారని ఎద్దేవా చేశారు.

డీజీపీ జితేందర్‌కు మాతృ వియోగం

సాక్షి, హైదరాబాద్: డీజీపీ డాక్టర్ జితేందర్ తల్లి కృష్ణ గోయల్ (85) శుక్రవారం ఉదయం కన్నుమూశారు. కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న కృష్ణ గోయల్.. హైదరాబాద్ అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆమె అంత్యక్రియలు శనివారం ఉదయం మహాప్రస్థానంలో జరగనున్నాయి. కృష్ణ గోయల్ మృతికి పలువురు రాజకీయ నాయకులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు సంతాపం తెలిపారు.

పదవులూ మీకే.. పైసలూ మీకేనా?

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలు



మాట్లాడుతున్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

సంస్థాన్ నారాయణపురం: 'పదవుల్లో మీరే ఉంటరు.. పైసలు మీరే తీసుకుంటరు. నాకు పదవి ఇవ్వకపోయినా నా నియోజకవర్గానికి నిధులు ఇవ్వండి' అని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం రాత్రి ఆయన యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఎల్లగిరి గ్రామంలో సర్దార్ వల్లభాయ్‌పటేల్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ 'పదవి వచ్చేటప్పుడు వస్తుంది. మనను ఎవరూ ఆపలేరు. పదవులు మీకే.. పైసల్ మీకే అని కొన్ని రోజుల కిందట అన్నాను. సీఎం రేవంత్‌రెడ్డిని అన్నానని తెలుసు కదా. మునుగోడు నియోజకవర్గంలో రోడ్లు వేసే కాంట్రాక్టర్లకు నిధులు రావడం లేదు. మంత్రి దగ్గరకి వెళ్లి అడిగినా రాలే. పనిచేయమంటే కాంట్రాక్టర్లు బిల్లులు చెల్లించమంటున్నారు. బిల్లులు ఇవ్వడం సీఎం రేవంత్ చేతిలో ఉంది. నాకు అన్యాయం చేసినా పర్వాలేదు. నన్ను ఎన్నుకున్న ప్రజలకు అన్యాయం చేయకండి' అని వ్యాఖ్యానించారు. పదవి అనేది అధిష్టానం నిర్ణయం తీసుకుంటుందని, తనకు పదవి వస్తే మునుగోడు ప్రజలకు మంచి జరుగుతుందని రాజగోపాల్‌రెడ్డి చెప్పారు.

దుస్సాహసానికి దిగారో ఖబడ్దార్!



మర్చిపోలేని గుణపాఠం తప్పదు ● పాక్‌కు ప్రధాని హెచ్చరిక

న్యూఢిల్లీ: దాయాది గుండెలదిరేలా ప్రధాని నరేంద్ర మోదీ సింహనాదం చేశారు. పహల్గాం పాశవికత్వం వెనక పాక్ ప్రమేయాన్ని ప్రస్తావిస్తూ పలుగు రాళ్లతో నలుగు పెట్టారు. ''పహల్గాం ఉగ్రోన్మాదానికి ప్రతీకారంగా మన సైన్యం చేసిన 'సిందూర' గర్జన తాలూకు భయంతో శత్రు దేశం నేటికీ నిద్ర లేని రాత్రులు గడుపుతోంది. మన దళాలు పాక్ భూభాగంలో వందలాది కిలోమీటర్ల మేరకు చొచ్చుకెళ్లి మరీ ఉగ్ర, సైనిక లక్ష్యాలను తుత్తునియలు చేశాయి. ఆ విధ్వంసానికి సంబంధించి నేటికీ రోజుకో కొత్త కబురు తెరపైకి వస్తోందంటే అతిశయోక్తి కాదు'' అంటూ ఎద్దేవా చేశారు. మళ్లీ అలాంటి దుస్సాహసానికి దిగితే దాయాదికి జన్మలో మర్చిపోలేని రీతిలో గట్టి గుణపాఠం నేర్పి తీరతామంటూ ప్రతినబూనారు. అణు బెదిరింపులకు జడిసే రోజులు గతించాయంటూ పాక్ ఆర్మీ చీఫ్ ఆసీం మునీర్‌కు పదునైన హెచ్చరికలు జారీ చేశారు. అటువంటి మతిలేని ఉన్మాదానికి దిగితే దీటుగా బదులిస్తామని స్పష్టం చేశారు. ''60 ఏళ్లుగా భారత రైతుల పొట్ట కొడుతూ పాక్ పొలాలను తడుపుతున్న ఏకపక్ష సింధూ నదీ జల ఒప్పందం శాశ్వతంగా కాలగర్భంలో కలిసినట్టే. నీరూ నెత్తురూ కలిసి పారడం జరగని పని'' అంటూ కుండబద్దలు కొట్టారు. ''భరత జాతి దశాబ్దాలుగా పదేపదే ఉగ్ర భూతానికి బలవుతూ వస్తోంది. దాయాది దన్నుతో జాతి గుండెను ఉగ్ర పోట్లు పదేపదే చీలుస్తూ వచ్చాయి. అది ఇకపై సాగదు. ఉగ్రవాదానికి మహారాజ పోషకులుగా మారి దానికి జవసత్వాలు అందజేస్తున్న దేశాలు, శక్తులను కూడా ఇకపై విడిగా చూడబోం. వారినీ ఆ ముష్కరులతో సమానంగా శిక్షించి తీరతాం. ఇదే మా నయా మంత్రం'' అంటూ పాక్‌కు పెను హెచ్చరికలు చేశారు. ''వారి మధ్య ఎలాంటి తేడా లేదు. ఇద్దరూ మానవాళికి సమాన శత్రువులే'' అని స్పష్టం చేశారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఎర్రకోటపై ప్రధాని జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం జాతినుద్దేశించి ఏకంగా 103 నిమిషాల పాటు ప్రసంగించారు. గతేడాది 98 నిమిషాలు ప్రసంగించిన స్వీయ రికార్డును అధిగమించారు. అంతేగాక ఎర్రకోట నుంచి వరుసగా 12 వసారి పంద్రాగస్టు ప్రసంగం చేయడం ద్వారా ఇందిరాగాంధీ రికార్డు (11)ను అధిగమించారు. వరుసగా 17సార్లు పంద్రాగస్టు ప్రసంగాలు చేసిన తొలి ప్రధాని నెహ్రూ తర్వాత రెండోస్థానంలో నిలిచారు. అన్ని రంగాల్లోనూ ఆత్మనిర్భరత తాలూకు ఆవశ్యకతను మోదీ తన ప్రసంగంలో పదేపదే నొక్కిచెప్పారు. సెమీ కండక్టర్లు మొదలుకుని కీలక ఖనిజాలు, అణు ఇంధనం దాకా అన్నింట్లోనూ స్వయంసమృద్ధి సాధించిన నాడే దేశం నిజమైన అభివృద్ధి దిశగా దూసుకెళ్తుందని స్పష్టం చేశారు. తన వికసిత్ భారత్ కలలను సవివరంగా దేశ ప్రజల ముందుంచారు. కాంగ్రెస్‌తో పాటు విపక్షాలన్నీ అభివృద్ధి నిరోధకులుగా మారుతున్నాయంటూ తూర్పారబట్టారు. అర్థం లేని డిమాండ్లతో పార్లమెంటును నిత్యం స్తంభింపజేస్తూ బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. కీలక పథకాల అమలులో ఇప్పటికైనా కేంద్రంతో కలిసి రావాల్సిందిగా పిలుపునిచ్చారు.

బలగాలు సత్తా చాటాయి

''రాజస్తాన్ ఎడారులు మొదలుకుని హిమశిఖరాలు, సముద్ర తీరం, అత్యంత జనసమ్మర్ద ప్రాంతాల దాకా ఇంటింటా నేడు త్రివర్ణ స్ఫూర్తి వెల్లివిరుస్తోంది. కానీ గత ఏప్రిల్ 22న జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో అమాయక పర్యాటకులను ఉగ్ర ముష్కరులు పిరికిదెబ్బ తీశారు. పిల్లల కళ్లముందు తండ్రులను పొట్టన పెట్టుకున్నారు. భార్యల సిందూరాన్ని కర్కశంగా తుడిపేశారు. ఆ దారుణాన్ని తలచుకుని జాతి యావత్తూ క్రోధావేశాలతో ఆక్రోశించింది. అందుకు ప్రతీకారంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో మన సైనిక బలగాలు పూర్తిస్థాయిలో సత్తా చాటాయి'' అన్నారు.

అతి పెద్ద సేవా సంస్థ ఆరెస్సెస్

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) ఆవిర్భావానికి వందేళ్లవుతున్న సందర్భంగా మోదీ అభినందనలు తెలిపా రు. దాన్ని ప్రపంచంలోకెల్లా అతి పెద్ద స్వచ్ఛంద సంస్థగా అభివర్ణించారు. ''దేశానికే గర్వకారణమైన ప్రస్థానం ఆరెస్సెస్‌ది. అంకితభావంతో దేశానికి సేవ చేస్తున్న ఆరెస్సెస్ కార్యకర్తలందరికీ నా సెల్యూట్. కోట్లాది మంది ప్రజలు, సాధుసంతులు, సైంటిస్టులు, టీచర్లు, రైతులు, సైనికులు, శ్రామికులు, వ్యక్తులు, సంస్థల మొక్కవోని ప్రయత్నాల ఫలస్వరూపంగా ఆరెస్సెస్ ఎదిగింది. వ్యక్తి, జాతి నిర్మాణానికి, దేశ సంక్షేమానికి వందేళ్లుగా వారంతా తిరుగులేని త్యాగాలు చేస్తూ వస్తున్నారు. ఆ స్వయం సేవకులదరినీ ఎర్రకోట వేదికగా సగౌరవంగా గుర్తు చేసుకుంటున్నా'' అన్నారు.

స్వదేశీ సత్తా చాటుదాం ఆ కలను నిజం చేయండి
యువతకు మోదీ సవాలు

వందేళ్ల పై చిలుకు దాస్యం మనలను నిరుపేదలుగా, పరాధీనులుగా మార్చిందని మోదీ ఆవేదన వెలిబుచ్చారు. నేటికీ ఏ జాతి ఆత్మగౌరవానికైనా ఆత్మ నిర్భరతే అతి పెద్ద తార్కాణమని నొక్కిచెప్పారు. స్వయం సమృద్ధ భారతే వికసిత భారత్‌కు పునాది అని స్పష్టం చేశారు. ''ఇది ఎగుమతులు, దిగుమతులు, కరెన్సీలకే పరిమితం కారాదు. మేడిన్ ఇండియా ఆయుధాల తాలూకు గొప్పదనాన్ని ఆపరేషన్ సిందూర్ ద్వారా ప్రపంచమంతటికీ ఘనంగా చాటాం. శత్రు లక్ష్యాలను రెప్పపాటులో తుత్తునియలు చేశాం. రక్షణ రంగంలో స్వయం సమృద్ధి సాధించకపోతే ఇది సాధ్యపడేదా?'' అని ప్రశ్నించారు. ''ప్రతి ఒక్కరమూ భారత్‌లో, మన తోటివారు చెమటోడ్చి తయారు చేసిన వస్తువులనే వాడతామని ప్రతినబూనుదాం. ఇతరులూ వాడేలా చేద్దాం. 'స్వదేశీ వస్తువులే అమ్ముతాం' అంటూ ప్రతి చిరు వ్యాపారీ, దుకాణదారూ బోర్డు పెట్టాలి. ప్రతి రంగంలోనూ దేశీయ తయారీ వస్తువులే ఉండాలని, వాటిని ప్రపంచ దేశాలన్నింటికీ ఎగుమతి చేసే స్థాయికి చేరాలి'' అని ఆకాంక్షించారు. ''దేశీయ జెట్ ఇంజన్లు, యుద్ధవిమానాలు మొదలుకుని సోషల్ మీడియా వేదికల దాకా తిరుగులేని రీతిలో డిజైన్ చేయాలి. మన యువతకు, ఇన్నొవేటర్లకు, సైంటిస్టులకు, ఇంజనీర్లకు, ప్రొఫెషనల్స్‌కు ఇదే నా సవాలు'' అని పేర్కొన్నారు. తద్వారా దేశాన్ని బలోపేతంగా, స్వయంసమృద్ధంగా తీర్చిదిద్దడంలో పాలుపంచుకోవాల్సిందిగా పిలుపునిచ్చారు. ''అంతరిక్ష రంగంలోనూ ఆత్మ నిర్భరత అత్యవసరం. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో అడుగు పెట్టిన తొలి భారతీయునిగా రికార్డు నెలకొల్పిన వాయుసేన గ్రూప్‌కెప్టెన్ శుభాన్షు శుక్లాను చూసి జాతి యావత్తూ పొంగిపోతోంది. తొలి దేశీయ మానవసహిత అంతరిక్ష గగన్‌యాన్‌కు త్వరలో శ్రీకారం చుట్టనున్నాం. అంతేకాదు, సొంత అంతరిక్ష కేంద్రాన్నీ నిర్మించుకోనున్నాం'' అని చెప్పారు.

తగ్గనున్న జీఎస్టీ శ్లాబులు
దివాలీ డబుల్ బొనాంజా

''త్వరలో భారీస్థాయిలో సరికొత్త జీఎస్టీ సంస్కరణలు తేనున్నాం. జీఎస్టీ శ్లాబులను బాగా తగ్గించనున్నాం. తద్వారా పౌరులపై పన్ను భారం గణనీయంగా తగ్గుతుంది. ఈ దీపావళికి వారికిది కేంద్రం తరఫున డబుల్ బొనాంజా. వార్షిక వ్యక్తిగత ఆదాయ పన్ను చట్టాలను కూడా సరళీకరించాం''.

యువత కోసం... రూ.లక్ష కోట్లు

''దేశ యువత కోసం రూ.లక్ష కోట్లతో 'ప్రధాన్‌మంత్రీ వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన' పేరుతో కొత్త పథకాన్ని త్వరలో ప్రారంభించనున్నాం. దీనికింద ప్రైవేట్ రంగంలో ఉపాధి పొందే యువతీ యువకులందరికీ రూ.15 వేలు అందజేయనున్నాం. యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు అందించే కంపెనీలకు ప్రోత్సాహకాలు అందుతాయి. ఈ పథకం ద్వారా కనీసం 3.5 కోట్ల మంది యువతకు ఉపాధి కల్పిస్తాం''.

కీలక ఖనిజాలపై దృష్టి

''ఇది టెక్నాలజీ ఆధారిత శతాబ్ది. దాన్ని అందిపుచ్చుకున్న దేశాలే అభివృద్ధిలో దూసుకెళ్లాయన్నది చరిత్ర చెబుతున్న సత్యం. గత ప్రభుత్వాలను విమర్శించడం నా లక్ష్యం కాదు. కానీ మన దేశంలో సెమీ కండక్టర్ల తయారీకి సంబంధించిన ఫైళ్లు కదలడం 60 ఏళ్ల కిందే మొదలైంది. కానీ ఏళ్లు గడిచినా ఎక్కడి గొంగళి అక్కడే! అలా మనం అతి విలువైన 50 ఏళ్లను కోల్పోతే మిగతా దేశాలు ఆ రంగంలో దూసుకెళ్లాయి. మేం అధికారంలోకి వచ్చాక సెమీ కండక్టర్ల తయారీకి పెద్దపీట వేస్తున్నాం. ఇక కీలక ఖనిజాల అవసరాన్ని నేడు ప్రపంచ దేశాలన్నీ గుర్తించాయి. ఈ రంగంలోనూ స్వయం సమృద్ధి సాధించడం అత్యంత కీలకం. పరిశ్రమలు, ఇంధనం, రక్షణ, టెక్నాలజీ... ఇలా ఏ రంగాన్ని తీసుకున్నా కీలక ఖనిజాలే ప్రాణావసరంగా మారిన పరిస్థితి! ఈ అవసరాలను పూర్తిస్థాయిలో దేశీయంగానే తీర్చుకునేందుకు నేషనల్ క్రిటికల్ మిషన్‌కు శ్రీకారం చుట్టాం. దేశవ్యాప్తంగా ఏకంగా 1,200 చోట్ల కీలక ఖనిజాల అన్వేషణకు తెర తీశాం''.

పదింతలకు 'అణు' పాటవం

''దేశవ్యాప్తంగా 10 కొత్త అణు రియాక్టర్లను శరవేగంగా నిర్మిస్తున్నట్టు మోదీ వెల్లడించారు. దేశ అణు ఇంధన సామర్థ్యాన్ని 2047 నాటికి పదింతలు పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు ప్రకటించారు''.

'సింధూ' ఇక భారత సొత్తే!

''మన నేలపై పుట్టి పారే నదులు శత్రు దేశపు పొలాలను తడుపుతున్నాయి. మన రైతులు దాహార్తితో అల్లాడుతున్నారు. సింధూ ఒప్పందం 70 ఏళ్లుగా వారికి చేసిన నష్టం మాటలకందనిది. అది ఎంతటి ఏకపక్ష ఒప్పందమో ఇప్పుడు దేశవాసులందరికీ తెలిసొచ్చింది. దీన్నిక సహించేది లేదు. ఆ ఒప్పందానికి నూకలు చెల్లినట్టే. సింధూ జలాలన్నీ ఇక పూర్తిగా మన రైతులవే. టారిఫ్‌లతో మన రైతులు, మత్స్యకారులతో సహా ఎవరూ నష్టపోకుండా అండగా నిలుస్తా''.

శ్రీకృష్ణుడే స్ఫూర్తిగా మిషన్ సుదర్శన చక్ర
దేశ భద్రతకు ఛత్రం ● పదేళ్లలో అందుబాటులోకి

దేశ భద్రతను మరింత బలోపేతం చేసే దిశగా 'మిషన్ సుదర్శన్ చక్ర' పేరుతో 2035 నాటికి అత్యంత శక్తిమంతమైన సరికొత్త రక్షణ వ్యవస్థ ఏర్పాటును ప్రధాని మోదీ ప్రకటించారు. దీనిద్వారా దేశ భద్రతా ఛత్రాన్ని మరింతగా విస్తరించి, బలోపేతం చేసి ఆధునీకరిస్తామని పేర్కొన్నారు. ''శనివారం శ్రీకృష్ణుని జన్మదినం. కచ్చితత్వంతో పని పూర్తి చేయడం, ఆ వెంటనే కృష్ణున్ని చేరుకోవడం సుదర్శన చక్రం ప్రత్యేకత. దాని స్ఫూర్తితో రూపొందే పూర్తి దేశీయ భద్రతా వ్యవస్థ కూడా అలాగే అత్యాధునికంగా రూపుదిద్దుకుంటుంది'' అన్నారు. యాంటీ బాలిస్టిక్ మిసైల్ సిస్టం వంటివాటితో ఇది ఇజ్రాయెల్ ఐరన్‌డోమ్ తరహాలో పని చేస్తుందన్నది నిపుణుల అంచనా.

అక్రమ వలసలు... అతి పెద్ద కుట్ర!
హై పవర్ మిషన్‌తో అడ్డుకట్ట

అక్రమ వలసలు దేశానికి తలనొప్పిగా మారాయని మోదీ ఆవేదన వెలిబుచ్చారు. ''ఇది పక్కా పథకం ప్రకారం కొందరు పన్నిన కుట్ర. ఉద్దేశపూర్వకంగా చొరబాట్లను ప్రోత్సహిస్తూ పెను సంక్షోభానికి బీజం వేస్తున్నారు. దేశంలో జనాభా సమతౌల్యాన్నే దెబ్బతీయజూస్తున్నారు. సరిహద్దు ప్రాంతాల్లో ఇది జాతీయ భద్రత పాలిట పెను ప్రమాదంగా పరిణమిస్తోంది. మన ఐక్యతకు, ప్రగతికి గొడ్డలిపెట్టుగా మారుతోంది. సామాజిక ఉద్రిక్తతల బీజాలు నాటుతోంది. చొరబాటుదార్లు అమాయక గిరిపుత్రులను మోగిస్తున్నారు. వారి అటవీ భూములను కాజేస్తున్నారు. ఈ ఘోరాలను ఇకపై సహించే ప్రసక్తే లేదు. అక్రమ చొరబాట్లకు అడ్డుకట్ట వేసేందుకు ఉన్నతస్థాయి డెమోగ్రాఫిక్ మిషన్‌కు రూపకల్పన చేస్తున్నాం'' అని ప్రకటించారు.

నారీ శక్తికి సలాం

''స్త్రీ శక్తి ప్రతి రంగంలోనూ సత్తా చాటుతోంది. స్టార్టప్‌లు, క్రీడలు, సైన్యం మొదలుకుని అంతరిక్షం దాకా ప్రతి రంగంలోనూ దేశ సామాజిక, ఆర్థిక ప్రగతిలో కీలక చోదక శక్తిగా నిలుస్తోంది. నేషనల్ డిఫెన్స్ అకాడెమీ (ఎన్‌డీఏ) నుంచి తాజాగా తొలి బ్యాచ్ మహిళా కేడెట్లు విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న చరిత్రాత్మక క్షణాలను తలచుకుని జాతి యావత్తూ గర్వంతో ఉప్పొంగిపోయింది. లక్‌పతీ దీదీ పథకంతో కోట్లాది మంది మహిళలు స్వయంసమృద్ధి సాధించారు''.



ఎర్రకోట ఆవరణలో స్వాతంత్ర్య వేడుకలకు హాజరైన విద్యార్థినులతో ముచ్చటిస్తున్న ప్రధాని మోదీ

రాజ్యాంగ స్ఫూర్తికి దగా

- సంఘ్ పెద్దలను మచ్చిక చేసుకోవడానికి మోదీ తంటాలు
- ఆర్‌ఎస్‌ఎస్‌పై ప్రధాని ప్రశంసలను దుయ్యబట్టిన కాంగ్రెస్

న్యూఢిల్లీ: స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్)పై ప్రశంసల వర్షం కురిపించడం పట్ల ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తంచేశాయి. మోదీ తీరును తీవ్రంగా ఖండించాయి. ఆర్‌ఎస్‌ఎస్‌పై మోదీ ప్రశంసలు రాజ్యాంగ స్ఫూర్తిని, లౌకిక గణతంత్రాన్ని దగా చేయడమే అవుతాయని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ శుక్రవారం 'ఎక్స్'లో విమర్శించారు. ఆర్‌ఎస్‌ఎస్ పెద్దలను మచ్చిక చేసుకోవడానికి మోదీ తంటాలు పడుతున్నారని ఎద్దేవా చేశారు. 75 ఏళ్లు దాటినవారు పదవుల నుంచి తప్పుకోవాలని ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భగవత్ చెప్పారని గుర్తుచేశారు. మోదీ ఈ రోజు అలసిపోయారని, త్వరలో పదవి నుంచి తప్పుకుంటారని జైరామ్ రమేశ్ తేల్చిచెప్పారు. ప్రభుత్వ కార్యక్రమంలో ప్రభుత్వానికి సంబంధం లేని సంస్థను పొగడడం ఏమిటని మండిపడ్డారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం స్వాతంత్ర్య దినోత్సవాన్ని రాజకీయ అంశంగా మార్చేశారని, ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కరాని మోదీపై నిప్పులు చెరిగారు. ఆర్‌ఎస్‌ఎస్‌పై మోదీ ప్రశంసల పర్వాన్ని సీపీఎం జాతీయ కార్యదర్శి ఎం.ఎ.బేబీ ఖండించారు. స్వాతంత్ర్య పోరాటంలో ఆర్‌ఎస్‌ఎస్‌కు ఎలాంటి పాత్ర లేదని గుర్తుచేశారు. ఆ సంస్థను గతంలో నిషేధించారని వెల్లడించారు.

అందుకోసం మోదీ నాగపూర్ వెళ్లాలి: ఒవైసీ

సంఘ్‌ను ఆకాశానికి ఎత్తేయడం భారత స్వాతంత్ర్య పోరాటాన్ని తక్కువ చేయడమే అవుతుందని ఏఐఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆక్షేపించారు. ఆర్‌ఎస్‌ఎస్, దాని అనుబంధ సంస్థలకు సేవకులుగా పనిచేశాయని దుయ్యబట్టారు. స్వాతంత్ర్య పోరాటానికి అవి దూరంగా ఉన్నాయని, మహాత్మా గాంధీని వ్యతిరేకించాయని చెప్పారు. ఆర్‌ఎస్‌ఎస్‌ను మంచి చేసుకోవాలంటే నాగపూర్‌కు వెళ్లాలి తప్ప ఎర్రకోట నుంచి ప్రశంసించడం ఏమిటని మోదీపై ఒవైసీ ధ్వజమెత్తారు. తప్పుడు చరిత్రను పక్కనపెట్టి అసలైన చరిత్ర, అసలైన హీరోల గురించి తెలుసుకోవాలని ప్రజలకు సూచించారు. ఆర్‌ఎస్‌ఎస్‌పై సమాజ్‌వాదీ పార్టీ అధినేత, ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్ విమర్శలు గుప్పించారు. ఆర్‌ఎస్‌ఎస్ త్వరలో 100 ఏళ్లు పూర్తి చేసుకోనుందని, అందుకు ఆ సంస్థ పెద్దలు బ్రిటిష్ పాలకులకు కృతజ్ఞతలు చెప్పుకోవాలని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. బ్రిటిషర్ల దయతోనే ఆ సంస్థ ఏర్పాటైందని అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్‌ను మోదీ కీర్తించడాన్ని తప్పుపట్టారు. మత సంస్థ పేరును అధికారిక కార్యక్రమంలో ప్రస్తావించడాన్ని ఆక్షేపించారు. నరేంద్ర మోదీ ఒక ప్రధానమంత్రిగా కాకుండా ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్‌గా వ్యవహరించారని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆరోపించారు. ఆర్‌ఎస్‌ఎస్ అనేది ప్రపంచంలో అతిపెద్ద రాజకీయ, విద్వేష, విభజన సంస్థ అని తేల్చిచెప్పారు. అది ప్రభుత్వం వద్ద రిజిస్టర్ కాలేదని, పన్నులు చెల్లించడం లేదని అన్నారు. అలాంటి సంస్థను ప్రధానమంత్రి ప్రశంసించడం దారుణమని సిద్ధరామయ్య విమర్శించారు. రాజకీయంగా బలహీనపడినప్పుడల్లా ఆర్‌ఎస్‌ఎస్ మద్దతు కోసం పాకులాడడం మోదీకి అలవాటుగా మారిందన్నారు. ఆర్‌ఎస్‌ఎస్‌కు ఘనమైన చరిత్ర ఏమీ లేదని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ స్పష్టంచేశారు.

పాక్‌లో వర్ష విలయం



ఖైబర్ ప్రావిన్స్‌లో గల్లంతైన వారి కోసం అన్వేషణ

- 36 గంటల వ్యవధిలో 200 మందికి పైగా మృతి
- అత్యధిక నష్టం ఖైబర్ ఫక్తున్వా ప్రావిన్స్‌లోనే
- పీవోకేలో గిల్గిట్-బల్టిస్తాన్ హైవే ధ్వంసం
- హెలికాప్టర్ కూలి ఐదుగురు మృత్యువాత

పెషావర్/ఇస్లామాబాద్: పాకిస్తాన్‌తోపాటు పీవోకేలో కురుస్తున్న భారీ వర్షాలు తీవ్ర ఆస్తి, ప్రాణ నష్టం మిగిల్చాయి. గత 36 గంటల వ్యవధిలో 214 మంది చనిపోగా పదుల సంఖ్యలో జనం గల్లంతయ్యారు. ఖైబర్ ఫక్తున్వా ప్రావిన్స్‌లో ఆకస్మిక వర్షాలు, వరదల్లో అత్యధికంగా 198 మంది చనిపోయినట్లు అధికారులు ప్రకటించారు. వీరిలో 14 మంది మహిళలు, 12 మంది చిన్నారులు ఉన్నారన్నారు. పీవోకేలోని గిల్గిట్-బాల్టిస్తాన్, కారకోరమ్ హైవే దెబ్బతిన్నాయన్నారు. ఖైబర్ ప్రావిన్స్‌లోని బునెర్ జిల్లాలో అత్యధికంగా 92 మంది చనిపోగా మన్‌షెరా జిల్లాలో 17 మంది బజౌర్, బటగ్రామ్ జిల్లాల్లో 18 మంది చొప్పున మృత్యువాతపడ్డారని స్థానిక అధికారులు వెల్లడించారు. లోయర్ దిర్ జిల్లాలో ఐదుగురు, స్వాత్‌లో నలుగురు, సంగ్లాలో ఒకరు చనిపోయారు. పలువురు చిన్నారులు సహా మొత్తం 125 మంది చనిపోయినట్లు విపత్తు నిర్వహణ విభాగం తెలిపింది. సహాయ, అన్వేషణ కార్యక్రమాలను ముమ్మరం చేసినట్లు వివరించింది. స్వాత్, బజౌర్‌లలో ఆర్మీ సహాయ కార్యకలాపాల్లో పాల్గొంటోంది. ఆకస్మిక వరదల్లో గిల్గిట్-బల్టిస్తాన్‌లోని ఘిజర్ జిల్లాలో 8 మంది చనిపోగా ఇద్దరు గల్లంతయ్యారు. జిల్లాలో పలు నివాసాలు, వాహనాలు, స్కూలు భవనాలు, ఆరోగ్య కేంద్రాలు ధ్వంసమయ్యాయి. కారకోరమ్ హైవే, బల్టిస్తాన్ హైవే పలు చోట్ల దెబ్బతింది. లింకు రోడ్లు తెగిపోవడంతో నీలమ్ లోయలోని రట్టి గలి సరస్సు వద్ద చిక్కుకుపోయిన 600 మందికి పైగా పర్యాటకులను అక్కడే ఉండాలంటూ అధికారులు సూచనలు చేశారు. కుందల్ షాహి వద్ద వంతెన కొట్టుకుపోయింది. వరద ఉధృతికి ఒక రెస్టారెంట్‌తో పాటు మూడిళ్లు నేలమట్టమయ్యాయి. జీలమ్ నదికి వరద పోటెత్తడంతో లోతట్టు ప్రాంతాల వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు ప్రారంభించారు. పీవోకేలోని ముజఫరాబాద్ జిల్లాలోని సర్లి సచాలో ఇల్లు కూలి కుటుంబంలోని ఆరుగురు సజీవ సమాధి అయ్యారు. సుధ్‌నోటి, బాగ్ జిల్లాల్లో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు.

కూలిన హెలికాప్టర్

సహాయక చర్యల్లో పాల్గొన్న హెలికాప్టర్ శుక్రవారం ఖైబర్ ప్రావిన్స్‌లో కూలిందని అధికారులు తెలిపారు. ఘటనలో ఇద్దరు పైలట్లు, ముగ్గురు సహాయక సిబ్బంది సహా ఐదుగురు చనిపోయారని చెప్పారు. వాతావరణం ప్రతికూలంగా మారడమే ఇందుకు కారణమని భావిస్తున్నామన్నారు. పెషావర్ నుంచి టేకాఫ్ తీసుకున్న ఎంఐ-17 హెలికాప్టర్ మహ్మంద్ జిల్లాలోని చంగి బండా వద్ద కూలిందని వివరించారు. ఘటన నేపథ్యంలో మరో హెలికాప్టర్‌ను సహాయక చర్యల కోసం వినియోగిస్తున్నామన్నారు.



కిష్తవాడ్‌లో వరదల్లో చిక్కుకున్న వారిని రక్షిస్తున్న సహాయక సిబ్బంది

60కి చేరిన మరణాలు

- మరో 69 మంది జాడ గల్లంతు
- చోసితీ గ్రామంలో కొనసాగుతున్న సహాయక చర్యలు
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్న సీఎం ఒమర్ అబ్దుల్లా

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని కిష్తవాడ్ జిల్లా చోసితీ గ్రామంలో 'క్లౌడ్ బరస్ట్' ఘటనలో మృతుల సంఖ్య శుక్రవారం 60కి చేరింది. 30 మృతదేహాలను గుర్తించి, సంబంధిత కుటుంబాలకు అప్పగించారు. మరో 69 మంది జాడ ఇంకా లభించలేదు. శిథిలాల కింద చిక్కుకున్నవారిని గుర్తించడానికి అధికారులు సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. భారీ వర్షాల కారణంగా గురువారం రాత్రి నిలిపివేసిన గాలింపు చర్యలను శుక్రవారం ఉదయం పునఃప్రారంభించారు. సైన్యం, పోలీసులు, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది చోసితీ గ్రామంలో రాళ్లు, బురదను తొలగిస్తున్నారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా చెప్పారు. క్లౌడ్ బరస్ట్‌లో 100 మందికిపైగా గాయపడ్డారని స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం సీఎం ఒమర్ అబ్దుల్లా, జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాతో మాట్లాడారు. అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. శిథిలాల కింద నుంచి వెలికి తీసినవారిని తక్షణమే ఆసుపత్రికి తరలించడానికి చోసితీలో 65 అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచారు. గ్రామంలో గురువారం మధ్యాహ్నం గంటపాటు క్లౌడ్ బరస్ట్ విరుచుకుపడిన సంగతి తెలిసిందే. ఆకస్మిక వర్షాలు, వరదల ధాటికి పెద్ద సంఖ్యలో ఇళ్లు, దుకాణాలు నేలమట్టమయ్యాయి. గ్రామాన్ని బురద ముంచెత్తింది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో మచైల్ మాత యాత్రను రెండో రోజు శుక్రవారం కూడా రద్దుచేశారు.

అధికారం కోసం ఎంతకైనా దిగజారుతుంది

బీజేపీపై కాంగ్రెస్ చీఫ్ ఖర్గే నిప్పులు

న్యూఢిల్లీ: వెలుగులోకి వస్తున్న ఎన్నికల అక్రమాలను చూస్తే అధికారం కోసం బీజేపీ ఎంతకైనా దిగజారుతుందని అర్థమవుతోందని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే నిప్పులు చెరిగారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆయన కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం ఇందిరా భవన్‌లో జెండా ఎగురవేసిన అనంతరం నాయకులు, శ్రేణులనుద్దేశించి ప్రసంగించారు. జోరున వర్షం కురుస్తుండగానే రాహుల్ గాంధీ కాంగ్రెస్ ముఖ్యనేతలు జెండా వందనం కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ..బిహార్‌లో చేపట్టిన ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) పేరుతో బతికున్న వారిని సైతం చనిపోయినట్లుగా ధ్రువీకరించడం ద్వారా ప్రతిపక్షాలకు పడే ఓట్లను తొలగించారని ఆరోపించారు. తొలగింపునకు గురైన 65 లక్షల ఓట్లకు సంబంధించి బీజేపీ ఒక్క అభ్యంతరం కూడా వ్యక్తం చేయకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. దీన్ని బట్టి చూస్తే ఎస్ఐఆర్‌తో లాభం కలిగేది బీజేపీకి మాత్రమేనని ఖర్గే వ్యాఖ్యానించారు. ఇలాంటి అక్రమాలు దేశవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో వెలుగులోకి వస్తున్నాయన్నారు. ఏ ప్రాతిపదికన ఓట్లను రద్దు చేసిందో తెలిపేందుకు ఈసీ సైతం సిద్ధంగా లేదని ఆరోపించారు. అధికారంలో కొనసాగేందుకు ఆ పార్టీ ఎంత అనైతికతకయినా సిద్ధమవుతోందని దీంతో స్పష్టమవుతోందని విమర్శించారు. ఈ పరిస్థితుల్లో దేశ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ పోరాటం సాగిస్తుందే తప్ప, ఎన్నికల్లో విజయం కోసం కాదని కాంగ్రెస్ చీఫ్ ఖర్గే స్పష్టం చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రత్యర్థి రాజకీయ పార్టీలకు వ్యతిరేకంగా కేంద్ర దర్యాప్తు విభాగాలైన ఈడీ, సీబీఐలతోపాటు ఆదాయపన్ను శాఖను సైతం బీజేపీ సర్కార్ బాహాటంగా దుర్వినియోగం చేస్తోన్న విషయాన్ని ప్రత్యక్షంగా అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టే చెప్పిందని ఆయన అన్నారు. అలీన విధానం ద్వారా కూడగట్టుకున్న ప్రతిష్టను బీజేపీ సర్కార్ హయాంలో మన దేశం కోల్పోవాల్సి వచ్చిందని ఖర్గే విమర్శించారు.



వర్షంలో తడుస్తూనే జెండా వందనం చేస్తున్న ఖర్గే, రాహుల్ తదితరులు

వర్షంలో తడుస్తూ రాహుల్ జెండా వందనం

ఇందిరా భవన్ ప్రాంగణంలో పార్టీ చీఫ్ ఖర్గే జెండా ఎగురవేస్తుండగా ఆయన పక్కనే అగ్రనేత రాహుల్ గాంధీ వర్షంలో మిగతా వారితో కలిసి తడుస్తూనే నిలబడ్డారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను కాంగ్రెస్ పార్టీ ఎక్స్‌లో షేర్ చేసింది. 'ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి కట్టుబడి ఉన్నాం. వీటి పరిరక్షణ కోసం ఇకపైనా పోరాడుతాం'అని ఆ పార్టీ పేర్కొంది. లోక్‌సభలో ప్రతిపక్ష నేత అయిన రాహుల్ గాంధీ ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

సాక్షి
హైదరాబాద్
శనివారం, 16, ఆగస్టు, 2025


హుస్సేన్ సాగర్ తీరంలో..

గరిష్టం/కనిష్టం
28.0/22.0

వాతావరణం
నగరంలో శనివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశముంది. గరిష్టంగా 28, కనిష్టంగా 22 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.


ట్యాంక్‌బండ్‌పై జాతీయ జెండాను చేబూని.. బాలిక ఉత్సాహం


గోల్కొండ కోటలో ఒగ్గు కళాకారుల విన్యాసం


జాతీయ పతాకంతో ఓ బాలుడు..

మది నిండా.. మన జెండా

మువ్వన్నెల జెండా మురిసింది. ఆకాశం నిండా మెరిసింది. ఆబాలగోపాలం మా తుఝే సలాం అంటూ ముక్త కంఠంతో నినదించింది. శుక్రవారం నగరంలో స్వాతంత్య్ర దినోత్సవ సంబరాలు నింగినంటాయి. గోల్కొండ కోటపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ట్యాంక్‌బండ్‌పై జాతీయ జెండాల ర్యాలీ అలరించింది. సికింద్రాబాద్‌లోని రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆర్‌పీఎఫ్ పోలీసులు ఒళ్లు గగుర్పొడిచేలా సాహస విన్యాసాలు చేశారు.


గోల్కొండ కోటలో విద్యార్థినితో సీఎం రేవంత్‌రెడ్డి కరచాలనం


ట్యాంక్‌బండ్‌పై..




సికింద్రాబాద్‌లోని రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో విన్యాసాలు


హుస్సేన్ సాగర్ అలలపై మువ్వన్నెల రెపరెపలు..

మహిళా సాధికారతకు ప్రాధాన్యం

పంద్రాగస్టు వేడుకల్లో హైదరాబాద్ కలెక్టర్ హరిచందన



సాక్షి, సిటీబ్యూరో: కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న ప్రభుత్వ సంకల్పంలో భాగంగా అన్ని రంగాల్లోనూ అతివలకు పెద్దపీట వేస్తున్నట్లు హైదరాబాద్ కలెక్టర్ హరిచందన దాసరి వెల్లడించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు కృషి చేయాలని హరిచందన సూచించారు. మారేడుపల్లి, ముషీరాబాద్, ఖైరతాబాద్, షేక్‌పేట, సైదాబాద్, ఆసిఫ్ నగర్, నాంపల్లి, తిరుమలగిరి మండల్లాలోని 16 కాలనీల్లో మురికి వాడలను గుర్తించి అర్హులైన పేదలకు 1800 ఇందిరమ్మ ఇళ్లను అందించనున్నట్లు చెప్పారు. స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ఉదయం పూట రూ.5కే మిల్లెట్ ఇడ్లీ, మిల్లెట్ ఉప్మా, పొంగల్, పూరి అందించేందుకు ఇందిరమ్మ క్యాంటీన్లకు త్వరలో శ్రీకారం చుడతామని తెలిపారు. హైదరాబాద్‌ను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దే దిశగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, బోయిన్‌పల్లిలోని డీ అడిక్షన్ సెంటర్ ద్వారా మాదక ద్రవ్యాలు సేవించే వారికి మెరుగైన చికిత్స అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కదిరవన్ పళని, జి.ముకుంద రెడ్డి, డీఆర్‌ఓ వెంకటాచారి, ఆర్డీవోలు రామకృష్ణ, సాయిరాం, సంక్షేమ అధికారులు ఆశన్న, ప్రవీణ్ కుమార్, కోటాజీ, ఇలియాస్ అహ్మద్ పాల్గొన్నారు.

ఉప్పల్ పరిధిలో దారుణం

ఐదేళ్ల బాలుడిపై హత్యాచారం

ఉప్పల్: అభమూ శుభమూ తెలియని ఐదేళ్ల బాలుడిపై ఓ మానవ మృగం లైంగిక దాడికి పాల్పడి.. అనంతరం హత్య చేసిన దారుణ ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు చెప్పిన వివరాల ప్రకారం.. రామంతాపూర్ కేసీఆర్ నగర్‌లో నివసించే ఓ వ్యక్తి స్థానికంగా ఉన్న టింబర్ డిపోలో పని చేస్తున్నాడు. ఈ నెల 12న తన కుమారుడు (5) కనిపించడం లేదంటూ ఉప్పల్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరిపిన పోలీసులు.. సీసీ ఫుటేజీల ఆధారంగా అనుమానితుణ్ని అదుపులోకి తీసుకుని విచారణ చేయగా.. అసలు విషయం బయట పడింది. అదే టింబర్ డిపోలో పని చేసే కమర్ అనే వ్యక్తి 12వ తేదీన బాలుడికి మాయమాటలు చెప్పి కేసీఆర్ నగర్ సమీపంలోని చెట్ల పొదల్లోకి తీసుకెళ్లి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీంతో బాలుడు స్పృహ తప్పిపోగా.. గొంతు నులిమి హత్య చేసినట్లు నిందితుడు వెల్లడించాడు. బిహార్‌కు చెందిన కమర్.. బాలుడి ఇంటి పక్కనే నివాసం ఉండేవాడని పోలీసులు తెలిపారు. బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఉప్పల్ పోలీసులు చెప్పారు.

పసిడి కిందికి.. సిగరెట్లు పైకి!

విదేశాల నుంచి తగ్గిన బంగారం స్మగ్లింగ్



- 2023–24ల్లో 240 కేసులు నమోదు
- గత ఆర్థిక సంవత్సరం ఇది 133కు తగ్గుదల
- కేంద్రం ఇంపోర్ట్ డ్యూటీని తగ్గించడమే కారణం
- గణనీయంగా పెరిగిన సిగరెట్ల అక్రమ రవాణా
- మూడు రెట్లు అధికంగా వీటి సంబంధిత కేసులు



ఇవీ స్మగ్లింగ్ కేసుల గణాంకాలు		
వస్తువు	2023-24	2024-25
బంగారం	240	133
సిగరెట్లు	54	175
విదేశీ నగదు	12	6
గంజాయి	0	6
వజ్రాలు	0	1
హెరాయిన్	2	0
జంతువులు	0	2
ఎలక్ట్రానిక్స్	1	0
మొబైల్ ఫోన్లు	0	2
ఇతరాలు	0	1
మొత్తం	309	326

సాక్షి, సిటీబ్యూరో

విదేశాల నుంచి అక్రమ రవాణా అవుతున్న బంగారానికి సంబంధించి శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలోని కస్టమ్స్, డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్‌ఐ) అధికారులు 2023–24 ఆర్థిక సంవత్సరంలో 240 కేసులు నమోదు చేశారు. వీటికి సంబంధించి 132.4 కేజీల పసిడి స్వాధీనం చేసుకున్నారు. 2024–25 నాటికి కేసుల సంఖ్య 133కి, సీజ్ చేసిన బంగారం 42.5 కేజీలకు తగ్గిపోయింది. కేంద్రం ఇంపోర్ట్ డ్యూటీని 15 నుంచి ఆరు శాతానికి తగ్గించడమే దీనికి కారణమని నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇదే సమయంలో సిగరెట్ల అక్రమ రవాణా మాత్రం గణనీయంగా పెరిగినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

ప్రధానంగా ఆ దేశాల నుంచే..

దుబాయ్ హవాలా రాకెట్లతో పాటు ఇప్పుడు బంగారం అక్రమ రవాణాకూ కేంద్రంగా మారిపోయింది. దీంతో పాటు జెద్దా, మస్కట్, కువైట్, బహ్రేన్ నుంచి స్మగ్లింగ్ అవుతుంటుంది. ఆయా దేశాల్లో ఆదాయపు పన్ను విధానం లేకపోవడంతో మనీలాండరింగ్ అనేదే ఉత్పన్నం కాదు. దీంతో ఇక్కడ నుంచి హవాలా ద్వారా నల్లధనాన్ని అక్కడకు పంపే స్మగ్లర్లు దాన్ని బంగారంగా మార్చి ఇక్కడకు తీసుకు వస్తుంటారు.

గరిష్టంగా ఏడు శాతం తక్కువ రేటు..

ప్రస్తుతం నగరంలో 24 క్యారెట్ల బంగారం కేజీ రూ.కోటి వరకు పలుకుతోంది. ఆయా దేశాల్లో దీని ఖరీదు ఐదు నుంచి ఏడు శాతం తక్కువగా ఉంటుంది. కేజీ బంగారాన్ని స్మగ్లింగ్ చేయడానికి సూత్రధారులు రూ.7 లక్షల వరకు ఖర్చు చేస్తారు. గతంలో విదేశాల నుంచి తీసుకు వచ్చే బంగారంపై 15 శాతం ఇంపోర్ట్ డ్యూటీ ఉండేది. దీన్ని కేంద్ర ప్రభుత్వం ఆరు శాతానికి తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో విదేశాల నుంచి అక్రమ రవాణా చేసి తీసుకువచ్చినా, నేరుగా తీసుకువచ్చినా వచ్చే లాభంలో పెద్ద తేడా లేకపోవడంతో స్మగ్లింగ్ గణనీయంగా తగ్గింది.

సిగరెట్లకు భారీగా పెరిగిన డిమాండ్..

బంగారం, ఎలక్ట్రానిక్ వస్తువులు, మాదకద్రవ్యాలు... అక్రమ రవాణా పేరు చెప్పగానే ఇవే గుర్తుకొస్తాయి. అయితే సిగరెట్లు కూడా పెద్ద సంఖ్యలో స్మగ్లింగ్ అవుతున్నాయి. 2023–24లో కేవలం 54 కేసులు నమోదు కాగా... గత ఆర్థిక సంవత్సరానికి ఈ సంఖ్య 175కు చేరింది. హైదరాబాద్ నగరానికి అక్రమ రవాణా అవుతున్న సిగరెట్లలో రెండు బ్రాండ్లే ఎక్కువగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

టాప్‌గేర్‌లో ఈ– బండి

ఈ ఏడాది రోడ్డెక్కిన 2.21 లక్షల వాహనాలు

- 1.8 లక్షల ద్విచక్ర వాహనాలదే హవా
- రెండో స్థానంలో 22వేలకు పైగా కార్లు..
- లైఫ్ ట్యాక్స్, ఫీజుల రూపంలో రూ.91.93 లక్షల రాయితీ
- చార్జింగ్ కేంద్రాలు పెరిగితే మరిన్ని రయ్ రయ్

నగరంలో ఈవీల జోరు ఇలా..		
వాహనాలు	సంఖ్య	పన్ను మినహాయింపు (రూ.లక్షల్లో)
ద్విచక్ర వాహనాలు	1,88,549	22.21
కార్లు	22,365	69.61
ఆటోరిక్షాలు	5,097	50.97
గూడ్స్ వాహనాలు	5,363	53.63
మొత్తం	2,21,374	91.932



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌లో ఈ– బండి టాప్‌గేర్‌లో పరుగులు తీస్తోంది. ఈవీలపై జీవితకాల పన్ను మినహాయింపుతో ఈ ఏడాది ఇప్పటి వరకు లక్షకుపైగా ద్విచక్ర వాహనాలు, 22 వేల కార్లు రోడ్డెక్కాయి .కొంతకాలంగా ఈ రెండు కేటగిరీలకు చెందిన వాహనాల అమ్మకాలు ఊపందుకున్నట్లు ఆటోమొబైల్ వర్గాలు తెలిపాయి. ఈ సంవత్సరం కేంద్రం ప్రకటించిన ప్రోత్సాహకాలు కూడా ఎలక్ట్రిక్ వాహనాల దూకుడు పెరిగేందుకు దోహదం చేస్తున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఇంధన ధరలు భారంగా మారుతున్న దృష్ట్యా సామాన్య, మధ్యతరగతి వర్గాలు క్రమంగా పెట్రోల్, డీజిల్ వాహనాల నుంచి ఈవీలకు మారుతున్నారు. గ్రేటర్‌లో ఈ నెల 10 నాటికి 1,88,549 ద్విచక్ర వాహనాలు, 22,365 కార్లు నమోదైనట్లు ఆర్టీఏ అధికారులు తెలిపారు. కొత్తగా 5,097 ఆటోలు, మరో 5,363 తేలికపాటి వస్తు రవాణా వాహనాలు రోడ్డెక్కాయి. వివిధ కేటగిరీల్లో మొత్తం 2,21,374 ఎలక్ట్రిక్ వాహనాలు ఇప్పటి వరకు నమోదైనట్లు అధికారులు చెప్పారు. ఈ వాహనాలపై జీవితకాల పన్ను రూపంలో వాహనదారులకు రూ.91.93 లక్షల రాయితీ లభించింది. ఆటోలు, గూడ్స్ వాహనాలపై ప్రతి మూడు నెలలకోసారి విధించే క్వార్టర్లీ ట్యాక్స్ నుంచి కూడా మినహాయింపు లభించింది. ఎలక్ట్రిక్ వాహనాలపై ప్రభుత్వం ఇచ్చిన పన్ను రాయితీ అవకాశాన్ని వాహన కొనుగోలుదారులు సద్వినియోగం చేసుకోవాలని హైదరాబాద్ జేటీసీ రమేష్ సూచించారు.

మరో అక్రమ ‘సృష్టి’

సరోగసీ పేరిట అమాయకులకు ఎర

- తల్లీకొడుకులే సూత్రధారులు
- సెంటర్‌పై దాడి చేసిన పోలీసులు
- ఇద్దరు ప్రధాన నిందితుల అరెస్టు
- అదుపులోకి ఆరుగురు మహిళలు
- కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో బయటపడిన వ్యవహారం

కుత్బుల్లాపూర్: నగరంలో సంచలనం సృష్టించిన ‘సృష్టి’ ఫెర్టిలిటీ సెంటర్ సరోగసీ కేసు విషయం మరవకముందే మేడ్చల్ జిల్లాలో మరో అక్రమ సరోగసీ సెంటర్ బండారం బయట పడింది. శుక్రవారం మేడ్చల్ జిల్లా ఎస్‌ఓటీ పోలీసులు, జిల్లా వైద్యశాఖ అధికారుల సహాయంతో కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని రింగ్‌రోడ్డు సమీపంలోని సెంటర్‌పై దాడి చేసి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి మరో ఆరుగురు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన నిందితులిద్దరూ తల్లీ కొడుకులే కావడం గమనార్హం. పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో మేడ్చల్ డీసీపీ ఎస్.కోటిరెడ్డి, మేడ్చల్ డీఎంహెచ్‌ఓ ఉమాగౌరితో కలిసి వివరాలు వెల్లడించారు. ఏపీలోని చిలకలూరిపేటకు చెందిన నారెడ్డుల లక్ష్మి రెడ్డి అలియాస్ లక్ష్మి తన కుమారుడు నరేందర్‌రెడ్డితో కలిసి కుత్బుల్లాపూర్, చింతల్‌లో ఉంటోంది. గతంలో లక్ష్మి అండం దాతగా, సరోగసీ తల్లిగా వ్యవహరించింది. దీంతో ఆమెకు పలు ప్రైవేట్ ఫెర్టిలిటీ క్లినిక్‌లతో సంబంధాలు ఏర్పడ్డాయి. క్లినిక్ నిర్వాహకులతో పరిచయాలు పెంచుకుని సులువుగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో అండం దానం, సరోగసీ తల్లిగా వ్యవహరించే వారిని గుర్తించి తానే కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనుకుంది. దీంతో బీటెక్ పూర్తి చేసిన తన కొడుకు నరేందర్‌రెడ్డితో కలిసి వ్యూహ రచన చేసింది.

నిరుపేద మహిళలే లక్ష్యంగా..

లక్ష్మి పలు ప్రైవేట్ ఫెర్టిలిటీ క్లినిక్‌లతో బేరం కుదుర్చుకుని భారీ మొత్తంలో డబ్బులు తీసుకుంటోంది. ఆర్థికంగా నష్టాల్లో ఉన్న, నిరుపేద మహిళలే లక్ష్యంగా మచ్చిక చేసుకుటుంది. ఆపై వారికి డబ్బు ఆశ చూపించి అండం దానం, సరోగసీ తల్లిగా వ్యవహరించేలా ఒప్పందం చేసుకుంటుంది. ఈ క్రమంలో వారిని తన ఇంట్లోనే పెట్టుకుంది.

సెంటర్‌పై దాడి..

విశ్వసనీయ సమాచారం అందుకున్న మేడ్చల్ ఎస్‌ఓటీ, పేట్‌బషీరాబాద్ పోలీసులు వైద్యశాఖ అధికారుల సహాయంతో సెంటర్‌పై దాడి చేశారు. లక్ష్మి, నరేందర్‌రెడ్డిలను అరెస్ట్ చేసి అద్దె గర్భ మహిళలు కర్ణాటక రాష్ట్రం బీదర్‌కు చెందిన గోల్కొండ సాయిలీల, ఏపీలోని రంపచోడవరం ప్రాంతానికి చెందిన మల్లగల్ల వెంకటలక్ష్మి, సాదల సత్యవతి, విజయనగరం నివాసులు పంటడ అపర్ణ, రమణమ్మ, అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన పి.సునీతలను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.6.47 లక్షల నగదు, ల్యాప్‌టాప్, ప్రామిసరీ నోట్లు, బాండ్ పేపర్లు, గర్భధారణ మందులు, హార్మోన్ ఇంజెక్షన్లు, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. లక్ష్మిపై 2024లో ఇదే తరహాలో ముంబైలో కేసు నమోదైంది.

విచారణ కొనసాగుతోందని, ఇందులో ప్రమేయమున్న ప్రైవేటు ఆస్పత్రులు, ఫెర్టిలిటీ క్లినిక్‌లను గుర్తించి వాటిపై పట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీసీపీ కోటిరెడ్డి తెలిపారు. మేడ్చల్ ఎస్‌ఓటీ అడిషనల్ డీసీపీ ఎ.విశ్వప్రసాద్, ఏసీపీ బాలగంగి రెడ్డి, ఎస్‌ఓటీ, పేట్‌బషీరాబాద్ పోలీసులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి. చిత్రంలో డీఎంహెచ్‌ఓ ఉమాగౌరి తదితరులు

మస్కిటో మటాష్

దోమల నివారణపై బల్దియా సమరభేరి

- ముమ్మరంగా యాంటీ లార్వా ఆపరేషన్లు
- చెరువులు ఇతర ప్రాంతాల్లో డ్రోన్ స్ప్రే

సాక్షి, సిటీబ్యూరో: వివిధ అంశాల్లో అధునాతన సాంకేతికతను వినియోగించుకుంటోన్న జీహెచ్‌ఎంసీ, దోమల నివారణకూ సాంకేతికతను వినియోగించుకోవాలని భావిస్తోంది. పెద్దపెద్ద చెరువుల్లో దోమల నివారణకు ఇప్పటికే డ్రోన్ స్ప్రే చేస్తుండగా, మనుషులు వెళ్లలేని ఇతర ప్రాంతాల్లోనూ మానవ జోక్యం లేకుండా డ్రోన్‌స్ప్రేతో పాటు ఇతరత్రా కార్యక్రమాలను అమలు చేసే దిశగా అధికారులు అడుగులు వేయనున్నారు.

అంటువ్యాధులు ప్రబలకుండా..

వరుస వర్షాలతో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున దోమల ద్వారా వ్యాపించే డెంగీ, మలేరియా, చికున్‌గున్యా తదితర వ్యాధుల వ్యాప్తిని సమర్థంగా అరికట్టేందుకు ఇది ఉపకరిస్తుందని భావిస్తున్నారు. దీంతోపాటు క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది యాంటీ లార్వా ఆపరేషన్లు సవ్యంగా నిర్వహిస్తున్నదీ లేనిదీ ఆన్‌లైన్ ఆధారిత ట్రాకింగ్ సిస్టమ్ ద్వారా ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు. తద్వారా వారి జవాబుదారీతనం మెరుగవుతుందని, పని చేయకున్నా చేస్తున్నామని చెప్పేందుకు వీలు ఉండదని సంబంధిత అధికారి తెలిపారు. కమిషనర్ కర్ణన్ ఆదేశాలకనుగుణంగా ఎంటమాలజీ విభాగం అన్ని జోన్లు, సర్కిళ్లలో యాంటీ లార్వా, యాంటీ అడల్ట్ మస్కిటో కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

గ్రేటర్ పరిధిలోని 4,846 కాలనీల్లో..

గ్రేటర్ వ్యాప్తంగా గుర్తించిన 4,846 కాలనీల్లోని నీటి నిల్వ ప్రదేశాలు, చెరువులు, కుంటల్లో గంబూసియా చేపలు, ఆయిల్ బాల్స్ వదులుతూ దోమల వృద్ధిని అరికడుతున్నారు. లోతట్టు ప్రాంతాలు , సెల్లార్లు, భవన నిర్మాణ ప్రాంతాల్లో నిల్వ ఉండే నీటితో దోమలు ఎక్కువగా వృద్ధి చెందే అవకాశం ఉన్నందున సదరు ప్రాంతాల్లో ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ఇండోర్ పైరిథ్రమ్ స్ప్రేతో పాటు దోమల లార్వా సర్వే చేపడుతున్నారు. దీంతోపాటు జోన్‌కొక ఫ్లోట్ ట్రాష్‌కలెక్టర్ ద్వారా గుర్రపు డెక్కలను, కుళ్లిన మొక్కల వ్యర్థాలను తొలగిస్తున్నట్లు జీహెచ్‌ఎంసీ పేర్కొంది. మంగళ, శుక్ర, శనివారాల్లో విద్యాసంస్థల్లో దోమల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని, ప్రతి శుక్రవారం ఫ్రై డే డ్రై డే పేరిట కాలనీల్లోనూ ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపింది. జీహెచ్‌ఎంసీ యాప్, ఈ–మెయిల్స్, ఎక్స్ ద్వారా అందే పౌరుల ఫిర్యాదులను పరిష్కరిస్తున్నామని పేర్కొంది. ప్రజలు కూడా దోమల నివారణకు తమ ఇళ్లతో పాటు పరిసరాలలో నీరు నిల్వకుండా చూసేందుకు సహకరించాలని కోరింది.

ఆన్‌లైన్ విజ్ఞప్తుల ఆధారంగా ఫాగింగ్

మై జీహెచ్‌ఎంసీ యాప్ ద్వారా ఫాగింగ్ కోసం సైతం ప్రజల నుంచి అభ్యర్థనలు స్వీకరించి ఫాగింగ్ కార్యక్రమాలు చేపడుతున్నారు.


చెరువులో యాంటీ లార్వా చర్యలు

దక్షిణమధ్య రైల్వేలో ఘనంగా స్వాతంత్య్ర వేడుకలు

సాక్షి, సిటీబ్యూరో: దక్షిణ మధ్య రైల్వేలో 79 వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. సికింద్రాబాద్ రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రాంగణంలో జరిగిన వేడుకల్లో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ జాతీయ జెండాను ఎగురవేశారు. ఆర్‌పిఎఫ్ నిర్వహించిన పరేడ్‌లో పాల్గొని గౌరవ వందనం స్వీకరించారు. ఈ వేడుకల్లో దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్, ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ అరోమా సింగ్ ఠాకూర్, సీనియర్ రైల్వే అధికారులు, సిబ్బంది, కుటుంబ సభ్యులు, రైల్వే పాఠశాల,కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, ఆర్పీఎఫ్ కమాండో షో,డాగ్ షోలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

మనీమ్యూల్స్‌కు షెల్టర్!

- 48 గంటల పాటు వారికి హోటళ్లలో బస ఏర్పాటు
- ఖాతాల యాక్టివేషన్ ప్రక్రియ మొత్తం పూర్తి కావడానికే
- విదేశాల్లో తిష్టవేసిన 'సైబర్ సూత్రధారుల' కొత్త ఎత్తు
- తాజా కేసుల దర్యాప్తులో గుర్తించిన సైబర్ క్రైమ్ కాప్స్

సాక్షి, సిటీబ్యూరో: కాంబోడియా, దుబాయ్, మయన్మార్ కేంద్రంగా సైబర్ క్రైమ్ సిండికేట్స్ నిర్వహించిన సూత్రధారులు అనుసరిస్తున్న కొత్త పంథాను సైబర్ క్రైమ్ పోలీసులు గుర్తించారు. బాధితుల నుంచి డబ్బు డిపాజిట్ చేయడానికి అవసరమైన బ్యాంకు ఖాతాలను అందించే మనీమ్యూల్స్‌ను 48 గంటల పాటు దళారుల ఆధీనంలో, హోటల్ రూమ్స్‌లో ఉంచుతున్నట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. వారి పేర్లు, వివరాలతో తెలిచిన బ్యాంకు ఖాతాలు యాక్టివేషన్ పూర్తి కావడంతో పాటు నగదు డిపాజిట్లు మొదలు కావడంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉండటానికే సూత్రధారులు ఈ చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసులు చెప్తున్నారు.

తమ ఖాతాలు వాడకుండా మూల్స్‌వి...

కాల్‌సెంటర్ల ఏర్పాటు చేసి మరీ వివిధ రకాలైన సైబర్ నేరాలు చేయిస్తున్న సూత్రధారులు ఇటీవల కాలంలో విదేశాల్లోనే ఉంటున్నారు. వీళ్లు బాధితుల నుంచి డబ్బు డిపాజిట్ చేయించుకోవడానికి తమ ఖాతాలు వినియోగించరు. టెలిగ్రాం, సిగ్నల్ తదితరు సోషల్‌మీడియాల్లో గ్రూపులు ఏర్పాటు చేయడం ద్వారా తమకు సహకరించే దళారుల్ని గుర్తిస్తున్నారు. వీరి ద్వారా ఆయా ప్రాంతాల్లో ఉన్న చిరుద్యోగులు, నిరుద్యోగులు, చిన్న చిన్న వ్యాపారులను ఆకర్షిస్తారు. వీరి కేవైసీ వివరాలతో, బోగస్ కంపెనీలు తెరిచి ఆపై బ్యాంకు ఖాతాలు తెరిపిస్తుంటారు. ఈ ఖాతాల ద్వారా జరిగే లావాదేవీలపై కమీషన్లు తీసుకునే వారిని మనీమ్యూల్స్‌గా పరిగణిస్తుంటారు. ఒకప్పుడు ఈ బ్యాంక్ ఖాతాలకు సంబంధించిన వివరాలు, డెబిట్ కార్డులు, చెక్‌బుక్స్ తదితరాలు తీసుకోవడంతో మనీమ్యూల్స్‌ను దళారులు పంపేసేవాళ్లు.

ఖాతాలు దొరకడం గగనం కావడంతో...

ఇలా మనీమ్యూల్స్ ద్వారా తెరిచిన బ్యాంకు ఖాతాల్లో కొన్ని సాంకేతిక కారణాలతో పూర్తిస్థాయిలో యాక్టివేట్ అయ్యేవి కాదు. ఆ ప్రక్రియ పూర్తి చేయడానికి మ్యూల్స్ అందుబాటులో ఉండరు. దీంతో ఆయా ఖాతాలను సూత్రధారులు వదిలేసేవాళ్లు. గతంలో పోలీసులు సైతం ఈ మనీమ్యూల్స్ విషయంలో ఉదాశీనంగా వ్యవహరించే వాళ్లు. అయితే కొన్నాళ్లుగా ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుంటున్న దర్యాప్తు అధికారులు వీరితో పాటు దళారులను అరెస్టు చేస్తున్నారు. ఈ కారణంగానే బ్యాంకు ఖాతాలు లభించడం సూత్రధారులకు గగనంగా మారిపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో ఏ ఒక్క మ్యూల్ ఖాతాను వదలకూడదని సూత్రధారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే దళారుల ద్వారా కనీసం 48 గంటల పాటు మ్యూల్స్‌కు షెల్టర్ ఏర్పాటు చేస్తున్నారు. దళారులు నివసించే ప్రాంతంలో ఉండే లాడ్జిలు, హోటళ్లనే దీనికోసం వినియోగిస్తున్నారు. ఆ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఖాతాల యాక్టివేషన్, ప్రాథమిక లావాదేవీలను సూత్రధారులు పూర్తి చేస్తున్నారు.



కామాంధుడిగా మారిన కానిస్టేబుల్

అమీర్‌పేట: కాపాడాల్సిన కానిస్టేబుల్ కామాంధుడుగా మారాడు. కోర్కె తీర్చాలని వివాహితను వేధింపులకు గురి చేసిన సంఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. తిరుమలగిరిలో ఓ మహిళ నివాసముంటుండగా పక్కింట్లో ఉంటూ రాజ్ భవన్‌లో పనిచేసే కార్ హెడ్ క్వార్టర్స్‌కు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ వెంకటేష్ (35) ఉండేవాడు. నాలుగేళ్లుగా ఆమెతో అతడికి పరిచయం ఉంది. ఏడాది నుంచి తన కోర్కె తీర్చాలని వేధిస్తూ వస్తున్నాడు. గురువారం బల్కంపేటలోని పుట్టింటికి వచ్చింది. వెంకటేష్ ఇంట్లోకి చొరబడి చేయి పట్టుకుని వెంట రావాలని బెదిరించాడు. తన కోర్కె తీర్చకుంటూ నీ భర్తతో పాటు పిల్లల్ని కూడా చంపేస్తానని హెచ్చరించాడు. దీంతో బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థిని గాయపరిచిన టీచర్‌పై చర్యలు తీసుకోండి

బాలల హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ సీతా దయాకర్‌రెడ్డి

వెంగళరావునగర్: మోడల్ స్కూల్‌లో ప్రథమ సంవత్సరం చదువుతున్న రిజాజ్‌ఖాన్ అనే విద్యార్థిని శారీరకంగా గాయపరిచిన ఉపాధ్యాయురాలిపై చర్యలు తీసుకోవాలని చైల్డ్ రైట్స్ కమిషన్ చైర్‌పర్సన్ సీతా దయాకర్‌రెడ్డి బోరబండ పోలీసులను ఆదేశించారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని మహిళా శిశుసంక్షేమశాఖ ప్రాంగణంలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ...బాలల హక్కులకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. పాఠ్యపుస్తకాలు తీసుకురాలేదని మోడల్ స్కూల్‌లో తబుసం అనే టీచర్ రియాజ్‌ఖాన్ అనే విద్యార్థిని శారీరకంగా గాయపరిచినట్టు తమకు ఫిర్యాదులు అందాయని పేర్కొన్నారు. దాంతో తెలంగాణ రాష్ట్ర చైల్డ్ రైట్స్ కమిషన్ టీమ్ స్పందించి బోరబండలోని బాలుని ఇంటిని దర్శించానన్నారు. అనంతరం సంఘటనపై విచారణ జరిపి బోరబండ పోలీసులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో కమిషన్ సభ్యులు వందన గౌడ్, వచన్‌కుమార్, ప్రేమలత అగర్వాల్, బోరబండ ఇన్‌స్పెక్టర్ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

నగరంలో భారీ వర్షం

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. రాత్రి 9 తర్వాత వర్షం ప్రారంభమై జోరందుకుంది. రాత్రి 11 గంటల వరకు అత్యధికంగా కూకట్‌పల్లి రాజీవ్ గృహకల్ప వద్ద 6.5 సెంటిమీటర్లు, జీడిమెట్లలో 6 సెంటిమీటర్ల వర్షపాతం నమోదైంది. కూకట్‌పల్లి, అల్వాల్, మల్కాజిగిరి, పటాన్‌చెరు, బాలానగర్, శేరిలింగంపల్లి ప్రాంతల్లో సగటున 3 నుంచి ఆరు సెంటిమీటర్ల వర్షపాతం నమోదైంది. ప్రధాన రహదారులపై భారీగా వరద నీరు వచ్చి చేరింది. రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది.

రైజింగ్ స్టేట్‌గా తెలంగాణ

సాక్షి, హైదరాబాద్: దేశంలో నంబర్ వన్ రైజింగ్ స్టేట్‌గా తెలంగాణ నిలుస్తోందని అటవీ దళాల ప్రధాన సంరక్షణాధికారిణి (పీసీసీఎఫ్) డాక్టర్ సువర్ణ పేర్కొన్నారు. అరణ్యభవన్‌లో శుక్రవారం స్వాతంత్య్ర దినోత్సవాల్లో భాగంగా సువర్ణ జాతీయ జెండా ఎగురవేశారు. అనంతరం విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు పురస్కారాలను సీనియర్ అధికారులతో అందజేశారు.

తెలంగాణ ఉద్యమంలో ఆర్టీసీ ఉద్యోగులది కీలకపాత్ర

సాక్షి, హైదరాబాద్: భారత స్వాతంత్య్ర పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని తెలంగాణ ఉద్యమంలో ఆర్టీసీ ఉద్యోగులు కీలకపాత్ర పోషించారని, 'బస్ కా పయ్యా నహీ చలేగా' అంటూ ఉద్యమంలో ముందుండి పోరాడారని టీజీఎస్‌ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ గుర్తుచేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బస్‌భవన్‌లో జరిగిన స్వాతంత్య్ర వేడకల్లో సజ్జనార్ జాతీయ పతకాన్ని ఆవిష్కరించారు. సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూనే సమాజ సేవ చేస్తున్న ఖమ్మం డిపో కండక్టర్ ఎ.అనిత, కరీంనగర్ జోనల్ వర్క్‌షాప్ స్టోర్ అటెండెంట్ పి.సత్యనారాయణ, బస్‌భవన్‌లో డిప్యూటీ సూపరింటెండెంట్ బి.రాములు, కంటోన్మెంట్ డిపో డ్రైవర్ ఎం.రాములును ఉన్నతాధికారులతో కలిసి సజ్జనార్ సత్కరించి ప్రశంసాపత్రాలను అందజేశారు.

ఫామ్ హౌస్‌లో ఫారినర్ల పార్టీ భగ్నం

పోలీసుల అదుపులో 51 మంది విదేశీయులు



మొయినాబాద్: మొయినాబాద్‌లోని ఓ ఫామ్ హౌస్‌లో విదేశీయులు నిర్వహిస్తున్న బర్త్ డే పార్టీని ఎస్ఓటీ, స్థానిక పోలీసులు భగ్నం చేశారు. విందులో విదేశీ మద్యం, డ్రగ్స్ వినియోగిస్తున్నారనే సమాచారంతో గురువారం రాత్రి 11:30 గంటలకు దాడిచేసి 51 మందిని పట్టుకున్నారు. వీరంతా హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో ఉంటున్నారు. ఫామ్‌హౌస్‌లో హుక్కాతోపాటు 20 లీటర్ల విదేశీ మద్యం బాటిళ్లు, 65 బీర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని, డ్రగ్స్ దొరకలేదని రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఉదయం శంషాబాద్ విమానాశ్రయం ఇమిగ్రేషన్ అధికారులు పట్టుబడిన వారి వీసా, పాస్‌పోర్టులను తనిఖీ చేశారు.

భారీ చోరీ.. 36 తులాల బంగారు నగలు మాయం

చిక్కడపల్లి: చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం తెల్లవారుజామున భారీ చోరీ జరిగింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాలు.. వివేక్‌నగర్‌లో మిధాని పనిచేసిన రిటైర్డ్ ఉద్యోగి లక్ష్మీనారాయణ దంపతులు నివాసముంటున్నారు.ఇంటి పాత తలుపుల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయిస్తున్నాడు. పనులు బీహార్ రాష్ట్రానికి చెందిన వారికి అప్పగించారు. శుక్రవారం తెల్లవారుజామున వచ్చిన దుండగులు అల్మారాలో ఉన్న 36 తులాల బంగారు నగలు, రూ.35వేల నగదు చోరీ చేశాడు. ఉదయం లక్ష్మీనారాయణ లేచేసరికి అల్మార తెరచి ఉండడంతో పాటు అందులో ఉన్న బంగారు నగలు నగదు కనిపించలేదు.దీంతో బాధితుడు చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాడు. దీంతో ఏసీపీ ఎల్. రమేష్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలో ఓ యువకుడు అనుమానాస్పదంగా తలుపును తడుతూ చివరికి నీళ్లు తాగి వెళ్లిన పోటోలను పోలీసులు పరిశీలించారు. ఇదిలా ఉండగా పోలీసులు నిందితుడిని పట్టుకొని నగలు స్వాధీనం చేసుకున్నారు.

'సహజవనరుల పరిరక్షణ అందరి లక్ష్యం కావాలి'

హైడ్రా కమిషనర్ రంగనాథ్



సాక్షి, సిటీబ్యూరో: సహజవనరుల పరిరక్షణ సమాజంలో అందరి లక్ష్యం, బాధ్యత కావాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అభిప్రాయపడ్డారు. అప్పుడే మెరుగైన జీవనాన్ని కొనసాగించగలమని స్పష్టం చేశారు. హైడ్రా ఆ దిశగా పని చేయడానికి పునరంకితం కావాలని ఆకాక్షించారు. బుద్ధభవన్‌లోని హైడ్రా ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాజ్యాంగంలో పేర్కొన్న మేరకే నగరంలో గొలుసుకట్టు చెరువుల పరిరక్షణ కోసం హైడ్రా పని చేస్తోందన్నారు

మూసారాంబాగ్ వంతెన హైడ్రా క్లియరెన్స్...

హిమాయత్‌సాగర్ నుంచి భారీ మొత్తంలో నీటిని కిందకు వదలడంతో మూసీ నదిలో ప్రవాహం పెరిగింది. పై నుంచి వరదతో పాటు కొట్టుకువచ్చిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు మూసారాంబాగ్ వంతెన వద్ద నిలిచిపోతున్నాయి. ఇవి అడ్డం పడి నదీ ప్రవాహానికి ఆటంకంగా మారుతున్నాయి. ఫలితంగా చాదర్‌ఘాట్, మూసారాంబాగ్‌లోని శంకర్‌నగర్, మూసానగర్, రసూల్‌పుర తదితర బస్తీలను వరద ముంచెత్తుతోంది. ఈ విషయం గుర్తించి శుక్రవారం రంగంలోకి దిగిన హైడ్రా బృందాలు ముసారంబాగ్ వంతెన వద్ద క్లియరెన్స్ చేపట్టాయి. అక్కడ పేరుకుపోయిన చెత్తను తొలగించే పనులు నిర్వహిస్తున్నాయి. గుర్రపు డెక్కతో పాటు గడ్డి, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తోంది. రెండు జేసీబీలతో పాటు టిప్పర్లను అక్కడే ఉంచిన అధికారులు చెత్తను ఎప్పటికప్పుడు తరలిస్తున్నారు. దీంతో వరద సాఫీగా ముందుకు సాగుతోంది.

ఉత్తమ సేవలకు అవార్డులు

సాక్షి,సిటీబ్యూరో : హైదరాబాద్ జిల్లాలో వివిధ రంగాల్లో ఉత్తమ సేవలందించిన జిల్లా అధికారులు, తహసీల్దార్లు ఉద్యోగులు, సిబ్బందికి జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అవార్డులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. శుక్రవారం హైదరాబాద్ కలెక్టరేట్‌లో జరిగిన పంద్రాగస్టు వేడుకల్లో కలెక్టర్ చేతులు మీదుగా పలువురు జిల్లా స్థాయి అధికారులు, తహసీల్దార్లు, ఉద్యోగులు, సిబ్బంది అవార్డులు అందుకున్నారు. అదేవిధంగా కులాంతర వివాహం చేసుకున్న 15 జంటలకు రూ. 2. 50లక్షల చొప్పున చెక్కులను కలెక్టర్ అందచేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కదిరవన్ పలని, జి ముకుంద రెడ్డి, డీఆర్‌ఓ వెంకటాచారి, రెవెన్యూ డివిజన్ అధికారులు రామకృష్ణ, సాయిరాం, సంక్షేమ అధికారులు ఆశన్న, ప్రవీణ్ కుమార్, కోటాజీ, ఇలియాస్ అహ్మద్, వివిధ శా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ హరిచందన చేతులు మీదుగా అవార్డు అందుకుంటున్న అధికారులు శ్రీధర్, వెంకట్ రెడ్డి, హబీబ్, నర్సయ్యలు

రెండు అవార్డులు అందుకున్న భూ సర్వే అధికారి శ్రీరామ్

స్వాతంత్ర వేడుకలు సందర్భంగా హైదరాబా ద్ జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డు అధికారి వులుగుండ శ్రీరామ్ రెండు అవార్డులు అందుకున్నారు. శుక్రవారం హైదరాబాద్ కలెక్టరేట్‌లో జరిగిన పంద్రాగస్టు వేడుకల్లో కలెక్టర్ హరిచందన దాసరి చేతులు మీదుగా అవార్డులు స్వీకరించారు. సర్వే అండ్ రికార్డు విభాగంలో శాఖ పరంగా ఉత్తమ సేవలందించినందుకు జిల్లా స్థాయి ఉత్తమ అధికారి అవార్డు లభించింది. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి 10 పాట్రన్(మహా రాజా పోషకులు) సభ్యత్వాలు, 4, వైస్-పాట్రన్ సభ్యత్వాలు,7 జీవితకాల సభ్యత్వాలను నమోదు చేయించి జిల్లా స్థాయి అధికారులలో అగ్రగామిగా నిలవడంతోపాటు రాష్ట్రంలోనే హైదరాబాద్ జిల్లాను ఆదర్శంగా నిలిపినందుకు రెడ్‌క్రాస్ అవార్డుకు ఎంపికై అవార్డు అందుకున్నారు.



శ్రీరామ్‌కు అవార్డు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ హరిచందన

ఎంఎంఎస్ అందుకున్న ఏసీపీ మోహన్‌కుమార్

గోల్కొండ కోటలో ప్రదానం చేసిన ముఖ్యమంత్రి



సాక్షి, సిటీబ్యూరో: నగర ట్రాఫిక్ విభాగంలో మధ్య మండల ఏసీపీగా పని చేస్తున్న శ్రీరాముల మోహన్‌కుమార్ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్ (ఎంఎంఎస్) అందుకున్నారు. శుక్రవారం గోల్కొండ కోటలో జరిగిన స్వాతంత్ర దినోవ్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రదానం చేశారు. ఖమ్మం జిల్లాకు చెందిన మోహన్‌కుమార్ 1995లో ఎస్సైగా పోలీసు విభాగంలోకి అడుగుపెట్టారు. 1996-99 మధ్య హబీబ్ నగర్, 2000-03 మధ్య చార్మినార్, 2003-09 మధ్య దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్‌లో ఎస్సైగా విధులు నిర్వర్తించారు. 2009లో ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందారు. ఆపై మీర్‌చౌక్, దక్షిణ మండల టాస్క్‌ఫోర్స్,చార్మినార్, పంజాగుట్ట, తూర్పు మండలం టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేశారు. 2018లో డీఎస్పీగా పదోన్నతి పొందిన మోహన్‌కుమార్ దక్షిణ మండలం స్పెషల్ బ్రాంచ్ ఏసీపీగా, సూర్యాపేట డీఎస్పీగా, నగర సీసీఎస్, పంజగుట్ట ఏసీపీగా పని చేశారు.

బంజారాహిల్స్‌లోని సాక్షి మీడియా ప్రధాన కార్యాలయంలో శుక్రవారం స్వాత్రంత్య దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సిబ్బంది స్వాతంత్య్ర సమర యోధులకు ఘనంగా నివాళులర్పించారు. వేడుకల్లో ఏఎల్ఎన్ రెడ్డి, వై.ఈశ్వర ప్రసాద్ రెడ్డి, వి.మురళి తదితరులు పాల్గొన్నారు.





జలమండలిలో ఎండీ అశోక్‌రెడ్డి



గోల్కొండలో కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు

ఘనంగా స్వాతంత్య్ర వేడుకలు

స్వాతంత్య్ర వేడుకలు శుక్రవారం నగరవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యాసంస్థలు, వివిధ పార్టీ కార్యాలయాల్లో వేడుకలు జరిగాయి. పలు పాఠశాలల్లో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అబ్బురుపరిచాయి. -సాక్షి,సిటీబ్యూరో



హెచ్ఎండీఏ కార్యాలయంలో కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్..



శామీర్ పేటలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్ ప్రైజ్ క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీనివాస మూర్తి, తదితరులు

అవాంఛనీయ సంఘటనలకు తావివ్వవద్దు

ఫిలింనగర్: రానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గణేష్ మండపాల నిర్వాహకులతో ఫిలింనగర్ ఇన్‌స్పెక్టర్ సంతోషం సమావేశం నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటుచేసుకోవాలని, జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత నిర్వాహకులపై ఉందన్నారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

గణనాథుడి ఏర్పాటుకు కర్రపూజ

ఫిలింనగర్: ఫిలింనగర్‌లోని విగ్రహాల చౌరస్తాలో ప్రతియేటా ఫిలింనగర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే భారీ గణనాథుడి విగ్రహానికి శుక్రవారం యువజన సంఘం సభ్యులు కర్రపూజ చేశారు. ఎంతో వైభవంగా ఇక్కడ గణనాథుడి నవరాత్రి ఉత్సవాలు చేస్తామని ఈ సారి కూడా గత వైభవానికి తగ్గకుండా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు యువజన సంఘం ప్రతినిధులు తెలిపారు. ఇప్పటికే భారీ గణనాథుడిని ఇక్కడికి తీసుకొచ్చేందుకు మార్గ మధ్యంలో ఉండే భారీ చెట్ల కొమ్మలను తొలగించాల్సిందిగా జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు వారు తెలిపారు. ఫిలింనగర్‌లోని 18 బస్తీల నుంచి నేతలు పాల్గొన్నారు.

జేఐసీలో 'ఉత్సవ్' ప్రారంభం



రాజదర్బార్ హాల్‌ను ప్రారంభిస్తున్న సెక్రటరీ రాజేశ్వరరావు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్ (జేఐసీ) అత్యంత ఆధునిక సౌకర్యాలతో రెండో అంతస్తులో నిర్మించిన రాజదర్బార్, ఉత్సవ్ వీఐపీ గ్రాండ్ హాళ్లను పెద్ద ఎత్తున విచ్చేసిన క్లబ్ సభ్యుల మధ్య అత్యంత అట్టహాసంగా ప్రారంభించారు. ఇది క్లబ్ అభివృద్ధి, సభ్యుల సేవల్లో ఒక చారిత్రక మైలురాయి లాంటిదని, ఈ విజయానికి కారణం ప్రెసిడెంట్ సురేందర్‌రెడ్డి దూరదృష్టి అని సెక్రటరీ కిలారు రాజేశ్వరరావు అన్నారు. అన్ని వేడుకలకు రాజసం ఉట్టిపడేలా 40 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించారన్నారు. సామాజిక వేడుకలు, సాంస్కృతిక కార్యక్రమాలు, కార్పొరేట్ ఈవెంట్స్‌కు ఇదొక ప్రపంచస్థాయి వేదికగా నిలవనున్నదన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో వీటిని తీర్చిదిద్దడం జరిగిందని, ఇది కేవలం హాళ్లు మాత్రమే కాదని, మధుర జ్ఞాపకాలు, బంధాలు, వేడుకలకు నిలయాలన్నారు.

వైభవంగా శ్రీవారి పవిత్రోత్సవాలు



వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్‌కాలనీలోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న శ్రీవెంకటేశ్వరస్వామి వారి పవిత్రోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఈ నెల 12వ తేదీన ప్రారంభమైన పవిత్రోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ముగింపు రోజున ఆలయ చైర్మన్ సీపిరి అర్జున్‌యాదవ్‌తో పాటు ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొని స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఆయన చైర్మన్ అర్జున్‌యాదవ్ మాట్లాడుతూ... నాలుగు రోజులుగా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు.

డయాలసిస్ రోగులకు 'డీపీఎల్' వరం



మాట్లాడుతున్న అజహరుద్దీన్

వెంగళరావునగర్: డయాలసిస్ రోగులు ఎలాంటి భయాందోళనలకు గురి కావద్దని, డీపీఎల్ ద్వారా జీవిత కాలాన్ని పెంచుకోవచ్చని పలువురు ప్రముఖులు తెలియజేశారు. శాప్ కిడ్నీ సెంటర్ ఆధ్వర్యంలో ఉమీద్ ట్రస్ట్ సహకారంతో యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో శుక్రవారం డయాలసిస్ ప్రీమియర్ లీగ్ (డీపీఎల్) పోటీలను నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర మైనార్టీ రెసిడెన్షియల్ ఇనిస్టిట్యూషన్స్ వైస్ చైర్మన్ ఫయీం ఖురేషి, టీపీసీసీ నాయకుడు, టీం ఇండియా మాజీ సారథి మహమ్మద్ అజహరుద్దీన్, ప్రముఖ సినీనటుడు అలీ, హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రో పాషా, ఏసీపీ స్నేహా మెహ్రా, ఆర్గనైజర్లు నియాజ్ అహ్మద్‌ఖాన్, షోయబ్ అహ్మద్‌ఖాన్, అఖిబ్ అహ్మద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు. పలువురు వైద్యుల పర్యవేక్షణలో డయాలసిస్ రోగులకు ఆయా పోటీలను ఏర్పాటు చేసి బహుమతులు అందించారు.



జూబ్లీహిల్స్ గాయత్రీహిల్స్‌లో ఎమ్మెల్యే దానం నాగేందర్



ఎన్‌బీటీనగర్‌లో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



ప్రెస్‌క్లబ్‌లో క్లబ్ అధ్యక్షుడు వేణుగోపాల్ నాయుడు తదితరులు



నిమ్స్‌లో వేడుకల దృశ్యం

మెరిసిన మువ్వన్నెల జెండా



మధురానగర్‌లో కార్పొరేటర్ దేదీప్య విజయ్



జెండా ఆవిష్కరణలో మాజీ ఎంపీ అజహరుద్దీన్

ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్-10లోని గాయత్రీహిల్స్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ జెండా ఎగురవేశారు. బంజారాహిల్స్ రోడ్డునెంబర్-14లోని నందినగర్‌లో మాజీ కార్పొరేటర్ భారతీనాయక్ జెండావిష్కరణ చేశారు. పాఠశాలలు, పోలీస్‌స్టేషన్లు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ వేడుకలు ఘనంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే పాఠశాలల్లో విద్యార్థులు బస్తీల్లో ఊరేగింపు నిర్వహించి భారత స్వాతంత్ర్య ఘట్టాలను తెలియజేసే పాటలు పాడుతూ దేశభక్తిని చాటుకున్నారు. ఫిలింనగర్‌లోని వినాయకనగర్ స్వాన్ మోడల్ స్కూల్ ఆధ్వర్యంలో విద్యార్థులు జాతీయ నేతల వేషధారణలో విశేషంగా ఆకట్టుకున్నారు. ఫిలింనగర్‌లోని వివేకానంద స్కూల్ ఆవరణలో కరస్పాండెంట్ రామచంద్రయ్య ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. – బంజారాహిల్స్



అమీర్‌పేట్‌లోని శ్రీవశిష్ట స్కూల్‌లో చిన్నారి ఆరాధ్య



రహమత్‌నగర్‌లో బైక్ ర్యాలీలో బీజేపీ నేతలు



స్టేట్‌హోంలో చైల్డ్ రైట్స్ కమిషన్ చైర్‌పర్సన్ సీతా దయాకర్‌రెడ్డి



జూబ్లీహిల్స్ క్లబ్‌లో.. సెక్రటరీ కిలారు రాజేశ్వరరావు



నందినగర్‌లో మాజీ కార్పొరేటర్ భారతీనాయక్



గాయత్రీహిల్స్‌లోని లిటిల్‌స్టార్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ అష్మతున్నిసా



వేడుకల్లో ఆశ్రయ్-ఆకృతి బధిర పాఠశాల విద్యార్థులు



శ్రీరాంనగర్‌లో వేడుకలు...



వెంకటగిరిలో మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి



శివలాల్ యాదవ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మహేష్...



మక్తాలో ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి



జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో చైర్మన్ మురళీముకుంద్



వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్...



బీవీబీపీ ఆత్మకూరి రామారావు స్కూల్‌లో ప్రిన్సిపాల్ శ్రీలతానాయర్



వెంగళరావు పార్కులో కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి



బంజారాహిల్స్‌లోని రెనోవా ఎన్‌ఐజిఎల్ హాస్పిటల్స్‌లో..



గౌతంనగర్‌లో..

మద్యం మత్తులో హల్‌చల్

ఇద్దరు యువకులను అరెస్టు చేసిన పోలీసులు



బియ్యపు రేవంత్



నారగాని విశాల్

బంజారాహిల్స్: మద్యం మత్తులో ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను బలవంతంగా కారులో ఎక్కించుకుని తీవ్రంగా కొట్టిన ఘటనలో ఇద్దరు నిందితులను జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలివీ... జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-10లోని స్రవంతినగర్‌లో గంగోల శ్రీనివాసులు (29) అనే యువకుడు సాఫ్ట్‌వేర్ కంపెనీ నిర్వహిస్తున్నాడు. గురువారం రాత్రి 10 గంటల ప్రాంతంలో శ్రీనివాసులు తనతో పనిచేస్తున్న కిరణ్, శ్రీనిజ, వెంకటేష్, మహేష్, పవన్, సుభాష్ తదితరులతో కలిసి మూసాపేట చంద్రకళ థియేటర్‌లో కూలీ సినిమా చూసి రాత్రి 1.30 గంటల ప్రాంతంలో తిరిగి వెంకటగిరికి వచ్చి శ్రీనిజను ఆమె ఇంటి వద్ద డ్రాప్ చేశారు. అదే సమయంలో ఇద్దరు యువకులు అక్కడికి వచ్చి మద్యం మత్తులో తూలుతూ శ్రీనివాసులును ఉద్దేశించి అరేయ్.. మీరంతా ఎవర్రా.. నా చెల్లిని తీసుకుపోవడానికి మీరెవరు..అంటూ కొట్టాడు. అసభ్య పదజాలంతో దూషించాడు. అడ్డుకోవడానికి యత్నించిన శ్రీనివాసులు స్నేహితుడిని కూడా కొట్టారు. నువ్వు కారు ఎక్కు... నీతో పని ఉంది అంటూ బలవంతంగా కారు ఎక్కించుకుని 10 నిమిషాల పాటు హైలంకాలనీ ఏరియాలో తిప్పారు. ఓ వైన్ షాపు ముందు ఆపి తమతో పాటు తెచ్చుకున్న బీర్లు తాగుతూ రేవంత్‌తో పాటు ఆయన స్నేహితుడు విశాల్.. శ్రీనివాసులును తీవ్రంగా కొట్టారు. అడ్డువచ్చిన కిరణ్‌ను కూడా తీవ్రంగా బాదారు. మళ్లీ కారు ఎక్కించుకుని శ్రీనివాసులుతో పాటు ఆయన స్నేహితుడు కిరణ్‌ను మళ్లీ యూసుఫ్‌గూడ ఫస్ట్ బెటాలియన్ వైపు తీసుకువెళ్లారు. అదే సమయంలో పెట్రోలింగ్ పోలీసు వాహనం అటువైపు రావడంతో వీరిద్దరూ బిగ్గరగా అరిచి పోలీసులను అప్రమత్తం చేశారు. స్పందించిన పోలీసులు కారును ఆపి నిందితులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వీరిద్దరికీ డ్రంకన్ డ్రైవ్ నిర్వహించగా మోతాదుకు మించి మద్యం సేవించినట్లు నిర్ధారణ అయ్యింది. దర్యాప్తులో నిందితుడు తొక్కుడుబియ్యపు రేవంత్ (27) యూసుఫ్‌గూడ ఫస్ట్ బెటాలియన్‌లో నివసిస్తుంటాడని, తండ్రి పోలీసు చనిపోవడంతో కారుణ్య నియామకం కింద ఆయనకు చాంద్రాయణగుట్ట బ్రాంచ్ పింఛన్ ఆఫీసులో సబార్డినేట్ పోస్టు వచ్చినట్లు తేలింది. ఆయన స్నేహితుడు నారగాని విశాల్ శ్రీనగర్‌కాలనీలో నివసిస్తుండగా ఓ కారు షోరూంలో సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్నట్లు తేలింది. వీరి అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మాంసం వ్యర్థాలను స్వచ్ఛ ఆటోలకు అందించాలి

బంజారాహిల్స్ ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి

బంజారాహిల్స్: గణేష్ నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బీఫ్, మటన్, చికెన్ దుకాణాల వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. బంజారాహిల్స్ ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి నిర్వాహకులతో మాట్లాడుతూ... నవరాత్రుల్లో భాగంగా మాంసం వ్యర్థాలను ఇష్టానుసారంగా బయటపడేయవద్దని, వాటిని బ్లాక్ కవర్లలో భద్రపరిచి తప్పనిసరిగా స్వచ్ఛ ఆటోలకు అందించాలన్నారు. మాంసం వ్యర్థాలను బయటపడేస్తే కుక్కలు తీసుకువెళ్లి మండపాల వద్ద వేసే ప్రమాదం ఉందని, దీని వల్ల సమస్యలు తలెత్తుతాయన్నారు. నిర్వాహకులు ఈ సూచనలను పక్కాగా పాటించాలన్నారు. రోజూ వ్యర్థాలను భద్రపరుస్తూ ఆటోలకు అందజేయకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హక్కుల సాధనకు ఉద్యమిద్దాం

హిమాయత్‌నగర్: స్వాతంత్ర పోరాట ఉద్యమ స్ఫూర్తితో కార్మిక హక్కుల సాధనకు ఉద్యమించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్ పిలుపునిచ్చారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకలను హిమాయత్‌నగర్‌లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించారు. నేతలు ఎం.నరసింహ, పి.ప్రేమ్ పావని, బి.వెంకటేశం, స్టాలిన్ పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి

వెంగళరావునగర్: అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతిచెందిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... గుంటూరు జిల్లాకు చెందిన ఉప్పల్ పవన్‌కుమార్ (27) గత ఏడాది డిసెంబర్‌లో సినిమా ఇండస్ట్రీలో చేరాలని వచ్చాడు. ప్రస్తుతం హాస్టల్‌లో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. గురువారం సాయంత్రం పవన్‌కుమార్ ఆసుపత్రిలో ఉన్నాడని చూడాలని అతని తల్లి అరుణ స్థానికంగా ఉంటున్న ఆమె సోదరి అనితకు తెలియజేసింది. సరూర్‌నగర్‌లో ఉంటున్న అనిత హుటాహుటిన ఆసుపత్రికి వెళ్లి వారి రూం మేట్‌లను వివరాలు అడగ్గా గురువారం బాత్రూంలో అపస్మారకస్థితిలో పడిపోయి ఉండగా హాస్టల్ యజమాని ఆసుపత్రిలో చేర్చాడని ఆమెకు తెలిపారు. శుక్రవారం పవన్‌కుమార్ మృతిచెందినట్టు గాంధీ ఆసుపత్రి వైద్యులు తెలియజేశారు. అనిత మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది.

భార్యను మోసం చేసిన వ్యక్తి అరెస్టు

బంజారాహిల్స్/లంగర్‌హౌస్: భార్యను మోసం చేస్తూ మరో మహిళతో వివాహేతర సంబంధం ఏర్పాటు చేసుకున్న వ్యక్తిని లంగర్‌హౌస్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. నగరానికి చెందిన ఫరీసా షాహీన్ 1990లో సౌదీ అరేబియా వెళ్లారు. అక్కడ పాకిస్థానీ జాతీయుడు సాహెద్ అఖిల్‌ను వివాహం చేసుకున్నారు. వీరికి 1991లో ఫహద్ అఖీల్ గోందల్ జన్మించాడు. భర్త చనిపోయిన తర్వాత ఫరీసా 1998లో నగరానికి వచ్చి స్థిరపడ్డారు. నగరంలోని విద్యనభ్యసించిన ఫహద్ ప్రస్తుతం ఓ సాఫ్ట్‌వేర్ సంస్థలో అసోసియేట్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. గతంలో ఉప్పల్‌లోని సంస్థలో పని చేసినప్పుడు అక్కడే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేసిన మహిళను వివాహం చేసుకుని లంగర్‌హౌస్ నేతాజీనగర్‌లో నివసిస్తున్నారు. ఫహద్‌కు ఏడాది క్రితం మరో మహిళతో ఏర్పడిన పరిచయం వివాహేతర సంబంధానికి దారి తీసింది. వీళ్లిద్దరూ బంజారాహిల్స్‌లోని ఓ ఫ్లాట్‌లో సహజీవనం చేస్తున్నారు. ఈ విషయం తెలిసిన ఫహద్ భార్య తొమ్మిది నెలలుగా దూరంగా ఉంటోంది. గురువారం రాత్రి ఫహద్ ఆ మహిళతో కలిసి ఉండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని పోలీసులకు సమాచారం ఇచ్చింది. అక్కడకు చేరుకున్న బంజారాహిల్స్ పోలీసులు ఫహద్‌ను లంగర్‌హౌస్ ఠాణాకు తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు ఫహద్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు అరెస్టు చేశారు.





కుక్కల సంరక్షణ.. భవిష్యత్ దిశ..

ఢిల్లీలోని కుక్కలను షెల్టర్లకు తరలించాలి : సుప్రీంకోర్టు

- కుక్కల దాడులు, రేబిస్ వంటి కారణాలతో ఆదేశం
- వీటి సంరక్షణ కోసం జీహెచ్ఎంసీ, ఎన్జీఓల విశేష కృషి
- ఇలాంటి పరిస్థితులే హైదరాబాద్‌లోనూ కొనసాగుతున్నాయి
- సుప్రీంకోర్టు నిర్ణయంతో హైదరాబాద్‌లోని పరిస్థితుల విశ్లేషణ
- భవిష్యత్తు పరిస్థితులు, జంతుప్రేమికుల సూచనలు

ఇటీవల సుప్రీం కోర్టు ఢిల్లీ పరిధిలోని అన్ని వీధి కుక్కలను ఎనిమిది వారాల్లో షెల్టర్లకు తరలించాలని ఆదేశించింది. కుక్క కాటు కేసులు, రేబిస్ ముప్పు, మరణాలు పెరుగుతున్న నేపథ్యంలో ఇచ్చిన ఈ తీర్పు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. జంతు హక్కుల కోసం కృషి చేసే సంస్థలు, జంతు ప్రేమికులు దీనిని 'మానవతా రహితం'గా అభివర్ణిస్తున్నారు. ప్రజల భద్రత కోణంలో చూస్తే ఇది తప్పనిసరి చర్యగా కొందరు సమర్థిస్తున్నారు. ఈ వివాదం నేపథ్యంలో మన హైదరాబాద్ నగరంలోని కుక్కల పరిస్థితులు, భవిష్యత్తు దిశ, పౌరుల బాధ్యతలు, ప్రభుత్వ చర్యలు వంటి అంశాలు ప్రస్తుతం ప్రాధాన్యత సంతరించుకున్నాయి. సుప్రీం కోర్టు తీర్పు ఢిల్లీలో ప్రజల భద్రత కోసం అవసరమైన చర్య కావొచ్చు. కానీ హైదరాబాద్ వంటి విస్తారమైన, పౌర భాగస్వామ్యం ఉన్న నగరంలో పరిష్కారం అంటే కుక్కలను పూర్తిగా తొలగించడం కాదు, వాటిని నియంత్రణలో ఉంచి, భద్రతతో సహజీవనం చేయడం సరైన మార్గమని కొందరి ఆలోచన. ఇది ప్రభుత్వ చర్యలు, ఎన్జీఓలు, పౌరుల సమన్వయం, పర్యావరణ నిర్వహణతోనే సాధ్యమని అభిప్రాయపడుతున్నారు. - సాక్షి, సిటీబ్యూరో

హైదరాబాద్ వేగంగా విస్తరిస్తున్న నగరం. కొత్త కాలనీలు, రోడ్లు, నిర్మాణ ప్రాజెక్టులు పెరిగే కొద్దీ వీధి కుక్కల సంఖ్య కూడా పెరిగింది. అధికారిక గణాంకాలు అందుబాటులో లేనప్పటికీ, అంచనా ప్రకారం నగరంలో లక్షల్లో వీధి కుక్కలు ఉన్నాయి. జీహెచ్ఎంసీ ప్రతి సంవత్సరం వ్యాక్సినేషన్, ఎనిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ – కుక్కల జననాల నియంత్రణ కోసం) ఆపరేషన్లు నిర్వహిస్తున్నప్పటికీ, వృద్ధి రేటు నియంత్రణలో సమస్యలు ఎదురవుతున్నాయి. పలు ఎన్జీఓలు, జంతు సంరక్షణ సంస్థలు కుక్కల ఆహారం, ఆరోగ్యంపై పనిచేస్తున్నప్పటికీ, ఇంకా కొన్ని ప్రాంతాల్లో కుక్కల దాడులు తరచూ జరుగుతూనే ఉన్నాయి.



సవాళ్లు..

అనియంత్రిత ఆహార వనరులు – చెత్త పారవేయడం, హోటల్ వ్యర్థాలు వీధి కుక్కల జనాభా పెరగడానికి కారణం.

- పూర్తిస్థాయి డేటా లోపం – ఎన్ని కుక్కలు ఉన్నాయి, ఎన్ని వ్యాక్సినేట్ అయ్యాయి అనే గణాంకాల స్పష్టత లేదు.
- ప్రజల అవగాహన లోపం – కుక్కలతో ఎలా ప్రవర్తించాలి, అవి దాడులు చేయడానికి గల కారణాలేంటి, వాటిని నివారించుకోవడంపై ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడం.

హైదరాబాద్‌లో సుప్రీం తీర్పు అమలు..?

ఢిల్లీ మాదిరిగా అన్ని కుక్కలనూ షెల్టర్లకు పంపడం హైదరాబాద్‌లో వాస్తవికంగా సాధ్యం కాని పని. మొదట నగరంలోని కుక్కల సంఖ్యను దృష్టిలో ఉంచుకుంటే షెల్టర్ల సామర్థ్యం సరిపోదు. రెండోది.. ఆహారం, వైద్యం, సంరక్షణ ఖర్చులు అమితంగా పెరుగుతాయి. అదనంగా, కుక్కల సహజ స్వభావం, మనిషితో మమేకమైన జీవన విధానం దృష్ట్యా, ఇలాంటి నిర్ణయం సామాజిక ప్రతిఘటనకు గురయ్యే అవకాశం ఉంది.

ప్రజల భద్రత వర్సెస్ జంతు హక్కులు..

సుప్రీం కోర్టు తీర్పు వెనుక ప్రధాన ఉద్దేశం ప్రజల ప్రాణరక్షణ. రేబిస్ వ్యాధి ప్రాణాంతకమైనదే.. కానీ కుక్కలను సమూలంగా షెల్టర్లకు తరలించడం అనేది వాటి సహజ జీవన వాతావరణాన్ని తారుమారు చేసే చర్య. హైదరాబాద్‌లోని జంతు ప్రేమికులు చెబుతున్నట్లు, కుక్కలు నగర పర్యావరణంలో భాగం. అవి ఒక విధంగా 'నగర రక్షకులు' కూడా.. చెత్తలో పాములు, ఎలుకల పెరుగుదలను నియంత్రించడం, అనుమానాస్పద చొరబాట్లను గుర్తించడం వంటివి చేస్తాయి. కాబట్టి సమస్యకు పరిష్కారం ఒక్క 'తొలగింపు' మాత్రమే కాదు, సమతుల్య దృక్పథం కావాలి.



మనుషులతో సమానంగా..

హైదరాబాద్ 'కలిసికట్టుగా జీవించే' నగరం. ఇక్కడ మనుషులు, జంతువులు, పక్షులు అందరూ ఒకే పర్యావరణంలో జీవిస్తున్నారు. కుక్కలు కూడా అందులో భాగం. సమస్య పరిష్కారం అంటే ఒకవైపు ప్రజల భద్రత, మరోవైపు కుక్కల హక్కులు.. రెండింటినీ సమతుల్యంగా కాపాడటం అవసరమనేది నిపుణుల మాట. ఉదాహరణకు.. ప్రతి కాలనీకీ ఒక 'కుక్కల సంరక్షణ కమిటీ' ఉండి, స్థానిక కుక్కల వ్యాక్సినేషన్, ఆహార నిర్వహణ, ప్రజలకు అవగాహన కల్పించడం వంటి పనులు చేస్తే, దాడుల సమస్యను గణనీయంగా తగ్గించవచ్చు.

మార్పులపై దృష్టి..

- సమగ్ర సర్వే – నగరవ్యాప్తంగా కుక్కల జనాభా, ఆరోగ్య స్థితి, వ్యాక్సినేషన్ వివరాలు సేకరించాలి.
- ఏబీసీ, వ్యాక్సినేషన్ వేగవంతం – సంవత్సరానికి లక్ష్యాలను పెంచి తక్షణ ఫలితాలు సాధించాలి.
- ప్రజల అవగాహన క్యాంపెయిన్లు – పాఠశాలల నుంచి కాలనీల వరకు 'కుక్కలతో భద్రతగా సహజీవనం'పై శిక్షణ ఇవ్వాలి.
- వ్యర్థ నిర్వహణ కఠినతరం – హోటల్ చెత్త, మాంసం వ్యర్థాలను నియంత్రించడం ద్వారా కుక్కల ఆకర్షణ తగ్గించవచ్చు.
- ఎన్జీఓ, ప్రభుత్వ భాగస్వామ్యం – సంరక్షణ, వైద్య సహాయం, రక్షణలో సమన్వయం పెంచాలి.

ప్రస్తుత చర్యలు.. ఫలితాలు..

- ఏబీసీ ప్రోగ్రామ్ – జీహెచ్ఎంసీ వార్షికంగా వేల కుక్కలకు నిష్క్రమణ ఆపరేషన్లు చేస్తోంది.
- రేబిస్ వ్యాక్సినేషన్ – రేబిస్ కేసులు తగ్గించడంలో కొంత మేర విజయం సాధించినా, 100 శాతం కవరేజ్ సాధించలేదు.
- ప్రజల స్పందన – కొంతమంది కాలనీల్లో నివాసితులు స్వచ్ఛందంగా కుక్కలకు ఆహారం, నీరు పెడుతున్నారు. అయితే, కొన్ని ప్రాంతాల్లో వ్యతిరేకత పెరుగుతోంది.
- ఎన్జీఓల సహకారం – 'బ్లూ క్రాస్', 'పీపుల్ ఫర్ ఎనిమల్స్' వంటి సంస్థలు ఆహారం, షెల్టర్లు, వైద్యసహాయం అందిస్తున్నాయి.



ఆనందోత్సవం..

- నగరంలో శ్రీకృష్ణాష్టమి వేడుకల సందడి
- హరే కృష్ణా గోల్డెన్ టెంపుల్ వేదికగా నిర్వహణ
- పలు సాంస్కృతిక కార్యక్రమాలకు ముస్తాబు





సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ నగరం శ్రీకృష్ణాష్టమి (జన్మాష్టమి) శోభతో ముస్తాబయ్యింది. నేటి శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఆధ్యాత్మికత, భక్తి, సాంస్కృతిక ఆనందాన్ని సమన్వయం చేస్తూ.. నగరంలోని దేవాలయాలు భక్తి పారవశ్యాన్ని నింపుతున్నాయి. బంజారాహిల్స్‌లోని హరే కృష్ణా గోల్డెన్ టెంపుల్ ఈ వేడుకలకు ప్రధాన కేంద్రంగా నిలిచింది. ఇస్కాన్ ఆధ్వర్యంలో 'మహా అభిషేకం', 'మహా మంగళ హారతి', 'నందోత్సవం' వంటి క్లాసిక్ ఆధ్యాత్మిక కార్యక్రమాలు.. భక్తి గీతాలు, వేద మంత్రాలతో కొనసాగనున్నాయి.. ఇస్కాన్ అబిడ్స్, అత్తాపూర్ కేంద్రాల్లో ప్రత్యేక దర్శనం, శ్రీకృష్ణ జన్మోత్సవం ఘనంగా జరుగుతుంది. ఈ సందర్భంగా దేవాలయాల్లో చప్పన్ భోగం (56 రకాల ప్రసాదం) సమర్పణ, కళాత్మక అలంకరణలు, భక్తి నృత్యాలు, హారతులు ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నాయి. పలు ప్రాంతాల్లో దహి హండి పోటీలతో పాటు యువ బృందాలు ఉట్టికొట్టే పోటీలు నిర్వహిస్తున్నారు. పిల్లలు కృష్ణుడి వేషధారణలో ప్రదర్శన ఇవ్వడం పండుగకు మరింత అందం చేకూరుస్తుంది.

సాంస్కృతిక సమ్మేళనం..

ఈ వేడుకల్లో కొన్ని ప్రాంతాల్లో విదేశీ భక్తులు కూడా పాల్గొని భారతీయ సంస్కృతి పట్ల తమ అభిమానాన్ని వ్యక్తం చేస్తున్నారు. గోల్డెన్ టెంపుల్ వంటి వేదికలు భిన్న సంస్కృతులను ఒకే చోట కలిపి, భక్తి సమానత్వాన్ని ప్రతిబింబిస్తాయి. భక్తి గీతాలు, కీర్తనలు, వేదికలపై జరిగే నృత్యాలు ఆధ్యాత్మికతను కళారూపంలో అందిస్తాయి.



రంగరించి.. ఆరగించి..

ముద్వన్నెల రంగుల్లో ఆకట్టుకుంటున్న ఆహారం | దేశభక్తి స్ఫూర్తితో తయారైన రుచులు

రాయదుర్గం: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని త్రివర్ణ పతాకం రంగులో పౌష్టికాహారాన్ని అందజేశారు. స్టార్ ఆస్పత్రిలో చికిత్సపొందే రోగులకు వీటిని అందించినట్లు ఆ సంస్థ సీఈఓ డాక్టర్ రాహుల్ మెడక్కర్ పేర్కొన్నారు. నానక్‌రాంగూడలోని క్యాంటీన్‌లో ఈ ముద్వన్నెల రంగులతో రంగరించిన ఆహారాన్ని సిద్ధం చేశారు. రోగుల శారీరక ఆరోగ్యమే లక్ష్యంగా పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందిస్తున్నామని, స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక మెనూ సిద్ధం చేశామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పలువురు డాక్టర్లు, వైద్య బృందం పాల్గొన్నారు.

పార్శీల నవ్‌రోజ్

సందడిగా ఎంజీ రోడ్డులోని ఫైర్ టెంపుల్

రాంగోపాల్‌పేట్: పార్శీల నూతన సంవత్సర వేడుకలు (నవ్‌రోజ్) గురువారం ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం ఉదయం ఎంజీ రోడ్డులోని ఫైర్ టెంపుల్‌లో పార్శీలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకుని నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు.









ఖైరతాబాద్ : సాగర తీరంలో ఐమాక్స్ పక్కన హెచ్ఎండీఏ మైదానంలో ఏర్పాటు చేసిన వింటేజ్ బైక్స్, కార్ల ప్రదర్శన ఆకట్టుకుంది. 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 1938 నుంచి 2013 వరకూ నగరంలోని వింటేజ్ బైక్స్, కార్లను ఇక్కడ ప్రదర్శించారు. భారత్, జపనీస్, ఇటాలియన్ అంబాసిడర్ మొదలు ఆస్టిన్, రాజ్‌దూత్ బైక్ వంటివి ప్రదర్శించారు. సందర్శకులు వింటేజ్ వాహనాలను తిలకించడంతో పాటు వాటితో సెల్ఫీలు, ఫొటోలు దిగారు. ఉస్మాన్‌ఖాన్, మరికొంత మంది చొరవతో వింటేజ్ షో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇకపై ప్రతి సంవత్సరం ఈ షోను నిర్వహిస్తామని తెలిపారు.

సాగర తీరంలో.. వింటేజ్ షో..

ఆకట్టుకుంటున్న గతకాలపు కార్లు, బైకులు











రియల్ హుషార్!

నగరం నలుమూలలా భారీ వెంచర్లు, బహుళ అంతస్తులు

- గతేడాదితో పోలిస్తే పెరిగిన హెచ్‌ఎండీఏ అనుమతులు
- క్రమంగా పుంజుకుంటున్న రియల్ ఎస్టేట్ రంగం
- హెచ్‌ఎండీఏ లే అవుట్లలో త్వరలో విక్రయాలు

'రియల్' దూకుడు పెరిగింది. నగరానికి నాలుగు వైపులా భారీ లేఅవుట్లు, కొత్త వెంచర్లు విస్తరిస్తున్నాయి. మరోవైపు విల్లాలు, బహుళ అంతస్తుల భవనాల విక్రయాల్లో సైతం జోరు పెరిగింది. దాదాపు ఏడాది కాలంగా నెలకొన్న 'రియల్' స్తబ్దత క్రమంగా పటాపంచలవుతోంది. మహా నగర పరిధిని ట్రిపుల్ ఆర్ వరకు విస్తరించడంతో పాటు ఫ్యూచర్ సిటీ ప్రణాళికలు, మెట్రో రెండో దశ ప్రతిపాదనలు, ఔటర్‌రింగ్ రోడ్డు నుంచి రీజనల్ రింగ్ రోడ్డు వరకు గ్రీన్‌ఫీల్డ్ రోడ్ల నిర్మాణం వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలతో రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకుంటోంది. మరోవైపు ఇటీవల హౌసింగ్ బోర్డు నిర్వహించిన బిడ్డింగ్‌కు సైతం అనూహ్య స్పందన లభించింది. ఫ్యూచర్ సిటీ నుంచి షాద్‌నగర్ వరకు కొత్త వెంచర్లకు డిమాండ్ కనిపిస్తోంది. కొత్తగా విలీనమైన గ్రామాల్లో ఇప్పుడు భారీ వెంచర్లు పుట్టుకొస్తున్నాయి.

– సాక్షి, సిటీబ్యూరో

సంవత్సరం	అనుమతులు	చదరపు మీటర్లు	ఆదాయం (రూ..లలో)
2023	1361	8991165.78	563.32
2024	878	5520304.88	395.13
2025(జూన్)	922	6343336.93	519.84

గత మూడేళ్లలో హెచ్‌ఎండీఏ ఇచ్చిన అనుమతులు

హైదరాబాద్ మహా నగరాభివృద్ధి సంస్థ(హెచ్‌ఎండీఏ) పరిధిలోని ఘట్‌కేసర్, శంషాబాద్, శంకర్‌పల్లి, మేడ్చల్ తదితర అన్ని జోన్లలో లే అవుట్లు, బహుళ అంతస్తుల భవనాల నిర్మాణానికి అనుమతుల్లో జాప్యాన్ని నివారించేందుకు హెచ్‌ఎండీఏ ప్రత్యేకంగా దృష్టి సారించింది. దీంతో కొంతకాలంగా అనుమతుల ప్రక్రియలో వేగం పెరిగింది. ఈ ఏడాది మొదటి ఆరు నెలల్లోనే 922 అనుమతులను ఇచ్చారు. మరో ఆరు నెలల్లో అనుమతులు రెట్టింపయ్యే అవకాశం ఉంది.



ఈ ఏడాదిలో (2025) జూన్ వరకు ఇచ్చిన అనుమతుల వివరాలు...

నెల	అనుమతులు	ఆదాయం (రూ.లలో)
జనవరి	124	60.10
ఫిబ్రవరి	137	62.51
మార్చి	111	94.71
ఏప్రిల్	128	43.97
మే	201	90.99
జూన్	221	167.56
	922	519.84



గతేడాది కంటే ఎక్కువే..

గత సంవత్సరం 2024లో మొత్తం 878 అనుమతులు మాత్రమే ఇచ్చారు. కానీ ఈ ఏడాది మొదటి ఆరు నెలల్లోనే 922 అనుమతులు ఇవ్వడం విశేషం. గత సంవత్సరం అన్ని అనుమతులపై హెచ్‌ఎండీఏకు రూ.395.13 కోట్ల ఆదాయం లభించగా ఈ సంవత్సరం జూన్ వరకు రూ.519 కోట్లకు పైగా ఆదాయం లభించింది. మరోవైపు 2023 సంవత్సరంలో 1,361 అనుమతులు ఇచ్చారు. రూ.563.32 కోట్ల ఆదాయం లభించింది. నిర్మాణ రంగంలో కొంతకాలం స్తబ్దత నెలకొన్నప్పటికీ క్రమంగా పుంజుకున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. టీజీబీపాస్ స్థానంలో కొత్తగా బిల్డ్‌నౌను ప్రవేశపెట్టిన తర్వాత దరఖాస్తు ప్రక్రియ కూడా సులభతరమైంది. క్షణాల్లోనే డాక్యుమెంట్‌లను అప్‌లోడ్ చేసే సదుపాయం లభించింది. మరోవైపు దరఖాస్తుదారులకు కూడా ఎలాంటి జాప్యం లేకుండా 'కీ'లు లభిస్తున్నాయి. కొన్ని సాంకేతిక ఇబ్బందులు ఉన్నప్పటికీ దరఖాస్తు ప్రక్రియ మాత్రం వేగవంతం అయినట్లు అధికారులు తెలిపారు.





వేలానికి సిద్ధంగా హెచ్‌ఎండీఏ స్థలాలు

మరోవైపు రియల్ ఎస్టేట్ రంగంలో సానుకూలమైన మార్పు రావడంతో వివిధ ప్రాంతాల్లో ఉన్న స్థలాలు, భూములను ఆన్‌లైన్ బిడ్డింగ్ ద్వారా విక్రయించేందుకు హెచ్‌ఎండీఏ సన్నద్ధమవుతోంది. గతంలో భూముల అమ్మకాలకు అనూహ్యమైన స్పందన లభించిన సంగతి తెలిసిందే. కోకాపేట్, బుద్వేల్, మోకిల తదితర ప్రాంతాల్లో భారీ స్పందన లభించింది. అలాగే తుర్కయంజాల్, తొర్రూరు, బాచుపల్లి, మేడిపల్లి తదితర ప్రాంతాల్లోనూ హెచ్‌ఎండీఏ ప్లాట్లు పెద్ద ఎత్తున అమ్ముడయ్యాయి. ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లో ఇంకా మిగిలిన స్థలాలతో పాటు కొత్త వెంచర్లలోనూ విక్రయాలకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. బహదూర్‌పల్లి, లేమూరు, ఇన్ముల్ నెర్వా తదితర ప్రాంతాల్లో త్వరలో వేలం నిర్వహించే అవకాశం ఉంది.

వివిధ ప్రాంతాల్లో ఆన్‌లైన్ బిడ్డింగ్‌కు సిద్ధంగా ఉన్న హెచ్‌ఎండీఏ లే అవుట్లు.

ఏరియా	మొత్తం ఎకరాల్లో	హెచ్‌ఎండీఏ ప్లాట్లు	విక్రయించినవి	ప్రస్తుతం ఉన్నవి
లేమూరు	83.47	164	0	164
తొర్రూరు	117.375	885	392	493
కుర్మల్‌గూడ	16.75	145	86	59
బాచుపల్లి	27.36	206	204	2
మేడిపల్లి	53.21	208	91	117
(కొన్ని ప్లాట్లు కోర్టు కేసుల్లో ఉన్నాయి.)				
మోకిల	165.37	908	189	719
(కొన్ని స్థలాల రిజిస్ట్రేషన్ పెండింగ్‌లో ఉంది.)				
బుద్వేల్	182.10	17	12	4
ప్రతాప్‌సింగారం	126.12	24	0	24
బహదూర్‌పల్లి	40.00	221	152	69
ఇన్ముల్‌నెర్వా	92.69	327	0	0

రెంటల్ అగ్రిమెంట్.. ఇలా సేఫ్..

హైదరాబాద్ వంటి మెట్రో నగరాల్లో అద్దె ఇల్లు అనేది నిత్యజీవితంలో చాలా సాధారణమైంది. ఉద్యోగావకాశాలు, విద్య, వైద్యం వంటి అంశాల కోసం లక్షలాది మంది నగరానికి తరలివచ్చి అద్దె ఇళ్లలో నివసిస్తున్నారు. ఈ నేపథ్యంలో రెంటల్ అగ్రిమెంట్ అనే విషయం ఎంతో కీలకమైంది. కానీ ఇప్పటికీ చాలామంది ఇంటి యజమానులు, అద్దెదారులు దీనిపై స్పష్టమైన అవగాహన లేకుండా నేరుగా మాటల కుదుర్చుకొని ముందుకు వెళ్లడం చూస్తుంటాం. రెంటల్ అగ్రిమెంట్ విషయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోతే అద్దెదారులు, గృహ యజమానులు ఇబ్బందులు పడే అవకాశం ఉంటుంది. ఈ వివాదాల్లో చిక్కుకోకుండా ఉండాలంటే న్యాయ నిపుణుల సూచనలకు అనుగుణంగా రెంటల్ అగ్రిమెంట్ చేసుకోవడం ఉభయులకు ఉపయుక్తంగా ఉంటుంది.

– సాక్షి, సిటీబ్యూరో

హైదరాబాద్ వంటి నగరాల్లో రెంటల్ అగ్రిమెంట్స్ తప్పనిసరి

- అద్దెదారులు, యజమానుల భవిష్యత్ సంరక్షణకు కీలకం
- 'మోడల్ టెనెన్సీ యాక్ట్ 2021' నిబంధనలతో ఒప్పందాలు
- 11 నెలల్లోపు నోటరీ ఒప్పందాలతో భవిష్యత్‌లో తిరకాసే..

ప్రస్తుత రియల్టీ మార్కెట్ గమనిస్తే, రెంటల్ అగ్రిమెంట్‌కు గల చట్టపరమైన ప్రాముఖ్యతను సమర్థంగా ఉపయోగించుకోవడం చాలా అవసరం. అద్దెదారుడి హక్కులు, ఇంటి యజమానుడి బాధ్యతలు, ఒప్పంద కాలం, అడ్వాన్స్, పెనాల్టీలు, ఇంటి పరిస్థితి వంటి అంశాలను స్పష్టంగా పేర్కొనడం వల్ల భవిష్యత్తులో అనవసర గొడవల నుంచి తప్పించుకోవచ్చు. రెంటల్ అగ్రిమెంట్ అంటే కేవలం డాక్యుమెంట్ మాత్రమే కాదు, అది రెండు వ్యక్తుల మధ్య నమ్మకాన్ని, బాధ్యతను ప్రతిబింబించే ఒప్పందం. హైదరాబాద్ వంటి నగరాల్లో పెరుగుతున్న నగరీకరణ మధ్య ఇది ఒక అవసరం.

'మోడల్ టెనెన్సీ యాక్ట్ 2021'..

- భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన మోడల్ టెనెన్సీ యాక్ట్ 2021' ప్రకారం అద్దె సంబంధిత అన్ని వ్యవహారాలను సరళంగా, పారదర్శకంగా చేయాలనే లక్ష్యంతో కొన్ని స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వబడ్డాయి.
- ఇందులో భాగంగా ప్రతి అద్దె ఒప్పందం రిజిస్టర్ చేయించుకోవాలి.
- అద్దెదారును అకస్మాత్తుగా ఇంటి నుంచి వెళ్లగొట్టడం తప్పు.
- అడ్వాన్స్‌గా ఎక్కువ డబ్బు తీసుకునేలా నియంత్రణ తప్పనిసరి.
- అద్దె ఇంటికి సెక్యూరిటీ డిపాజిట్ 2 నెలల అద్దె మాత్రమే తీసుకోవాలి.
- వ్యాపారాల నిమిత్తం అద్దె తీసుకుంటే ముందస్తుగా 6 నెలల కిరాయి మాత్రమే డిపాజిట్ చేయాలి.
- అద్దె పెంపు, భద్రత డిపాజిట్ వంటి వాటికి స్పష్టత ఉండాలి.
- ఇవన్నీ ప్రస్తుతం హైదరాబాద్ వంటి నగరాల్లో అమలవుతున్నాయా అన్నది ప్రశ్నే. కానీ ఈ చట్టం నగరాల్లో ఇప్పుడిప్పుడే మెల్లగా పుంజుకుంటోంది.



11 నెలల రెంటల్ అగ్రిమెంట్

11 నెలల రెంటల్ అగ్రిమెంట్ అనేది చాలా ఆసక్తికరమైన అంశం. మెట్రోనగరాల్లో ఎక్కువగా రెంటల్ అగ్రిమెంట్స్ 11 నెలలకు మాత్రమే చేస్తుంటారు. ఎందుకంటే 1908 రిజిస్ట్రేషన్ యాక్ట్ ప్రకారం 12 నెలలకు (ఏడాది) పైబడిన ఒప్పందాలు తప్పనిసరిగా రిజిస్టర్ చేయించాలి. (స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ చార్జీలు పడతాయి). కానీ 11 నెలల ఒప్పందానికి నోటరైజ్ చేయడం సరిపోతుంది. చట్టబద్ధంగా తక్కువ బాధ్యతలు ఉండటం వల్ల, దీనిని ఇంటి యజమానులు, అద్దెదారులు అనుసరిస్తున్నారు. ఇది ఒక 'కంఫర్ట్ జోన్'గా మారింది. కానీ దీని వలన కొన్ని సమస్యలు కూడా ఉన్నాయి. ఉదాహరణకు.. న్యాయ వివాదం తలెత్తినప్పుడు, నోటరైజ్డ్ ఒప్పందానికి పూర్తి చట్టపరమైన మద్దతు ఉండదు.

నగరంలో అద్దెలు..

హైదరాబాద్‌లోని ప్రధాన ప్రాంతాలైన హైటెక్ సిటీ, గచ్చిబౌలి, కూకట్‌పల్లి, అమీర్‌పేట వంటి ప్రాంతాల్లో అద్దె ఇళ్లు ఎక్కువగా కార్పొరేట్ ఉద్యోగులు, విద్యార్థుల అవసరాలను తీర్చేలా ఉన్నాయి. కానీ చాలామంది యజమానులు సరైన ఒప్పందం లేకుండా రూమ్‌లు ఇచ్చేస్తున్నారు. ఆన్‌లైన్ రియల్టీ ప్లాట్‌ఫామ్స్ (99ఎకర్స్, నోబ్రోకర్, మ్యాజిక్ బ్రిక్స్ మొదలైన) ద్వారా ఒప్పందాలు అయితే వస్తున్నాయి. కానీ అవి కూడా చాలాసార్లు 11 నెలల్లోనే నిమిత్తమవుతున్నాయి. ప్రధానంగా పోలీస్ వెరిఫికేషన్, ఆధార్ ఆధారిత ఒప్పందం వంటి వాటిని చాలా మంది పట్టించుకోట్లేదు.

భవిష్యత్తు దృష్టితో..

రియల్టీ, లైఫ్‌స్టైల్ పరంగా చూస్తే, అద్దె ఇల్లు అనేది తాత్కాలిక అవసరంగా కనిపించినా, జీవన శైలిని ప్రభావితం చేసే అంశం. చట్టపరమైన అవగాహన, పారదర్శక ఒప్పందాలు ఉండటం వల్ల అద్దెదారుడికి భద్రత ఉంటుంది. యజమానికి లీగల్ కవరేజీ ఉంటుంది. రెండు పక్షాల మధ్య విశ్వాసం పెరుగుతుంది.



క్లుప్తంగా...

విశ్వగురువుగా భారత్ కోసం కృషి

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పిలుపు



సాక్షి, న్యూఢిల్లీ: భారతదేశాన్ని విశ్వగురువుగా తీర్చిదిద్దేందుకు అందరం కలిసి కట్టుగా ముందుకు రావాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి కోరారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా.. ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. సీఆర్‌పీఎఫ్ జవాన్ల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశహితాన్ని పక్కనబెట్టి రాజకీయాలు చేయడం సరికాదని హితవు పలికారు.

చట్టసభల్లో ఘనంగా పతాకావిష్కరణ

సాక్షి, హైదరాబాద్: 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శాసనసభ ప్రాంగణంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు మహాత్మాగాంధీ, బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు ఎమ్మెల్యేలు, లెజిస్లేటివ్ సెక్రటరీ డాక్టర్ వి.నరసింహాచార్యులు పాల్గొన్నారు.

మండలిలో..

శాసనమండలి ప్రాంగణంలో చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ అద్దంకి దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యోగులకు తీవ్ర అన్యాయం

- టీజీవో అధ్యక్షుడు 'ఏలూరి'



సాక్షి, హైదరాబాద్: ప్రొఫెసర్ జయశంకర్ ఉద్యమ స్ఫూర్తితో సాధించుకున్న ప్రత్యేక తెలంగాణలో.. ఉద్యోగులకు పదేళ్లుగా తీవ్ర అన్యాయం జరిగిందని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీవో) అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్‌రావు అన్నారు. టీజీవో కార్యాలయంలో 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం శ్రీనివాస్‌రావు మాట్లాడారు. ఉద్యోగుల హక్కుల కోసం తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం ముందుంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీజీవో ప్రధాన కార్యదర్శి ఎ.సత్యనారాయణ, అసోసియేషన్ అధ్యక్షుడు బి.శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

నో వార్.. పీస్ ఇన్ ది వరల్డ్..

- పంద్రాగస్టు వేడుకల్లో అసదుద్దీన్ ఒవైసీ



మహ్మద్ ఇలియాస్ బుకారీతో కలిసి ప్రపంచ శాంతిని కోరుతూ బెలూన్‌లను ఎగుర వేస్తున్న ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

చార్మినార్: ప్రపంచ దేశాలన్నీ శాంతిని కోరుతూ ఆయా దేశాల్లోని ప్రజల సంక్షేమం, దేశాభివృద్ధికి కృషి చేయాలని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. నో వార్.. పీస్ ఇన్ ది వరల్డ్.. అనే స్లోగన్‌లతో ఏర్పాటు చేసిన రంగురంగుల బెలూన్‌లను ఆకాశంలోకి వదిలి ప్రపంచ శాంతిని కోరారు. మదీనా సర్కిల్‌లోని మహ్మద్ క్యాప్ మార్ట్ యజమాని మహ్మద్ ఇలియాస్ బుకారీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పంద్రాగస్టు వేడుకల్లో ఆయన మజ్లిస్ పార్టీ కార్పొరేటర్లతో కలిసి పాల్గొన్నారు.

భారతదేశ అభివృద్ధికి ఎస్‌బీఐ మూలస్తంభం

- ఎస్‌బీఐ హైదరాబాద్ సర్కిల్ సీజీఎం రాధాకృష్ణన్



సాక్షి, హైదరాబాద్: భారతదేశ అభివృద్ధికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఒక మూలస్తంభంగా ఉందని ఎస్‌బీఐ హైదరాబాద్ సర్కిల్ సీజీఎం ఎస్.రాధాకృష్ణన్ ఉద్ఘాటించారు. శుక్రవారం హైదరాబాద్ కోఠిలోని ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయంలో 79వ స్వాతంత్ర్య దిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాను ఎగరవేసిన అనంతరం రాధాకృష్ణన్ మాట్లాడారు. గతంలో రేషన్‌లైన్‌లో నిలబడి విదేశీ సహాయం కోసం ఎదురుచూసేవాళ్లమని, ఇప్పుడు ఆహార ధాన్యాలను విదేశాలకు ఎగుమతి చేసే దశకు చేరుకున్నామని తెలిపారు. దేశ నిర్మాణంలో ఎస్‌బీఐ పాత్ర అత్యంత ప్రధానమన్నారు. ఎస్‌బీఐ 60 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా బ్యాంకింగ్‌ను బలోపేతం చేయాలన్నారు. ఎస్‌బీఐని తెలంగాణలో అతిపెద్ద బ్యాంకుగా మార్చాలని, దీనికి ఉద్యోగులు, కస్టమర్లు, సహోద్యోగులు, తోటి పౌరులతో ప్రేమతో సేవ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ అధికారులు షెన్‌బాగా దేవి, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

..జలాలపై తగ్గేదే లేదు

▶ మొదటి పేజీ తరువాయి

గోదాట్లో కలిసిపోయినా, ఆ ప్రాజెక్టు నుంచి చుక్క నీరు రాకున్నా ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణను అగ్రస్థానంలో నిలిపామని సీఎం తెలిపారు.

సంక్షేమానికి కేరాఫ్ కాంగ్రెస్ పాలన..

రాష్ట్రంలో 20 నెలల కాంగ్రెస్ పాలనలోనే తెలంగాణను దేశానికే రోల్‌మోడల్‌గా నిలిపామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. 'నేను సీఎంగా బాధ్యతలు స్వీకరించగానే రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాం. మా ఆలోచనలో స్పష్టత, పారదర్శకత ఉంది. అందరినీ కలుపుకొని అద్భుతాలు సృష్టించే సమ్మిళిత అభివృద్ధి విధానాన్ని ఎంచుకుని 20 నెలల్లోనే దేశానికి రోల్ మోడల్‌గా నిలబెట్టాం. సంక్షేమానికి కేరాఫ్ కాంగ్రెస్ పాలన. రూ.13 వేల కోట్ల వ్యయంతో 3.10 కోట్ల మందికి సన్నబియ్యం అందిస్తున్నాం. ఇది కేవలం ఆకలి తీర్చే పథకం కాదు.. ఆత్మగౌరవాన్ని చాటి చెప్పే పథకం. 25.35 లక్షల మంది రైతులకు రూ.20,616 కోట్ల రుణమాఫీ చేసి కొత్త చరిత్ర రాశాం. ఇందిరమ్మ రైతు భరోసా కింద 70,11,184 మంది రైతులకు సాయం అందించాం. 7,178 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి చివరి గింజ వరకు కొన్నాం. సన్నాలకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తున్నాం. రైతు సంక్షేమానికి రూ.1.13 లక్షల కోట్లు ఖర్చు చేశాం. రూ.22,500 కోట్లతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాం. సమగ్ర కులగణన ద్వారా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు రంగం సిద్ధం చేశాం. ఆరోగ్య శ్రీ పథకానికి పూర్వవైభవం తెచ్చాం. 27 ఎకరాల విస్తీర్ణంలో రూ.2,700 కోట్లతో నయా ఉస్మానియా ఆస్పత్రి భవన సముదాయాన్ని నిర్మిస్తున్నాం. బాధ్యతలు స్వీకరించిన 48 గంటల్లోనే మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాం. దీని ద్వారా వారికి ఇప్పటివరకు రూ.6,790 కోట్లు ఆదా అయ్యాయి. 20 నెలల్లోనే దాదాపు 60 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం'అని సీఎం వివరించారు.

రాష్ట్రంలో డ్రగ్స్‌కు తావులేదు

గడచిన పదేళ్లలో యువతను మత్తుకు బానిసలను చేసే కుట్ర జరిగిందని సీఎం ఆరోపించారు. ఆ కుట్రను తాము ఛేదించామని చెప్పారు. ఇప్పుడు రాష్ట్రంలో డ్రగ్స్ అనే మాట వినబడటానికి వీలు లేకుండా కఠినంగా వ్యవహరిస్తున్నామని, ఈగల్ పేరుతో ఏర్పాటైన వ్యవస్థ రాష్ట్రం మూల మూలలా నిశితంగా నిఘా పెట్టిందని తెలిపారు.



గోల్కొండలో పంద్రాగస్టు వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో సీఎస్ రామకృష్ణారావు

గేమ్ ఛేంజర్‌గా తెలంగాణ..

ప్రపంచ వేదికపై తెలంగాణను సగర్వంగా నిలబెట్టాలన్న ఆలోచనతో ప్రభుత్వం ఉందని సీఎం తెలిపారు. '2047 నాటికి స్వతంత్ర భారతం శత వసంతాలు పూర్తి చేసుకుంటుంది. అప్పటికి దేశ ముఖచిత్రాన్ని మార్చే గేమ్ ఛేంజర్ పాత్రలో తెలంగాణను నిలిపేలా కీలక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. ఈ లక్ష్యం దార్శనిక పత్రమే తెలంగాణ రైజింగ్ 2047. 2035 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్స్‌ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను మార్చే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం. మూసీ పునరుజ్జీవం నుంచి మొదలై గ్రామీణ తెలంగాణ వ్యవసాయ వికాసం వరకు ఈ విజన్‌లో విస్పష్టంగా ఉండబోతోంది. వరదలతో అతలాకుతలం అవుతున్న హైదరాబాద్‌ను సుందరమైన నగరంగా మార్చే సంకల్పాన్ని ఇది ఆవిష్కరిస్తుంది. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మాణమయ్యే ఫ్యూచర్ సిటీ ఆధునిక ప్రపంచానికి గేట్ వేగా ఏ విధంగా ఉంటుందో ఈ పత్రం వెల్లడిస్తుంది. రీజినల్ రింగ్ రోడ్డు తెలంగాణ పురోగతికి రాచమార్గంగా ఎలా నిలవబోతోందో చెప్పబోతున్నాం. డిసెంబర్ నాటికి దాన్ని ఆవిష్కరిస్తాం'అని సీఎం తెలిపారు.

హైడ్రా అద్భుతంగా పని చేస్తోంది

హైదరాబాద్ నగరంలో హైడ్రా అద్భుతంగా పనిచేసి కబ్జాకు గురైన చెరువులను పునరుద్ధరిస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. హైడ్రాను ప్రతిపక్షాలు పనిగట్టుకుని విమర్శిస్తున్నాయని మండిపడ్డారు. గత ప్రభుత్వ అప్పులు, బకాయిలను తీర్చేందుకు తన ప్రభుత్వం రూ.2.20 లక్షల కోట్లు చెల్లించిందని, ఆ అప్పులే లేకుంటే ఈ మొత్తం ప్రజా సంక్షేమానికి ఖర్చు చేసేవాళ్లమని అన్నారు. దక్షిణ కొరియాను ఆదర్శంగా తీసుకుని యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్-బెంగళూరు డిఫెన్స్ కారిడార్‌లో పెట్టుబడుల కోసం గట్టిగా ప్రయత్నిస్తున్నామని తెలిపారు. అమరావతితో ప్రత్యేక గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు, రైలు కారిడార్‌తోపాటు అక్కడి పోర్టులతో అనుసంధానం, ఇక్కడ డ్రైపోర్టుల నిర్మాణానికి కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నట్లు వివరించారు.

ఘనంగా వేడుకలు...

గోల్కొండ కోటలో శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవాన్ని ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. సీఎం ఉదయం 10 గంటలకు కోట వద్దకు చేరుకుని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, ప్రసంగం అనంతరం పోలీసు సేవా పతకాలను ప్రదానం చేశారు. గాయకుడు రాహుల్ సిప్లిగంజ్‌కు రూ.కోటి నజరానా అందించారు. ఈ సందర్భంగా కళాకారుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కాగా, కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి భారీగా ప్రజలు రావటంతో గోల్కొండ కోట ప్రాంతంలో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

సత్వర, సమర్థ న్యాయమే లక్ష్యం

- పంద్రాగస్టు వేడుకల్లో హైకోర్టు సీజే జస్టిస్ ఏకే సింగ్



సెల్యూట్ చేస్తున్న హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: కోర్టులకొచ్చే కక్షిదారులకు సత్వర, సమర్థ న్యాయం అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, ఆ దిశగా మరిన్ని చర్యలు చేపడతామని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్ పేర్కొన్నారు. వేగంగా న్యాయం అందించడానికి కట్టుబడి ఉన్నామన్నారు. స్వేచ్ఛాయుతంగా మనం జీవించడానికి స్వాతంత్ర్య సమరయోధులు చేసిన కృషి, త్యాగాలకు అందరం కృతజ్ఞతలు తెలపాలని చెప్పారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా హైకోర్టు ప్రాంగణంలో శుక్రవారం జాతీయ పతాకాన్ని సీజే ఆవిష్కరించారు. అనంతరం జస్టిస్ ఏకే సింగ్ మాట్లాడుతూ.. 'రాష్ట్ర హైకోర్టు ఎందరో న్యాయమూర్తులను, సమర్థులైన న్యాయవాదులను తయారు చేసింది. హైకోర్టు, జిల్లా కోర్టుల జడ్జీలు అనేక అడ్డంకులున్నా న్యాయం అందిస్తూ కేసుల పెండింగ్‌ను తగ్గించడంలో అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారు. గత సంవత్సర కాలంలో 210 పని దినాలకు 74,768 కేసులు నమోదు కాగా, 72,414 కేసులు పరిష్కారమయ్యాయి. బార్, బెంచ్ సమష్టి కృషి.. కేసుల గుణాత్మక, వేగవంతమైన పరిష్కారానికి దోహదం చేస్తోంది'అని వెల్లడించారు.

సైనికుల కోసం లీగల్ క్లినిక్..

'13 చోట్ల జిల్లా కోర్టు సముదాయాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.1,053 కోట్ల పరిపాలనా అనుమతి మంజూరు చేసింది. సుప్రీంకోర్టు తీర్పులు 3,500, హైకోర్టు తీర్పులు 2,000 తెలుగులో అందుబాటులోకి తెచ్చాం. రికార్డుల డిజిటలైజేషన్‌కు ప్రక్రియను మరింత వేగవంతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. జాతీయ లోక్‌అదాలత్‌లో రాష్ట్రంలో ఏడాది కాలంగా 55,20,379 కేసులు పరిష్కారం కాగా, కక్షిదారులకు రూ.236 కోట్లు పంపిణీ చేశాం. చంచల్‌గూడ జైలులో నివృత్తి పేరిట డీ-అడిక్షన్ సెంటర్‌తోపాటు లీగల్ ఎయిడ్ క్లినిక్ ఏర్పాటు చేశాం. సైనికుల కోసం కూడా ఇలాంటి క్లినిక్‌ను ప్రారంభించాం'అని వివరించారు. అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి, బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నరసింహారెడ్డి, అడ్వొకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.జగన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, రిజిస్ట్రార్లు, మాజీ న్యాయమూర్తులు జస్టిస్ చల్లా కోదండరామ్, జస్టిస్ జి.రఘురామ్, జస్టిస్ సీవీ రాములు, జస్టిస్ భిక్షపతి, జస్టిస్ జి.యతిరాజు, జస్టిస్ రవికుమార్, జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి, టీజీఎల్ఎస్ఏ సభ్యకార్యదర్శి సీహెచ్ పంచాక్షరి, జస్టిస్ గోపాల్‌రెడ్డి, అడిషనల్ అడ్వొకేట్ జనరల్‌లు ఇమ్రాన్‌ఖాన్, తేరా రజనీకాంత్‌రెడ్డితోపాటు జీపీలు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణపై ఢిల్లీ కిరాయిపాలన రుద్దుతున్నారు

- పదేళ్ల పాటు ఆత్మగౌరవంతో బతికిన తెలంగాణ బానిసత్వంలోకి..
- చంద్రబాబు కేంద్రంలో చక్రం తిప్పుతున్న రోజుల్లోనే కేసీఆర్ పార్టీ
- తెలంగాణభవన్‌లో స్వాతంత్ర్య దినోత్సవంలో కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: 'స్వాతంత్ర్యం అంటే సొంతంగా పరిపాలించుకోవడమే కాదు.. ఆత్మగౌరవంతో బతకడం. పదేళ్ల కేసీఆర్ పాలనలో ఆత్మగౌరవంతో బతికిన తెలంగాణపై ఢిల్లీ కిరాయిపాలన రుద్దుతూ పెత్తనం చేస్తున్నారు. మళ్లీ బానిసత్వంలోకి వెళ్లిన తెలంగాణ తన స్వేచ్ఛ, స్వాతంత్ర్యాన్ని కోల్పోయింది. ప్రతి చిన్నపనికీ ఢిల్లీవైపు చూస్తూ సీఎం రేవంత్ 51 సార్లు అక్కడకు వెళ్లి వచ్చాడు. ఢిల్లీ పార్టీలు కాంగ్రెస్, బీజేపీ వల్లే తెలంగాణ వెనుకబాటుకు గురవుతోంది'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. తెలంగాణభవన్‌లో శుక్రవారం జరిగిన స్వాతంత్ర్య దిన వేడుకల్లో కేటీఆర్ జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం 'ప్రజాయోధుడు కేసీఆర్'అనే పుస్తకాన్ని ఆవిష్కరించి కేటీఆర్ మాట్లాడారు. పూర్తి వివరాలు ఆయన మాటల్లోనే...



పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతున్న కేటీఆర్

దేశానికి దీప స్తంభంలా తెలంగాణ

స్వీయ రాజకీయ అస్తిత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష. గాంధీ, నెహ్రూ, అంబేడ్కర్ స్ఫూర్తితో కేసీఆర్ నాయకత్వంలో పోరాడి సాధించుకున్న తెలంగాణ పదేళ్లలో అద్భుత విజయాలు సాధించి దేశానికి దీప స్తంభంలా నిలిచింది. కానీ రైతును రాజును చేయాలనే కేసీఆర్ తపన పక్కకు వెళ్లి 20 నెలల కాంగ్రెస్ పాలనలో యూరియా కోసం రైతులు లైన్లలో నిలబడుతున్నారు. తెలంగాణకు బద్ధ వ్యతిరేకి అయిన చంద్రబాబు కేంద్రంలో చక్రం తిప్పుతుంటే రాజకీయ పార్టీ పెట్టాలని ఆలోచించడమే దుస్సాహసం. కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ చాలా బలంగా ఉన్న రోజుల్లో తెలంగాణ కోసం ఒక పార్టీ పెట్టి రాజకీయశక్తిగా ప్రజల ఓట్లను ఆయుధంగా చేసుకొని పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లును పాస్ చేయించుకొని రాష్ట్రాన్ని సాధించుకుంటామని చెప్పే సాహసాన్ని కేసీఆర్ చేశారు. ఎన్టీఆర్, ఎంజీఆర్‌లాగా కేసీఆర్ సినిమా స్టార్ కాకపోయినా, కుల బలం, ధన బలం, మీడియా పవర్, బలగం లేకున్నా తెలంగాణ ప్రజల మనోభావాలను పార్లమెంట్‌కు చేరేలా ఉద్యమ నిర్మాణాన్ని చేశారు. తెలంగాణ రానే రాదన్న అనుమానాలను పటాపంచలు చేసి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన కారణజన్ముడు కేసీఆర్.

చిల్లర ప్రయత్నాలు తిప్పికొట్టాలి

కేసీఆర్ అప్పులు చేశారని రాహుల్‌గాంధీ నుంచి రేవంత్‌రెడ్డి వరకు చేస్తున్న తప్పుడు ప్రచారానికి చెంపదెబ్బ లాంటి సమాధానాన్ని పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ఇచ్చింది. పాలన చేతకాక, హామీలు అమలు చేయలేక అప్పుల పేరిట కేసీఆర్‌ను కాంగ్రెస్ బదనాం చేస్తోంది. ఆ చిల్లర ప్రయత్నాలను తిప్పికొట్టాలి. తెలంగాణ కోసం చేసిన పోరాటం, కొత్త రాష్ట్ర నిర్మాణం కోసం చేసిన కృషిని చెప్పుకోలేక పోయాం. కాళోజీ, జయశంకర్, కేసీఆర్‌తోపాటు తెలంగాణ పోరాట యోధుల జీవిత చరిత్రలను నేటి యువతకు తెలిసేలా పుస్తకాలు, ఆడియో, వీడియో రూపాలను తీసుకురావాలి'అని కేటీఆర్ పిలుపునిచ్చారు.

దేశంలోనే గేమ్ ఛేంజర్‌గా తెలంగాణ

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ఖమ్మంలో స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్న డిప్యూటీ సీఎం



సెల్యూట్ చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

సాక్షిప్రతినిధి, ఖమ్మం: '2047 నాటికి దేశ ముఖచిత్రాన్ని మార్చే గేమ్ ఛేంజర్ పాత్రలో తెలంగాణ ఉండాలన్న సంకల్పంతో మా ప్రభుత్వం పనిచేస్తోంది. ఆ సంకల్పానికి దార్శనిక పత్రమే 'తెలంగాణ రైజింగ్ 2047'. మూడు ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను మార్చే మహత్తర లక్ష్య పత్రంగా ఇది ఉంటుంది. ఇది కేవలం ప్రణాళికే కాదు.. ప్రపంచ వేదికపై తెలంగాణను సగర్వంగా నిలబెట్టే సంకల్పం'అని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. ఖమ్మంలో శుక్రవారం జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ, 70 ఏళ్లుగా పీడీఎస్ వ్యవస్థ పేద ప్రజల ఆహార భద్రతకు భరోసా ఇస్తుండగా తాము రూ.13 వేల కోట్ల వ్యయంతో 3.10 కోట్ల మందికి సన్నబియ్యం అందిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది జూలై 14 నుంచి నూతన రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభించగా, రాష్ట్రంలో 25.35 లక్షల మంది రైతులకు రూ.20,616 కోట్ల మేర రుణమాఫీ చేసి కొత్త చరిత్ర రాశామన్నారు. అలాగే, రైతు భరోసా ద్వారా రూ.9 వేల కోట్లు చెల్లించి, సన్నధాన్యం క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తున్నామని, 29 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్ కోసం రూ.16,691 కోట్లను విద్యుత్ సంస్థలకు చెల్లిస్తున్నామని భట్టి తెలిపారు. కాంగ్రెస్ బ్రాండ్ అయిన ఆరోగ్యశ్రీ పథకానికి పూర్వవైభవం తెచ్చామని చెప్పారు. కాగా, కృష్ణా, గోదావరి జలాల్లో రాష్ట్ర వాటా సాధనలో రాజీ పడబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైన్ లాంగ్వేజ్‌లో కలెక్టర్ జాతీయ గీతాలాపన



సైన్ లాంగ్వేజ్‌లో జాతీయగీతం ఆలపిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి తదితరులు

కరీంనగర్ కల్చరల్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కరీంనగర్ పోలీసు పరేడ్ మైదానంలో కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ అశ్వినీ తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ బధిర విద్యార్థులతో కలిసి ఇండియన్ సైన్ లాంగ్వేజ్‌లో జాతీయగీతాన్ని ఆలపించారు. దివ్యాంగుల భావాన్ని అర్థం చేసుకుని వారి సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా అధికారులకు ఇండియన్ సైన్ లాంగ్వేజ్ బేసిక్స్‌పై కలెక్టర్ పమేలా సత్పతి శిక్షణ ఇప్పించారు. ఏడు రోజుల్లో సైన్ లాంగ్వేజ్‌లో బేసిక్స్ నేర్చుకున్నారు. శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అధికారులంతా కలిసి ప్రదర్శన ఇచ్చారు.

ప్రజల ఆకాంక్షలమేరకే ముందుకు

- స్వాతంత్ర్య వేడుకల్లో టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: ప్రజల ఆకాంక్షల మేరకే రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకెళుతోందని, పేదల శ్రేయస్సే ధ్యేయంగా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. ప్రపంచంతో పోటీ పడేలా తెలంగాణను తీర్చిదిద్దడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని చెప్పారు. కాగా, నాడు స్వాతంత్ర్యం వద్దన్న పార్టీలే ఇప్పుడు దేశాన్ని పాలించడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా శుక్రవారం ఆయన గాంధీభవన్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ దేశంలో బీజేపీ అప్రజాస్వామిక పాలనపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అలుపెరగని పోరాటం చేస్తున్నారని, దేశవ్యాప్తంగా భారత్‌జోడో పేరుతో పాదయాత్ర చేసి ప్రజల సమస్యలను అర్థం చేసుకున్నారని చెప్పారు. జనాభా దామాషా ప్రకారం దేశ సంపదలో వాటా దక్కాలన్న రాహుల్ గాంధీ ఆలోచన మేరకు రాష్ట్రంలో కులగణన చేసి బీసీ బిల్లు ఆమోదించడం ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి తన చిత్తశుద్ధిని నిరూపించుకున్నారని అన్నారు.

'ముద్దు'ల ముచ్చట.. 'కూన' నైట్ కాలింగ్!

శ్రీకాకుళంలో కేజీబీవీ ప్రిన్సిపాల్‌కు ఎమ్మెల్యే 'కూన' వేధింపులు..

కలకలం రేపిన గుంటూరు టీడీపీ ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ 'ముద్దు' వీడియో..

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం పట్నం బజారు (గుంటూరు), కళ్యాణదుర్గం: ఏపీలో అధికార పార్టీ ప్రజాప్రతినిధులు బరితెగించి ప్రవర్తిస్తుండటంతో మహిళలు రక్షణ కరువై అల్లాడుతున్నారు. బాధ్యత మరిచిన టీడీపీ ప్రజాప్రతినిధుల విశృంఖల వైఖరితో మహిళలు బెంబేలెత్తుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక టీడీపీ నేతలు, ఆ పార్టీ ప్రజా ప్రతినిధుల ఆగడాలు మితిమీరి పోవడంతో మహిళా ఉద్యోగులు కార్యాలయాలకు రావాలంటే వణికిపోతున్నారు. అనంతపురం, శ్రీకాకుళం, గుంటూరు జిల్లా ల్లో వెలుగులోకి వచ్చిన అఘాయిత్యాలు.. గుంటూరు ఎమ్మె ల్యే 'ముద్దు' వీడియోలు మహిళల పట్ల ఏడాది పాలనలో జరుగుతున్న దుశ్చర్యలకు మచ్చు తునకగా నిలుస్తు న్నాయి.

'కూన' వీడియో కాల్స్...!

'ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ రాత్రి 10 గంటల తర్వాత పార్టీ కార్యాలయాలకు రావాలని తన అనుచరులతో పిలిపిస్తారు. చాలాసేపు అక్కడే ఉంచుతారు. రాత్రి 10.30 దాటిన తర్వాత వీడియో కాల్ చేసి వేధిస్తుంటాడు. సాధారణ కాల్స్ చేయరు. వీడియో కాల్ అయితేనే మాట్లాడతారని అనుచరులతో చెప్పిస్తారు. దుర్బుద్ధితోనే ఇదంతా... దారికి రాలేదని వేధింపులకు గురి చేస్తున్నారు. నాలా నియోజకవర్గంలో అనేక మంది మహిళా ఉద్యోగులను ఇబ్బంది పెట్టారు. ఎమ్మెల్యేతో పాటు టీడీపీ నేతల వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకోవాలనుకున్నా...!'

పొందూరు కేజీబీవీ ప్రిన్సిపాల్ సౌమ్య ఆవేదన ఇదీ!

దళితురాలిని తీవ్రంగా వేధించారంటూ బాధితురాలు కన్నీరుమున్నీరవుతున్నారు. కూన రవికుమార్ వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకోవాలని భావించినట్లు చెబుతున్నారు. ఇటీవల ఎమ్మెల్యే ఇద్దరు మనుషులను పంపించి కేజీబీవీలోని టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందితో తనకు వ్యతిరేకంగా బలవంతంగా సంతకాలు చేయించినట్లు తెలిపారు. అధికారులు తనకు అండగా ఉండకపోగా ఎమ్మెల్యేకు కొమ్ము కాస్తున్నారని వాపోయారు. కాగా గార, కంచిలి కేజీబీవీల ప్రిన్సిపాళ్లపై కూడా వ్యూహాత్మకంగా ఫిర్యాదులు చేయించి బదిలీలు చేయించారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

బలిపశువుని చేస్తున్నారు..!

గుంటూరు తూర్పు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్ 'ముద్దు' దృశ్యాల వీడియో వైరల్ అయిన ఘటనలో తనని బలిపశువుని చేస్తున్నారంటూ పార్టీ మహిళా నేత షేక్ సూఫియా పురుగుల మందు తాగడం కలకలం రేపింది. ఎమ్మెల్యే, పోలీసుల వేధింపులు తట్టుకోలేక పోతున్నానంటూ శుక్రవారం ఆమె బ్రహ్మానందరెడ్డి స్టేడియం వద్ద ఆత్మహత్యాయత్నం చేయడంతో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పార్టీ నాయకురాలు గుడిపల్లి వాణితో ఎమ్మెల్యే వివాహేతర సంబంధం గురించి ప్రతి ఒక్కరికీ తెలుసని సూఫియా మీడియాతో పేర్కొన్నారు. ఎమ్మెల్యేతో సన్నిహితంగా ఉన్న వీడియోలను ఆమె భర్త నవీన్‌కృష్ణ స్వయంగా రికార్డ్ చేసి వైరల్ చేశారని ఆరోపించారు. తాను ఈ విషయాన్ని ఎమ్మెల్యే నసీర్‌కు చెప్పడంతో రెండు రోజులు మాట్లాడకుండా ఉండమన్నారని చెప్పారు. గుడిపల్లి వాణి కుటుంబంతో ఎమ్మెల్యే సెటిల్‌మెంట్ చేసుకుని తనని ఇరికించే యత్నం చేస్తున్నారని చెప్పారు. నవీన్‌కృష్ణ ఫోన్‌లో ఉన్న వీడియోలపై విచారణ జరిపించాలన్నారు. పోలీసుల వేధింపులు తట్టుకోలేకపోతున్నానని,ఆత్మహత్యే శరణ్యమని వాపోయారు.

కళ్యాణదుర్గంలో గర్భిణి బలవన్మరణం..

'భర్త, అత్త మామల వేధింపులు తాళలేక స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినా నాకు న్యాయం జరగలేదు. నా ఫిర్యాదును పోలీసోళ్లు మార్చేశారు. టీడీపీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి నాకు అన్యాయం చేశారు..' అని విలపిస్తూ అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన నిండు గర్భిణి శ్రావణి (22) ఉరి పోసుకుని బలవన్మరణానికి పాల్పడింది. తన దయనీయ పరిస్థితిని ఫోన్‌లో ఆడియో రికార్డ్ చేసి తనువు చాలించింది. ఈ ఘటన గురువారం సాయంత్రం చోటు చేసుకోగా... శుక్రవారం ఉదయం మృతురాలి ఆడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

ఈ ప్రభుత్వంలో న్యాయం జరగదా..?

కళ్యాణదుర్గానికే చెందిన శ్రీనివాసులుతో మూడేళ్ల క్రితం శ్రావణికి వివాహమైంది. కట్నం కోసం భర్త, అత్తమామలు తరచూ వేధించడంతో కళ్యాణదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు శ్రావణి పేర్కొంది. అయితే టీడీపీ నేత, మున్సిపల్ మాజీ చైర్మన్ వైపీ రమేష్, మాజీ వైస్‌చైర్మన్ శర్మస్ వలి ఒత్తిళ్లతో సీఐ దీన్ని మరో రకంగా మార్చేసి భర్త, అత్తమామలకు అనుకూలంగా వ్యవహరించారని ఆడియోలో మృతురాలు కన్నీరు మున్నీరైంది. దీనిపై పట్టణ సీఐ యువరాజును వివరణ కోరగా.. మృతురాలు ఆరోపించినట్లుగా తాము నిర్లక్ష్యం చేయలేదని, ఎఫ్ఐఆర్ నమోదు చేసి భార్యాభర్తకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించామని చెప్పారు. శ్రావణి ఫిర్యాదు మేరకు ఈ నెల 11న కళ్యాణదుర్గం స్టేషన్‌లో కేసు నమోదైనట్లు జిల్లా ఎస్పీ పి.జగదీష్ మీడియాతో చెప్పారు. భర్త, కుటుంబ సభ్యులను రిమాండ్‌కు పంపామన్నారు.

కమ్యూనిస్టుల ముసుగులో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాటకం

- పథకం ప్రకారం గుజరాతీలు, మార్వాడీలపై కుట్ర
- కేంద్ర మంత్రి బండి,బీజేపీ చీఫ్ రాంచందర్‌రావు ధ్వజం



తిరంగాయాత్రలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న బండి సంజయ్, రాంచందర్‌రావు

వెంగళరావునగర్/సాక్షి, హైదరాబాద్: కమ్యూనిస్టుల ముసుగులో కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎంలు నాటకాలు ఆడుతూ.. మార్వాడీలు, గుజరాతీలపై కుట్ర చేస్తున్నాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు ధ్వజమెత్తారు. శుక్రవారం యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియం నుంచి వీరు హర్‌ఘర్ తిరంగా బైక్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గుజరాతీలు, మార్వాడీలు హిందూ ధర్మాన్ని, సనాతన ధర్మాన్ని కాపాడుతున్నారని, బీజేపీకి అనుకూలంగా ఉంటారనే.. ఓర్వలేక ప్లాన్ ప్రకారం గో బ్యాక్ అంటున్నారని పేర్కొన్నారు. గుజరాతీలు రాష్ట్ర సంపదను దోచుకోవడానికి, అధికారం కోసం రాలేదని, వ్యాపారం చేసుకోవడానికి వచ్చారని తెలిపారు. అనేకమంది రోహింగ్యాలు నగరంలో ఉన్నారని, పాతబస్తీ వారికి అడ్డాగా మారిందని, వారి గురించి కాంగ్రెస్ నాయకులు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. మైనార్టీలు బీసీల పొట్టగొడుతున్నారని, హిందువుల వ్యాపారాలను దెబ్బ తీస్తున్నారని ధ్వజమెత్తారు. నరేంద్ర మోదీ పాలన వచ్చాక ప్రతీ ఇంటిమీద జెండా ఎగురుతోందని పేర్కొన్నారు.

కొన్ని పార్టీలు దేశ వ్యతిరేక పనులు చేస్తున్నాయి

కొన్ని రాజకీయ పార్టీలు దేశానికి, రాజ్యాంగానికి వ్యతిరేకంగా కార్యక్రమాలు చేపడుతున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు ఆరోపించారు. ఈ పార్టీలు రైతులు, యువజనుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న తీరును ప్రజలు గ్రహించారన్నారు. శుక్రవారం బీజేపీ కార్యాలయంలో ఆయన త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఒక ఛాయ్‌వాలా ప్రధానిగా ఎన్నికై, ఎర్రకోటపై 12వ సారి జాతీయ జెండా ఎగురవేయడం సామాన్యుడికి గర్వకారణమని అన్నారు.



చాలామంది కృష్ణుడంటే అల్లరి, చిలిపితనం, మాయలు, మహిమలు... అనే అనుకుంటారు. కానీ కృష్ణుడంటే ఒక చైతన్యం. ఒక స్ఫూర్తి. ఎందుకంటే తానో రాజు కొడుకైనా సామాన్య గోప బాలురతో చెలిమి చేశాడు. అల్లరి పనులతో బాల్యాన్ని ఎలా ఆస్వాదించాలో చెప్పాడు. అంతేకాదు, యవ్వనంలో ఉండే చిన్న చిన్న సరదాలనూ చూపించాడు. బంధాలను నిలుపుకోవడంలో అందరికీ ఆదర్శంగా నిలిచాడు. ముఖ్యంగా ప్రేమ, పెళ్లి, స్నేహం... ఏదైనా సరే పది కాలాల పాటు సరిగ్గా ఉండాలంటే ఏం చేయాలో వివరించాడు. భగవద్గీత ద్వారా ఈ సారాన్ని ప్రపంచానికి అందించాడు. నేడు కృష్ణాష్టమి సందర్భంగా ఆయన చెప్పిన ఆ పాఠాలను అర్థం చేసుకుందాం...

కృష్ణం వందే జగద్గురుమ్



స్నేహానికి ప్రాణం

చిన్నప్పుడు గోపబాలురతో అరమరికలు లేకుండా హాయిగా ఆడుకున్న శ్రీ కృష్ణుడు స్నేహితులకు, శరణార్థులకూ మాట ఇచ్చాడంటే తప్పడం అన్నది లేదు. 'కురుక్షేత్రంలో ఆయుధం పట్టను' అని చెప్పాడు. ఆ మాట మీదే నిలబడ్డాడు. అంతేకాదు. అర్జునుడితో చుట్టరికం ఉన్నప్పటికీ అంతకు మించి ఆప్యాయతను చూపించాడు. శ్రీ కృష్ణుడు, కుచేలుడి గురించి ఎలా చెప్పుకుంటారో అదే విధంగా శ్రీకృష్ణుడు, అర్జునుడి బంధం గురించి కూడా మాట్లాడతారు. పాండవులు ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నా సరే అండగా నిలిచాడు. వారికి దిక్కుతోచనప్పుడు మార్గదర్శిగా మారాడు. యుద్ధంలో అర్జునుడికి రథసారథిగా ఉన్నాడు. ఇవన్నీ కేవలం స్నేహం కోసం చేసినవే.

ఒక భరోసా... ఒక నమ్మకం

నమ్మకం అనేది ఏ బంధంలో అయినా ముఖ్యం. నమ్మకం పోగొట్టుకోడానికి ఎంతోసేపు పట్టదు. కానీ సంపాదించుకోడానికి మాత్రం చాలా సమయం పడుతుంది. కృష్ణుడు చెప్పింది కూడా ఇదే. 'నన్ను పూర్తిగా నమ్ము.. అంతా నేను చూసుకుంటాను' అనే భరోసా ఇచ్చాడందరికీ. అందరికన్నా ముందుగా అర్జునుడికి. ఆ నమ్మకంతోనే యుద్ధంలో పోరాడాడు అర్జునుడు. అంగబలం, అర్థబలం, అధికార బలం, సైనిక బలం ఉన్న కౌరవులపై యుద్ధంలో పాండవులు పైచేయి సాధించగలిగారంటే అందుకు కృష్ణుడే కారణం.

స్థాయీ భేదాలు చూపలేదు...

అవతలి వాళ్ల స్థాయి ఏంటి... వారు ఎలాంటి హోదాలో ఉన్నారు అన్నది పక్కన పెట్టి అందరినీ సమానంగా చూడాలని బోధించాడు కృష్ణుడు. అందుకే సాయం కోసం వచ్చిన కుచేలుడి మనసు అర్థం చేసుకుని ఆనందాన్ని అందించాడు. అదే సమయంలో గౌరవం చూపించాడు. కేవలం స్నేహితులు అనే కాదు. ప్రేమికులు, భార్యా భర్తలు...ఇలా ఏ బంధంలో అయినా సరే అందరినీ సమానంగా చూస్తే ఎలాంటి చిక్కులూ రావని, పరస్పరం గౌరవించుకుంటే సమస్యలే ఉండవని నిరూపించాడు.

క్షమాగుణం

తప్పులు అందరూ చేస్తారు. కొన్నిసార్లు తెలియక, కొన్ని సార్లు తెలిసి అవి జరుగుతుంటాయి. అంత మాత్రాన ఆ వ్యక్తి పూర్తిగా చెడ్డవాడు అయిపోడు. వాళ్లపై ద్వేషం పెంచుకోవాల్సిన అవసరమూ లేదు. మిత్రులనే కాదు. శత్రువులను కూడా ఒకే రకంగా ఆదరించడంలో కృష్ణుడు ముందుండేవాడు. ఆ మాత్రం క్షమాగుణం లేకపోతే బంధం ఎలా నిలబడుతుంది? మేనత్తకు ఇచ్చిన మాట కోసం శిశుపాలుడు చేసిన వంద తప్పులను మన్నించాడు. ఎవరినైనా ఇష్టపడితే వాళ్ల నుంచి ఏవేవో ఆశించకుండా పూర్తిగా డిటాచ్‌డ్‌గా ఉండాలని బోధించాడు కృష్ణుడు.

పరిపూర్ణ జీవితం

కృష్ణుడంటే అన్ని బంధాలనూ ఆస్వాదించిన వాడని మరచిపోరాదు. బాల్యంలోనే కన్న తల్లిదండ్రులకు దూరమైనా, పెంచిన తల్లిదండ్రులను పరిపూర్ణంగా ప్రేమించాడు. ఆ తర్వాత కన్న తల్లిదండ్రులకూ సాంత్వన నిచ్చాడు. పదహారు వేలమంది గోపికలకూ తన ప్రేమను పంచాడు. అష్టమహిషులనూ అదేవిధంగా ఆదరించాడు. తనను నమ్మి వచ్చిన ఎవ్వరికీ ఏ లోటూ రానివ్వలేదు. తాను సంతోషంగా ఉన్నాడు. తనతో ఉన్న వారిని అదేరీతిలో ఉంచాడు.

వ్యక్తిత్వ వికాస గురువు

ఇప్పుడు వస్తున్న వ్యక్తిత్వ వికాస పుస్తకాలన్నింటికీ మూలాధారం రణరంగంలో శ్రీకృష్ణుడు అర్జునుడికి బోధించిన గీతే! వ్యక్తిత్వ వికాస బోధకులకు కృష్ణుడే గాడ్ ఫాదర్. అందుకే కృష్ణుడు పరమాత్ముడే కాదు.. అందరికీ పరమ ఆప్తుడు... జగద్గురువు కూడా!

– డి.వి.ఆర్.

లీలాకృష్ణుడు

శ్రీకృష్ణ జన్మాష్టమి అనేది దేవదేవుడైన శ్రీ కృష్ణుడు తన దివ్య ధామం నుంచి భూమిపై అవతరించిన రోజు. ఈ పండుగను శ్రావణ మాసంలోని కృష్ణ పక్ష అష్టమి నాడు జరుపుకుంటారు. భగవంతుని అలౌకికమైన ఆవిర్భావం, దివ్య లీలలను అర్థం చేసుకోవడం ద్వారా జీవులు ముక్తిని పొంది, భగవద్ధామాన్ని చేరగలరని భగవద్గీత బోధిస్తోంది. శ్రీ కృష్ణుడి జననం మానవ జీవిత సార్థకతకు అవసరమైన అనేక వరాలను లోకానికి అందించింది. మధురలోని కంసుని కారాగారంలో దేవకీ వసుదేవులకు చతుర్భుజ విష్ణువుగా అవతరించటం, ఆపై సామాన్య బాలకుడిగా రూపాంతరం చెందటం, పసిపిల్లాడిగానే అసురులను మట్టుపెట్టడం, చిటికెన వేలుతో గోవర్ధన గిరిని ఎత్తి పట్టడం తదితర అసాధారణమైన లీలలన్నీ శ్రీ కృష్ణుని దివ్యత్వాన్ని చాటిచెబుతున్నవే.



అవతార లక్ష్యం... వాస్తవానికి ఆయన పుట్టుక లేనివాడైనప్పటికీ, తన ఆంతరంగిక శక్తిచేతనే ఈ లోకాన అవతరించి మన మధ్య జన్మించడం ఆయన దివ్యలీలల్లో ఒకటి. దుష్టులను శిక్షించి, శిష్టులను రక్షించి, ధర్మాన్ని పునఃస్థాపించడం అవతార ప్రయోజనాలలో మరొకటి. మనమంతా ఈ భౌతిక దేహాలు కాదని, శాశ్వత ఆత్మ స్వరూపులమని, నిరంతర ఆనందం మన సహజ స్థితి అని తెలుపుతూ భగవద్గీతలో శ్రీకృష్ణుడు అందించిన సందేశం మన సనాతన సంస్కృతికి మూల స్తంభం. మానవ జన్మకు అంతిమ లక్ష్యం భగవంతునితో మన ప్రేమపూర్వక సంబంధాన్ని పునరుద్ధరించుకోవడమే.

ఎలా ఆచరించాలి..? కృష్ణాష్టమి నాడు భక్తులు అర్ధరాత్రి వరకు ఉపవాసం ఉంటారు. ఆరోగ్యం సహకరించనివారు పండ్లు, పాలు వంటి అనుకల్ప ప్రసాదం తీసుకోవచ్చు. మీకు సమీపంలోని శ్రీ కృష్ణుని దేవాలయాన్ని సందర్శించి శ్రీ కృష్ణుని సేవల్లో పాల్గొనండి. ముఖ్యంగా, హరే కృష్ణ మహామంత్రాన్ని జపించడం (కనీసం 108 సార్లు) చాలా శ్రేష్ఠం. దేవాలయానికి వెళ్లలేని భక్తులు కూడా హరే కృష్ణ మహామంత్రాన్ని జపించడం ద్వారా కృష్ణుని కృపను పొందగలరు. ఈ రోజు భగవద్గీత, శ్రీమద్భాగవతం వంటి గ్రంథాల నుండి శ్రీ కృష్ణుని లీలలు, ఉపదేశాలను పఠించడం పుణ్యప్రదం.



- సత్యగౌర చంద్రదాస ప్రభూజీ,
అధ్యక్షులు, హరే కృష్ణ మూవ్‌మెంట్,
హైదరాబాద్

అందరికీ కావాలి ఆటపాటల బడి

అది బెర్క్‌షైర్ లోని విండ్సర్ పట్టణంలోని రాజప్రాసాదం. పేరు విండ్సర్ క్యాజిల్. పౌరపురస్కారాల కార్యక్రమం రాజరిక గౌరవాలతో సాగుతున్న రోజు. బ్రిటిష్ రాజవంశం పౌరులకు ప్రదానం చేసే అత్యున్నతమైన 'కమాండర్ ఆఫ్ ద ఆర్డర్ ఆఫ్ ద బ్రిటిష్ ఎంపైర్' పురస్కారాలను బ్రిటన్ రాజు చార్లెస్ సోదరి ప్రిన్సెస్ యాన్నే ప్రదానం చేశారు. పురస్కారాలు అందుకున్న వారిలో తెలుగు మహిళ ఉన్నారు. ఆమె పూర్ణిమా మూర్తి తణుకు. తెలుగు నేల అందుకున్న తొలి 'కమాండర్ ఆఫ్ ద ఆర్డర్ ఆఫ్ ద బ్రిటిష్ ఎంపైర్' పురస్కారం.



పూర్ణిమామూర్తి తణుకు

ఆంధ్రప్రదేశ్, అమలాపురంలో పుట్టిన పూర్ణిమామూర్తి ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశారు. బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, కొత్తపేట ఆమె అత్తగారిల్లు. పెళ్లి తర్వాత భర్తతోపాటు ఇంగ్లండ్‌కు వెళ్లిన పూర్ణిమ ఎర్లీ ఇయర్స్ ఎడ్యుకేషన్‌లో సేవలందించారు. నేషనల్ డే నర్సరీస్ అసోసియేషన్ (ఎన్‌డీఎన్‌ఏ) ద్వారా ఆమె స్కూలు వయసు రాని పిల్లలకు విద్యావిధానం మీద ఇరవై ఏళ్లకు పైగా పని చేశారు. ప్రస్తుతం ఆమె ఎన్‌డీఎన్‌ఏకి చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె ఫోన్‌లో మాట్లాడుతూ ''బాల్యం అద్భుతమైనది. పాఠశాలకు వెళ్లడానికి ముందు నుంచే పిల్లలను పాఠ్యాంశాలకు తగినట్లు సిద్ధం చేయడం అనే ప్రక్రియ సున్నితంగా మొదలవ్వాలి. మెదడు వికాసంలో ఇది చాలా ప్రధానమైన విషయం. అందుకే నర్సరీల మీద ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. పిల్లలకు ఇచ్చే ఆహారం, ఫిజికల్ ఎక్సర్‌సైజ్, కరికులమ్ రూపొందించడంతోపాటు అవి యథాతథంగా అమలయ్యేటట్లు దృష్టి పెట్టాలి'' అన్నారు. బ్రిటన్‌లో ప్రభుత్వం ప్రతి నర్సరీని సందర్శిస్తుంది. తల్లి వర్కింగ్ ఉమన్ అయితే తొమ్మిది నెలల నుంచి బిడ్డ బాధ్యతను నర్సరీ తీసుకుంటుంది. ఆ బిడ్డకు మూడున్నర– నాలుగేళ్లు నిండే వరకు అంటే ప్రాథమిక పాఠశాలకు వెళ్లేవరకు నర్సరీనే సంరక్షిస్తుంది. పైగా నర్సరీలను చాలా వరకు ప్రభుత్వమే స్వయంగా నిర్వహిస్తుంది. ప్రైవేట్ నర్సరీలకు బిడ్డకు ఇంత అని ఫండింగ్ ఇస్తుంది. పూర్ణిమామూర్తి పర్యావరణం, వాతావరణ మార్పుల వంటి ఇతర సామాజికాంశాల్లో పని చేస్తున్నప్పటికీ ఎర్లీ ఎడ్యుకేషన్ కోసం కీలకమైన సేవలందించారు. మనదేశంలో కూడా నర్సరీ విధానం ఉంది. కానీ అది సామాన్యులకు అందుబాటులో లేదు. నర్సరీ ఫీజులు కూడా వేలల్లో, లక్షల్లో ఉంటున్నాయి. దాంతో అవి సంపన్నులు, ఎగువ మధ్యతరగతికి మాత్రమే పరిమితమవుతున్నాయి. ప్రభుత్వాలు నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సెంటర్లలో నాణ్యత ఉండడం లేదు. పిల్లలు ఆడుతూ పాడుతూ, తోటి పిల్లలతో అనుబంధాలు అల్లుకుంటూ నేర్చుకోవాలి. పాఠాల కంటే ముందు అందమైన సమాజాన్ని అర్థం చేసుకోవాలి. అందుకే ఎర్లీ ఇయర్స్ ఎడ్యుకేషన్ విధానంలో ఆటపాటల బడి ప్రతి ఊరికీ కావాలి.

> **ఖైదీలకు పాఠాలు**
>
> జైల్లో శిక్షననుభవిస్తున్న ఖైదీలకు చదువు చెప్పడం, చెప్పించడంలో చేసిన సేవలు చాలా సంతృప్తినిచ్చాయి. వాళ్లలో ఎక్కువ మంది కరడు కట్టిన నేరగాళ్లే. జైలు జీవితం అంటేనే వారికి తగిన శిక్షణనిచ్చి సమాజంలో గౌరవంగా జీవించేటట్లు తయారు చేయడం కదా! నేర ప్రవృత్తి నుంచి వారిని దూరం చేయాలంటే చదువుకు దగ్గర చేయడమే చక్కటి మార్గం. ఇంట్లో వాళ్లు భయపడేవాళ్లు. కానీ ప్రభుత్వం ప్రత్యేక రక్షణనిచ్చి పని చేయడానికి తగిన వెసులుబాటు కల్పించేది. నా సేవలను గుర్తించిన బ్రిటిష్ ప్రభుత్వం అత్యున్నత పౌర పురస్కారంతో గౌరవించింది. ఈ పురస్కారం అందుకున్న తొలి తెలుగు వ్యక్తిని కావడం సంతోషంగా ఉంది.
>
> - పూర్ణిమామూర్తి తణుకు,
> విద్యాకార్యకర్త, బ్రిటిష్ ప్రభుత్వ పురస్కార గ్రహీత

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

● సమ్‌థింగ్ స్పెషల్

నాలుగు చరణాలు... నాలుగు దేశాలు!

ఒక పాటలోని నాలుగు చరణాలను నాలుగు దేశాల్లో వీడియో షూట్ చేయడం సామాన్య విషయం ఏమీ కాదు. రాజ్‌కపూర్ 'శ్రీ420' సినిమాలోని 'మేరా జూతా హై జపానీ' పాట అంటే తన్యాకు ఇష్టం కాదు ప్రాణం. ఆ పాటలోని నాలుగు చరణాలను సందర్భానుసారంగా నాలుగు దేశాల్లో చిత్రీకరించి 'వావ్' అనిపించుకుంది తన్యా. జపానీ సంప్రదాయ దుస్తులు వేసుకొని జపాన్‌లో 'మేరా జూతా హై జపానీ' చరణాన్ని షూట్ చేసింది. ఇంగ్లాండ్‌లోని లండన్ బ్రిడ్జి టవర్ ఎదురుగా 'యే పత్‌లూన్ ఇంగ్లీష్‌స్తానీ' చరణాన్ని షూట్ చేసింది. రష్యన్ సంప్రదాయ దుస్తులు ధరించి రష్యాలో 'సర్ పే లాల్ టోపీ రూసీ' చరణాన్ని షూట్ చేసింది. 'ఫిర్ భీ దిల్ హై హిందుస్థానీ' చరణాన్ని ఇండియాలో చిత్రీకరించింది.ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియోకు మూడు గంటల వ్యవధిలో మూడు లక్షల వ్యూస్ వచ్చాయి.




'నేను ప్రపంచంలో ఏ మూలకు వెళ్లినా నా హృదయంలో హిందుస్థానీ నిలిచే ఉంటుంది. మూడు సంవత్సరాల క్రితమే ఈ వీడియో గురించి ఆలోచించాను' అని రాసింది తన్యా.

వంటిల్లు

ఈ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా షెఫ్ రూపా నాబర్ రూపొందించిన ఈ అందమైన, రుచికరమైన క్రియేషన్‌లతో మన జాతీయ జెండా రంగులను ప్లేట్‌లోకి తీసుకురావచ్చు. మన జాతీయ జెండా రంగులను పోలి తాజా, ఆరోగ్యకరమైన పదార్థాలతో తయారు చేసిన ఈ వంటకాలలో పోషకాలూ మెండుగా ఉన్నాయి.

త్రివర్ణ విందు

టొమాటో సాస్ వెజిటబుల్ బాల్స్



రంగురంగుల పొరలు, సాస్ మిశ్రమంతో కూడిన బేక్డ్ డిష్ ఇది.

కావలసినవి: రంగు రంగుల కూరగాయలు, బంగాళాదుంపలు, పచ్చి బఠానీలు, జీడిపప్పు, ఎండుద్రాక్ష ; టొమాటో ప్యూరీ, గరం మసాలా, బ్రెడ్ క్రంబ్స్, కార్న్‌ఫ్లోర్, టొమాటో కెచప్, క్రీమ్, చీజ్, నిమ్మరసం; వైట్ సాస్ కోసం: వెన్న, మైదా, పాలు, ఉప్పు.

తయారీ: ● ఒక వెడల్పాటి పాత్రలో కూరగాయల మిశ్రమం (బంగాళాదుంపలు, కూరగాయలు, బఠానీలు, జీడిపప్పు, ఎండుద్రాక్ష, గరం మసాలా, ఉప్పు, పచ్చిమిర్చి, సన్నగా తరిగిన కొత్తిమీర.. అన్నీ మెత్తగా చేసినది), కార్న్‌ఫ్లోర్ వేసి కలపాలి ● మిశ్రమాన్ని చిన్న చిన్న బాల్స్‌గా చేసుకోవాలి. కార్న్‌ఫ్లోర్‌లో అద్ది, బ్రెడ్‌క్రంబ్స్‌తో కోట్ చేసి, ఓవెన్‌లో ఎయిర్ ఫ్రై చేయాలి. పాన్‌లో అయితే నూనె స్ప్రే చేసి, వీటిని రెండు వైపులా కాల్చుకోవచ్చు ● టొమోటో ప్యూరీని ఉప్పు, చక్కెర, కారం, కెచప్, క్రీమ్‌తో ఉడికించి టొమాటో సాస్‌ను సిద్ధం చేసుకోవాలి ● వెన్న, మైదా, పాలు కలిపి, మిశ్రమం మృదువుగా అయ్యే వరకు ఉడికించి వైట్ సాస్‌ను తయారు చేయాలి ● బేకింగ్ డిష్‌లో, మెత్తని బఠానీల ప్యూరీ, వెజిటబుల్ బాల్స్ ఉంచి, వాటిపైన వైట్ సాస్, చీజ్, టొమాటో సాస్‌ను పొరలుగా వేయాలి ● 180 డిగ్రీల వద్ద 5–6 నిమిషాలు అవెన్ బేక్ చేసి, వెల్లుల్లి బ్రెడ్‌తో వేడి వేడిగా వడ్డించాలి.

తిరంగా పులావ్



ఆరెంజ్ రైస్ కోసం...
కప్పు వండిన బాస్మతి రైస్; టేబుల్ స్పూన్ నెయ్యి, అర టీ స్పూన్ జీలకర్ర, టీ స్పూన్ అల్లం వెల్లుల్లి పేస్ట్; టీ స్పూన్ పసుపు పొడి, కప్పు క్యారెట్ గుజ్జు; స్పూన్ కారం, రుచికి తగినంత ఉప్పు.

ఆరెంజ్ రైస్ తయారీ:
● నెయ్యి వేడి చేసి అందులో జీలకర్ర, అల్లం వెల్లుల్లి పేస్ట్, పసుపు, క్యారెట్ గుజ్జు, కారం, ఉప్పు కలపాలి. తర్వాత అందులో అన్నం వేసి, కలిపి, పక్కన పెట్టుకోవాలి.

వైట్ రైస్ కోసం...
కప్పు వండిన బాస్మతి రైస్; ఉప్పు, మిరియాలు.

వైట్ రైస్ తయారీ
● అన్నంలో తగినంత ఉప్పు, మిరియాల పొడి కలపాలి.

గ్రీన్ రైస్ కోసం...
కప్పు వండిన బాస్మతి రైస్; టేబుల్ స్పూన్ నెయ్యి, స్పూన్ పచ్చిమిర్చి పేస్ట్, స్పూన్ గరం మసాలా; కప్పు పాలకూర గుజ్జు, రుచికి తగినంత ఉప్పు.

గ్రీన్ రైస్ తయారీ
● గిన్నెలో నెయ్యి వేడి చేసి, పచ్చిమిర్చి పేస్ట్, గరం మసాలా, పాలక్ ప్యూరీ, తగినంత ఉప్పు కలపాలి. అందులో అన్నం కలిపి, పక్కనుంచాలి.

● ప్లేట్‌లోకి ముందుగా గ్రీన్ రైస్, తరువాత వైట్ రైస్, ఆ తరువాత ఆరెంజ్ రైస్ వరసగా పెట్టాలి. ఇలా పెట్టేటప్పుడు ప్రతి పొరను మృదువుగా నొక్కాలి. నీటుగా రావాలంటే ఒక అచ్చు గిన్నెలో ఒక్కో రంగు రైస్ వేస్తూ, ఆ తర్వాత అచ్చు గిన్నెను ప్లేట్‌లోకి బోర్లించి, తీసి, సెట్ చేసుకోవచ్చు.

ఆరెంజ్ కివీ కస్టర్డ్



త్రివర్ణంలో ఉన్న చల్లటి డెజర్ట్ ఇది. మీ భోజనాన్ని స్వీట్‌గా ముగించడానికి సరైన ఎంపిక.

కావలసినవి: 3 టేబుల్ స్పూన్లు వెనిల్లా కస్టర్డ్ పౌడర్; 2 కివీలను సన్నని వృత్తాకార ముక్కలుగా కట్ చేసుకోవాలి; 1 ప్యాకెట్ ఆరెంజ్ జెల్లీ; 2 కప్పుల పాలు; 2 టేబుల్ స్పూన్ల చక్కెర.

తయారీ విధానం: ● జెల్లీ పౌడర్‌ను 3 కప్పుల వేడినీటిలో కరిగించి పక్కన పెట్టుకోవాలి ●కస్టర్డ్ పౌడర్‌ను కప్పు చల్లని పాలలో కరిగించి, ఉండలు రాకుండా కలపాలి ● స్టోవ్ పాన్‌లో మిగిలిన పాలను చక్కెర కలిపి, మరిగించి, కరిగించిన కస్టర్డ్ పౌడర్ వేసి, చిక్కబడే వరకు కలిపి, పక్కన పెట్టాలి ● 8 చిన్న గాజు గ్లాసులను తీసుకోవాలి. కివీ ముక్కలను అడుగున అమర్చాలి. పైన కస్టర్డ్ పోసి, 15 నిమిషాలు రిఫ్రిజిరేటర్‌లో ఉంచాలి ● కస్టర్డ్ మీద ఆరెంజ్ జెల్లీని పోసి, మరో 30 నిమిషాలు రిఫ్రిజిరేటర్‌లో ఉంచి, చల్లగా సర్వ్ చేయాలి.



- రూపా నాబర్, షెఫ్, టీటీకే ప్రెస్టీజ్

బులియన్
(బంగారం 10 గ్రా.: వెండి కిలో) ఆగస్టు 15న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,15,340	1,02,940	1,01,240	1,02,940	1,00,800	1,01,230
బంగారం (22 క్యారెట్లు)	94,769	92,800	92,800	95,580	92.740	92,800
వెండి	1,11,709	1,17,400	1,26,100	1,17,400	1,17,300	1,27,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.



వాతావరణం మారుతోంది. మారుతున్న వాతావరణానికి అనుగుణంగా మన కిచెన్ కూడా తనను తాను మార్చుకుంటుంది. వంట పాత్రలు కూడా మారాలంటున్నాయి అధ్యయనాలు. పదార్థాలు ఎక్కువ సేపు నిలవ ఉండాలంటే, పోషకాలను కోల్పోకుండా, రుచి మారకుండా ఉంచే పాత్రల్లోనే వండాలి. ఈ గుణాలున్నవి మట్టిపాత్రలే. వండడానికి మాత్రమే కాదు, భోజనాల తర్వాత మిగిలిన పదార్థాలను మరుసటి రోజుకు నిల్వ చేయడానికి కూడా మట్టి పాత్రలను మించిన పాత్ర మరొకటి ఉండదని తాజా పరిశోధన. మట్టి మంచిదేనంటున్నాయి అధ్యయనాలు.

గట్ హెల్త్‌కు మట్టి మాటలు

గట్ హెల్త్ కోసం!

స్టీలు, ప్లాస్టిక్ పాత్రల్లో నిల్వ చేసిన పదార్థాలు ఆవిరిపట్టడం, అనారోగ్యకరమైన రసాయన చర్యలకు లోనుకావడం సహజం. మట్టిపాత్రలకు ఉండే సహజమైన రంధ్రాల ద్వారా గాలి ప్రసరిస్తుంది. పదార్థాలు ఎటువంటి మార్పులకూ లోనుకావని ఈజిప్టు పరిశోధన బృందం వెల్లడించింది. పైగా మట్టి సహజంగానే క్షారగుణం ఉంటుంది. ఇది ఆహారపదార్థాల్లోని ఆమ్లగుణాలను క్రమబద్ధీకరిస్తుంది. పీహెచ్ స్థాయులు జీర్ణక్రియకు తగిన మోతాదులో ఉండేలా మారుస్తుంది మట్టిపాత్ర. దీంతో గట్ హెల్త్ ఇంప్రూవ్ అవుతుంది. గట్ హెల్త్ కోసం ప్రపంచం పరిశోధనలు చేస్తోంది. మన సంప్రదాయ జీవనశైలి గట్ హెల్త్‌ను పరిరక్షించేదని ఆయుర్వేద నిపుణులు తెలియచేస్తున్నారు. మట్టిపాత్రల్లో వండడం వల్ల మట్టిలో సహజంగా ఉండే మినరల్స్ పదార్థాలకు తోడవుతాయి. 'మట్టి పాత్ర టాక్సిక్ ఫ్రీ, బయోడీగ్రేడబుల్' అనే ట్యాగ్ లైన్‌తో మోడరన్ కిచెన్, డైనింగ్ టేబుల్ మీద మట్టి పాత్రలు రాజ్యమేలనున్నాయి.

మంచినీటి కోసం మట్టి కుండలు మోడరన్ కిచెన్ లోకి మట్టికుండలు వచ్చాయి. తాజా అధ్యయనం ప్రకారం పదార్థాలను మట్టిపాత్రల్లో నిల్వ చేస్తే ఫ్రిజ్‌లో పెట్టాల్సిన అవసరం ఉండదు. ఇకపై ఫ్రిజ్ ఇంట్లో అలంకార వస్తువుగా మారే రోజు కూడా రావచ్చు. ఆయుర్వేదం- ఆధునిక శాస్త్రం రెండూ ఏకాభిప్రాయం వ్యక్తం చేస్తున్న విషయమిది.

మృణ్మయం- ఆరోగ్యమయం



'పృథ్వి, అప్, తేజస్, వాయు, ఆకాశము' ఇవి పంచమహాభూతాలు. వీటిలో భూమిదే ప్రథమస్థానం. చరాచర జీవరాశులకివే ఆయువుపట్టు. భూమి అంటేనే మట్టిమయం. కణాల పరిమాణాన్ని బట్టి ఇది ప్రధానంగా మూడు రకాలు. ఇసుక, ఒండ్రు, బంక మట్టి. మనం వాడే మట్టిపాత్రలకు ప్రధాన భూమిక ఒండ్రు మట్టి. అనాదిగా వస్తున్న ఆయుర్వేద శాస్త్రంలో మట్టిపాత్రల వాడకానికి మంచి విశిష్టత ఉంది. త్రాగునీరు సహజసిద్ధంగా చల్లబడాలన్నా, ఔషధాలు తయారు చేయాలన్నా, పుటాలు పెట్టాలన్నా, ఆహార ద్రవ్యాలు నిల్వ చేయాలన్నా కుండలు, మూకుడు వంటి మూతలు, వివిధ రూపాల్లో తయారు చేసిన మట్టి పాత్రలనే వాడేవారు. ఇవి నిదానంగా వేడెక్కి, నిదానంగా చల్లబడతాయి. మట్టిలో సహజంగా నిక్షిప్తమైన ఖనిజాలు కొన్ని రకాల సూక్ష్మ క్రిములు మనిషి ఆరోగ్యానికి ప్రకృతి ప్రసాదించిన వరాలు. వండిన పదార్థాలను పూర్వీకులు 'ఉట్టి'లో పెట్టి వేలాడదీసేవారు. ఆ ఉట్టిలో మట్టిపాత్రలను పెట్టేవారు. ఈ పాత్రల ఉపరితలంలోని సూక్ష్మరంధ్రాల ద్వారా పర్యావరణంతో అనుబంధమై వాటిలో ఉంచిన పదార్థాలు పాడవకుండా సహజస్థితిలోనే ఉంటాయి. ఇప్పటికీ ఉత్తరాదిలో మట్టిపాత్రలలో తేనీరు తాగే ఆచారం ఉంది. నేటి సమాజం మరలా నాటి సంప్రదాయాలకు మొగ్గుచూపడం హర్షణీయం.

– ప్రొఫెసర్ డాక్టర్ వృద్ధుల లక్ష్మీ నరసింహ శాస్త్రి,
విశ్రాంత ప్రధానాచార్యులు, సంయుక్త అదనపు సంచాలకులు, ఆయుష్ విభాగం, ఆంధ్రప్రదేశ్

ఒక విషయం



ఆరోగ్యానికి విటమిన్ సి చాలా అవసరం. విటమిన్ సి ఎక్కువగా ఉన్న నిమ్మ, కమలాఫలం, కివీ, పాలకూర, ఉసిరి, బ్రొకోలీ, టమాట, అడవి ఉసిరి, కాలీఫ్లవర్ తినడం వల్ల ప్లేట్‌లెట్స్ కౌంట్ పెరుగుతుందని తేలింది. ఫ్రీ రాడికల్స్ వల్ల జరిగే నష్టాన్ని తగ్గించి కౌంట్‌ని పెంచడంలో ఈ ఆహార పదార్థాలు బాగా ఉపయోగపడతాయి. ప్లేట్‌లెట్స్ కౌంట్ తగ్గిన వారు సమస్యని పరిష్కరించుకునేందుకు వీటిని ఆహారంలో భాగం చేసుకోవచ్చు. ఒకవేళ తినడం కష్టం అనుకుంటే వీటితో సలాడ్ చేసి భోజనానికి ముందుగా తీసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఇక కమలా ఫలాల్ని జ్యూస్‌లా చేసుకొని తాగేయొచ్చు.



ష్... హాయిగా బజ్జోండి...

లేకుంటే వందకు పైగా అనారోగ్యాలు

తీవ్రమైన నిద్ర లేమి పరోక్ష ప్రభావాలకు మించి, మరణానికి ప్రధానమైన 15 కారణాలలో ఆరు దీర్ఘకాలిక నిద్ర లేమితో నేరుగా ముడిపడి ఉన్నాయి, వాటిలో...

అధిక రక్తపోటు: రాత్రి ఐదు గంటల కన్నా తక్కువ నిద్రపోవడం వల్ల రక్తపోటు (అధిక రక్తపోటు) ప్రమాదం రెండు రెట్లు పెరుగుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి, ఇది గుండె జబ్బులకు మాత్రమే కాకుండా దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధి వంటి వాటికి కూడా ప్రధాన కారణం.

గుండె జబ్బులు: రాత్రిపూట ఐదు గంటల కంటే తక్కువ నిద్రపోవడం వల్ల కూడా కొరోనరీ ఆర్టరీ వ్యాధి వచ్చే ప్రమాదం 200% నుండి 300% వరకు పెరుగుతుంది..

డయాబెటిస్: తక్కువ నిద్ర అలవాట్లు టైప్ 2 డయాబెటిస్ ప్రమాదాన్ని 1.5 రెట్లు పెంచుతాయి, ఇది ప్రస్తుతం యునైటెడ్ స్టేట్స్‌లో మరణానికి ఎనిమిదవ ప్రధాన కారణం.

స్ట్రోక్: కొన్ని అధ్యయనాలు రాత్రిపూట ఆరు గంటల కంటే తక్కువ నిద్రపోవడం వల్ల స్ట్రోక్ ప్రమాదం 400% కంటే ఎక్కువగా పెరుగుతుందని సూచిస్తున్నాయి, ముఖ్యంగా అబ్‌స్ట్రక్టివ్ స్లీప్ అప్నియా ఉన్నప్పుడు.

తగ్గిన రోగనిరోధక ప్రతిస్పందన: తగినంత నిద్ర లేకపోవడం వల్ల ఇన్ఫెక్షన్లకు రోగనిరోధక ప్రతిస్పందన తగ్గుతుంది. ఇందులో టీకాలకు రోగనిరోధక ప్రతిస్పందన తగ్గడం కూడా ఉంటుంది, దీని వలన తక్కువ రక్షణ ప్రభావాలు ఏర్పడతాయి. అంతేకాదు, ఒక రోజు నిద్ర లేమి మీ రోగనిరోధక వ్యవస్థను మార్చివేస్తుంది, శరీరంలో వాపులను పెంచుతుందని ది జర్నల్ ఆఫ్ ఇమ్యునాలజీ చెబుతోంది.

కొన్ని క్యాన్సర్లు: శరీర సర్కాడియన్ లయలో అంతరాయాలు క్యాన్సర్ ఉత్పరివర్తనాలను నిరోధించడంలో సహాయపడే మెలటోనిన్ స్థాయిలను తగ్గించడం ద్వారా రొమ్ము, పెద్దప్రేగు, అండాశయ, ప్రోస్టేట్ క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతాయి.

కొన్ని అధ్యయనాలు మీరు కోల్పోయే ప్రతి అదనపు గంట నిద్రకు, మీ ప్రమాదం మరో 10% పెరుగుతుందని సూచిస్తున్నాయి.

సో... వెయ్యేల.. హాయిగా కంటినిండా నిద్రపోతే సరికదా! ఒకవేళ నిద్రపట్టకపోతే వెంటనే వైద్యుని సంప్రదించడం మంచిది.



టీ.. తిన్న వెంటనే వద్దు!

చాలా మందికి పొద్దున్నే లేవగానే వేడి వేడి టీ కడుపులో పడనిదే బండి నడవనని మొరాయిస్తుంది. అంతెందుకు, సంతోషంలోనూ, దుఃఖంలోనూ, ఉల్లాసంలోనూ, ఉత్సాహంలోనూ, ఆందోళనలోనూ, ఆనందలోనూ కూడా గరమ్ గరమ్ చాయ్ పడనిదే పొద్దుపోదు. ఆవేశం వచ్చినా, ఆగ్రహం వచ్చినా దానిని చల్లార్చేది టీనే. కొందరయితే భోజనం చేయగానే టీ తాగుతారు. అయితే అది అంత మంచి అలవాటు కాదంటున్నారు నిపుణులు. ఎందుకంటే ఆహారం తిన్న వెంటనే టీ తాగడం వల్ల తిన్న ఆహారంలోని పోషకాలు వంటికి పట్టవట. అంతేకాదు, టీలో ఉండే టానిన్లు, పాలీఫెనోల్స్ రక్తంలో ఐరన్ కలవకుండా అడ్డుకుంటాయట. అంతేకాదు, జీర్ణరసాలు ఊరకుండా కూడా చేస్తాయట. అందుకే అన్నం తిన్న వెంటనే కాకుండా కనీసం గంటా గంటన్నర వరకు ఆగి అప్పుడు టీ తాగడం కొంతమేరకు నయం అని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

ఫ్యాటీ లివర్‌కు బొప్పాయితో చెక్

కాలేయంలో అదనపు కొవ్వు పేరుకుని పోయే ఫ్యాటీ లివర్ వ్యాధికి ఇతర ఔషధాలకన్నా బొప్పాయి మంచి మందని పరిశోధనలు చెబుతున్నాయి. అందుకు వారేం చెబుతున్నారో చూద్దాం...

బొప్పాయిలో విటమిన్ సి, బీటా–కెరోటిన్, ఫ్లేవనాయిడ్లు వంటి యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఈ పోషకాలు కాలేయాన్ని ఆక్సీకరణ ఒత్తిడి నుండి రక్షిస్తాయి,

లివర్ డిటాక్స్‌కు మద్దతు

బొప్పాయిలో పపైన్ మరియు కైమోపాపైన్ వంటి ఎంజైమ్‌లు ఉంటాయి, ఇవి జీర్ణక్రియకు సహాయపడతాయి. పరోక్షంగా కాలేయం నిర్విషీకరణ విధులకు మద్దతు ఇస్తాయి. ఈ ఎంజైమ్‌లు ప్రోటీన్‌లను విచ్ఛిన్నం చేయడంలో, కాలేయంపై జీర్ణ భారాన్ని తగ్గించడంలో సహాయపడతాయి.

కాలేయ ఎంజైమ్ స్థాయిలను మెరుగుపరుస్తుంది

బొప్పాయి వంటి కాలేయానికి అనుకూలమైన పండ్లను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల కాలేయ ఎంజైమ్ ప్రొఫైల్స్ మెరుగుపడతాయని అధ్యయనాలు సూచిస్తున్నాయి.



వాపును తగ్గిస్తుంది

బొప్పాయిలోని కొన్ని సమ్మేళనాలు కాలేయ కణజాలలో వాపును తగ్గించడంలో సహాయపడతాయి.

బొప్పాయిలోని పోషక విలువలు

తక్కువ కేలరీలు, అధిక ఫైబర్ కంటెంట్, సహజ చక్కెరలు, అనారోగ్యకరమైన కొవ్వులు లేదా కొలెస్ట్రాల్ ఉండకపోవడమనే లక్షణాలు కొవ్వు కాలేయ ఆహారాన్ని అనుసరించే వారికి బొప్పాయిని ఆదర్శవంతమైన పండుగా చేస్తాయి.

ఎంత తినాలి?

మితంగా తినడం చాలా ముఖ్యం. రోజుకు ఒక చిన్న గిన్నె బొప్పాయి – ఉదయం లేదా మధ్యాహ్నం స్నాక్‌గా – సహజ చక్కెరలపై ఓవర్ లోడ్ లేకుండా అవసరమైన పోషకాలను అందిస్తుంది. కూరగాయలు, లీన్ ప్రోటీన్లు, తృణధాన్యాలు అధికంగా ఉండే సమతుల్య ఆహారంతో దీన్ని ఎల్లప్పుడూ జత చేయండి.

హిందుస్తాన్... హిందుస్తాన్...



• సన్నీ డియోల్

మేజర్ కుల్దీప్ సింగ్‌గా బాలీవుడ్ సీనియర్ నటుడు సన్నీ డియోల్ వెండితెరపైకి మళ్లీ వస్తున్నారు. సన్నీ డియోల్ హీరోగా నటించిన తాజా చిత్రం 'బోర్డర్ 2'. వరుణ్ ధావన్, దిల్జిత్ సింగ్, అహన్ శెట్టి, మేధా రాణా, మోనా సింగ్, సోనమ్ బజ్వా ఈ చిత్రంలోని ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ చిత్రంలో మేజర్ కుల్దీప్ సింగ్ పాత్రలో కనిపిస్తారు సన్నీ డియోల్. శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'బోర్డర్ 2' సినిమాలోని సన్నీ డియోల్ పాత్ర తాలూకు మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. 'హిందుస్తాన్... హిందుస్తాన్... మేరీ జాన్ హిందుస్తాన్' అనే పాటతో ఈ మోషన్ పోస్టర్ సాగుతుంది. అనురాగ్ సింగ్ దర్శకత్వంలో భూషణ్ కుమార్, క్రిషణ్‌కుమార్, జేపీ దత్తా, నిధి దత్తా నిర్మించిన ఈ చిత్రం వచ్చే ఏడాది జనవరి 22న విడుదల కానుంది. అయితే ఈ సినిమాను తొలుత జనవరి 23న రిలీజ్ చేయాలనుకున్నారు. కానీ ఒకరోజు ముందుగా... జనవరి 22న విడుదల చేస్తున్నట్లుగా అధికారికంగా ప్రకటించారు. ఇక 1971లో జరిగిన ఇండియా–పాకిస్తాన్ యుద్ధం నేపథ్యంలో సన్నీ డియోల్ హీరోగా నటించిన 'బోర్డర్' (1997) సినిమాకు సీక్వెల్‌గా 'బోర్డర్ 2' రూపొందింది. ''27 సంవత్సరాల క్రితం ఇచ్చిన ఓ వాగ్దానాన్ని నెరవేర్చుకోవడానికి ఓ సైనికుడు తిరిగి వస్తున్నాడు'' అంటూ ఈ సినిమాను ప్రకటించిన సమయంలో ఈ చిత్రబృందం పేర్కొంది.


తలుపులు తెరవబడ్డాయి



• బెల్లంకొండ సాయిశ్రీనివాస్, అనుపమ

''నమస్కారం... ఈ రోజు శుక్రవారం... 9-8-1989, ఆకాశవాణి తలుపులు తెరవబడ్డాయి... పునఃప్రసారాలు నేటితో మొదలు'... ఈ డైలాగ్స్ 'కిష్కింధపురి' సినిమా టీజర్‌లోనివి. బెల్లంకొండ సాయిశ్రీనివాస్, అనుపమా పరమేశ్వరన్ హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'కిష్కింధపురి'. అర్చన సమర్పణలో కౌశిక్ పెగల్లపాటి దర్శకత్వంలో సాహు గారపాటి నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబరు 12న విడుదల కానుంది. శుక్రవారం ఈ సినిమా టీజర్ విడుదల చేశారు. హారర్, థ్రిల్, మిస్టరీ మేళవింపుతో రూపొందిన ఈ సినిమా ప్రధానంగా సువర్ణ మాయ రేడియో స్టేషన్ నేపథ్యంలో సాగుతుందని తెలుస్తోంది. ఈ సినిమాకు సంగీతం: సామ్ సీఎస్.

శ్రీకృష్ణుడి యుద్ధం



• 'శ్రీ కృష్ణ అవతార్ ఇన్ మహోబా' పోస్టర్

చిత్ర పరిశ్రమలో తొలిసారిగా శ్రీ కృష్ణుడిని ఒక యుద్ధవీరుడి పాత్రలో చూపించనున్నట్లు 'శ్రీ కృష్ణ అవతార్ ఇన్ మహోబా' చిత్రబృందం ప్రకటించింది. ముకుంద్ పాండే కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో అభయ్ చరణ్ ఫౌండేషన్–శ్రీజీ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్స్‌పై రూపొందనున్న ఈ చిత్రానికి 'శ్రీ కృష్ణ అవతార్ ఇన్ మహోబా' టైటిల్‌ను ప్రకటించారు. ''ఇస్కాన్–ఢిల్లీకి చెందిన సీనియర్ ప్రీచర్ 'జితామిత్ర ప్రభు శ్రీ' ఆశీస్సులతో ఈ చిత్రం రూపొందుతోంది. 11–12వ శతాబ్దాల నాటి 'మహోబా' సాంస్కృతిక వైభవాన్ని, అలాగే భగవాన్ శ్రీ కృష్ణుడి దివ్యత్వాన్ని, ధీరత్వాన్ని, ఆధ్యాత్మిక ప్రభావాన్ని చూపించేలా ఈ సినిమా ఉంటుంది. పాన్ వరల్డ్ ప్రాజెక్ట్‌గా ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. ప్రపంచస్థాయి సాంకేతిక నిపుణులతో తెరకెక్కుతున్న ఈ చిత్రం చరిత్ర, సాంస్కృతిక వారసత్వం, ఆధ్యాత్మికతను కలగలుపుతుంది. నటీనటులు, సాంకేతిక బృందంతో పాటు పూర్తి వివరాలను త్వరలో వెల్లడిస్తాం'' అని చిత్రబృందం తెలిపింది. ఈ చిత్రానికి నిర్మాణ నిర్వహణ: అనిల్ వ్యాస్.

క్లాప్... క్లాప్



• రాధాకృష్ణ, త్రివిక్రమ్, వెంకటేశ్, సురేష్‌బాబు

వెంకటేశ్ హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనుందంటూ గత కొన్నాళ్లుగా వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. ఆ వార్త నిజమే. వీరిద్దరి కాంబినేషన్‌లో కొత్త చిత్రానికి క్లాప్ కొట్టారు. హారిక– హాసినీ క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) నిర్మించనున్న ఈ సినిమా ప్రారంభోత్సవం శుక్రవారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో ఆరంభమైంది. నిర్మాత సురేష్‌బాబు కెమెరా స్విచ్చాన్ చేశారు. ''ప్రేక్షకుల హృదయాల్లో చిరస్మరణీయంగా నిలిచే చిత్రానికి తొలి అడుగు పడింది. త్రివిక్రమ్ ప్రత్యేకమైన కథా శైలిలో రూపుదిద్దుకున్న పాత్రలో వెంకటేశ్‌ని చూడటం ప్రేక్షకులకు మరచిపోలేని అనుభూతిని అందించనుంది. స్వచ్ఛమైన వినోదం, లోతైన భావోద్వేగాలతో నిండిన కుటుంబ కథా చిత్రాలను అందించడంలో త్రివిక్రమ్ పేరుగాంచారు. ఇప్పుడాయన అన్ని వర్గాల ప్రేక్షకులు మెచ్చే మరో చిత్రాన్ని అందించడానికి సిద్ధమవుతున్నారు. త్వరలో ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఇక వెంకటేశ్ హీరోగా నటించిన 'నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి' వంటి హిట్ చిత్రాలకు త్రివిక్రమ్ కథ, సంభాషణలు అందించిన విషయం గుర్తుండే ఉంటుంది.

అడవుల్లో సాహసం



• సంయుక్త

సాహసం చేయడానికి సై అంటూ కథానాయిక సంయుక్త అడవి బాట పట్టారు. దట్టమైన అడవుల్లో ఆమె ట్రెక్కింగ్‌కి వెళ్లారు. అందులోనూ వర్షం కురుస్తుండగా ధైర్యంగా ఈ సాహస యాత్ర చేశారు సంయుక్త. ఈ సాహస యాత్రకి సంబంధించిన ఫొటోలను అభిమానుల కోసం తన సోషల్ మీడియా వేదికగా షేర్ చేశారామె. ''దట్టమైన పచ్చని అడవిలో ప్రకృతి ఒడిలో ట్రెక్కింగ్ అంటే సాహసమే. పైగా వర్షం కురుస్తుండగా ట్రెక్కింగ్‌కి వెళ్లడం ఎంతో మధురానుభూతి. ఈ ట్రెక్కింగ్‌లో ఎన్నో చెప్పలేనన్ని సంతోషాలు, థ్రిల్‌కి గురిచేసే అంశాలున్నాయి. ఇలాంటి గొప్ప అనుభవాలు మీకు ఎదురయ్యాయా?'' అంటూ రాసుకొచ్చారు సంయుక్త. ఇక ఆమె నటిస్తున్న తాజా సినిమాల విషయానికొస్తే... తెలుగులో 'అఖండ 2, స్వయంభు, నారీ నారీ నడుమ మురారి, విజయ్ సేతుపతి హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వం వహిస్తున్న చిత్రంలో నటిస్తున్నారు. అలాగే హిందీ, తమిళ, మలయాళ సినిమాలు చేస్తున్నారు.

పంద్రాగస్టుకి పదిహేను చిత్రాలకు శ్రీకారం



• సుమన్, ఓం సాయిప్రకాశ్, రేలంగి నరసింహారావు, రామసత్యనారాయణ

భీమవరం టాకీస్ పతాకంపై ఇప్పటికే 114 చిత్రాలను నిర్మించిన తుమ్మలపల్లి రామసత్యనారాయణ ఒకేసారి 15 చిత్రాలకు శ్రీకారం చుట్టారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఈ పదిహేను సినిమాల ప్రారంభోత్సవం వైభవంగా జరిగింది. 'జస్టిస్ ధర్మ' చిత్రానికి యండమూరి వీరేంద్రనాథ్ దర్శకత్వం వహించనుండగా, 'నాగపంచమి'కి ఓం సాయిప్రకాశ్, 'నా పేరు పవన్ కల్యాణ్'కి జేకే భారవి, 'టాపర్'కి ఉదయ్ భాస్కర్, 'కేపీహెచ్‌బీ కాలనీ'కి తల్లాడ సాయికృష్ణ, 'పోలీస్ సింహం'కి సంగ కుమార్, 'అవంతిక–2'కి శ్రీరాజ్ బళ్లా, 'యండమూరి కథలు'కి రవి బసర, 'బి.సి' (బ్లాక్ కమాండో)కి మోహన్ కాంత్, 'హనీ కిడ్స్'కి హర్ష, 'సావాసం'కి ఏకరి సత్యనారాయణ, 'డార్క్ స్టోరీస్'కి కృష్ణ కార్తీక్, 'మనల్ని ఎవడ్రా ఆపేది'కి బి. శ్రీనివాసరావు, 'ది ఫైనల్ కాల్'కి ప్రణయ్ రాజ్ వంగరి, 'అవతారం' సినిమాకి డా. సతీష్ దర్శకత్వం వహించనున్నారు. తుమ్మలపల్లి రామసత్యనారాయణ మాట్లాడుతూ– ''2025, ఆగస్టు 15న కొబ్బరికాయలు కొట్టిన ఈ 15 చిత్రాలను 2026 ఆగస్టు 15కి పూర్తి చేసేలా సన్నాహాలు చేస్తున్నాం. దేశవ్యాప్తంగా పేరొందిన 9 సంస్థలు ఈ ప్రారంభోత్సవాన్ని వరల్డ్ రికార్డ్ బుక్స్‌లో నమోదు చేశాయి'' అని చెప్పారు.

ఇద్దరు దేవదాసులు!



• రాశీ సింగ్

కాలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో జరిగే ట్రయాంగిల్ లవ్ స్టోరీతో రూపొందిన చిత్రం 'ఒక పార్వతి ఇద్దరు దేవదాసులు'. ఈ చిత్రంలో సిద్ధార్థ్ మీనన్, దిలీప్ హీరోలుగా, రాశీ సింగ్ హీరోయిన్‌గా నటించారు. తోట రామకృష్ణ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం ఇది. ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. ''పార్వతి దేవదాసుల ప్రేమకథకు ఎంతటి క్రేజ్ ఉందో తెలిసిందే. ఇప్పుడు 'ఒక పార్వతి... ఇద్దరు దేవదాసులు' టైటిల్‌తో ఓ విభిన్నమైన చిత్రాన్ని ప్రేక్షకులకు అందించనున్నాం. ముఖ్యంగా యువతీ యువకులను అలరించేలా ఈ చిత్రం ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది. రఘుబాబు, కెశి రెడ్డి రాజ్‌కుమార్, వీరశంకర్, గౌతం రాజు తదితరులు నటించిన ఈ సినిమాకు సంగీతం: మోహిత్ రహమానియాక్, కెమెరా: శ్రీనివాసరాజు.

సూప్ రెడీ



• రమణ్, వర్షా విశ్వనాథ్

వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందిన సినిమా 'మటన్ సూప్'. 'విట్‌నెస్ ది రియల్ క్రైమ్' అనేది ఉపశీర్షిక. ఈ చిత్రంలో రమణ్, వర్షా విశ్వనాథ్ హీరో హీరోయిన్లుగా నటించారు. రామచంద్ర వట్టికూటి దర్శకత్వంలో అలుక్కా స్టూడియోస్, శ్రీ వారాహి ఆర్ట్స్, భవిష్య విహార్ చిత్రాలు పతాకంపై మల్లిఖార్జున ఎలికా (గోపాల్), అరుణ్ చంద్ర వట్టికూటి, రామకృష్ణ సనపల ఈ సినిమాను నిర్మించారు. శుక్రవారం ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ను నిర్మాత కేఎస్ రామారావు విడుదల చేసి, మాట్లాడుతూ– ''మటన్ సూప్' సినిమా టైటిల్ పోస్టర్ బాగుంది. ఈ సినిమా పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను'' అని అన్నారు. ''సినిమా అద్భుతంగా వస్తోంది. మంచి కథతో రూపొందించిన మా సినిమాను ప్రేక్షకులు ఆదరిస్తారని ఆశిస్తున్నాం'' అని పేర్కొన్నారు రమణ్. ''మా సినిమా రిలీజ్‌కి రెడీ అవుతోంది'' అని తెలిపారు మల్లిఖార్జున, రామకృష్ణ సనపల, దర్శకుడు రామచంద్ర. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: పర్వతనేని రాంబాబు.

సాక్షి బిజినెస్

శనివారం
16-8-2025

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు (గురువారం ముగింపు)	
సెన్సెక్స్ ▲ 58	80,598
నిఫ్టీ ▲ 12	24,631

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	21,647	▽	63
డోజోన్స్	45,034	▲	123
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,142	▽	35
డాక్స్	24,382	▲	4
హాంగ్‌సెంగ్	3,697	▲	30
నికాయ్	43,378	▽	625

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	87.10	88.12
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	117.00	119.99
€	యూరో	ఎస్‌బీఐ	101.20	103.93
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	59.00	60.51
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	56.28	58.53
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	65.89	69.57
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.46	23.96
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.95	24.19
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.33	13.15

ఐపీవోకి ఆర్‌ఎస్ బ్రదర్స్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దుస్తుల రిటైలింగ్ సంస్థ ఆర్‌ఎస్‌బీ రిటైల్ ఇండియా (ఆర్‌ఎస్ బ్రదర్స్) పబ్లిక్ ఇష్యూకి రానుంది. ఇందుకు సంబంధించి మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. దీని ప్రకారం రూ. 500 కోట్ల విలువ చేసే షేర్లను తాజాగా జారీ చేయనుండగా, 2.98 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్‌ఎస్) కింద ప్రమోటర్లు విక్రయించనున్నారు. ఇష్యూ ద్వారా సమీకరించిన నిధుల్లో రూ. 275 కోట్లను నిర్దిష్ట రుణాల చెల్లింపునకు, రూ. 118 కోట్ల మొత్తాన్ని ఆర్‌ఎస్ బ్రదర్స్, సౌతిండియా షాపింగ్ మాల్ ఫార్మాట్లలో కొత్త స్టోర్స్‌ను ఏర్పాటు చేసేందుకు కంపెనీ వినియోగించుకోనుంది. సంస్థకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటకలో మొత్తం 73 స్టోర్స్ ఉన్నాయి. సౌతిండియా షాపింగ్ మాల్, ఆర్‌ఎస్ బ్రదర్స్, కాంచీపురం నారాయణి సిల్క్స్, డి రాయల్, వేల్యూ జోన్ హైపర్‌మార్ట్ పేరిట వివిధ ఫార్మాట్లలో స్టోర్స్ నిర్వహిస్తోంది. పొట్టి వెంకటేశ్వర్లు, సీర్న రాజమౌళి, తిరువీధుల ప్రసాద రావు తదితరులు ప్రమోటర్లుగా ఉన్నారు. 2024–25లో కంపెనీ రూ. 2,694 కోట్ల ఆదాయం, రూ. 104 కోట్ల లాభం నమోదు చేసింది.

ఇక జీఎస్‌టీలో రెండే శ్లాబులు!

5%, 18% మాత్రమే...

- లగ్జరీ వస్తువులపై మాత్రం 40% ప్రత్యేక రేటు
- కేంద్ర ఆర్థిక శాఖ ప్రతిపాదన...
- దీనిపై మంత్రుల బృందం అధ్యయనం
- సెప్టెంబర్ జీఎస్‌టీ కౌన్సిల్ భేటీలో నిర్ణయం!
- అనేక వస్తువులు, సేవల ధరలు భారీగా తగ్గే చాన్స్



న్యూఢిల్లీ: సామాన్యులకు వస్తు సేవలు మరింత అందుబాటులోకి రానున్నాయి. ఇందుకు వీలుగా వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ)లో రెండు రేట్ల విధానాన్ని కేంద్ర ఆర్థిక శాఖ ప్రతిపాదించింది. స్టాండర్డ్ (ప్రామాణిక), మెరిట్ (యోగ్యత) కింద వీటిని వర్గీకరిస్తూ రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో కూడిన ప్యానెల్‌కు నివేదించింది. వీటిపై అధ్యయనం అనంతరం జీఎస్‌టీ కౌన్సిల్ ముందు ప్యానెల్ తన సిఫారసులు ఉంచనుంది. దాదాపు అన్ని రకాల వస్తు, సేవలు రెండు రేట్ల పరిధిలోనే ఉంటాయి. విలాస, హానికారక వస్తువులపై మాత్రం 40% ప్రత్యేక రేటు అమలు కానుంది. దీంతో నిత్యావసరాలు, వాహనాలు సహా ఎన్నో రకాల వస్తు, సేవల రేట్లు గణనీయంగా తగ్గనున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలోనే కొత్త విధానాన్ని అమలు చేయాలన్న సంకల్పాన్ని ఆర్థిక శాఖ వ్యక్తం చేసింది. ప్రధాని మోదీ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలో జీఎస్‌టీ చట్టాన్ని సంస్కరించనున్నట్టు ప్రకటించారు. పన్నుల భారం గణనీయంగా తగ్గుతుందంటూ, దీన్ని దీపావళి కానుకగా అభివర్ణించారు. రోజువారీ వినియోగ వస్తువుల రేట్లు చౌకగా మారనున్నట్టు చెప్పారు. దీనివల్ల ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందన్నారు. ప్రధాని ప్రసంగం తర్వాత ఆర్థిక శాఖ ప్రకటన విడుదల చేసింది.

జీఎస్‌టీలోనే ఎన్నో పన్నులు..

ప్రస్తుతం జీఎస్‌టీ పరిధిలో 5, 12, 18, 28 శాతం రేట్లు అమల్లో ఉన్నాయి. కొన్నింటిని జీఎస్‌టీ నుంచి పూర్తిగా మినహాయించగా, విలాస వస్తువులు, సిగరెట్లు వంటి హానికారక (సిన్‌గూడ్స్) వస్తువులపై 28 శాతం రేటుకు అదనంగా కాంపెన్సేషన్ సెస్ (రాష్ట్రాల కోసం ఉద్దేశించిన పరిహార పన్ను) అమలవుతోంది. 5% పన్ను పరిధిలో 21 శాతం వస్తువులు ఉన్నాయి. 12% పన్ను రేటు కింద 19 శాతం.. 18% పన్ను పరిధిలో 44% వస్తు సేవలు ఉన్నాయి. 12% శ్లాబును ఎత్తివేసి ఇందులో ఉన్న వస్తు, సేవలను 5, 18 శాతం రేట్ల పరిధిలోకి మార్చొచ్చని తెలుస్తోంది. 12 శాతం రేటు పరిధిలోని 99 శాతం వస్తువులు 5 శాతం పరిధిలోకి వెళ్లనున్నట్టు.. 28 శాతం పరిధిలోని 90 శాతం వస్తు సేవలు 18 శాతం రేటు పరిధిలోకి వెళ్లనున్నట్టు సమాచారం. పొగాకు ఉత్పత్తులు, ఆన్‌లైన్ గేమింగ్ తదితర కొన్ని 40 శాతం పన్ను పరిధిలో ఉంటాయి. ముఖ్యంగా ఆటోమొబైల్, టెక్స్‌టైల్స్, ఫెర్టిలైజర్స్, పునరుత్పాదక ఇంధనాలు, హస్తకళలు, వ్యవసాయం, ఆరోగ్యం, బీమా తదితర రంగాలకు ప్రయోజనం కలగనుంది. ముఖ్యంగా బంగారంపై 3 శాతం ప్రత్యేక రేటు అమలవుతోంది. దీన్ని అలాగే కొనసాగిస్తారా? లేక 5 శాతం రేటు పరిధిలోకి తెస్తారా? అన్న దానిపై ఇప్పటికి స్పష్టత లేదు. రేట్ల తగ్గింపు కారణంగా రాష్ట్రాలకు ఆదాయం తగ్గినట్టయితే దీన్ని ఎలా భర్తీ చేస్తారో చూడాలి. అలాగే, విలాసవంత, హానికారక వస్తువులపై 28 శాతం పన్నుకు అదనంగా అమలు చేస్తున్న కాంపెన్సేషన్ సెస్సు గడువు 2026 మార్చి 31తో ముగియనుంది. ఈ రూపంలో వచ్చే ఆదాయం ఆ తర్వాత తగ్గనుంది. అయితే, దీన్ని ఎలా సర్దుబాటు చేస్తారన్నది ఆసక్తిగా మారింది. అయితే, రేట్ల తగ్గింపుతో వినియోగం పెరిగి, అదనపు ఆదాయం సమకూరుతుందన్నది ఆర్థిక శాఖ అంచనా. 2017 జూలై 1 నుంచి అమల్లోకి వచ్చిన జీఎస్‌టీ విధానంలో తొలిసారి పెద్ద ఎత్తున మార్పు చోటుచేసుకోనుంది. జీఎస్‌టీ రేట్ల క్రమబద్ధీకరణ ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తుందని, దీన్ని సరైన సమయంలో సరైన చర్యగా ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు.

సెప్టెంబర్‌లో కీలక భేటీ..



కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన రాష్ట్రాల మంత్రులతో కూడిన జీఎస్‌టీ కౌన్సిల్ వచ్చే నెలలోనే సమావేశం కానుంది. ఈ సమావేశంలోనే జీవిత, ఆరోగ్య బీమాలపై పన్ను తగ్గింపు సహా జీఎస్‌టీలో రేట్ల క్రమబద్ధీకరణపై నిర్ణయం తీసుకునే అవకాశాలున్నట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. పన్నుల తగ్గింపు వల్ల సమాజంలోని అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని, వినియోగం పెరిగి ఆర్థిక వ్యవస్థకు ఊతం లభిస్తుందని అంచనా వేస్తోంది. గుర్తింపు పరమైన వివాదాలను తొలగిస్తుందని, కొన్ని రంగాలకు ఇన్వర్టెడ్ డ్యూటీ స్ట్రక్చర్‌ను సరిచేస్తుందని.. రేట్ల పరమైన స్థిరత్వం ఏర్పడి వ్యాపార నిర్వహణను సులభతరం చేస్తుందని భావిస్తోంది. రాష్ట్రాల విస్తృత ఏకాభిప్రాయంతో తదుపరి తరం సంస్కరణలను అమలు చేయనున్నట్టు కేంద్ర ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. ''జీఎస్‌టీ కౌన్సిల్ తన తదుపరి భేటీలో మంత్రుల బృందం సిఫారసులపై చర్చిస్తుంది. సాధ్యమైనంత త్వరగా అమలు చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటాం. దీంతో ఆశించిన ప్రయోజనాలు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే సాకారమవుతాయి''అని పేర్కొంది.

గ్రామీణ మార్కెట్లలో ఎఫ్‌ఎంసీజీ అమ్మకాల జోరు..

- పట్టణాల కంటే రెట్టింపు వృద్ధి
- జూన్ త్రైమాసికంలో 8.4 శాతం
- నీల్సన్‌ఐక్యూ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: ఎఫ్‌ఎంసీజీ అమ్మకాలు పట్టణాల కంటే గ్రామీణ మార్కెట్లలో మెరుగ్గా ఉన్నట్టు డేటా విశ్లేషణ సంస్థ నీల్సన్‌ఐక్యూ వెల్లడించింది. జూన్ త్రైమాసికంలో పట్టణ ప్రాంతాల్లో ఎఫ్‌ఎంసీజీ అమ్మకాలు 4.6 శాతం పెరగ్గా.. దీనికి రెట్టింపు స్థాయిలో 8.4 శాతం మేర గ్రామీణ మార్కెట్లలో వృద్ధి నమోదైనట్టు తన తాజా నివేదికలో తెలిపింది. వరుసగా ఆరో త్రైమాసికంలో అమ్మకాల వృద్ధి (పరిణామం పరంగా) పట్టణాల కంటే గ్రామీణ మార్కెట్లలో అధికంగా ఉన్నట్టు పేర్కొంది. ఈ ఏడాది మార్చి త్రైమాసికంతో పోల్చి చూస్తే మాత్రం జూన్ క్వార్టర్‌లో గ్రామీణ – పట్టణ ప్రాంతాల మధ్య వృద్ధి పరమైన అంతరం తగ్గినట్టు వెల్లడించింది. మొత్తం మీద జూన్ త్రైమాసికంలో ఎఫ్‌ఎంసీజీ పరిశ్రమ అమ్మకాల్లో (విలువ పరంగా) 13.9 శాతం వృద్ధిని నమోదు చేసింది. పట్టణాల్లో స్థిరమైన వినియోగానికి తోడు, గ్రామీణ ప్రాంతాల్లో పుంజుకున్న వినియోగం ఇందుకు మద్దతుగా నిలిచాయి. అమ్మకాల్లో 6%, ధరల పెంపు రూపంలో 7.4% చొప్పున వృద్ధిని సాధించినట్టు, చిన్న ప్యాకెట్లకు వినియోగదారులు ప్రాధాన్యం ఇస్తున్నట్టు నీల్సన్‌ఐక్యూ నివేదిక తెలిపింది. చిన్న పట్టణాల్లో అమ్మకాలు పుంజుకుంటున్నట్టు పేర్కొంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

16-8-2025	
విశాఖ	515–00
చిత్తూరు	548–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	510–00
విజయవాడ	520–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	485–00
వరంగల్	487–00
రిటైల్ ధర	5.45

బీఎండబ్ల్యూ కార్ల ధరల పెంపు

సెప్టెంబర్ 1 నుంచి అమలు



న్యూఢిల్లీ: జర్మన్ లగ్జరీ కార్ల తయారీ సంస్థ బీఎండబ్ల్యూ కార్ల ధరలు పెంచింది. సెప్టెంబర్ 1 నుంచి అన్ని రకాల మోడళ్ల ధరలను 3 శాతం వరకు పెంచుతున్నట్టు ప్రకటించింది. ఫారెక్స్ మార్కెట్లో కరెన్సీ ఆటుపోట్లు, అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలో ఒత్తిళ్లు, పెరిగిన రవాణా వ్యయాల కారణంగా ధరలు పెంచాల్సి వచ్చిందని బీఎండబ్ల్యూ గ్రూపు ఇండియా ప్రెసిడెంట్, సీఈవో విక్రమ్ పవాహ్ తెలిపారు. ప్రస్తుత పండుగ సీజన్‌లో మరిన్ని నూతన మోడళ్లను మార్కెట్లోకి విడుదల చేస్తామన్నారు. ఈ జనవరి 1, ఏప్రిల్ 1 తర్వాత 2025లో కంపెనీ కార్ల ధరలు పెంచడం ఇది మూడోసారి. బీఎండబ్ల్యూ ఇండియా రూ.46.9 లక్షలు మొదలుకొని రూ.2.6 కోట్ల లోపు ధర కలిగిన మోడళ్లు విక్రయిస్తుంది.

సాక్షి స్పోర్ట్స్



సత్యన్‌కు సింగిల్స్ టైటిల్

వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) ఫీడర్ వియెన్‌టియాని ఓపెన్ టోర్నీలో భారత టీటీ స్టార్ ప్లేయర్ సత్యన్ జ్ఞానశేఖరన్ విజేతగా నిలిచాడు. లావోస్ రాజధాని వియెన్‌టియానిలో జరిగిన ఈ టోర్నీలో **సత్యన్ పురుషుల సింగిల్స్ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు.** శుక్రవారం ఫైనల్లో ప్రపంచ 99వ ర్యాంకర్, రెండో సీడ్ సత్యన్ 11-4, 11-6, 12-10తో టాప్ సీడ్, ప్రపంచ 95వ ర్యాంకర్ రోయిచి యోషియామా (జపాన్)పై గెలుపొందాడు. విజేతగా నిలిచిన సత్యన్‌కు 1000 డాలర్లు (రూ. 87 వేలు), 125 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. **గత నెలలో డబ్ల్యూటీటీ కంటెండర్ లాగోస్ టోర్నమెంట్‌లో ఆకాశ్ పాల్‌తో కలిసి డబుల్స్ టైటిల్ గెలిచిన సత్యన్... ఈ టోర్నీలో అదే జోరు కొనసాగించాడు. ఈ టోర్నీ క్వార్టర్ ఫైనల్లో ఆకాశ్‌పై సత్యన్ విజయం సాధించాడు. 2024 డబ్ల్యూటీటీ ఫీడర్ బీరుట్ టోర్నమెంట్ గెలిచిన తొలి భారత ప్యాడ్లర్‌గా రికార్డు సృష్టించిన సత్యన్... ఇప్పుడు ఇదే విభాగంలో రెండో టైటిల్ ఖాతాలో వేసుకున్నాడు.**

కొత్త 'క్రీడా విధానం'తో రాత మారిపోతుంది

స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని మోదీ



న్యూఢిల్లీ: దేశంలోని క్రీడా వ్యవస్థలో పలు మార్పులను ఆశిస్తూ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన నేషనల్ స్పోర్ట్స్ పాలసీ (ఎన్‌ఎస్‌పీ) బిల్‌కు ఇటీవలే పార్లమెంట్ ఉభయ సభల్లో ఆమోదం లభించింది. త్వరలోనే చట్టంగా మారనున్న ఈ బిల్లుతో క్రీడా రంగం మరింత అభివృద్ధి చెందుతుందని ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్షించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం ఇచ్చిన ప్రసంగంలో ఆయన భారత క్రీడల అభివృద్ధి గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. 'అభివృద్ధిలో క్రీడలు కూడా ఒక భాగం. ఒకప్పుడు ఆటలు ఆడితే తల్లిదండ్రులు కోప్పడే పరిస్థితి నుంచి ఇప్పుడు ప్రోత్సహించే వరకు పరిస్థితి మారడం సంతోషంగా ఉంది. ఇది మంచి సంకేతం. భారతీయ కుటుంబాల్లో క్రీడలు కూడా అంతర్భాగం కావడం నాకు గర్వంగా అనిపిస్తోంది. భారత భవిష్యత్తుకు కూడా ఇది చాలా మంచిది' అని ప్రధాని వ్యాఖ్యానించారు. కొత్తగా అమల్లోకి రాబోయే స్పోర్ట్స్ పాలసీ దేశంలో పలు మార్పులకు శ్రీకారం చుడుతుందని, జవాబుదారీతనం పెంచుతుందని ఆయన అన్నారు. 'క్రీడలను మరింతగా ప్రోత్సహించేందుకే పలు దశాబ్దాల తర్వాత కొత్త పాలసీని తీసుకొచ్చాం. పాఠశాలలనుంచి ఒలింపిక్స్ వరకు ఇది ఆటలను అభివృద్ధి చేసేలా ఉంటుంది. కోచింగ్, ఫిట్‌నెస్, మౌలిక సౌకర్యాల కల్పనకు సంబంధించి ఒక వ్యవస్థను దీని ద్వారా రూపొందిస్తున్నాం. ఇది దేశంలోని మారుమూలలకు వెళ్లి పని చేస్తుంది' అని మోదీ స్పష్టం చేశారు. ఫిట్‌నెస్, క్రీడల ప్రాధాన్యత గురించి వివరిస్తూ ప్రధాని... ప్రస్తుతం దేశంలో ఊబకాయం అతి పెద్ద సమస్యగా మారిందని, దీనిలో మార్పుల తేవాలంటే నూనెల వినియోగాన్ని తక్కువ చేయాలని సూచించారు.

చివరి ఓవర్‌లో ఛేదించి...

వన్డే సిరీస్ సొంతం చేసుకున్న భారత మహిళల 'ఎ' జట్టు

- రెండో వన్డేలో 2 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా మహిళల 'ఎ' జట్టుపై విజయం
- రాధ, యస్తిక, తనూజ అర్ధ సెంచరీలు
- మూడు వికెట్లతో రాణించిన మిన్ను మణి


యస్తిక

బ్రిస్బేన్: ఆస్ట్రేలియా పర్యటనలో టి20 సిరీస్ కోల్పోయిన భారత మహిళల 'ఎ' జట్టు... వన్డే సిరీస్‌లో సత్తా చాటింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలుండగానే 2–0తో కైవసం చేసుకుంది. శుక్రవారం హోరాహోరీగా సాగిన రెండో వన్డేలో భారత 'ఎ' జట్టు 2 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా మహిళల 'ఎ' జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా 'ఎ' జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 265 పరుగులు చేసింది. స్టార్ బ్యాటర్ అలీసా హీలీ (87 బంతుల్లో 91; 8 ఫోర్లు, 3 సిక్స్‌లు) త్రుటిలో సెంచరీ చేజార్చుకోగా... కిమ్ గార్త్ (41 నాటౌట్; 4 ఫోర్లు) కీలక ఇన్నింగ్స్ ఆడింది. భారత బౌలర్లలో మిన్ను మణి 46 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టగా ... సైమా ఠాకూర్ 30 పరుగులిచ్చి 2 వికెట్లు తీసింది. టిటాస్ సాధు, రాధా యాదవ్, ప్రేమ రావత్, తనూజ కన్వర్‌లకు ఒక్కో వికెట్ లభించింది. అనంతరం లక్ష్యఛేదనలో భారత మహిళల 'ఎ' జట్టు 49.5 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 266 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్ రాధ యాదవ్ (78 బంతుల్లో 60; 5 ఫోర్లు, 1 సిక్స్), యస్తిక భాటియా (71 బంతుల్లో 66; 9 ఫోర్లు), తనూజ కన్వర్ (57 బంతుల్లో 50; 3 ఫోర్లు) హాఫ్‌సెంచరీలతో కదంతొక్కారు. షఫాలీ వర్మ (4), ధారా గుజ్జర్ (0), తేజల్ హసబ్నిస్ (19), రాఘ్వీ బిస్త్ (14) విఫలమయ్యారు. సహచరుల నుంచి పెద్దగా సహకారం లభించకపోయినా... ఆరంభంలో యస్తిక ఇన్నింగ్స్‌ను నడిపించింది. ఆ తర్వాత ఆ బాధ్యతను రాధ యాదవ్ సక్రమంగా నిర్వర్తించగా... ఆఖర్లో తనూజ అదరగొట్టింది. అర్ధశతకం అనంతరం రాధా యాదవ్ అవుట్ కావడంతో భారత జట్టు 193/7తో నిలిచింది. ఇక ఛేదన కష్టమే అనుకుంటున్న తరుణంలో స్పిన్ బౌలింగ్ ఆల్‌రౌండర్ తనూజ కన్వర్ చక్కటి ఆటతీరుతో చెలరేగింది. ప్రేమ రావత్ (33 బంతుల్లో 32 నాటౌట్; 3 ఫోర్లు)తో కలిసి ఎనిమిదో వికెట్‌కు 68 పరుగులు జోడించి జట్టును విజయం దిశగా నడిపించింది. చివరి ఓవర్ తొలి బంతికి తనూజ అవుట్ కావడంతో ఉత్కంఠ నెలకొన్నా... ప్రేమ రావత్ విజయానికి కావాల్సిన 5 పరుగులు చేసి మరో బంతి మిగిలుండగానే జట్టును గెలిపించింది. ఇదే వేదికపై బుధవారం జరిగిన తొలి వన్డేలో భారత 'ఎ' జట్టు 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఇక ఇరు జట్ల మధ్య నామమాత్రమైన మూడో వన్డే ఆదివారం ఇక్కడే జరగనుంది.


తనూజ
మిన్ను మణి
రాధ యాదవ్

తొలి రౌండ్‌లో స్నేహిత్ పరాజయం



మాల్మో (స్వీడన్): యూరోప్ స్మాష్ వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) టోర్నమెంట్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న హైదరాబాద్ ప్లేయర్ సూరావజ్జుల స్నేహిత్‌కు నిరాశ ఎదురైంది. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వాలిఫయింగ్ పోటీల్లో స్నేహిత్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాడు. ప్రపంచ 178వ ర్యాంకర్ డానియల్ బెర్జోసా (స్పెయిన్)తో జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో ప్రపంచ 104వ ర్యాంకర్ స్నేహిత్ 10-12, 5-11, 11-7, 5-11తో ఓడిపోయాడు. 33 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో స్నేహిత్ తన సర్వీస్‌లో 21 పాయింట్లు, ప్రత్యర్థి సర్వీస్‌లో 10 పాయింట్లు సాధించాడు. మహిళల క్వాలిఫయింగ్ సింగిల్స్ విభాగంలో భారత ప్లేయర్లు దియా చిటాలె, యశస్విని గోర్పడే, స్వస్తిక ఘోష్ రెండో రౌండ్‌లోకి ప్రవేశించారు. దియా 11-7, 11-8, 5-11, 11-2తో జెస్సికా (అమెరికా)పై,యశస్విని 11-5, 11-9, 11-7తో బ్రియానా (ప్యూర్టో రికో)పై, స్వస్తిక 11-6, 11-8, 11-9తో సాలీ మోలాండ్ (అమెరికా)పై గెలిచారు. భారత్‌కే చెందిన మనిక బత్రా, ఆకుల శ్రీజలకు మహిళల సింగిల్స్ మెయిన్ 'డ్రా'లో నేరుగా చోటు లభించింది.

మరిన్ని క్రీడా వార్తలు | సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

అర్జున్‌కు మూడో స్థానం



చెన్నై: చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్‌లో ప్రపంచ ఆరో ర్యాంకర్, భారత గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ మూడో స్థానాన్ని దక్కించుకున్నాడు. శుక్రవారం ముగిసిన ఈ టోర్నీలో అనీశ్ గిరి (నెదర్లాండ్స్), అర్జున్, కార్తికేయన్ మురళీ (భారత్) 5 పాయింట్లతో ఉమ్మడిగా రెండో స్థానంలో నిలిచారు. అయితే మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించారు. దాంతో అనీశ్‌కు రెండో స్థానం, అర్జున్‌కు మూడో స్థానం, కార్తికేయన్‌కు నాలుగో స్థానం ఖరారయ్యాయి. 7 పాయింట్లతో జర్మనీ గ్రాండ్‌మాస్టర్ విన్సెంట్ కీమెర్ చాంపియన్‌గా నిలిచాడు. భారత్‌కే చెందిన గ్రాండ్‌మాస్టర్లు నిహాల్ సరీన్ 4.5 పాయింట్లతో ఐదో స్థానంలో, విదిత్ 4 పాయింట్లతో ఏడో స్థానంలో, ప్రణవ్ 3 పాయింట్లతో తొమ్మిదో స్థానంలో నిలిచారు. మొత్తం పది మంది గ్రాండ్‌మాస్టర్ల మధ్య తొమ్మిది రౌండ్లపాటు ఈ టోర్నీని నిర్వహించారు. శుక్రవారం జరిగిన చివరిదైన తొమ్మిదో రౌండ్ గేముల్లో కీమెర్ 41 ఎత్తుల్లో రే రాబ్సన్ (అమెరికా)పై, అనీశ్ గిరి 33 ఎత్తుల్లో జోర్డెన్ (నెదర్లాండ్స్)పై గెలిచారు. అర్జున్–కార్తికేయన్ గేమ్ 49 ఎత్తుల్లో... విదిత్ (భారత్)–లియాంగ్ (అమెరికా) గేమ్ 31 ఎత్తుల్లో 'డ్రా'గా ముగిశాయి. విజేత కీమెర్‌కు రూ. 25 లక్షలు... అనీశ్‌కు రూ. 15 లక్షలు... అర్జున్‌కు రూ. 10 లక్షలు ప్రైజ్‌మనీగా లభించాయి. ఇదే వేదికపై జరిగిన చాలెంజర్స్ టోర్నీలో భారత గ్రాండ్ మాస్టర్ ప్రాణేశ్ 6.5 పాయింట్లతో విజేతగా నిలిచాడు. తద్వారా వచ్చే ఏడాది చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ టోర్నీకి అర్హత సాధించాడు. హైదరాబాద్ ప్లేయర్ హారిక 1.5 పాయింట్లతో 9వ స్థానంలో నిలిచింది.



ఖమ్మం జిల్లా పొలిశెట్టిగూడెం వద్ద మున్నేటికి కొత్తగా ఏర్పాటు చేసిన ఫ్లడ్ గేజ్

ముంపెంత? ముప్పెంత?

ఫ్లడ్‌గేజ్‌ల ఏర్పాటు, సాంకేతికతతో ముందే అంచనా..

వరద ఉధృతిని అంచనా వేసేలా మున్నేరు, ఆకేరు, పాలేరు వద్ద ఏర్పాటు

ఎగువ జిల్లాల అధికారులతో వాట్సాప్ గ్రూప్

గత అనుభవాల నేపథ్యంతో చర్యలు

సాంకేతిక నిఘా, ప్రణాళికతో ఖమ్మం జిల్లా యంత్రాంగం

సాక్షిప్రతినిధి, ఖమ్మం: వరద ఉధృతిని అంచనా వేసేందుకు ఖమ్మం జిల్లా యంత్రాంగం ఫ్లడ్‌గేజ్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. దీనికితోడు సాంకేతికతను జోడించి ఎగువ జిల్లాల అధికారుల సహకారం తీసుకుంటోంది. గత ఏడాది అనుభవాల దృష్ట్యా మున్నేరు, ఆకేరు, పాలేరు పరీవాహక ప్రాంత జిల్లాల్లో ఫ్లడ్‌గేజ్‌లను ఏర్పాటు చేసింది.

జల రక్కసి..: గతేడాది ఆగస్టు 31, సెప్టెంబర్ 1వ తేదీన వచ్చిన వరదతో ఖమ్మం జిల్లాలోని మున్నేరు, ఆకేరు, పాలేరు పరీవాహక ప్రాంతంలోని ఖమ్మం, పాలేరు, మధిర నియోజకవర్గాలు తీవ్ర నష్టాన్ని చవిచూశాయి. మున్నేరు గత ఏడాది ఆగస్టు 31న రాత్రి 9 గంటలకు 11 అడుగులు ఉండగా.. తెల్లవారేకల్లా 19 అడుగులకు, ఉదయం 11 గంటలకు 36 అడుగులపైకి చేరడంతో ఖమ్మం నగరం, ఖమ్మంరూరల్, తిరుమలాయపాలెం, కూసుమంచి మండలాల పరీవాహక ప్రాంతాల ప్రజలు విలువైన సామగ్రి కూడా తీసుకునే అవకాశం లేక తీవ్రంగా నష్టపోయారు. ఆ సమయాన మున్నేటికి దాదాపు 42 అడుగుల మేర వరద వచ్చినట్టుగా అధికారులు అంచనా వేశారు.

సరికొత్తగా..: ఫ్లడ్ గేజ్‌లు లేకపోవడంతో ఏర్లు, వాగులు పొంగినప్పుడు ఎంత వరద వస్తుందనే అంచనా వేయడం సాధ్యం కాదు. ఇప్పటికే ఖమ్మం కాల్వొడ్డు ప్రాంతంలో మున్నేరుకు ఫ్లడ్ గేజ్ ఉండగా, మున్నేరు, ఆకేరు పరీవాహకంలో కూడా ఫ్లడ్‌గేజ్‌లు ఏర్పాటు చేశారు. ఫలితంగా ఎగువ నుంచి వచ్చే వరద ఆధారంగా ఇక్కడ ఎన్ని అడుగుల మేర పెరుగుతుందో పరిశీలిస్తూ ప్రజలను అప్రమత్తం చేయొచ్చని చెబుతున్నారు. మున్నేటిపై ఖమ్మంరూరల్ మండలంలో పోలిశెట్టిగూడెం, తీర్థాల వద్ద, ఆకేరుపై ఖమ్మం రూరల్ మండలం తనగంపాడు వద్ద ఫ్లడ్ గేజ్‌లు పెట్టారు.

ఎక్కడ.. ఏం జరుగుతోంది..: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, జనగామ, హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్ మున్నేరు, ఆకేరు పరీవాహక జిల్లాలుగా ఉన్నాయి. ఇక్కడ నమోదయ్యే వర్షపాతం తెలుసుకుంటే దిగువకు ఎంత వరద వస్తుందనేది అంచనా వేయొచ్చు. ఈ సమాచారం ఎప్పటికప్పుడు తెలుసుకునేలా ఈ జిల్లాల అధికారులతో వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేశారు. మొత్తంగా ఆరు జిల్లాలకు చెందిన 75 మంది అధికారులు గ్రూప్‌లో ఉండగా.. ప్రతిరోజు ఈ రెండు పరీవాహకాల్లో వర్షం, వరద, చెరువుల్లో నీటి నిల్వల వివరాలు ఇచ్చిపుచ్చుకుంటున్నారు. పాలేరు పరీవాహకంలో జనగామ, మహబూబాబాద్, ఖమ్మం, సూర్యాపేట జిల్లాలోని ఏడు మండలాల నుంచి కూడా వర్షపాతం, చెరువుల్లో నీటి నిల్వ వివరాలు ఎప్పటికప్పుడు తెప్పించుకుంటున్నారు.

గూగుల్ ఎర్త్ మ్యాప్‌తో గుర్తింపు

మున్నేరు, ఆకేరు వాగులకు వచ్చే వరదతో ఖమ్మం నగరంతోపాటు ఎన్ని ప్రాంతాలు ముంపునకు గురవుతాయనే అంశాన్ని అధికారులు గూగుల్ ఎర్త్ మ్యాప్ ద్వారా గుర్తిస్తు న్నారు. మున్నేటికి ఎన్ని అడుగుల వరద వస్తే ఏఏ కాలనీలు ముంపునకు గురవుతాయో జోన్ల వారీగా గుర్తి స్తారు. ఖమ్మం మీదుగా వెళుతున్న మున్నేటికి 16 అడుగుల మేరకు వరద వస్తే ఎన్ని కాలనీలు.. 25, 32 అడుగుల వరకు వస్తే ఇంకెన్ని కాలనీల్లో ప్రభావం ఉంటుందో మ్యాపింగ్ చేసి వరద ఆధారంగా ఆయా ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేలా ఏర్పాట్లు చేశారు.

మున్నేటికి వచ్చే వరద ఆధారంగా జోన్ల వారీగా గుర్తించిన ప్రభావిత ప్రాంతాలు (గూగుల్ ఎర్త్ మ్యాప్)



ఎనిమిది ఆలయాల అభివృద్ధికి
డీపీఆర్ సిద్ధం

యాదగిరి మాసపత్రిక, గరుడ ట్రస్టు, ఈ-ఆఫీస్‌ను ప్రారంభించిన మంత్రి సురేఖ



గరుడ ట్రస్టును ప్రారంభిస్తున్న మంత్రి సురేఖ. చిత్రంలో విప్ ఐలయ్య, ఎమ్మెల్సీ మల్లన్న, కలెక్టర్ హనుమంతరావు తదితరులు

యాదగిరిగుట్ట: రాష్ట్రంలో ఎనిమిది ఆలయాల అభివృద్ధికి డీపీఆర్ సిద్ధం చేస్తున్నామని దేవాదాయ, ధర్మాదాయశాఖ మంత్రి కొండా సురేఖ వెల్లడించారు. శుక్రవారం ఆమె యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం యాదగిరి ఆధ్యాత్మిక మాసపత్రిక, ఈ-ఆఫీస్, గరుడ ట్రస్టును ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సురేఖ మాట్లాడుతూ కల్యాణ మండపం నిర్మాణం, గోశాల ఏర్పాటు ప్రతిపాదనలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. బీర్ల ఐలయ్య మాట్లాడుతూ యాదాద్రిలో వేద పాఠశాలను రూ.46 కోట్లతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు కొండా సురేఖకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, కలెక్టర్ హనుమంతరావు, ఈఓ వెంకట్రావ్, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, డిప్యూటీ ఈఓ భాస్కరశర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో ఐటీడీఏ పీవో
సతీమణి ప్రసవం

మగబిడ్డ జననం.. పీవో దంపతులకు అభినందనలు



వైద్య బృందంతో పీవో రాహుల్ దంపతులు

భద్రాచలం టౌన్: భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ తన సతీమణి మనీషా కు భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో ప్రసవం చేయించారు. ఈమేరకు ఆమె శుక్రవారం ఉదయం పండంటి మగబిడ్డకు జన్మనిచ్చారు. ప్రభుత్వ ఆస్పత్రు ల్లో మెరుగైన వైద్యం అందుతోందని ప్రజలకు భరోసా కల్పించేందుకు.. గతంలో భద్రాద్రి కలెక్టర్‌గా పనిచేసిన అనుదీప్, ప్రస్తుత కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తమ సతీమణులకు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవం చేయించడం తెలిసిందే. స్వాతంత్ర్య దినోత్సవం రోజు బిడ్డకు జన్మనిచ్చిన రాహుల్ దంపతులకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఏరియా ఆస్పత్రి వైద్యులు రామకృష్ణ, విజయ్ బృందం ఆధ్వర్యంలో మనీషాకు ప్రసవం చేశారు.

రైతు బర్త్‌డేకు యూరియా గిఫ్ట్



రైతు బర్త్‌డేకు యూరియాను గిఫ్ట్‌గా అందజేస్తున్న స్నేహితులు

వేములవాడ రూరల్: బర్త్‌డేలకు బహుమతులు ఇస్తారు. కేక్‌లు కట్ చేస్తారు. కానీ ఓ రైతు బర్త్‌డేకు కొరతగా ఉన్న యూరియాను గిఫ్ట్‌గా అందించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లికి చెందిన మారు కిషన్‌రెడ్డి బర్త్‌డే సందర్భంగా శుక్రవారం ప్రధాన కూడలి వద్ద స్నేహితులు, రైతులు వేడుకలు నిర్వహించారు. ఇటీవల కొరత ఏర్పడిన యూరియాను గిఫ్ట్‌గా ఇచ్చారు.

ఆ మూలికా ఔషధాలతో ముప్పు!

సాక్షి, సాగుబడి: హైదరాబాద్‌లోని హెర్బల్ డ్రగ్స్ దుకాణాల్లోని ఔషధాలు సూక్ష్మ క్రిముల తో కలుషితం అయిపోయాయట. భారతీయ వైద్య పరిశోధనామండలి (ఐసీఎంఆర్)కి చెందిన జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్) శాస్త్రవేత్తల తాజా పరిశోధనల్లో వెల్లడైన వాస్తవాలివి. ఎన్ఐఎన్ పాథాలజీ, మైక్రో బయాలజీ విభాగం శాస్త్రవేత్త ముళ్లపూడి వెంకట సునీత సారథ్యంలో 9 మంది శాస్త్ర వేత్తల బృందం ఈ అధ్యయనం నిర్వహించింది. ఇది తాజా అధ్యయనం. అధ్యయన ఫలితాలతో కూడిన సమగ్ర వ్యాసం సైన్స్ డైరెక్ట్ వారి జర్నల్ ఆఫ్ హెర్బల్ మెడిసిన్‌లో ప్రచురితమైంది.

ముప్పు ఏమిటి?

ప్రజలు విరివిగా వాడే 170 రకాల మూలికా ఔషధాల నమూనాలను హైదరాబాద్ మహానగరం పరిధిలోని పలు రిటైల్ మందుల షాపుల నుంచి సేకరించి అధ్యయనం చేశారు. అమెరికాకు చెందిన ఎఫ్‌డీఏ బ్యాక్టీరియల్ అనలిటికల్ మాన్యువల్ సూచించిన ప్రామాణిక పద్ధతుల్లో మైక్రోబయలాజికల్ రిస్క్ అసెస్‌మెంట్ చేశారు. ఈ ఔషధాలు రోజుకు ఎంత మేరకు జబ్బును కలిగిస్తాయో తెలుసుకోవడానికి రిస్క్ రేంజర్ టూల్‌ను వినియోగించారు.

ముప్పు ఎందుకు?

ఈ మూలికా ఔషధాల్లో ఎస్చెరిచియా కోలి, ఫీకల్ కోలిఫామ్స్, స్టెఫిలోకాకస్, సూడోమోనాస్, సాల్మొనెల్లా, ఈస్ట్, మౌల్డ్స్ తదితర సూక్ష్మ క్రిములు యూఎస్ ఫార్మకోపియా అనుమతించే పరిమితులకు మించిన స్థాయిలో కనిపించాయి. 170 మూలికా ఔషధాలపై ఎఫ్‌డీఏ ప్రమాణాల ప్రకారం పరీక్షలు చేస్తే అందులో 52.4% ఔషధ నమూనాల్లో అధిక స్థాయిలో సూక్ష్మక్రిములు ఉన్నట్లు వెల్లడైంది. 110 ఘన రూపంలో ఉన్న నమూనాలను పరీక్షిస్తే వీటిలో 63.6% ఔషధ నమూనాల్లో ప్రమాణాలకు మించి సూక్ష్మక్రిములు ఉన్నాయి.

సగానికిపైగా వాటిలో అధిక సూక్ష్మక్రిములు

హైదరాబాద్ దుకాణాల్లో కలుషిత హెర్బల్ డ్రగ్స్

170 ఔషధాలు పరీక్షించిన ఐసీఎంఆర్ – ఎన్ఐఎన్



ప్రామాణిక పరీక్షల్లో ఔషధాల పనితీరు:

100% ఫెయిల్ అయినవి:
పొడులు: అశ్వగంధ, శతావరి, బ్రహ్మీ, త్రికటు, శొంఠి, యష్టిమధు.
మాత్రలు: శతావరి

25-75% ఫెయిల్ అయినవి:
పొడులు: తానికాయ, లోధ్ర బెరడు, త్రిఫల, ఉసిరి, కరక్కాయ.
మాత్రలు: అశ్వగంధ, త్రిఫల

ఎంత ముప్పు?

కలుషిత మూలికా ఔషధాలను వాడే వినియోగదారుల ఆరోగ్యానికి ఎంత మేరకు ముప్పు వాటిల్లే అవకాశం ఉంది? అనే అంశాన్ని రిస్క్ రేంజర్ టూల్ ద్వారా శాస్త్రవేత్తలు అంచనా కట్టారు. ఈ సూక్ష్మక్రిములతో కూడిన మూలికా ఔషధాలను తీసుకునే వారు జీర్ణకోశ వ్యాధులు, తీవ్రమైన ఇన్ఫెక్షన్ల బారిన పడే ముప్పు ఉందని వారు హెచ్చరిస్తున్నారు.

కింకర్తవ్యం?!

ఈ అధ్యయనం ద్వారా వెల్లడైన గణాంకాల ఆధారంగా మన దేశంలో మూలికా ఔషధాల తయారీ, నిల్వ పద్ధతులకు సంబంధించి కఠినమైన నాణ్యతా ప్రమాణాలను రూపొందించే ఆస్కారం ఉందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

ఆస్తులు పంచుకుని అమ్మను గెంటేశారు

కరీంనగర్ జిల్లా తాడికల్‌లో తల్లిని వదిలేసిన కొడుకులు

- ఎస్ఐ కౌన్సెలింగ్‌తో తీసుకెళ్లిన పెద్దకొడుకు

శంకరపట్నం: కష్టపడి సంపాదించిన 20 ఎకరాలను ముగ్గురు కొడుకులకు పంచిస్తే.. తల్లికి బుక్కెడు బువ్వ పెట్టేందుకు నిరాకరించి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వదిలేశారు. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం తాడికల్‌లో శుక్రవారం జరిగిన ఈ సంఘటన వివరాలు పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వెంగల లచ్చవ్వ (90), మల్లయ్య దంపతులకు ముగ్గురు కొడుకులు రాజకొమురయ్య, రాజయ్య, సమ్మయ్య, కూతురు ఉన్నారు. సంపాదించిన 20 ఎకరాల వ్యవసాయ భూమిని ముగ్గురికి సమానంగా పంచిచ్చారు. ముప్పయ్యేళ్ల క్రితం మల్లయ్య మరణించాడు. కొన్నాళ్ల క్రితం వరకు లచ్చవ్వ సొంతంగా వండుకునేది. వయసు పైబడటంతో.. కొంతకాలంగా ముగ్గురు కొడుకులు నెలకొకరు చొప్పున తల్లిని పోషిస్తున్నారు. తిండిపెట్టే విషయంలో విభేదాలు రావడంతో.. ఒక్కొక్క కుమారుడు పదిరోజుల చొప్పున చూసుకుంటున్నారు. లచ్చవ్వకు వచ్చే ఆసరా పింఛన్‌ను తమ్ముడు సమ్మయ్య వాడుకుంటున్నాడని, ఆ డబ్బులు లెక్కచేసి ఇస్తేనే ఇంట్లోకి రావాలని పెద్దకొడుకు రాజకొమురయ్య శుక్రవారం మెలిక పెట్టాడు. ఇంతలో 10 రోజుల వంతు పూర్తయిన రెండో కోడలు.. లచ్చవ్వను ఆటోలో తీసుకొచ్చి గ్రామ పంచాయతీ వద్ద వదిలిపెట్టి వెళ్లిపోయింది. కేశవపట్నం ఎస్ఐ శేఖర్‌రెడ్డి అక్కడికి చేరుకుని కౌన్సెలింగ్ చేయడంతో.. తల్లిని పెద్దకొడుకు రాజకొమురయ్య ఇంటికి తీసుకెళ్లాడు.



గ్రామ పంచాయతీ భవనం ఎదుట వెంగల లచ్చవ్వ



బక్రిచేప్యాల పాఠశాలలోని బర్త్ డే గార్డెన్‌లో మొక్కల సంరక్షణలో విద్యార్థులు

పసి మొగ్గల.. బర్త్ డే గార్డెన్

పుట్టినరోజున కేక్ కటింగ్‌లకు బదులు మొక్కలు నాటుతున్న విద్యార్థులు

బక్రి చేప్యాల ప్రభుత్వ పాఠశాల, లచ్చపేట మోడల్ స్కూల్‌లో గార్డెన్లు

పర్యావరణ పరిరక్షణలో ఆదర్శంగా నిలుస్తున్న విద్యార్థులు

సాక్షి, సిద్దిపేట: పుట్టినరోజు వస్తుందంటేనే పిల్లలు ఎక్కడ లేని సంతోషంలో మునిగిపోతారు. బర్త్‌డే రోజు ఒక మంచిపని చేయాలని కొందరు ప్రయత్నిస్తుంటారు. ఆ ఆలోచనలోంచి అందమైన బర్త్ డే గార్డెన్‌లు పురుడు పోసుకున్నాయి. సిద్దిపేట జిల్లా బక్రి చేప్యాల జెడ్పీఉన్నత పాఠశాలతోపాటు దుబ్బాకలోని లచ్చపేట మోడల్ స్కూల్‌లోని విద్యార్థుల బర్త్ డే గార్డెన్‌లు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. బక్రి చేప్యాల పాఠశాల ఉపాధ్యాయులు, లచ్చపేట మోడల్ స్కూల్ సీసీఆర్ టీ (సెంటర్ ఫర్ కల్చరల్, రిసోర్స్ అండ్ ట్రైనింగ్) క్లబ్ ఈ ఏడాది జూన్ 16న బర్త్ డే గార్డెన్‌లు ఏర్పాటు చేశాయి. పాఠశాలల్లో ఎవరి పుట్టిన రోజు ఎప్పుడు అనేది తెలుసుకునేందుకు ప్రత్యేక రికార్డు బుక్‌ను ఏర్పాటు చేశారు. ప్రతి విద్యార్థి పుట్టిన రోజు నాడు వారిచేత టీచర్ల గార్డెన్‌లో మొక్కను నాటిస్తున్నారు. ప్రతీ రోజు బ్రేక్ సమయంలో ఎవరి మొక్కకు ఆ విద్యార్థి నీళ్లు పోసేలా చర్యలు తీసుకుంటున్నారు. అక్కడి టీచర్లు కూడా తమ పుట్టిన రోజు సందర్భంగా గార్డెన్‌లో మొక్కలు నాటుతున్నారు. గార్డెన్ల పర్య వేక్షణ బాధ్యతను ప్రత్యేకంగా ఎంపిక చేసిన టీచర్లకు అప్పగించారు.

పర్యావరణ పరిరక్షణపై బాధ్యత పెంచాలని..



బర్త్ డే అంటే కేక్ కట్ చేయటం, చాక్లెట్లు పంచటమే కాదు... మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలనే ఉద్దేశంతో బర్త్‌డే గార్డెన్‌ను ఏర్పాటు చేశాం. విద్యార్థుల్లో పర్యావరణం పట్ల బాధ్యత, ప్రేమ పెంచాలనే దీనిని ప్రారంభించాం. విద్యార్థి దశ నుంచే పర్యావరణ పరిరక్షణకు కృషి చేసేలా ప్రయత్నిస్తున్నాం. గ్రామ పంచాయతీ నర్సరీ నుంచి మొక్కలు తెప్పించి నాటిస్తున్నాం.

- నాగేందర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు, బక్రి చేప్యాల

పుట్టినరోజు సందర్భంగా మొక్క నాటాను



మా పాఠశాలలో ఏర్పాటుచేసిన బర్త్ డే గార్డెన్‌లో నా 14వ బర్త్‌డే సందర్భంగా గులాబీ మొక్కను నాటాను. రోజూ బ్రేక్ సమయంలో మొక్కకు నీళ్లు పోస్తున్నా. బర్త్ డే రోజు మొక్క నాటడం ఎంతో సంతోషంగా ఉంది.

-రక్షిత, 9వ తరగతి, బక్రి చేప్యాల

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

కడలి గర్భంలో త్రివర్ణ రెపరెపలు!



సముద్ర గర్భంలో జాతీయ జెండా ఎగురవేస్తున్న దృశ్యం

79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రుషికొండ బీచ్ వద్ద శుక్రవారం జాతీయ జెండా రెపరెపలాడింది. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సహకారంతో లివ్ ఇన్ అడ్వెంచర్స్ ఆధ్వర్యంలో సముద్ర గర్భంలో జాతీయ జెండాను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లివ్ ఇన్ వ్యవస్థాపకుడు బి.బలరామనాయుడు మాట్లాడుతూ ఎనిమిదిమంది డైవర్ల ఆధ్వర్యంలో కడలి గర్భంలో మన దేశ స్వాతంత్ర్య దినోత్సవాన్ని నిర్వహించడం దేశ భక్తికి హద్దుల్లేవన్న సంగతి గుర్తు చేసిందన్నారు.

- కొమ్మాది(విశాఖ జిల్లా)

గుండెపోటుతో హెచ్ఎం మృతి



స్వప్న (ఫైల్)

ఆమదాలవలస: శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలం గోపీనగర్‌లో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎన్.స్వప్న (45) గుండెపోటుతో గురువారం మృతి చెందారు. పని ఒత్తిడితోనే ఆమె చనిపోయారని సహోద్యోగులు చర్చించుకుంటున్నారు. బుధవారం విధులకు హాజరైన ఆమెకు అదే రోజు రాత్రి తీవ్ర గుండె నొప్పి రావడంతో రాజాం నుంచి కుటుంబ సభ్యులు శ్రీకాకుళం మెడికవర్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె గురువారం తుదిశ్వాస విడిచారు. స్వప్నకు భర్త నాగరాజు, కుమార్తె హనీ ఉన్నారు. భర్త నాగరాజు శ్రీకాకుళం ఎస్‌బీఐ ఏడీబీలో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తుండగా కుమార్తె ఇంటర్ చదువుతోంది. ఉపాధ్యాయురాలు 2023లో ఆమదాలవలస మండలానికి బదిలీపై వచ్చారు. అప్పటి నుంచి ఆ పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేవారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఒకరు వెళ్లిపోగా ఈమె ఒక్కరే పాఠశాలలో ఉన్నారు. పని ఒత్తిడి, యాప్‌లలో నిత్యం అప్‌లోడ్ చేయాల్సిన అంశాలు తదితర విషయాల్లో ఆమె ఒత్తిడికి గురైనట్లు తోటి ఉపాధ్యాయులు చర్చించుకుంటున్నారు.



జాజిపూల తోట




పూలు కోస్తున్న కూలీలు

తెగుళ్లు, పెట్టుబడులు పెరిగిపోయి..
పూల రైతు వాడిపోయి..!

ప్రకాశం జిల్లా రావిపాడులో గతంలో 300కుపైగా ఎకరాల్లో మల్లె, జాజి తోటల సాగు

- తోటలకు తెగుళ్లు, వైరస్‌లతో ప్రస్తుతం 50 ఎకరాలకు పడిపోయిన వైనం
- పెరిగిన పెట్టుబడులు కూడా మరో కారణం
- కన్నెత్తిచూడని ఉద్యానవన శాఖాధికారులు
- నష్టపోతున్న రైతులు



మల్లె పూలు

కంభం: ప్రకాశం జిల్లా కంభం మండలంలోని రావిపాడు గ్రామం పేరు వినగానే గుర్తొచ్చేది పూల సువాసనలు. పూల తోటల సాగుకు ఈ గ్రామం పెట్టింది పేరు. ఇక్కడ పండించే మల్లె, జాజి పూలు రాష్ట్ర నలుమూలలకు ఎగుమతి అవుతుంటాయి. వంద సంవత్సరాల క్రితం నుంచే ఈ గ్రామంలో పూలతోటలు సాగుచేస్తూ వస్తున్నారు. పూర్వం బత్తాయి తోటలు సాగుచేస్తూ మధ్యలో అక్కడక్కడా మల్లె పూల చెట్లు వేసేవారు. పూలు బాగా కాస్తూ మంచి రేటుకు అమ్ముడుపోతుండటంతో కాలక్రమంలో పూలతోటలే సాగుచేస్తూ రైతులు ఆదాయం పొందుతున్నారు. గతంలో 300 నుంచి 400 ఎకరాల్లో మల్లె, జాజి పూలతోటలు సాగుచేస్తుండగా, ప్రస్తుతం తెగుళ్లు, చీడపీడలతో పాటు పెరిగిన పెట్టుబడుల కారణంగా సాగు తగ్గుతూ వచ్చి కేవలం 50 నుంచి 60 ఎకరాల్లోనే పూలతోటలు సాగులో ఉన్నాయి.

తమిళనాడు నుంచి అంటు తెచ్చి...

రామేశ్వరం, మధురై, కుంభకోణం నుంచి మల్లె అంట్లు తెచ్చి రావిపాడు గ్రామంలోని పొలాల్లో రైతులు నాటుతారు. మొక్కలు నాటిన తొలి రెండు సంవత్సరాలు చిన్నపిల్లల్లా వాటిని చూసుకుంటారు. రెండేళ్లకు కోతకు వస్తాయి. అప్పటికే ఎకరాకు లక్ష రూపాయల వరకు పెట్టుబడి అవుతుంది.

ఇతర ప్రాంతాలకు రవాణా...

రావిపాడులో పండిన మల్లె, జాజి పూలకు మంచి డిమాండ్ ఉంది. ఇక్కడ పండిన పూలు గతంలో మన జిల్లాతో పాటు వినుకొండ, నరసరావుపేట, హైదరాబాద్, తదితర ప్రాంతాలకు సరఫరా అయ్యేవి. ఇటీవల కాలంలో సాగు తగ్గడంతో ప్రస్తుతం మార్కాపురం, గిద్దలూరు, పోరుమామిళ్ల, పొదిలి, కనిగిరి వంటి ప్రాంతాలకు మాత్రమే పంపిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో కేజీ పూలు రూ.150 వరకు ధర పలుకుతున్నాయి.

తెగుళ్లతో తగ్గిపోతున్న దిగుబడి, సాగు విస్తీర్ణం...

మల్లె, జాజి తోటలకు ఎర్రనల్లి తెగులు, ఎర్రమొగ్గ తెగులు, ముడత తెగులు, బొబ్బతెగులు బెడద అధికమవడంతో దిగుబడి భారీగా తగ్గిపోయింది. ఒకసారి నాటిన చెట్లు పదేళ్ల వరకు కాపు కాస్తాయి. నెలకు ఒక కాపు వస్తుండగా, గతంలో కాపునకు సుమారు 100 కేజీల వరకూ దిగుబడి వచ్చేది. ప్రస్తుతం తెగుళ్ల కారణంగా 20 నుంచి 25 కేజీల వరకు దిగుబడి తగ్గిపోయింది. దీంతో క్రమంగా సాగు విస్తీర్ణం కూడా తగ్గింది.

పట్టించుకోని ఉద్యానవన శాఖాధికారులు...

ప్రస్తుతం రావిపాడు గ్రామంలో 50 ఎకరాలకుపైగా మల్లె, జాజి తోటలు సాగులో ఉన్నాయి. తెగుళ్లు, వైరస్‌ల బెడద అధికంగా ఉండటంతో దిగుబడి తగ్గిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. చివరకు సాగు విస్తీర్ణం కూడా భారీగా తగ్గిపోయినప్పటికీ ఉద్యానవన శాఖ, వ్యవసాయ శాఖల అధికారులు ఆ తోటల వైపు కన్నెత్తి కూడా చూడలేదని రైతులు వాపోతున్నారు. గతంలో చీడపీడల బెడద తక్కువగా ఉండేదని, ఇటీవల అధికమవడంతో దిగుబడి తగ్గిపోయి నష్టాలకు గురవుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏ అధికారి కూడా తమ పూలతోటలవైపు కన్నెత్తి చూడటం లేదని, ఏ తెగులుకు ఏ మందు వాడాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తమకు అర్థం కావడం లేదని ఆవేదన చెందుతున్నారు. దుకాణదారులు ఏ మందు చెబితే అది గుడ్డిగా తెచ్చుకొని పొలాలకు వాడుకుంటున్నామని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మల్లె సాగులో రైతులకు మెళకువలు నేర్పించడంతో పాటు జాగ్రత్తలు, సూచనలు అందిస్తేనే పూల సాగుకు రైతులు ముందుకొస్తారని చెబుతున్నారు.

ఏ మందులు వాడాలో తెలియడం లేదు



మల్లె తోటలకు ఎర్ర మొగ్గ, నల్లి తెగుళ్ల బెడద అధికంగా ఉంది. అధికారులెవరూ మల్లెతోటలను పరిశీలించేందుకు రావడం లేదు. తెగుళ్లకు ఏ మందులు వాడాలో తెలియక ఎరువుల కొట్లవారు ఏ మందు ఇస్తే అది కొనుగోలు చేసి పిచికారీ చేసుకుంటున్నాం. మా పూలతోటలను అధికారులు పరిశీలించి సూచనలిస్తే ప్రయోజనకరంగా ఉంటుంది.

–షేక్.ఖాసింవలి, రైతు

పెట్టుబడి రావడం లేదు



పూలతోటలకు పెట్టిన పెట్టుబడులకు సరిపడా ఆదాయం కూడా రావడం లేదు. కూలీల ఖర్చులు పెరిగిపోయాయి. ఆరుగాలం శ్రమించి సాగుచేసుకున్న పంటకు తెగుళ్లు వ్యాపించి దిగుబడి తగ్గిపోవడంతో నష్టాలే మిగులుతున్నాయి. రాను రానూ పూలతోటలు సాగుచేయాలంటే భయమేస్తోంది.

–భువనగిరి శ్రీనివాసులు, రైతు

ఎకరా పొలంలోనే మల్లె సాగు



గతంలో నాలుగైదు ఎకరాల్లో పూల తోటలు సాగు చేసేవాడిని.ఖర్చులు పెరిగిపోవడం, తెగుళ్లతో దిగుబడులు తగ్గిపోతుండటంతో ప్రస్తుతం ఎకరా పొలంలోనే సాగు చేస్తున్నా.

–పి.కరీముల్లా, మల్లె రైతు



బొబ్బతెగులు సోకి ముడతలు పడిపోతున్న జాజిచెట్ల ఆకులు

గంగపుత్రుల కష్టాలు తీర్చేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసిన ఫిష్ లాండింగ్ సెంటరు నిర్మాణాన్ని (జెట్టీ) కూటమి ప్రభుత్వం మరుగున పడేసింది. గత ప్రభుత్వం మంజూరు చేసిన ఫిష్ ల్యాండింగ్ సెంటరు నిర్మించడం మానేసి మిట్టల్ స్టీల్‌ప్లాంట్ ప్రయోజనాల కోసం కార్గోపోర్టు నిర్మాణానికి అవసరమైన అనుమతులు మంజూరు చేసి, ఆగమేఘాల మీద భూములు కేటాయించింది. దీనిపై మత్స్యకార వర్గాలనుంచి తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.



జెట్టీ నిర్మించ తలపెట్టిన బోయపాడు తీరం

మత్స్యకారులు వద్దు, మిట్టల్ ముద్దు!

కూటమి ప్రభుత్వం తీరుపై గంగపుత్రుల ఆగ్రహం

- గత ప్రభుత్వంలో జెట్టీ కోసం రూ.24 కోట్ల కేటాయింపు
- ఫిష్ ల్యాండింగ్ సెంటరు నిర్మాణానికి జీవో
- కూటమి ప్రభుత్వం వచ్చాక పట్టించుకోని వైనం

నక్కపల్లి: అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నియోజకవర్గంలో 17 మత్స్యకార గ్రామాలున్నాయి. సుమారు 25 వేలమంది మత్స్యకారులు జీవిస్తున్నారు. వీరిలో దాదాపు 10 వేల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా చేపల వేటను ఆధారంగా చేసుకుని జీవిస్తున్నారు. ప్రాణాలకు తెగించి వీరు వేటాడి తెచ్చిన మత్స్య సంపద నిల్వ చేసుకోవడం, భద్రపరచుకోవడం, మార్కెటింగ్ చేసుకోడానికి సరైన సదుపాయాలు లేవు. లక్షలాది రూపాయల విలువైన మత్స్యసంపదను వేటాడి తెచ్చుకుంటున్నప్పటికీ మార్కెటింగ్ చేసుకోలేక మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రజా సంకల్పయాత్రలో మత్స్యకారుల సమస్యలు స్వయంగా తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీ నిలబెట్టుకుని 2023లో నక్కపల్లి మండలం రాజయ్యపేట, బోయపాడు సమీపంలో మినీ జెట్టీ(ఫిష్ ల్యాండింగ్ సెంటరు) ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేశారు. ఈ జెట్టీ నిర్మాణానికి మొత్తం రూ.24.77 కోట్లు కేటాయిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. కేంద్రం తన వాటా కింద రూ.14.86 కోట్లు కేటాయించగా రాష్ట్రప్రభుత్వ వాటాకింద రూ.9.90కోట్లు మంజూరు చేసింది. ఈ జెట్టీ నిర్మాణానికి అవసరమైన పదెకరాల స్థలాన్ని రాజయ్యపేట, బోయపాడు, దొండవాక ప్రాంతాల్లో ఎంపిక చేశారు. రిజర్వ్ ఫారెస్టుకు చెందిన స్థలం కావడంతో వాటికి ప్రత్యామ్నాయంగా పదెకరాలను కేటాయించి ఎంపిక చేసిన భూమిలో జెట్టీ నిర్మించాలనేది గత ప్రభుత్వ నిర్ణయం. జెట్టీ నిర్మాణానికి గుర్తించిన భూములను ఢిల్లీ నుంచి వచ్చిన నిపుణులు, రాష్ట్ర, జిల్లా మత్స్యశాఖ ఉన్నతాధికారులు సైతం పరిశీలించి అనువైన ప్రాంతంగా నివేదిక ఇవ్వడంతో ప్రభుత్వం నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసింది.



జెట్టీ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని పరిశీలిస్తున్న అప్పటి కలెక్టర్ రవిపటాన్‌శెట్టి (ఫైల్)

గత ప్రభుత్వంలో ఇవీ ప్రతిపాదనలు...

- రూ.2.32 కోట్లు వెచ్చించి జెట్టీ ఇతర భవనాల నిర్మాణం.
- రూ.33లక్షల వ్యయంతో వర్క్‌షెడ్, మొక్కల పెంపకం
- రూ.34లక్షలతో వాహనాల పార్కింగ్ సదుపాయం
- రూ.1.86కోట్లతో చేపలను ఎండబెట్టుకునేందుకు 2 ప్లాట్‌ఫారాల నిర్మాణం
- రూ.15లక్షల వ్యయంతో ట్రక్ పార్కింగ్ నిర్మాణం
- రూ.21లక్షల వ్యయంతో మత్స్య సంపద కోసం లోడింగ్ సెంటరు (షెడ్లు) నిర్మాణం
- రూ.1.11 కోట్ల వ్యయంతో చేపల కొనుగోళ్లు, అమ్మకాల కోసం పెద్ద హాళ్ల నిర్మాణం
- రూ.5.94 లక్షలతో ఫిష్‌ల్యాండింగ్ ఫ్లాట్‌ఫారాలు
- రూ.32.24లక్షలతో బీచ్ ల్యాండింగ్ ఫ్లాట్‌ఫారం
- రూ.7.11కోట్ల వ్యయంతో జెట్టీ వద్ద మెకనైజ్డ్, మోటారుబోట్లు, ఇంజిన్లను తెప్పలు పార్కింగ్ మరమ్మతుల కోసం ప్రత్యేకంగా భవనాలు, షెడ్ల నిర్మాణం
- రూ.1.98 కోట్లతో జెట్టీ నిర్మించే ప్రాంతంలో సిమెంటు రోడ్ల నిర్మాణం
- రూ.64 లక్షల వ్యయంతో మురుగునీటి కాలువల నిర్మాణం
- రూ.1.14కోట్ల వ్యయంతో ప్రహరీ గోడ నిర్మాణం
- రూ.9.88లక్షల వ్యయంతో వ్యర్థజలాలను శుద్ధి చేసే ప్లాంటు ఏర్పాటు
- రూ.46.92లక్షల వ్యయంతో వలలు, మరమ్మతులు, భద్రపరచుకునే షెడ్ల నిర్మాణం
- రూ.39.42లక్షల వ్యయంతో విశ్రాంతి భవనాల నిర్మాణం
- రూ.10లక్షల వ్యయంతో మరుగుదొడ్ల ఏర్పాటు
- రూ.27.22లక్షల వ్యయంతో తాగునీరు, వాడుక నీరు కోసం ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం వంటి ప్రతిపాదనలు చేశారు.
- జెట్టీ నిర్మించే ప్రాంతం చుట్టూ బయోఫెన్సింగ్, పటిష్టమైన రక్షణ గేటు కోసం రూ.9.16 లక్షలు కేటాయింపు
- రూ.16 లక్షలతో నీటివనరులైన బోర్లు, గొట్టపు బావులు, మోటారు బూస్టర్ క్లీనింగ్ సదుపాయాలు
- రూ.80.85 లక్షల వ్యయంతో విద్యుత్ సదుపాయం, ట్రాన్స్‌ఫార్మర్లు, వీధిదీపాల సదుపాయాలు
- విద్యుత్ సరఫరా, కనెక్షన్ల కోసం మరో రూ.80 లక్షలు కేటాయించారు.
- ముందస్తు అధ్యయనాల కోసం రూ.20 లక్షలు, అత్యవసర పరిస్థితుల్లో ఖర్చు చేసేందుకు రూ.60 లక్షలు కేటాయించారు.అన్నీ సవ్యంగా జరిగి జెట్టీ నిర్మాణం పూర్తయితే తమ బెంగ తీరినట్టేనని గంగపుత్రులు భావించారు. భూసేకరణలో ఎదురైన సాంకేతిక ఇబ్బందుల వల్ల జెట్టీ నిర్మాణం ఆలస్యమైంది. ఇంతలో

సార్వత్రిక ఎన్నికలు రావడంతో ఎన్నికల కోడ్ కారణంగా జెట్టీ నిర్మాణం నిలిచిపోయింది. ఎన్నికల ప్రచారంలో టీడీపీ నాయకులు సైతం తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మత్స్యకారుల కోసం ఫిష్ ల్యాండింగ్ సెంటరు నిర్మిస్తామని హామీలు గుప్పించారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జరిగింది. ఇంతలోనే మిట్టల్ స్టీల్‌ప్లాంట్ తెర మీదకు రావడంతో జెట్టీ అంశం మరుగున పడింది. మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు రాష్ట్రప్రభుత్వం ఈ ఏడాది 2400 ఎకరాలు కేటాయించింది. ఈ భూముల్లో మిట్టల్ కంపెనీ సొంత అవసరాల కోసం కార్గో పోర్టు (క్యాప్టివ్‌పోర్టు) నిర్మించనుంది. 148 ఎకరాల్లో నిర్మించే ఈ క్యాప్టివ్ పోర్టుకు కూటమి ప్రభుత్వం ఆగమేఘాల మీద అనుమతులు మంజూరు చేసింది. దీంతో జపాన్‌కు చెందిన మిట్టల్‌ప్రతినిధుల బృందం పోర్టు నిర్మించే ప్రాంతాలను అధ్యయనం చేసేందుకు రావడం జరిగింది. వేటాడిన మత్స్య సంపద ఎండబెట్టుకునేందుకు ప్లాట్‌ఫారాలు భద్రపరచుకునేందుకు స్టోర్ రూములులేక, ఇంజిన్లు, వలలు భద్రపరచుకునేందుకు స్టోర్‌రూములు, మార్కెటింగ్ చేసుకునేందుకు షెడ్లు లేక మత్స్యకారులు ఇబ్బంది పడుతూంటే జెట్టీ నిర్మించాల్సిన ప్రభుత్వం మిట్టల్ కంపెనీ కార్గో పోర్టుకు ఆగమేఘాల మీద అనుమతులు మంజూరు చేయడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కూటమిప్రభుత్వ తీరుతో ఇక జెట్టీ విషయం మరుగున పడినట్టేనని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం గంగపుత్రులను మోసం చేసిందని ఆగ్రహంతో రగిలిపోతున్నారు.

జెట్టీ లేక నానా ఇబ్బందులు



జగనన్న ప్రభుత్వం మత్స్యకారుల కోసం జెట్టీ మంజూరు చేసింది. డబ్బులు కూడా ఇడదల చేసింది. పదెకరాల భూమి కూడా సేకరణ జరిగింది. బెండర్లు పూర్తయి జెట్టీ కడతారనుకునే సమయంలో ఎన్నికలు వచ్చేయి, జెట్టీ పని ఆగిపోయింది. ఈ ప్రభుత్వంలో కడతారని ఆశపడ్డాం. కానీ స్టీల్‌ప్లాంట్ ఒక్క పోర్టు కట్టుకునేందుకు పెట్టుబడి అనుమతి ఇచ్చిందంట. ఇంక మాకు జెట్టీ కడతారనే ఆశలు పోయాయి. మమ్మల్ని ప్రభుత్వం మోసం చేసింది. సముద్రం ఒడ్డున సదుపాయాలు లేక సానా ఇబ్బంది పడతన్నం. జెట్టీ కడితే మేము పడే కష్టానికి ఫలితం దక్కేది.

– మైలపల్లి సూరిబాబు, మత్స్యకారుడు రాజయ్యపేట

మధుర ఫలాలు.. చేదు ఫలితాలు

దక్కని గిట్టుబాటు ధర

సీజన్ చివరిలోనూ పెరగని ధరలు



సాక్షి, పాడేరు: అల్లూరి జిల్లా మన్యంలో గిరిజన రైతులు సాగు చేస్తున్న ఆర్గానిక్ మధుర ఫలాలకు మార్కెట్‌లో గిట్టుబాటు ధరలు కరువయ్యాయి. ఇక్కడ పండే పైనాపిల్, పనస, సీతాఫలాలకు మైదాన ప్రాంతాల్లో ఎంతో డిమాండ్ ఉంది. నాణ్యత, రుచిలో నంబర్ 1గా ఆదరణ ఉన్నప్పటికీ ఈ మధుర ఫలాలకు మాత్రం సీజన్ ప్రారంభం నుంచి ఆశించినంత ధరలు లేకపోవడంతో గిరిజన రైతులు నష్టపోతున్నారు. ప్రస్తుతం పైనాపిల్, పనస పండ్ల సీజన్ చివరి దశలో ఉంది. మైదాన ప్రాంతాల్లో డిమాండ్ తగ్గడంతో విజయవాడ, రాజమండ్రి, తాడేపల్లిగూడెం ప్రాంతాలకు చెందిన పెద్ద వ్యాపారులు కూడా గత 2 వారాల నుంచి ఏజెన్సీకి రావడం లేదు. దీంతో ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన దళారీ వ్యాపారుల మాటే వేదంలా చెలామణి అవుతోంది. డుంబ్రిగుడ, జి.మాడుగుల, పాడేరు మండలాల్లో 700 ఎకరాల్లో పైనాపిల్ తోటలను గిరి రైతులు సాగు చేస్తున్నారు. ఈ ఏడాది వంట్లమామిడి, అరకు, చింతపల్లి ప్రాంతాల్లో ఒక పండు రూ.10 నుంచి రూ.12 ధరకు అమ్ముడుపోయింది. ప్రస్తుతం రూ.10కి మించి పైనాపిల్ అమ్ముడుపోకపోవడంతో గిరిజన రైతులు ఉసూరుమంటున్నారు.

పనసకు తగ్గిన డిమాండ్

పనస పండ్లకు మైదాన ప్రాంతాల్లో డిమాండ్ తగ్గింది. వ్యాపారుల నుంచి ఆర్డర్లు లేకపోవడంతో స్థానికంగా పనస పండ్లు పెద్దగా ఎగుమతి కావడం లేదు. గత నెలలో పనసపండును సైజు బట్టి రూ.70 నుంచి రూ.100 వరకు గిరిజన రైతులు విక్రయించారు. సీజన్ ఆఖరు కావడంతో ఇదే ధర పలకాల్సి ఉండగా, వ్యాపారులు గ్రామాలకు వచ్చి కొనుగోలు చేయకపోవడంతో ధర పతనమైంది. స్థానిక వ్యాపారులు గిరిజనుల నుంచి రూ.30కే చౌకగా కొంటున్నారు.

సీతాఫలాలధర పతనం

సీతాఫలాల వ్యాపారం భారీగానే జరుగుతున్నప్పటికీ గిరిజన రైతులకు గిట్టుబాటు కావడం లేదు. పాడేరు మండలం వంట్లమామిడి, 12వ మైలురాయి, రాజాపురం, అనంతగిరి మండలం కాశీపట్నం ప్రాంతాల్లో ప్రస్తుతం సీతాఫలాల మార్కెట్ జరుగుతోంది. అయితే పశ్చిమబెంగాల్ నుంచి వచ్చే పెద్ద వ్యాపారులు మన్యం సంతలకు రాకపోవడంతో స్థానిక వ్యాపారులు ధరను పతనం చేశారు. బుట్ట సీతాఫలాలను రూ.700 నుంచి రూ.1000కి అమ్ముకోవాలి అనే పరిస్థితి ఉండగా ఈ ఏడాది సీజన్ ప్రారంభం నుంచి తక్కువ ధరకే వ్యాపారులు కొంటున్నారు. బుట్ట పండ్లను రూ.500 లోపే అమ్ముకుంటున్న గిరిజన రైతులు నష్టపోతున్నారు. మైదాన ప్రాంతాల్లో సీతాఫలాలకు డిమాండ్ ఉన్నప్పటికీ గిరిజన రైతుల వద్ద మాత్రం వ్యాపారులు తక్కువ ధరతో వ్యాపారం చేస్తున్నారు.

గిట్టుబాటు కరువు



ఈ ఏడాది పైనాపిల్, సీతాఫలాలకు సీజన్ ప్రారంభం నుంచి గిట్టుబాటు ధరలు కరువయ్యాయి. పైనాపిల్‌ను రూ.10కే అమ్ముకున్నాం. పనస పండ్లకు డిమాండ్ తగ్గింది. సీతాఫలాల అమ్మకాలతోనూ ఆదాయం తక్కువగానే ఉంది. వ్యాపారులంతా సిండికేట్‌గా మారి ధరలను పతనం చేయడంతో ఆర్థికంగా నష్టపోతున్నాం

–కిల్లు కృష్ణ, గిరిజన రైతు, దేవాపురం, పాడేరు మండలం



పాడేరు ఘాట్‌లో 12వ మైలురాయి వద్ద అనాస, సీతాఫలాల అమ్మకాలు



ఘాట్‌లో సీతాఫలాలు అమ్ముతున్న గిరిజన రైతు

చిత్రం చెప్పిన కథ



హ్యాపీ బర్త్ డే

పండాలు చాలా ప్రమాదం అంచున ఉన్న జీవులు. సౌత్‌వెస్ (ఆగ్నేయ) చైనాలోని ఎత్తయిన ప్రాంతాల్లో ఉండే వెదురు వనాల్లోనే ఇవి ఎక్కువగా జీవిస్తాయి. అయితే వీటిని జూలలో పెట్టి కూడా సంరక్షిస్తున్నారు. హాంగ్‌కాంగ్‌లోని ఓషన్ పార్క్‌లో గత సంవత్సం ఆగస్టు 15న కవల పాండాలు పుట్టాయి. అవి సంవత్సరం పూర్తి చేసున్న సంతదర్భంగా మొదటి బర్త్‌డేను నిర్వహించారు. కేకులు పెట్టారు. అవి కూడా ఉత్సాహంగా కేకులు తిన్నాయి. అన్నట్టు ఈ పాండాల పేర్లు దేదే, జియా జియా.

కథలు రాసి ఇంత పేరు తెచ్చుకోండి

కథలు రాయాలంటే బాగా పెద్దగా అయిపోయి మీసాలు వచ్చేసి గడ్డాలు పెరిగిపోవాలని రూలేం లేదు. పదో తరగతి పాసై ఉండాల్సిన అవసరం లేదు. చిన్నప్పుడే వెంటనే కూడా మీరు కథలు రాయొచ్చు. పుస్తకాలు వేయొచ్చు. కథలు రాయడం అంటే మీ ఊహలకు బలం ఇవ్వడం. మీరు కల్పించి కొన్ని పాత్రలకు ప్రాణం పోయడమే. కథలు రాయడం చాలా మంచి అలవాటు. హాబీ. ఫుల్‌టైమ్ ప్రొఫెషన్ కూడా. పుస్తకాలు చదువుతూ ఉంటే కథలు రాయాలన్న ఆలోచన వస్తుంది. మీరు ట్రై చేయండి. చిన్న వయసులోనే రచయితలుగా పేరు గడించిన వీరిని ఒకసారి చూడండి.

అయాన్ గోగోయ్ గోహైన్ (Ayan Gogoi Gohain) – అస్సాం:



వయస్సు: 2018 లో 4 సంవత్సరాల అయాన్ తన రోజువారీ అనుభవాలను తల్లి మొబైల్‌లో ఆడియో క్లిప్‌లుగా రికార్డ్ చేసి, వాటిని తన తాతకు వాట్సాప్ ద్వారా పంపాడు. ఈ క్లిప్‌లను సేకరించి **"Honeycomb"** అనే పుస్తకంగా ప్రచురించారు అతని తాత. ఈ పుస్తకం అతని బాల్య దృక్కోణం నుండి సరళమైన రచనగా పేరు ప్రఖ్యాతలు సంతరించుకుంది. దీంతో అయాన్ భారతదేశంలో అతి చిన్న వయస్సులో రచయితగా ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించాడు.

అహాన్ పాండే (Ahaan Pandey):

2020 లో ఆరేళ్ళ అహాన్ "We Are the Greatest" అనే పుస్తకాన్ని రాసి, అతి చిన్న వయస్సులో రచయితగా గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించాడు. ఈ పుస్తకాన్ని పిల్లలకు స్ఫూర్తినిచ్చే కథల సంకలనంగా రూపొందించాడు. ఇందులో సామాజిక సమస్యలు మరియు పర్యావరణ అవగాహన గురించి కథల రూపంలో రాశాడు అహాన్.

సంహిత అర్ని (Samhita Arni):



8 సంవత్సరాల వయస్సులో రచన ప్రారంభించింది సంహిత. తన 8వ ఏట "The Mahabharata: A Child's View" అనే పుస్తకాన్ని రాసింది. ఇది మహాభారతాన్ని పిల్లల దృష్టికోణం నుండి సరళంగా వివరిస్తుంది. ఈ పుస్తకం తారా బుక్స్ ద్వారా ప్రచురితమై, విమర్శకుల ప్రశంసలు పొందింది. ఆమె తర్వాత "Sita's Ramayana" అనే గ్రాఫిక్ నవలను కూడా రచించింది. ఇది రామాయణాన్ని సీత దృక్కోణం నుండి చెబుతుంది.

అనుష్కా రావ్ (Anushka Rao):

పదమూడేళ్ళ అనుష్కా "My Sweet Home" అనే పుస్తకాన్ని రాసింది. ఇది ఒక యువతి తన జీవితంలో ఎదురైన సవాళ్లను ఏ విధంగా ఎదుర్కొంది. స్త్రీల కలలను కౌమారం, యవ్వనంలో సమాజం ఏ విధంగా ప్రభావితం చేస్తుంది అనేది కూలంకశంగా చర్చించింది. అనుష్కా రచనలు భారతీయ సంస్కృతి మరియు కుటుంబ విలువలను ఆధారంగా చేసుకుని రాయబడటంతో యువ పాఠకులలో బాగా ఆదరణ పొందింది.

వండర్ కిడ్

మూడేళ్లకే... సంస్కృత శ్లోకాల్లో దిట్ట



గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్ నగరానికి చెందిన కైరా పూర్వేశ్ కబ్రా అనే చిన్నారి వయసు ప్రస్తుతం రెండు సంవత్సరాల 11 నెలలు. ఆ వయసులోని పిల్లలంతా అల్లరి చేస్తూ, ఆడుకుంటూ ఉంటారు. తను మాత్రం సంస్కృత శ్లోకాలు చెప్తూ అందర్నీ ఆశ్చర్యపరుస్తోంది. ఆ వయసులోని చిన్నారులు చాలా పదాలను స్పష్టంగా పలకలేరు. కొన్ని అక్షరాలను వదిలేస్తుంటారు. అయితే కైరా మాత్రం అందుకు పూర్తి భిన్నం. సంస్కృతంలోని అతి కష్టమైన శబ్దాలను సైతం చక్కగా పలుకుతోంది. తన కుటుంబంలోని ఆధ్యాత్మిక జీవనవిధానం తనపై ప్రభావం చూపింది. రోజూ పొద్దున్నే లేచి హనుమాన్ చాలీసా వింటూ, కొన్నాళ్లకు దాన్ని సాధన చేయడం మొదలుపెట్టింది. కొన్నాళ్లకే స్పష్టంగా పలకడం నేర్చుకుంది. అనంతరం కర్పూరగౌరం శ్లోకం, వక్రతుండ మహాకాయ శ్లోకం, గురుఃబ్రహ్మ శ్లోకం.. ఇంట్లో పెద్దల ద్వారా ఒకదాని తర్వాత మరొక శ్లోకాన్ని నేర్చుకుంటూ మరింత ఆసక్తి పెంచుకుంది.

కైరా ఆసక్తి అక్కడితో ఆగిపోలేదు. పుట్టినరోజు సందర్భంగా పాడే 'హ్యాపీ బర్త్‌డే' పాటను సంస్కృతంలో నేర్చుకొని, దాన్ని సైతం సాధన చేసి తప్పులు లేకుండా పాడింది. తన ప్రతిభ నేరుగా పరిశీలించిన వరల్డ్ ఇండియా రికార్డ్స్ ప్రతినిధులు తనను మెచ్చుకొని, రికార్డు అందించారు.

చిన్నారుల కోసం.. అతి పెద్ద ఆసుపత్రి

శ్రీలంక రాజధాని కొలంబోలో ఉన్న లేడీ రిడ్జ్‌వే హాస్పిటల్ ఫర్ చిల్డ్రన్ ఆసుపత్రి ప్రపంచంలో అతి పెద్ద పిల్లల ఆసుపత్రి. ఇక్కడ ఒకేసారి 1200 కంటే ఎక్కువమందికి చికిత్స అందించొచ్చు. 1895లో 'లేడీ హావ్‌లాక్ హాస్పిటల్ ఫర్ ఉమెన్ అండ్ చిల్డ్రన్' పేరుతో దీన్ని స్థాపించారు. 1910లో దీన్ని 'లేడీ రిడ్జ్‌వే హాస్పిటల్ ఫర్ చిల్డ్రన్'గా మార్చారు. లేడీ హావ్‌లాక్, లేడీ రిడ్జ్‌వే ఇద్దరూ సిలోన్‌లోని బ్రిటిష్ గవర్నర్లు సర్ ఆర్థర్ హావ్‌లాక్, సర్ జోసెఫ్ వెస్ట్ రిడ్జ్‌వేల సతీమణులు.

లేడీ రిడ్జ్‌వే హాస్పిటల్ శ్రీలంకకు పీడియాట్రిక్ కేర్ కోసం జాతీయ రిఫెరల్ సెంటర్‌గా కూడా పనిచేస్తుంది. కొలంబో నగరంతోపాటు చుట్టుపక్కలున్న అనేక ప్రాంతాల జనాభాకు ఇది అత్యవసర, అవుట్ పేషెంట్ కేర్ అందించే ఆసుపత్రి. శ్రీలంక ప్రభుత్వ ఉచిత రాష్ట్ర ఆరోగ్య సంరక్షణ విధానం ద్వారా ఇక్కడ అని సేవలూ ఉచితంగా అందుతాయి. ఈ ఆసుపత్రిలోని ఔట్ పేషెంట్ విభాగం, యాక్సిడెంట్ సర్వీస్ విభాగం సంవత్సరంలో 365 రోజులు, రోజుకు 24 గంటలు తెరిచే ఉంటుంది. ఇక్కడ సంవత్సరానికి పది లక్షలకు పైగా ఔట్ పేషెంట్లు వచ్చి చికిత్స పొందుతుంటారు. దాదాపు 50,000 మంది పిల్లలు ఇక్కడ చికిత్స పొందుతుంటారు. ఇక్కడి వైద్యులు ఎంతోమంది చిన్నారులను ప్రాణాపాయ స్థితి నుంచి రక్షించి, ఆరోగ్యవంతుల్ని చేసి ఇంటికి పంపించారు. శ్రీలంక క్రికెటర్ యాంజిలో మ్యాథ్యూస్ కూతురు కూడా ఇక్కడ చికిత్స పొందింది. ఇక్కడి వైద్యులు, నర్సులు అందించిన సేవలు చూసి, ఆయన ఈ ఆసుపత్రికి తనవంతు సాయాన్ని అందించారు.



అప్పుడు 'లేడీ హావ్‌లాక్ హాస్పిటల్ ఫర్ ఉమెన్ అండ్ చిల్డ్రన్' (1895)



ఇప్పుడు దీన్ని 'లేడీ రిడ్జ్‌వే హాస్పిటల్ ఫర్ చిల్డ్రన్'

మహనీయులు

మహిళల హక్కుల కోసం తొలి అడుగు... రమాబాయి రానడే



పిల్లలూ! దేశంలో మహిళల హక్కుల కోసం పోరాడిన నాయకులు ఎందరో ఉన్నారు. మహిళలకు పురుషులతో సమానంగా గౌరవం, గుర్తింపు అందించాలని పోరాటాలు చేశారు. అటువంటి వారిలో తొలితరం నాయకురాలు రమాబాయి రానడే.

రమాబాయి 1862 జనవరి 25న మహారాష్ట్రలోని సాంగ్లి జిల్లా దేవరాష్ట్రే అనే చిన్న గ్రామంలో జన్మించారు. అమె అసలు పేరు యమునా కుర్లేకర్. ఆ రోజుల్లో బాలికలకు విద్య నేర్పించడం నిషిద్ధం. 1873లో 11 ఏళ్ల వయస్సులో తన కంటే 20 సంవత్సరాల పెద్దవాడైన జస్టిస్ మహాదేవ్ గోవింద్ రనడేను ఆమె వివాహం చేసుకున్నారు. మహాదేవ్ గోవింద్ భారతదేశ సామాజిక సంస్కరణ ఉద్యమానికి మార్గదర్శకుడు. ఆయనవి ఆదర్శ భావాలు. ఇంట్లోవారి నుంచి వ్యతిరేకతను ఎదుర్కొన్నా వెనుకాడక తన భార్యకు విద్య నేర్పించారు. సామాజిక, విద్యా సంస్కరణలలో ఆమెను భాగస్వామిని చేశారు.

భర్త నడిపే ఉద్యమాలలో తానూ చురుకైన భాగస్వామిగా మారేందుకు రమాబాయి చదువును మార్గంగా ఎంచుకున్నారు. భర్త వద్దే మరాఠీ, చరిత్ర, గణితం, ఇంగ్లీషు నేర్చుకున్నారు. నిత్యం సాధన చేస్తూ ఇంగ్లీష్, మరాఠీ భాషల్లో అనర్గళంగా మాట్లాడే స్థితికి చేరుకుని అందర్నీ చైతన్యవంతుల్ని చేశారు. హిందూ లేడీస్ సోషల్ అండ్ లిటరరీ క్లబ్‌ను స్థాపించి భాషలు, టైలరింగ్, హ్యాండ్‌వర్క్‌లలో మహిళలకు శిక్షణ తరగతులను ప్రారంభించారు.

1901లో భర్త మరణం తర్వాత రమాబాయి పూర్తిగా మహిళల సేవల కోసం అంకితమయ్యారు. బొంబాయిని వదిలి పూణేకు వచ్చి అక్కడే స్థిరపడ్డారు. బాధిత మహిళల పునరావాసం కోసం సేవాసదన్ స్థాపించారు. 1904లో బొంబాయిలో జరిగిన భారత్ మహిళా పరిషత్ మొదటి సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. బాలికలకు తప్పనిసరి పూర్వ ప్రాథమిక విద్య అందించాలని, బొంబాయి ప్రెసిడెన్సీలో మహిళల ఓటు హక్కు కల్పించాలని ఉద్యమించారు. దేశ మహిళలకు ఎన్నో సేవలు అందించిన రమాబాయి 1924 జనవరి 25న మరణించారు.

కథ

పేదరాశి పెద్దమ్మ వరం

అనగనగా ఓ ఊరిలో ధనవంతుడైన ఓ వ్యాపారికి ఇద్దరు భార్యలున్నారు. వారిలో ఒకరి పేరు సుమతి, మరొకరి పేరు కుమతి. సుమతి చాలా అణకువ కలిగిన ఇల్లాలు. కుమతి గర్విష్ఠి. సుమతికి ఉన్న ఆరోగ్య సమస్య కారణంగా ఆమె జుట్టంతా ఊడిపోయింది. దీంతో అంద వికారంగా కనిపించేది. ఈ కారణంతో ఆమె భర్త సుమతి మీద కంటే కుమతి మీద ఎక్కువ ప్రేమ చూపించేవాడు. దానికి తోడు కుమతి ఆమె మీద ఎక్కువ చాడీలు చెప్పడంతో ఆమెను ఇంటి నుంచి వెళ్లగొట్టాడు.

ఆ బాధతో ఏడుస్తూ సుమతి అడవిలో నడుస్తూ ఉండగా ఒకచోట ఒక ముసలి ఆడమనిషి చలికి వణుకుతూ కనిపించింది. అది చూసి తన ఒంటి మీదున్న శాలువా తీసి ఆమెకు కప్పి, పక్కనే చలిమంట వేసింది సుమతి. రాత్రంతా అక్కడే ఉండి ఆమెకు సపర్యలు చేసింది. పొద్దున్న లేచిన ఆమె తనను తాను పేదరాశి పెద్దమ్మగా పరిచయం చేసుకుంది. ఒంటరిగా ఈ అడవిలోకి ఎందుకొచ్చావని సుమతిని ప్రశ్నించింది.

సుమతి తన బాధ చెప్పుకుంది. అంతా విన్న పేదరాశి పెద్దమ్మ 'నువ్వేమీ దిగులు పడకు. వెళ్లి ఆ తటాకంలో స్నానం చేసిరా!' అని చెప్పింది.

సుమతి తటాకంలో దిగి స్నానం చేసింది. బయటికొచ్చేటప్పుడు చూసుకుంటే తన తలపై ఒత్తుగా జుట్టు మొలిచింది. తన రూపం కూడా మారిపోయి అందగత్తెగా మారిపోయింది. ఇదంతా పేదరాశి పెద్దమ్మ వరం అని గుర్తించి, తనకు కృతజ్ఞతలు చెప్పి ఇంటిబాట పట్టింది.

ఒత్తైన జుట్టుతో, అందగత్తెలా మారిన సుమతిని చూసి భర్త ఆశ్చర్యపోయాడు. తనను ఇంట్లోకి రమ్మని పిలిచి ఆమెను ప్రేమగా చూసుకోవడం మొదలుపెట్టాడు.


ఇదంతా కుమతిని కంటగింపుగా మారింది. తాను కూడా పేదరాశి పెద్దమ్మ వరం పొందితే తన భర్త సుమతిని వదిలేసి, తన వెంటే తిరుగుతాడని భావించింది. ఓ రోజు ప్రయాణించి అడవిలో పేదరాశి పెద్దమ్మ ఉన్న చోటుకు చేరుకుంది. అక్కడ పేదరాశి పెద్దమ్మ పనిచేస్తూ ఉంది. అయినా కుమతి వెళ్లి, తాను తీసుకొచ్చిన శాలువా ఆమె మీద వేసి, కింద కూర్చోబెట్టి సేవలు చేయడం ప్రారంభించింది.

కుమతి ఉద్దేశం ఏమిటో పేదరాశి పెద్దమ్మ కనిపెట్టింది. ఏం కావాలో కోరుకొమ్మని అంది. తనను లోకంలో అందరికంటే సౌందర్యరాశిగా మార్చమని కోరింది. 'అయితే వెళ్లి ఆ తటాకంలో మునుగు' అని చెప్పింది పేదరాశి పెద్దమ్మ. సంతోషంగా వెళ్లి ఆ తటాకంలో మునిగి బయటకు వచ్చింది కుమతి. కానీ తన జుట్టంతా పోయి, తాను అందవికారంగా మారినట్లు గుర్తించింది. తన ఆశ, గర్వం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని గుర్తించి, తనను మామూలుగా మార్చమని పేదరాశి పెద్దమ్మను వేడుకుంది.

'ఇకపై బుద్ధిగా మసులుకోమని' హెచ్చరించి పేదరాశి పెద్దమ్మ తనను పూర్వస్థితికి తెచ్చింది. తిరిగి ఇంటికి వెళ్లిన కుమతి సుమతితో, భర్తతో ప్రేమగా ఉండటం మొదలు పెట్టింది.




పుస్తకాలు



రూపం ఎలా ఉన్నా అందరూ సమానమే

రచయిత్రి ఆర్.జె. పలాసియో 2012లో రాసిన సమకాలీన పిల్లల నవల ఇది. ఆగ్గీ పుల్మాన్ అనే పదేళ్ల బాలుడి ముఖం ఇతరుల కంటే భిన్నంగా ఉంది. ఆ బాలుడు మొదటిసారి పాఠశాలలో చేరతాడు. అక్కడ అతనికి ఎదురైన అనుభవాలేమిటి, వాటిని అతను ఎలా స్వీకరించాడనేది ఈ నవల కథాంశం. అందానికి అతీతంగా అందర్నీ సమానంగా చూడాలనే దృక్పథంతో ఈ నవల సాగుతుంది.



మంచి బుద్ధులు నేర్పే కథలు

ఎదిగే పిల్లలకు సమాజంలో ఎలా మెలగాలో, స్నేహాన్ని ఎలా పెంపొందించుకోవాలో, మంచిచెడుల భేదం ఎలా తెలుసుకోవాలో చెప్పే కథలివి. రచయిత చొప్ప వీరభద్రప్ప పిల్లలకు అర్థమయ్యే భాషలో ఈ కథల్ని రాశారు. ప్రతి కథ ఓ సామాజిక అంశాన్ని, బాధ్యతను గుర్తుచేసి పిల్లల్లో ఉత్తేజాన్ని నింపుతుండి. వారిని మంచి మార్గంలో నడుపుతుంది.



సెమీస్‌లో అనాహత్

సిడ్నీ: ప్రొఫెషనల్ స్క్వాష్ అసోసియేషన్ (పీఎస్‌ఏ) చాలెంజర్ టూర్ ఈవెంట్‌లో భారత ఆటగాళ్లు సత్తా చాటారు. ఆ్రస్టేలియా వేదికగా జరుగుతున్న న్యూసౌత్‌వేల్స్ స్క్వాష్ బేగా ఓపెన్‌లో భారత ప్లేయర్లు అనాహత్ సింగ్, ఆకాంక్ష సాలుంఖే సెమీఫైనల్లోకి దూసుకెళ్లారు. మహిళల సింగిల్స్‌లో టాప్ సీడ్‌గా బరిలోకి దిగిన 17 ఏళ్ల అనాహత్ క్వార్టర్ ఫైనల్లో 11–4, 11–9, 14–12తో ఏడో సీడ్ హేలీ వార్డ్ (దక్షిణాఫ్రికా)పై విజయం సాధించింది. 27 నిమిషాల్లో ముగిసిన పోరులో అనాహత్ సంపూర్ణ ఆధిపత్యం కనబర్చింది. మరో మ్యాచ్‌లో ఐదో సీడ్ ఆకాంక్ష 11–4, 11–7, 11–3తో నాలుగో సీడ్ అలెగ్జాండ్రా హైడన్ (ఆ్రస్టేలియా)పై గెలిచింది. 24 నిమిషాల పాటు సాగిన పోరులో భారత ప్లేయర్ అదరగొట్టింది. సెమీస్‌లో నూర్ ఖఫాగీ (ఈజిప్ట్)తో అనాహత్, హబీబా హనీ (ఈజిప్ట్)తో ఆకాంక్ష తలపడనున్నారు.

లంక దేశవాళీ క్రికెటర్ సమన్‌పై ఐసీసీ వేటు

దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) శ్రీలంక మాజీ దేశవాళీ క్రికెటర్ సలియా సమన్‌పై ఐదేళ్ల నిషేధం విధించింది. అతను అబుదాబి టి10 క్రికెట్ లీగ్‌లో మ్యాచ్ ఫిక్సింగ్‌కు ప్రయత్నించినట్లు విచారణలో తేలింది. 2021లో జరిగిన అబుదాబి టి10 లీగ్‌లో అతను ఇతర ఆటగాళ్లతో కలిసి మ్యాచ్‌లు ఫిక్స్ చేసేందుకు ప్రయత్నించినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై దృష్టిసారించిన ఐసీసీ అవినీతి నిరోధక విభాగం, యూఏఈకి చెందిన ఎమిరేట్స్ క్రికెట్ బోర్డు ప్రాథమిక విచారణ అనంతరం 2023లో అతనితో పాటు 8 మందిపై కేసు నమోదు చేసింది.



భారత్‌లో రొనాల్డో ఆట!

గోవా ఫుట్‌బాల్ క్లబ్‌తో తలపడనున్న అల్ నాసర్ క్లబ్

- ఏఎఫ్‌సీ చాంపియన్స్ లీగ్ -2 షెడ్యూల్ విడుదల

చెన్నై: అంతా అనుకున్నట్లు జరిగితే... పోర్చుగల్ ఫుట్‌బాల్ స్టార్ క్రిస్టియానో రొనాల్డో ఆటను భారత అభిమానులు ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం లభిస్తుంది. ఆసియా ఫుట్‌బాల్ కాన్ఫడరేషన్ (ఏఎఫ్‌సీ) చాంపియన్స్ లీగ్–2లో భాగంగా రొనాల్డో ప్రాతినిధ్యం వహిస్తున్న అల్ నాసర్ జట్టుతో గోవా ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) తలపడాల్సి ఉంది. దీంతో ఆ మ్యాచ్‌లో పాల్గొనేందుకు పోర్చుగల్ స్టార్ భారత్‌కు వచ్చే అవకాశం ఉంది. అయితే అల్ నాసర్ క్లబ్‌తో కాంట్రాక్ట్ ప్రకారం విదేశీ వేదికలపై జరిగే మ్యాచ్‌ల్లో రొనాల్డో పాల్గొనే అంశంలో కొన్ని సడలింపులు ఉన్నాయి. మరి రొనాల్డో గోవా ఎఫ్‌సీతో మ్యాచ్ కోసం భారత్‌కు వస్తాడా లేదా అనేది త్వరలోనే తేలనుంది. ఏఎఫ్‌సీ చాంపియన్స్ లీగ్2కు సంబంధించిన 'డ్రా' శుక్రవారం విడుదలైంది. ఈ టోర్నమెంట్‌లో భారత్ నుంచి గోవా ఎఫ్‌సీతో పాటు మోహన్ బగాన్ సూపర్ జెయింట్ జట్టు పాల్గొననుంది. వచ్చే నెల 16 నుంచి ప్రారంభం కానున్న ఈ టోర్నమెంట్‌లో మొత్తం 32 జట్లు పాల్గొననుండగా... వాటిని ఎనిమిది గ్రూప్‌లుగా విభజించారు. ఒక్కో గ్రూప్‌లో నాలుగు జట్లు ఉన్నాయి. గ్రూప్‌లో మెరుగైన ప్రదర్శన కనబర్చిన రెండు జట్లు నాకౌట్ దశకు అర్హత సాధించనున్నాయి. గత సీజన్‌లో లీగ్ షీల్డ్ దక్కించుకోవడం ద్వారా మోహన్ బగాన్ జట్టు నేరుగా ఈ టోర్నీకి అర్హత సాధించగా... 'సూపర్ కప్' గెలవడం ద్వారా గోవా ఎఫ్‌సీ ముందంజ వేసింది. ఏఎఫ్‌సీ చాంపియన్స్ లీగ్‌లో గోవా జట్టు పాల్గొనడం ఇది రెండోసారి. 2021లోనూ గోవా జట్టు ఈ టోర్నీలో ఆడింది. సెప్టెంబర్ 16న ప్రారంభం కానున్న ఈ టోర్నమెంట్... వచ్చే ఏడాది మే 16న జరగనున్న ఫైనల్‌తో ముగియనుంది. లీగ్‌లో భాగంగా... ఇంటాబయట మ్యాచ్‌లు జరగడం పరిపాటి కావడంతో గోవా ఎఫ్‌సీతో తలపడేందుకు అల్ నాసర్ తరఫున రొనాల్డో భారత్‌కు వస్తాడనే వార్తలు వ్యాపించాయి. గ్రూప్ 'సి'లో ఫూలద్ మొబారకేహ్ సెపాహన్ ఎస్‌సీ (ఇరాన్), అల్ హుసేన్ (జోర్డాన్), అహల్ ఎఫ్‌సీ (తుర్క్‌మెనిస్తాన్)తో కలిసి మోహన్ బగాన్ పోటీ పడనుంది. గ్రూప్ 'డి'లో గోవా ఎఫ్‌సీతో పాటు అల్ నాసర్ క్లబ్ (సౌదీ అరేబియా), అల్ జవ్రా ఎస్‌సీ (ఇరాక్), ఇస్తిక్లోల్ ఎఫ్‌సీ (తజకిస్తాన్) ఉన్నాయి.

'మానసిక రుగ్మత'లకు ఐఓసీ మందు

ప్రచారకర్తల జాబితాలో అభినవ్ బింద్రా



లుసానే: అంతర్జాతీయ క్రీడాకారులు శారీరకంగా ఎదుర్కొనే ఫిట్‌నెస్ సమస్యలతో పాటు ఇటీవలి కాలంలో మానసిక సమస్యలు కూడా చాలా మందిని ఇబ్బంది పెడుతున్నాయి. ఆటపరంగా అద్భుతాలు చేసే స్థాయి ఉన్నా...మానసిక దృఢత్వం లేక కీలక సమయాల్లో ఒత్తిడిని తట్టుకోలేక కుప్పకూలిపోతున్నారు. ఇలాంటి వారికి తగిన మార్గనిర్దేశనం చేయాలని అంతర్జాతీయ ఒలింపిక్ మండలి (ఐఓసీ) యోచిస్తోంది. ఈ క్రమంలో కొత్తగా 9 మందితో 'మెంటల్ హెల్త్ అంబాసిడర్స్' అంటూ ప్రచారకర్తలను నియమించింది. భారత తొలి ఒలింపిక్ వ్యక్తిగత స్వర్ణపతక విజేత, షూటర్ అభినవ్ బింద్రాకు ఈ బృందంలో సభ్యుడిగా అవకాశం దక్కింది. హోలీ బ్రాడ్‌షా (పోల్‌వాల్ట్), కెమిలె చెంగ్, బ్రూన్ ఫొటస్, ర్యాన్ పీనీ (స్విమ్మింగ్), గ్రేసీ గోల్డ్ (ఫిగర్ స్కేటింగ్), మారీ జోసీ, అకానీ సింబైన్ (స్ప్రింట్), మాసోమా అలీ జాదా (సైక్లిస్ట్) కూడా బింద్రాతో పాటు ప్రచారకర్తలుగా వ్యవహరిస్తారు. 42 ఏళ్ల బింద్రా ఇప్పటికే ఐఓసీ అథ్లెట్స్ కమిషన్ ఉపాధ్యక్షుడిగా కూడా వ్యవహరిస్తున్నాడు. 'శారీరక ఆరోగ్యంతో పాటు ఆటగాళ్ల మానసిక ఆరోగ్యం కూడా ఎంతో ముఖ్యమని ఐఓసీ భావిస్తోంది. ఏ ఆటగాడు కూడా అలాంటి సమస్యను ఎదుర్కొనరాదు. అందుకే ఐఓసీ మెంటల్ హెల్త్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ప్రపంచవ్యాప్తంగా ఒలింపియన్లతో ఈ టీమ్‌ను ఎంపిక చేశాం. వీరు తమ పరిజ్ఞానం, అనుభవంతో ఆటగాళ్లకు సరైన సూచనలిస్తారు. సమస్యలతో బాధపడుతున్న క్రీడాకారులతో స్వయంగా మాట్లాడి దాని ప్రకారం వారికి తగిన విధంగా సహాయం చేస్తారు. ఐఓసీ ఆలోచన ప్రకారం ఏ అథ్లెట్ కూడా ఎలాంటి మానసిక సమస్యలతో బాధపడకూడదు. అలాంటి సానుకూల వాతావరణాన్ని తయారు చేయడమే దీని లక్ష్యం' అని ఐఓసీ ప్రకటించింది.



'మహిళలు ఓపెన్ టోర్నీల్లో పాల్గొనాలి'

అప్పుడే ఆట మెరుగుపడుతుంది

చెస్ డబ్ల్యూజీఎం తానియా వ్యాఖ్య

చెన్నై: మహిళల చెస్‌లో భారత క్రీడాకారిణులు ముందంజ వేయాలంటే ఎక్కువ సంఖ్యలో ఓపెన్ టోర్నీల్లో పాల్గొనాలని సీనియర్ ప్లేయర్, ఉమెన్ గ్రాండ్‌మాస్టర్ (డబ్ల్యూజీఎం) తానియా సచ్‌దేవ్ అభిప్రాయపడింది. మహిళల టోర్నీలకు పూర్తిగా దూరం కావద్దని... అయితే పురుషులతో ఓపెన్ కేటగిరీలో పోటీ పడితే ఆట ఎంతో మెరుగవుతుందని ఆమె వ్యాఖ్యానించింది. గత ఏడాది చెస్ ఒలింపియాడ్ నెగ్గిన భారత జట్టులో సభ్యురాలైన తానియా... ప్రస్తుతం చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ టోర్నీలో వ్యాఖ్యాతగా వ్యవహరిస్తోంది. 'చెస్ కెరీర్‌లో ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న అమ్మాయిలు సాధ్యమైనన్ని ఎక్కువ ఓపెన్ టోర్నమెంట్‌లలో ఆడాలి. కేవలం మహిళల టోర్నీలకే పరిమితం కాకుండా పురుషులతో కలిసి శిక్షణ పొందడంతో పాటు వారితో పోటీ పడాలి. అప్పుడే వారి ఆట మరింత పదునెక్కుతుంది' అని తానియా పేర్కొంది. అయితే పెద్ద స్థాయికి చేరే ముందు మహిళా టోర్నీల్లో విజయాలు సాధించడం కూడా ముఖ్యమని, అవి కెరీర్‌లో ముందుకు వెళ్లేందుకు కావాల్సిన ప్రేరణను అందిస్తాయని తానియా చెప్పింది. 'మహిళల విభాగంలో సాధించే విజయాలను కూడా తక్కువ చేయాల్సిన అవసరం లేదు. ఇవి కొత్త తరం అమ్మాయిలు చెస్‌ను ఎంచుకునేందుకు కావాల్సిన స్ఫూర్తిని ఇస్తాయి. ఓపెన్ టోర్నీల్లో పాల్గొనడం, మహిళల టోర్నీల్లో టైటిల్స్ గెలవడం రెండూ కూడా ముఖ్యమే. ఏదీ తక్కువ కాదు. సరిగ్గా చెప్పాలంటే కెరీర్‌లో ఎదిగే సమయంలో ఇది మధ్యేమార్గంలాంటిది. అయితే కేవలం మహిళల టోర్నీల్లోనే పాల్గొంటే వారు తమ స్థాయిని తగ్గించుకున్నట్లే. పూర్తి స్థాయిలో తమ సామర్థ్యాన్ని ప్రదర్శించే అవకాశాన్ని వారు కోల్పోతారు' అని 38 ఏళ్ల తానియా విశ్లేషించింది. అంతర్జాతీయ స్థాయిలో మన మహిళా చెస్ క్రీడాకారిణుల తాజా ప్రదర్శన పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేసింది. 'ఫిడే' వరల్డ్ కప్ ఫైనల్లో తలపడిన కోనేరు హంపి, దివ్య దేశ్‌ముఖ్‌లపై ఆమె ప్రశంసలు కురిపించింది. 'మన దేశానికి సంబంధించి ఇప్పుడు చెస్‌లో స్వర్ణ యుగం నడుస్తున్నట్లుగా ఉంది. ఇలాంటి సమయంలో మేమేం తక్కువ కాదన్నట్లుగా మహిళలు నిరూపించుకుంటున్నారు. ఒక మెగా టోర్నీ ఫైనల్లో రెండు వేర్వేరు తరాలకు చెందిన భారత ప్లేయర్లు పోటీ పడటం మామూలు విషయం కాదు. చెస్‌ను చూసి ఈ ఆటను ఎంచుకోవాలనుకునే అమ్మాయిలకు ఇది కావాల్సినంత స్ఫూర్తిని అందిస్తుంది' అని తానియా అభిప్రాయం వ్యక్తం చేసింది. ప్రస్తుతం కెరీర్ చివరి దశలో ఉన్నా తనలో ఇంకా సత్తా ఉందన్న తానియా... ఏడాదికి ఒకటి లేదా రెండు చొప్పున టోర్నీలు ఆడుతూ చెస్ వ్యాఖ్యానంపైనే ఎక్కువగా దృష్టి పెట్టనున్నట్లు వెల్లడించింది.

డిసెంబర్‌లో మోదీతో మెస్సీ భేటీ

- అర్జెంటీనా సూపర్ స్టార్ భారత పర్యటన ఖరారు
- డిసెంబర్ 12న కోల్‌కతాకు ఫుట్‌బాల్ స్టార్
- 15న ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశం
- సెలబ్రిటీలతో బిజీ బిజీగా 4 రోజుల షెడ్యూల్

కోల్‌కతా: అర్జెంటీనా సూపర్‌స్టార్ ఫుట్‌బాలర్ లయోనల్ మెస్సీ భారత పర్యటన ఖరారైంది. చాలా రోజులుగా భారత టూర్ ఉంటుందని వార్తలు వస్తుండగా... తాజాగా షెడ్యూల్‌ను ప్రకటించారు. మెస్సీ పర్యటనను 'గోట్ (గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్) టూర్ ఆఫ్ ఇండియా'గా నిర్వహిస్తున్నట్లు ప్రముఖ ఈవెంట్ ప్రమోటర్ శతద్రు దత్తా శుక్రవారం వెల్లడించారు. ఈ మధ్య సెలబ్రిటీలు టెన్నిస్ తరహా రాకెట్‌తో ఆడే ఆటే 'ప్యాడెల్'. అయితే ఇది పూర్తిగా టెన్నిస్ ఆడే రాకెట్ కాదు. కాస్త భిన్నంగా ఉంటుంది. డిసెంబర్ 12 నుంచి 15 వరకు భారత్‌లోని ప్రముఖ నగరాలైన కోల్‌కతా, ముంబై, ఢిల్లీ అహ్మదాబాద్‌లలో మెస్సీ భారత అభిమానులను అలరిస్తారు. ప్రతీ నగరంలోనూ చిన్నారులు, యువ ఫుట్‌బాలర్లతో కలుస్తారు. మన ప్రధాని నరేంద్ర మోదీని మర్యాదపూర్వకంగా కలుసుకుంటారు. నాలుగు రోజుల బిజీ పర్యటనలో ముందుగా అతను కోల్‌కతాలో అడుగు పెడతాడు. ఫుట్‌బాల్ అంటేనే శివాలుగే కోల్‌కతాలో డిసెంబర్ 12న మెస్సీ గడుపుతారు. ఈడెన్ గార్డెన్స్ లేదంటే సాల్ట్ లేక్ స్టేడియంలో జరిగే ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు గోట్ ఆట ఆడతారు. దీంతో పాటు భారత మాజీ కెప్టెన్ గంగూలీ, బాలీవుడ్ స్టార్ జాన్ అబ్రహం, ఫుట్‌బాల్ కెప్టెన్ బైచుంగ్ భూటియాలతో కలిసి సెవెన్–ఎ–సైడ్ సాఫ్ట్‌టచ్ ఫుట్‌బాల్ మ్యాచ్ ఆడతారు. సాధారణ ప్రేక్షకులను కూడా ఈ సెలబ్రిటీ మ్యాచ్ చూసేందుకు అనుమతిస్తారు. రూ. 3500 నుంచి మొదలయ్యే టికెట్లు కొనుగోలు చేయాల్సి ఉంటుందని నిర్వాహకుడు శతద్రు దత్తా తెలిపారు. మెస్సీ పర్యటనపై బెంగాల్ రాష్ట్ర ముఖ్యమంత్రి మమత బెనర్జీకి వెల్లడించినట్లు ఆయన చెప్పారు. దీనికి సంబంధించిన భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ఈ సందర్భంగా ఆమె పోలీసు శాఖను ఆదేశించినట్లు పేర్కొన్నారు. కోల్‌కతా పోలీస్ కమిషనర్ కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పక్కా ప్లాన్ చేస్తామని హామీ ఇచ్చినట్లు దత్తా చెప్పారు.

14న ముంబైలో హేమాహేమీలతో...

మరుసటి రోజు డిసెంబర్ 13న మెస్సీ అహ్మదాబాద్‌కు పయనమవుతాడు. అక్కడ అదానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగే ప్రైవేట్ కార్యక్రమంలో అతను పాల్గొంటాడు. అటునుంచి 14న నేరుగా ముంబై చేరుకుంటాడు. సీసీఐ బ్రాబోర్న్ ఏర్పాటు చేసే కార్యక్రమంలో హేమాహేమీలతో భేటీ అవుతాడు. వాంఖెడే స్టేడియంలో ముంబై ప్యాడెల్ కప్‌లో పాల్గొంటాడు. అధికారికంగా వెల్లడించనప్పటికీ బాలీవుడ్, స్పోర్ట్స్ దిగ్గజాలు షారుక్ ఖాన్, రణ్‌వీర్ సింగ్, ఆమిర్ ఖాన్, టైగర్ ష్రాఫ్, లియాండర్ పేస్, సచిన్ టెండూల్కర్, ధోని, రోహిత్ శర్మలతో టెన్నిస్ తరహా రాకెట్‌తో ఆడే ప్యాడెల్ ఈవెంట్‌లో మెస్సీ కాసేపు ఆడనున్నాడు. మరుసటి రోజు డిసెంబర్ 15న ఢిల్లీకి పయనమవుతాడు. అక్కడ మొదట భారత ప్రధాని నరేంద్ర మోదీతో మర్యాద పూర్వకంగా కలిశాక... ఫిరోజ్ షా కోట్లా స్టేడియంలో జరిగే ఢిల్లీ అంచె గోట్ కప్‌లో కింగ్ కోహ్లి, శుబ్‌మన్ గిల్‌లతో కలిసి ఆడతాడు. సరిగ్గా ధర్మశాలలో డిసెంబర్ 14న దక్షిణాఫ్రికాతో జరిగే టి20 అనంతరం ఢిల్లీలో ఈ ఈవెంట్ జరుగుతుందని ఢిల్లీ క్రికెట్ సంఘం (డీడీసీఏ) వర్గాలు తెలిపాయి.



మెస్సీతో ఈవెంట్ ప్రమోటర్ శతద్రు దత్తా (ఫైల్)



'బ్లిట్జ్'లో గుకేశ్ తడబాటు

సెయింట్ లూయిస్ (అమెరికా): గ్రాండ్ చెస్ టూర్‌లో భాగంగా జరుగుతున్న సెయింట్ లూయిస్ ర్యాపిడ్, బ్లిట్జ్ టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ 'బ్లిట్జ్' ఫార్మాట్‌లో తడబడ్డాడు. ర్యాపిడ్ విభాగంలో నిర్ణీత తొమ్మిది రౌండ్‌లు పూర్తికాగా... బ్లిట్జ్ విభాగంలో 18 రౌండ్‌లు నిర్వహిస్తున్నారు. పదో రౌండ్ ముగిశాక గుకేశ్ 3.5 పాయింట్లతో ఎనిమిదో స్థానంలో ఉన్నాడు. గుకేశ్ ఐదు గేమ్‌లను 'డ్రా' చేసుకొని... నాలుగు గేముల్లో ఓడిపోయి, ఒక గేమ్‌లో మాత్రమే విజయం సాధించాడు. మరో ఎనిమిది గేమ్‌లు జరగాల్సి ఉన్నాయి.

స్టీపుల్‌ఛేజ్‌లో అంకిత జాతీయ రికార్డు



న్యూఢిల్లీ: భారత ఒలింపియన్ అంకిత ధ్యాని జాతీయ రికార్డుతో ఇజ్రాయెల్‌లో జరిగిన గ్రాండ్ స్లామ్ జెరూసలెం అథ్లెటిక్స్ మీట్‌లో మెరిసింది. మహిళల 2000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్ రేసును అంకిత 6 నిమిషాల 13.92 సెకన్లలో పూర్తి చేసింది. తద్వారా పారుల్ చౌధరీ (6ని.14.38 సెకన్లు) నెలకొల్పిన జాతీయ రికార్డును 23 ఏళ్ల అంకిత సవరించింది. ఈ టైటిల్‌తో ఆమె 3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్‌కు అవసరమైన ర్యాంకింగ్ పాయింట్లను సంపాదించింది. దీంతో టోక్యోలో వచ్చే నెలలో జరిగే ప్రపంచ చాంపియన్‌షిప్‌కు అర్హత సాధించే అవకాశాల్ని మెరుగుపర్చుకుంది. ప్రపంచ ర్యాంకింగ్ కోటా ద్వారా టోక్యో ఈవెంట్‌లో 3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్‌కు అర్హత సాధించే అవకాశాలు మెరుగయ్యాయి. దీన్ని భారత అథ్లెటిక్స్ హెడ్ కోచ్ రాధాకృష్ణన్ నాయర్ ధ్రువీకరించారు. 'నిజమే. నిబంధనల ప్రకారం 2000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్ ప్రదర్శనను 3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్ అర్హత కోసం పరిగణిస్తారు. మెరుగైన ర్యాంకింగ్ ద్వారా ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే అవకాశాలుంటాయి' అని అన్నారు. గత నెలలో జరిగిన ప్రపంచ యూనివర్సిటీ క్రీడల్లోనూ అంకిత రాణించింది. 3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్‌లో పోటీపడిన ఆమె రజత పతకం గెలిచింది. గతేడాది పారిస్ ఒలింపిక్స్‌లో ఆమె 5000 మీటర్ల పరుగులో పోటీ పడింది. ఈ ఏడాది ఉత్తరాఖండ్ జాతీయ క్రీడల్లో 5000 మీటర్ల పరుగు, 3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్‌లో అంకిత బంగారు పతకాలు సాధించింది. రెండేళ్ల క్రితం 2023లో బ్యాంకాక్ ఆతిథ్యమిచ్చిన ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లోనూ ఆమె 5000 మీటర్ల విభాగంలో కాంస్య పతకం చేజిక్కించుకుంది.



స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం జాతీయ యుద్ధ స్మారకం వద్ద అమరులకు నివాళులర్పిస్తున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము



రాజ్‌ఘాట్‌లో మహాత్మాగాంధీకి నివాళులర్పిస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ



అమృత్‌సర్ సమీపంలోని అట్టారీ-వాఘా సరిహద్దు పోస్టు వద్ద స్వీట్లు పంచుకుంటున్న బీఎస్‌ఎఫ్ జవాన్లు



లాహౌల్-స్పితిలో ఏర్పాటైన కార్యక్రమంలో సంప్రదాయ దుస్తుల్లో హిమాచల్ మహిళలు

కన్నుల పండువగా...

న్యూఢిల్లీ: దేశ ప్రజలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'ఎక్స్'లో స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. మన స్వాతంత్య్ర సమర యోధుల కలలు సాకారం చేయడానికి, 'అభివృద్ధి చెందిన భారత్'నిర్మాణానికి పౌరులంతా కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు.

- ఎర్రకోట వద్ద జరిగే స్వాతంత్య్ర దినోత్సవానికి హాజరు కావడానికంటే ముందు ప్రధాని మోదీ తొలుత రాజ్‌ఘాట్ వద్ద మహాత్మాగాంధీకి ఘనంగా నివాళులర్పించారు. అక్కడి నుంచి ఎర్రకోటకు బయలుదేరి వెళ్లారు.
- పంద్రాగస్టు వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. మోదీ ఈసారి కాషాయ రంగు తలపాగా ధరించారు. తెల్లరంగు కుర్తా, కాషాయ రంగు బంద్‌గలా జాకెట్ ధరించి, జాతీయ జెండా ఎగురవేశారు. ఆయన గత 12 ఏళ్లుగా స్వాతంత్య్ర దినోత్సవాల్లో దేశ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా వేర్వేరు రంగులు తలపాగాలు ధరిస్తున్నారు.
- స్వాతంత్య్ర దినోత్సవాల ప్రసంగాల విషయంలో దివంగత ప్రధాని ఇందిరా గాంధీ రికార్డును మోదీ తిరగరాశారు. మోదీ వరుసగా 12 ఏళ్లు ఎర్రకోట నుంచి ప్రసంగించారు. ఈ విషయంలో జవహర్‌లాల్ నెహ్రూ తర్వాతి స్థానం మోదీదే కావడం విశేషం. నెహ్రూ ఎర్రకోట నుంచి వరుసగా 17 సార్లు స్వాతంత్య్ర దినోత్సవ ప్రసంగాలు చేశారు. ఇందిరా గాంధీ ప్రధానమంత్రి హోదాలో మొత్తం 16 సార్లు ఎర్రకోట నుంచి ప్రసంగించగా, ఇందులో వరుసగా ప్రతి ఏటా చేసిన ప్రసంగాలు 11 మాత్రమే.
- ఈసారి వేడుకలకు 5,000 మంది ప్రత్యేక అతిథులు హాజరయ్యారు. ప్రజలకు విశిష్టమైన సేవలు అందించిన అంగన్‌వాడీ కార్యకర్తలు, సర్పంచ్‌లు, లఖ్‌పతీ దీదీలతోపాటు వినూత్న సాగు పద్ధతులతో గుర్తింపు పొందిన రైతులను ప్రభుత్వం ప్రత్యేకంగా ఆహ్వానించింది. జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో విజేతలుగా నిలిచివారికి కూడా ఆహ్వానం పలికింది. త్వరలో స్పెషల్ ఒలింపిక్స్‌లో పాల్గొన్నబోతున్న భారత క్రీడాకారులు, కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు, అంతర్జాతీయ యోగా దినోత్సవంలో సేవలందించిన వాలంటీర్లు, పారిశుధ్య కార్మికులు సైతం హాజరయ్యారు.
- వేర్వేరు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 1,500 మంది తమ సంప్రదాయ వస్త్రాలు ధరించి రావడం చూపరులను విశేషంగా ఆకట్టుకుంది.
- ప్రధానమంత్రి ప్రసంగం ఏకంగా 103 నిమిషాల పాటు సాగింది.
- మోదీ తన ప్రసంగంలో పలు కవితలను ప్రస్తావించారు. 'సమృద్ధ భారత్'కోసం కృషి చేయాలని పిలుపునిస్తూ కష్టపడి పనిచేసేవారే చరిత్ర సృష్టిస్తారని కవిత రూపంలో చెప్పారు. ఉక్కు లాంటి రాళ్లను ముక్కలు చేసే సత్తా కలిగినవారికి కాలం కూడా సహకరిస్తుందని అన్నారు. కాలాన్ని మనకు అనువుగా మార్చుకోవడానికి ఇదే సరైన సమయమని ఉద్ఘాటించారు.
- రాజ్యసభలో ప్రతిపక్ష నేత అయిన మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో విపక్ష నేత అయిన రాహుల్ గాంధీ ఈసారి ఎర్రకోట వద్ద వేడుకులకు హాజరుకాకపోవడం చర్చనీయాంశంగా మారింది.



స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా అందంగా ముస్తాబైన ఎర్ర కోట ప్రాంగణం

'బిర్యానీ పార్టీ'తో నిరసన

ఛత్రపతి శంభాజీనగర్/థానె: ఛత్రపతి శంభాజీ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ జంతు వధ శాలలు, మాంసం దుకాణాల మూసివేతకు ఇచ్చిన ఆదేశాలు వివాదాస్పదమయ్యాయి. ఆగస్టు 15న స్వాతంత్య్ర దినోత్సవంతోపాటు గోకులాష్టమి, ఆగస్టు 20న జైన మతస్తుల 'పర్యుషన్ పర్వ'ల నాడు ఉపవాసాలు, ప్రార్థనలతో రోజంతా గడుపుతారు కాబట్టి మాంసం విక్రయాలపై నగర పరిధిలో నిషేధం విధిస్తున్నట్లు మంగళవారం ప్రకటించింది. దీనిని నిరసిస్తూ ఏఐఎంఐఎం నేత, మాజీ ఎంపీ ఇంతియాజ్ జలీల్ తన నివాసంలో శుక్రవారం బిర్యానీ పార్టీ ఏర్పాటు చేశారు. చికెన్ బిర్యానీతోపాటు, శాకాహార భోజనం కూడా సిద్ధం చేసి ఉంచా. మున్సిపల్ కమిషనర్ వస్తే శాకాహారం వడ్డించే వాణ్ని. మేం ఏం తినాలో, తినకూడదో ప్రభుత్వం చెప్పడం సరికాదు. ఇలాంటి వాటిని మానేయాలి. మాంసంపై నిషేధం విధించడం దురదృష్టకర ఘటన'అని ఇంతియాజ్ జలీల్ వ్యాఖ్యానించారు.

గగన్‌యాన్‌లో జీవన్-1 ప్రయోగం

షార్ డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్

సూళ్లూరుపేట: గగన్‌యాన్ ప్రాజెక్టులో భాగమైన జీవన్-1 ప్రయోగాన్ని ఈ ఏడాదిలోనే చేపడతామని షార్ డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్ తెలిపారు. శుక్రవారం షార్‌లో మీడియాతో మాట్లాడారు. జీవన్-1 అనంతరం జీ-2, జీ-3 లాంటి ప్రయోగాలుంటాయని తెలిపారు. పలు ప్రయోగాల అనంతరం 2035లో మానవ సహిత గగన్‌యాన్ మిషన్ ఉంటుందని పేర్కొన్నారు. జీఎస్‌ఎల్‌వీ రాకెట్ ద్వారా ప్రయోగించిన నైసార్ అద్భుతంగా పనిచేస్తోందని, ఆ ఉపగ్రహానికి ఉన్న 12 అడుగుల యాంటెన్నా కూడా విజయవంతంగా విచ్చుకుందని తెలిపారు. ఈ ఏడాదిలోనే పీఎస్‌ఎల్‌వీ ఎన్1 పేరుతో చేపట్టే మరో 5 ప్రయోగాలు కూడా వాణిజ్యపరమైనవేనని చెప్పారు. ఎల్‌వీఎం3 ఎం5 ద్వారా కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని లేదా ఈఓఎస్ ఉపగ్రహాన్ని కాని ప్రయోగించే అవకాశముందని వివరించారు. పీఎస్‌ఎల్‌వీ సీ62, సీ63 ప్రయోగాలు కూడా ఈ ఏడాది ఉంటాయని తెలిపారు.

అమెరికా-భారత్ కలిసి ముందుకు సాగుతాయి

- టారిఫ్‌ల ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా విదేశాంగ మంత్రి వ్యాఖ్య
- భారత్‌కు స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన మార్కో రుబియో

వాషింగ్టన్: అమెరికా-భారత్‌లు ఉమ్మడి దృక్పథంతో ఐక్యంగా ఉన్నాయని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో తెలిపారు. ప్రస్తుత ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించుకుంటూ మెరుగైన భవిష్యత్తు కోసం రెండు దేశాలు కలిసి పనిచేస్తున్నాయన్నారు. ట్రంప్ ప్రభుత్వం భారత్‌పై భారీగా టారిఫ్‌లను విధించడంతో రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ మంత్రి ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. స్వాతంత్య్ర దినోత్సవం జరుపుకుంటున్న భారత ప్రజలకు అమెరికా తరఫున, వ్యక్తిగతంగా మార్కో రుబియో శుక్రవారం శుభాకాంక్షలు తెలుపుతూ ఒక ప్రకటన విడుదల చేశారు. శాంతియుత, సౌభాగ్యవంత, భద్రత కలిగిన ఇండో-పసిఫిక్ లక్ష్యానికి ఇరు దేశాలు కట్టుబడి ఉన్నాయని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రాచీన కాలంలో బుల్లి తిమింగలం

ఆస్ట్రేలియా తీరంలో శిలజాన్ని గుర్తించిన సైంటిస్టులు

వెల్లింగ్టన్: సముద్రాల్లో తిరుగాడే తిమింగలం పరిమాణం ఎంత ఉంటుందో మనకు తెలుసు. భారీ ఆకారంతో టన్నుల కొద్దీ బరువుండే తిమింగలాలు ఉన్నాయి. కానీ, ప్రాచీన కాలంలో బుల్లి తిమింగలాలు ఉండేవని పరిశోధకులు గుర్తించారు. 2.5 కోట్ల సంవత్సరాల క్రితం నాటి తిమింగలం శిలాజం ఆస్ట్రేలియా సముద్ర తీరంలో లభించింది. దీనికి జంజూసిటస్ డులార్డి అని పేరు పెట్టారు. ఇది చాలా అరుదైన తిమింగలం అని చెబుతున్నారు. తిమింగలాల పరిణామ క్రమాన్ని తెలుసుకోవడానికి తోడ్పడుతుందని అంచనా వేస్తున్నారు. ఇది ఎంత చిన్నది అంటే సింగిల్ బెడ్‌కు సరిగ్గా సరిపోతుంది. దాని కండ్లు టెన్నిస్ బంతుల సైజ్‌లో ఉన్నాయి. పదునైన దంతాలు కనిపిస్తున్నాయి. అంటే ఇవి ఆహారం కోసం సముద్రంలో ఇతర జీవులను వేటాడేవని తెలుస్తోంది. దీని ముఖం కార్టూన్ క్యారెక్టర్ ముఖాన్ని పోలి ఉంది. బుల్లి తిమింగలాలు ఎలా అంతరించిపోయాయన్నది తెలుసుకోవడానికి సైంటిస్టులు ప్రయత్నిస్తున్నారు.

హైకోర్టు కంటే సుప్రీం ఎక్కువ కాదు: సీజేఐ గవాయ్

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు మాదిరిగానే హైకోర్టులు కూడా రాజ్యాంగ న్యాయస్థానాలేనని, ఇందులో ఒకటి ఎక్కువ మరొకటి తక్కువ అనే తేడా లేదని ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ పేర్కొన్నారు. అదేవిధంగా, ఫలానా వ్యక్తినే న్యాయమూర్తిగా సిఫారసు చేయాలంటూ సుప్రీంకోర్టు కొలీజియం హైకోర్టులకు ఆదేశాలు ఇవ్వజాలదని స్పష్టం చేశారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జస్టిస్ గవాయ్ ప్రసంగించారు. సుప్రీంకోర్టులో పనిచేసే న్యాయవాదులను హైకోర్టుల్లో న్యాయమూర్తులుగా నియమించే అంశాన్ని పరిశీలించాలంటూ అంతకుముందు బార్ అధ్యక్షుడు వికాస్ సింగ్ చేసిన వినతిపై ఆయనీ మేరకు స్పందించారు. 'జడ్జీల నియామకంపై సిఫారసులు చేయాల్సింది ముందుగా హైకోర్టులే. హైకోర్టులు అందజేసిన పేర్లలో కొన్నిటిని మాత్రం మేం సిఫారసు చేస్తాం. తిరిగి మాకు అందిన జాబితాలోని వారు మాత్రమే జడ్జీలుగా నియమితులవుతారు'అని ఆయన తెలిపారు.

సిందూర్‌లో స్వదేశీ సత్తా

స్వాతంత్య్ర దినోత్సవ ప్రసంగంలో ప్రత్యేకంగా ప్రస్తావించిన ప్రధాని మోదీ

జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులను పొట్టన పెట్టుకున్న పాకిస్తాన్ ముష్కరులకు, వారి పోషకులకు తగిన బుద్ధి చెప్పడమే లక్ష్యంగా భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు 100 రోజులు పూర్తయ్యాయి. శుక్రవారం స్వాతంత్య్ర దినోత్సవ ప్రసంగంలో ప్రధాని మోదీ ఈ ఆపరేషన్ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. స్వదేశీ ఆయుధాలు, రక్షణ వ్యవస్థలతో మనం విజయం సాధించామని చెప్పారు. 'మేడ్ ఇన్ ఇండియా'ఆయుధాల సత్తా ఏమిటో ప్రపంచానికి తెలిసొచ్చిందని అన్నారు. రక్షణ రంగంలో పూర్తి స్వావలంబన దిశగా ముందుకు సాగుతున్నామని వివరించారు.
ఈ నేపథ్యంలో ఆపరేషన్ సిందూర్‌లో శత్రువుపై ఎక్కుపెట్టిన స్వదేశీ ఆయుధాలు ఏమిటో తెలుసుకుందాం..

డి-4 డ్రోన్ల విధ్వంసకారి

డి-4 యాంటీ డ్రోన్ సిస్టమ్‌ను డీఆర్‌డీఓ అభివృద్ధి చేసింది. ఈ వ్యవస్థ ఆపరేషన్ సిందూర్‌లో తన వంతు సేవలు అందించింది. గగనతల నుంచి పాక్ చేసిన దాడులను గట్టిగా తిప్పికొట్టింది. సాధారణ డ్రోన్లతోపాటు చిన్నపాటి మానవ రహిత యుద్ధ విమానాలను నేలకూల్చగలదు. ఆపరేషన్ సిందూర్‌లో స్వదేశీ ఆయుధాలతోపాటు విదేశాల భాగస్వామ్యంతో అభివృద్ధి చేసిన ఆయుధాలను సైతం భారత సైన్యం ఉపయోగించింది. వాటిలో స్కై స్ట్రైకర్ కామికాజ్ డ్రోన్లు, బరాక్-8 మీడియం రేంజ్ సర్ఫేస్ టు ఎయిర్ మిస్సైళ్లు ఉన్నాయి. అంతేకాదు పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన ఉపగ్రహాలు కూడా ఈ ఆపరేషన్‌కు సహకరించాయి.





సమర్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్

సర్ఫేస్ టు ఎయిర్ మిస్సైల్ ఫర్ అష్యూర్డ్ రిటాలియేషన్(సమర్) అనేది ఇండియా గగనతల రక్షణ వ్యవస్థలో ఒక భాగం. పాక్ సైన్యం ప్రయోగించిన డ్రోన్లు, క్షిపణులను మధ్యలోనే కూల్చివేసింది. భారత వైమానిక దళం సహకారంతో భారత రక్షణ రంగ పరిశ్రమలు దీన్ని రూపొందించాయి. గగనతలంలో తక్కువ ఎత్తులో దూసుకొచ్చే క్షిపణులు, మానవ రహిత విమానాలను ఇది పేల్చేయగలదు. భారత సైన్యంలో ఇది కీలక అస్త్రంగా మారింది.

బ్రహ్మోస్ సూపర్ సానిక్ క్రూయిజ్ మిస్సైళ్లు



పాకిస్తాన్‌తోపాటు పాక్ ఆక్రమిత కాశ్మీర్(పీఓకే)లోని ఉగ్రవాదుల స్థావరాలు, శిక్షణ శిబిరాలు, ఎయిర్‌బేస్‌లపై భారత సైన్యం మే 10వ తేదీన అత్యంత కచ్చితత్వంలో కూడిన దాడులు ప్రారంభించింది. ఇందుకు బ్రహ్మోస్ సూపర్ సానిక్ క్రూయిజ్ మిస్సైళ్లు ఎంతగానో తోడ్పడ్డాయి. బ్రహ్మోస్ క్షిపణుల దెబ్బకు పాకిస్తాన్‌లో 20 శాతం వైమానిక స్థావరాలు ధ్వంసమయ్యాయి. ఈ క్షిపణులను భారత రక్షణ శాఖ ఆధ్వర్యంలోని డీఆర్‌డీఓపాటు రష్యా రక్షణ పరిశోధన సంస్థ కలిసి సంయుక్తంగా అభివృద్ధి చేశాయి. కచ్చితత్వంతో కూడిన దాడులు చేయడానికి ఇవి ప్రపంచంలో అత్యంత అధునాతనమైన క్షిపణులుగా గుర్తింపు పొందాయి. బ్రహ్మోస్ మిస్సైళ్లను సబ్‌మెరైన్లు, నౌకలు, యుద్ధ విమానాలతోపాటు భూభాగం నుంచి ప్రయోగించవచ్చు. ఇవి ధ్వని వేగం కంటే మూడు రెట్లు ఎక్కువ వేగంతో దూసుకెళ్తాయి. ప్రయోగించామంటే లక్ష్యాన్ని తాకాల్సిందే. గురితప్పే ప్రసక్తే లేదు. బ్రహ్మోస్ అంటే కేవలం ఆయుధం కాదు, భారతీయ సైనిక శక్తికి ప్రతీక అని భారత రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభివర్ణించారు.

ఆకాశ్ క్షిపణి వ్యవస్థ



భారతదేశ ఐరన్ డోమ్‌గా పేరుగాంచిన ఆకాశ్ క్షిపణులు ఆపరేషన్ సిందూర్‌లో కీలక పాత్ర పోషించాయి. డీఆర్‌డీఓ అభివృద్ధి చేసిన ఈ మిస్సైళ్లను బీడీఎల్ తయారు చేసింది. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత సైన్యం దాడులు ప్రారంభించిన తర్వాత పాక్ సైన్యం ప్రతిదాడులకు దిగింది. డ్రోన్లు, మిస్సైళ్లు ప్రయోగించింది. ఇవి చాలావరకు తుర్కియే, చైనా సరఫరా చేసినవే. ఆకాశ్ మిస్సైల్ సిస్టమ్ వాటిని సమర్థంగా తుత్తునియలు చేసింది. భారత భూభాగానికి ఎలాంటి నష్టం వాటిల్లలేదు. ఆకాశ్ అనేది షార్ట్ రేంజ్ సర్ఫేస్ టు ఎయిర్ మిస్సైల్. ఇజ్రాయెల్ ఐరన్ డోమ్‌తో దీన్ని పోల్చుతుంటారు. ఆకాశ్ క్షిపణి 25 కిలోమీటర్ల దూరంలోని నాలుగు లక్ష్యాలను ఒకేసారి ఛేదించగలదు.

- సాక్షి, నేషనల్ డెస్క్

బెంగాల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

బిహార్‌కు చెందిన 10 మృతి, 25 మందికి గాయాలు

ఐదుగురి పరిస్థితి విషమం

బుర్ద్వాన్/పట్నా: బెంగాల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. దైవ దర్శనానికి వచ్చిన యాత్రికుల బస్సు.. ఆగి ఉన్న ట్రక్కును ఢీకొట్టింది. బస్సులో ఉన్న 10 మంది మృతి చెందారు. 25 మంది గాయపడ్డారు. వారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. బిహార్‌లోని చంపారన్ జిల్లా మోతీహారికి చెందిన 45 మంది యాత్రికులు.. ఆగస్టు 8న తీర్థ యాత్రకు వచ్చారు. మొదట దేవ్‌ఘర్‌ను, ఆ తరువాత దక్షిణ 24 పరగణా జిల్లాలోని గంగసాగర్‌ను దర్శించుకున్నారు. శుక్రవారం ఉదయం తిరుగు ప్రయాణమయ్యారు. ఈస్ట్ బర్ధమాన్‌లోని జాతీయ రహదారి వెంబడి వెళ్తుండగా బస్సు నియంత్రణ కోల్పోయింది. రోడ్డు పక్కన ఆగి ఉన్న ట్రక్కు వెనుక భాగాన్ని ఢీకొట్టి బోల్తా పడింది. ప్రమాదం జరిగిన వెంటనే పెద్ద శబ్దం వినిపించింది. అది విన్న స్థానికులు సంఘటనా స్థలానికి పెద్ద ఎత్తున చేరుకున్నారు. పోలీసులకు సమాచార అందించి సహాయ కార్యక్రమాలు చేపట్టారు. పోలీసులు, సహాయక సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని చికిత్స కోసం బుర్ద్వాన్ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. అప్పటికే పది మంది మరణించినట్లు వైద్యులు ప్రకటించారు. మృతుల్లో ఎనిమిది మంది పురుషులు, ఇద్దరు మహిళలున్నారు. బస్సు డ్రైవర్ నిద్రమత్తులో బస్సును నడుపుతూ ఉండటం వల్లే ప్రమాదం జరిగిందని ప్రాథమిక దర్యాప్తులో తెలుస్తోంది. ప్రమాదంలో బస్సు ముందు భాగం తీవ్రంగా దెబ్బతింది. దీంతో బస్సులో చాలా మంది ప్రయాణికులు చిక్కుకుపోయారు. మృతులను గుర్తించడానికి, వారి కుటుంబాలను సంప్రదించడానికి అధికారులు కృషి చేస్తున్నారు. ప్రాణాలతో బయటపడిన వారిని స్వస్థలానికి పంపించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రమాదంపై బిహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 2 లక్షల ఎక్స్‌గ్రేషియా, గాయపడిన ప్రతి ప్రయాణికుడికి రూ. 50,000 పరిహారం ప్రకటించారు. గాయపడిన వారికి సరైన చికిత్స అందించాలని పశ్చిమ బెంగాల్‌లోని ప్రభుత్వంతో మాట్లాడినట్లు తెలిపారు. చనిపోయినవారి మృతదేహాలు వారి స్వస్థలానికి త్వరగా చేరుకునేలా చూడాలని అధికారులను ఆయన ఆదేశించారు.

దర్గా గోడ కూలి ఆరుగురు మృతి

న్యూఢిల్లీ: దేశ రాజధానిలో శుక్రవారం ఘోరం జరిగింది. హుమాయూన్ టూంబ్స్ ఆవరణలోని షరీఫ్ పతే షా దర్గా గోడ కూలి ఆరుగురు మృతి చెందారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. 11 మందిని శిథిలాల నుంచి బయటికి తీసి ఆస్పత్రులకు తరలించారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉండగా, మిగిలిన క్షతగాత్రుల ఆరోగ్యం స్థిరంగా ఉంది. సహాయక చర్యల అనంతరం దర్గాలోని సీసీటీవీ ఫుటేజీని నిజాముద్దీన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ స్థలాన్ని పూర్తిగా మూసేశారు. దర్గా సంరక్షకులను ప్రశ్నిస్తున్నారు. ఢిల్లీలోని నిజాముద్దీన్ ప్రాంతంలో ఉన్న హుమాయున్ సమాధి.. పర్యటాకంగా చాలా ప్రసిద్ధి పొందింది. యునెస్కో గుర్తింపు పొందిన ప్రపంచ వారసత్వ ప్రదేశం. 16వ శతాబ్ద కాలంలో నిర్మించిన ఈ టూంబ్స్‌ను చూసేందుకు ఏడాది పొడవునా సందర్శకులు వస్తుంటారు. అయితే.. ప్రమాదం జరిగిన దర్గాను 25 నుంచి 30 సంవత్సరాల మధ్య నిర్మించి ఉంటారని భావిస్తున్నారు.

నాగాలాండ్ గవర్నర్ గణేశన్ కన్నుమూత

సాక్షి, చెన్నై: నాగాలాండ్ గవర్నర్ ఇల గణేశన్(80) శుక్రవారం కన్నుమూశారు. చెన్నైలోని అపోలో ఆస్పత్రి ఐసీయూలో గత కొద్ది రోజులుగా చికిత్స పొందుతున్న గణేశన్ శుక్రవారం సాయంత్రం తుదిశ్వాస విడిచారని కోహిమా రాజ్‌భవన్ వెల్లడించింది. ఈ నెల 8వ తేదీన చెన్నైలోని తన నివాసంలో కిందపడిపోయిన గణేశన్ తలకు తీవ్ర గాయమైంది. అప్పటి నుంచి ఆస్పత్రి ఐసీయూలో వైద్య చికిత్సలు కొనసాగుతున్నాయని రాజ్‌భవన్ పేర్కొంది. కాగా, గణేశన్ భౌతిక కాయాన్ని టీ నగర్‌లోని నివాసంలో ఉంచారు. శనివారం చెన్నైలో అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు జరిగే అవకాశాలున్నాయి. నాగాల్యాండ్ 21వ గవర్నర్‌గా 2023 ఫిబ్రవరిలో గణేశన్ నియమితులయ్యారు.

ఉద్యోగాన్ని వదులుకుని...

ఇల గణేశన్ తమిళనాడులోని తంజావూరులో 1945 ఫిబ్రవరి 16వ తేదీన జన్మించారు. చిన్నతనంలోనే తండ్రి మరణించడంతో సోదరుడే ఆయనకు మార్గదర్శి అయ్యారు. ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాలకు ఆకర్షితుడైన గణేశన్ ఉద్యోగాన్ని సైతం వదులుకుని 1970లో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తగా మారారు. దాదాపు 20 ఏళ్లపాటు వివిధ హోదాల్లో ఆర్‌ఎస్‌ఎస్‌లో పనిచేశారు. 1991లో బీజేపీలో చేరారు. రాష్ట్ర శాఖ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా అనంతరం ఆ పార్టీ జాతీయ కార్యదర్శిగా, రెండేళ్లపాటు జాతీయ ఉపాధ్యక్షులలో ఒకరిగా పనిచేశారు. 2006- 2009 సంవత్సరాల్లో తమిళనాడు బీజేపీ అధ్యక్షుడిగా ఉన్నారు. 2021 ఆగస్టు 27న మణిపూర్ గవర్నర్‌గా, 2022 జూలై నుంచి నవంబర్ వరకు పశ్చిమబెంగాల్ గవర్నర్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాలను అనుసరించినా, తమిళనాడులోని రెండు ప్రధాన ద్రవిడ పార్టీల ముఖ్య నేతలతో స్నేహ సంబంధాలు కొనసాగించారు.

జార్ఖండ్ మంత్రి రాందాస్ సోరెన్ మృతి

రాంచీ: జార్ఖండ్ విద్యాశాఖ మంత్రి రాందాస్ సోరెన్(62) శుక్రవారం తుదిశ్వాస విడిచారు. ఈ నెల 2వ తేదీన జాంషెడ్‌పూర్‌లోని తన నివాసంలోని బాత్ రూంలో జారిపడి తీవ్రంగా గాయపడ్డారు. రాంచీలోని ఆస్పత్రి నుంచి మరింత మెరుగైన చికిత్స కోసం అదే రోజు హెలికాప్టర్‌లో ఢిల్లీలోని ఓ ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి ఆయన ఐసీయూలోనే చికిత్స పొందుతున్నారు. వెంటిలేటర్‌పై కొనసాగుతున్న ఆయన ఆరోగ్యం పరిస్థితి విషమించి తుదిశ్వాస విడిచినట్లు జార్ఖండ్‌లోని అధికార జేఎంఎం పార్టీ ప్రతినిధి కునాల్ సర్కాగి తెలిపారు.

కలకత్తాలో సుప్రీంకోర్టును ఎప్పుడు ఏర్పాటు చేశారు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ



బ్రిటిషర్ల కాలంలో చేసిన చట్టాలు

ఆంగ్లేయులు భారతదేశానికి ప్రధానంగా వ్యాపారం కోసం వచ్చినప్పటికీ ఆ తర్వాత క్రమంగా ఇక్కడ పరిపాలనపై పట్టు సాధించారు. ఇందులో భాగంగా అనేక చట్టాలకు రూపకల్పన చేశారు. వైస్రాయ్‌లు, గవర్నర్ జనరల్స్ భారతదేశంలో వివిధ సంస్కరణలు ప్రవేశపెట్టారు. మనదేశంలో ప్రస్తుతం అమలవుతున్న అనేక చట్టాలు ఈ రూపం సంతరించుకోవడానికి బ్రిటిషర్ల కాలంనాటి విధానాలు, ఉద్యమాలు, సంస్కరణలు దోహదం చేశాయి. వీటికి సంబంధించిన ముఖ్యమైన అంశాలను పరిశీలిద్దాం..

- మనదేశంలో స్థానిక స్వపరిపాలన చట్టాలను 1880–84లో చేశారు. లార్డ్ రిప్పన్‌ను భారతదేశంలో స్థానిక పరిపాలనా పితామహుడిగా పేర్కొంటారు.
- లార్డ్ రిప్పన్ 'ఇల్బర్టు బిల్లు'ను ప్రవేశపెట్టాడు. దీన్ని గవర్నర్ జనరల్ కార్యనిర్వాహక మండలిలో న్యాయశాఖ సభ్యుడైన ఇల్బర్ట్ రూపొందించాడు. దీని ద్వారా భారతీయ మెజిస్ట్రేట్లకు యూరోపియన్ నిందితులను విచారించడానికి అధికారం లభించింది.
- లార్డ్ లాన్స్‌డౌన్ గవర్నర్ జనరల్ కాలంలో 'రెండో కర్మాగారాల చట్టం' అమల్లోకి వచ్చింది.
- భారతదేశంలో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను 1866లో ఏర్పాటు చేశారు. దీన్ని లార్డ్ డఫ్రిన్ నెలకొల్పారు.
- 'రైతు బాంధవుడు'గా గుర్తింపు పొందిన వైస్రాయ్ లార్డ్ కర్జన్. ఇతడినే 'డూ క్విక్ వైస్రాయ్'గా పేర్కొంటారు.
- లార్డ్ కర్జన్ భారతదేశంలో ప్రత్యేక పురావస్తు శాఖను ఏర్పాటు చేశాడు. పురావస్తు శాఖ మొట్టమొదటి డైరెక్టర్ జనరల్‌గా సర్ జాన్ మార్షల్ పని చేశాడు.
- 1859లో బెంగాల్‌లో భూమిశిస్తు చట్టాన్ని ప్రవేశపెట్టారు.
- దేశభాషా పత్రికల చట్టాన్ని అమలు జరిపిన గవర్నర్ జనరల్ 'లార్డ్ లిట్టన్'.
- లార్డ్ కానింగ్ 1862లో స్వదేశీ సంస్థానాధిపతుల బ్రిటిష్ రాజప్రతినిధులను సామంతులుగా ప్రకటించాడు.
- విక్టోరియా రాణి 1877లో 'భారతదేశ చక్రవర్తి' అనే బిరుదు ధరించారు.
- 1885లో భారత జాతీయ కాంగ్రెస్ ఆవిర్భవించింది.
- లార్డ్ కర్జన్ శాశ్వత కౌలు పద్ధతి ద్వారా నిజాం నుంచి బీరార్ ప్రాంతాన్ని వేరు చేసి బ్రిటిష్ పాలిత ప్రాంతాల్లో విలీనం చేశాడు.
- భూటాన్‌ను ఆక్రమించిన గవర్నర్ జనరల్ 'జాన్ లారెన్స్'. బ్రిటిష్ ఇండియా, భూటాన్ మధ్య జరిగిన సంధి పేరు 'సించులా'.
- లార్డ్ కర్జన్ భారత్‌లో తొలిసారిగా సీఐడీలను ప్రవేశపెట్టాడు. ఇతడు విశ్వవిద్యాలయాల చట్టాన్ని కూడా రూపొందించాడు. 1901లో బెంగాల్‌లోని 'పూసా'లో ఇంపీరియల్ అగ్రికల్చరల్ ఇన్‌స్టిట్యూట్ (వ్యవసాయ పరిశోధనా కేంద్రం) నెలకొల్పాడు.
- 1905లో బెంగాల్‌ను విభజించిన బ్రిటిష్ రాజప్రతినిధి 'లార్డ్ కర్జన్'. ఇతడి కాలంలోనే ప్రత్యేక రైల్వే బోర్డును నెలకొల్పారు.
- 1906లో అఖిల భారత ముస్లింలీగ్‌ను స్థాపించారు. ఇదే సంవత్సరం కేంద్ర వ్యవసాయ శాఖను ఏర్పాటు చేశారు.
- జాతీయ కాంగ్రెస్‌ను, ముస్లింలను సంతృప్తిపరచడానికి బ్రిటిష్ ప్రభుత్వం 1909లో మింటో మార్లే సంస్కరణల చట్టం ప్రవేశపెట్టింది. ఈ సంస్కరణలు 'విభజించు, పాలించు' విధానానికి నాంది పలికాయి.
- 1911లో హార్డింజ్ కాలంలో దేశ రాజధానిని కలకత్తా నుంచి ఢిల్లీకి మార్చారు. సుతమతి, కాళీఘట్టం, గోవిందపూర్ గ్రామాల కలయికతో కలకత్తా నగరం ఏర్పడింది.
- ఇంగ్లండ్ చక్రవర్తి అయిదో జార్జ్ భారతదేశాన్ని 1911లో సందర్శించాడు.

భారతదేశంలో 1773–1857 మధ్యకాలంలో ఈస్టిండియా కంపెనీ వ్యాపార, వ్యవహారాలను నియంత్రించడానికి బ్రిటిష్ పార్లమెంటు కొన్ని చట్టాలను రూపొందించింది. వీటినే 'చార్టర్ చట్టాలు' అంటారు.

రెగ్యులేటింగ్ చట్టం-1773

భారతదేశానికి వ్యాపార రీత్యా వచ్చిన ఈస్టిండియా కంపెనీ వ్యవహారాలను నియంత్రించడానికి బ్రిటిష్ పార్లమెంట్ చేసిన తొలి చట్టం ఇది. దీన్ని భారతదేశానికి సంబంధించి 'మొట్టమొదటి లిఖిత చట్టం'గా పేర్కొంటారు. ఈస్టిండియా కంపెనీకి ఈ చట్టం ద్వారా మొదటిసారిగా రాజకీయ, పరిపాలన అధికారాలు సంక్రమించాయి. కంపెనీ వ్యవహారాలను నియంత్రించే ఉద్దేశంతో రూపొందించడం వల్ల దీన్ని 'రెగ్యులేటింగ్ చట్టం' అంటారు. దీని ద్వారా బెంగాల్ గవర్నర్ హోదాను 'గవర్నర్ జనరల్ ఆఫ్ బెంగాల్'గా మార్చారు. ఇతడికి సలహాలు ఇవ్వడానికి నలుగురు సభ్యులతో కార్యనిర్వాహక మండలిని ఏర్పాటు చేశారు. 'వారన్ హేస్టింగ్స్'ను తొలి గవర్నర్ జనరల్‌గా నియమించారు. కౌన్సిల్‌లో మెజారిటీ ఆధారంగా నిర్ణయాలు తీసుకునేవారు. గవర్నర్ జనరల్‌కు కాస్టింగ్ ఓటు మాత్రమే ఉండేది. 1774లో ఒక ప్రధాన న్యాయమూర్తి, ముగ్గురు సాధారణ న్యాయమూర్తులతో కలకత్తాలో సుప్రీంకోర్టును ఏర్పాటు చేశారు. 'ఎలిజా ఇంఫే' సుప్రీంకోర్టు మొదటి ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరించాడు.

పిట్స్ ఇండియా చట్టం-1784

రెగ్యులేటింగ్ చట్టంలోని లోపాలను సవరించడానికి బ్రిటిష్ పార్లమెంటు ఈ చట్టాన్ని 1784లో ఆమోదించింది. నాటి బ్రిటన్ ప్రధాని 'విలియం పిట్' ఈ చట్టాన్ని ప్రతిపాదించారు. దీని ద్వారా 'బోర్డ్ ఆఫ్ కంట్రోల్' అనే నూతన విభాగాన్ని ఏర్పాటు చేసి కంపెనీ రాజకీయ వ్యవహారాలను దానికి అప్పగించారు. అప్పటికే ఉన్న కోర్ట్ ఆఫ్ డైరెక్టర్స్‌ను వాణిజ్య వ్యవహారాలకే పరిమితం చేశారు. గవర్నర్ జనరల్ కార్యనిర్వాహక మండలికి ప్రెసిడెన్సీ ప్రాంతాలపై ప్రత్యక్ష నియంత్రణ అధికారాన్ని ఇచ్చారు. కార్యనిర్వాహక మండలి సభ్యుల సంఖ్యను నాలుగు నుంచి మూడుకు తగ్గించారు.

చార్టర్ చట్టం-1793

ఈ చట్టం ద్వారా గవర్నర్ జనరల్ ఆఫ్ ఇండియా అధికారాలను విస్తృతం చేశారు. కంపెనీ వ్యాపార గుత్తాధిపత్యాన్ని మరో 20 ఏళ్లకు పొడిగించారు. బోర్డు కార్యదర్శిని పార్లమెంటులో కూర్చోవడానికి అనుమతించారు. బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ఉద్యోగుల జీతభత్యాల ఖర్చును భారత రెవెన్యూ నుంచి వినియోగించేవిధంగా, యుద్ధ అవసరాలకు మొత్తం రెవెన్యూను మళ్లించే విధంగా మార్పులు చేశారు.

చార్టర్ చట్టం-1813

ఈస్టిండియా కంపెనీ చార్టర్‌ను మరో 20 ఏళ్లు పొడిగించారు. భారతదేశ వర్తకంపై కంపెనీ గుత్తాధిపత్యాన్ని తొలగించి కేవలం పాలనాపరమైన సంస్థగా మార్చారు. పన్నులు విధించడం, అవి చెల్లించని వారిపై చర్యలను తీసుకునే అధికారాన్ని స్థానిక సంస్థలకు ఇచ్చారు. భారతీయులకు మత, విద్యాపరమైన అధ్యయనం కోసం లక్ష రూపాయలతో నిధి ఏర్పాటు చేశారు. సివిల్ సర్వెంట్లకు శిక్షణా సదుపాయాన్ని కల్పించారు. ఈ చట్టం ద్వారా భారత్‌లో వర్తకం చేయడానికి అందరికీ అవకాశం కల్పించారు.

చార్టర్ చట్టం-1833

ఈస్టిండియా కంపెనీ పాలనను మరో 20 ఏళ్లకు పొడిగించారు. బెంగాల్ గవర్నర్ జనరల్ హోదాను 'ఇండియన్ గవర్నర్ జనరల్'గా మార్చారు. ఈ హోదాలో భారత మొదటి గవర్నర్ జనరల్ విలియం బెంటింగ్. రాష్ట్ర ప్రభుత్వాల శాసనాధికారాలను రద్దు చేసి కార్యనిర్వాహక మండలి సమేతుడైన గవర్నర్ జనరల్‌కు పూర్తి శాసనాధికారాలు కల్పించారు. భారతీయ శాసనాలను క్రోడీకరించడానికి భారతీయ 'లా' కమిషన్‌ను నియమించారు. దీనికి తొలి అధ్యక్షుడు లార్డ్ మెకాలే.

చార్టర్ చట్టం-1853

చార్టర్ చట్టాల్లో చివరిది. అతి తక్కువ కాలం అమల్లో ఉన్న చార్టర్ చట్టం ఇదే. దీని ద్వారా కంపెనీ పాలనను పొడిగించలేదు. ఇకపై ప్రభుత్వ ఉద్యోగుల ఎంపిక కాంపిటీటివ్ పరీక్షల ఆధారంగానే జరుగుతుందని నిర్దేశించారు. గవర్నర్ జనరల్ సాధారణ మండలి అధికారాలను శాసన, కార్యనిర్వాహక విధులుగా విభజించారు. శాసనాలు రూపొందించే ప్రక్రియ కోసం 'ఇండియన్ సెంట్రల్ లెజిస్లేటివ్ కౌన్సిల్'ను ఏర్పాటు చేశారు. ఇది బ్రిటిష్ పార్లమెంటులా విధులు నిర్వర్తిస్తుంది. అందువల్ల దీన్ని 'మినీ పార్లమెంట్'గా పేర్కొంటారు. కేంద్ర లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో మొదటిసారిగా స్థానిక ప్రతినిధులకు ప్రాతినిధ్యం కల్పించారు.

భారత రాజ్యాంగ చట్టం-1858

1857 సిపాయిల తిరుగుబాటుతో భారతదేశంలో కంపెనీ పాలన అంతమై చక్రవర్తి (బ్రిటిష్ రాజు/రాణి) పరిపాలన వచ్చింది. బ్రిటిష్ రాణి 1858 నవంబర్ 1న భారత పరిపాలనా అధికారాన్ని నేరుగా చేపడుతూ ఒక ప్రకటన జారీ చేశారు. గవర్నర్ జనరల్ ఆఫ్ ఇండియా హోదాను వైస్రాయ్ ఆఫ్ ఇండియాగా మార్చారు. ఇతడు బ్రిటిష్ రాణి పేరుపై దేశ పాలన నిర్వహిస్తాడు. మొదటి వైస్రాయ్ చార్లెస్ కానింగ్. 'భారత రాజ్య కార్యదర్శి' అనే కొత్త పదవిని సృష్టించారు. ఇతడు బ్రిటిష్ మంత్రివర్గానికి చెందిన వ్యక్తి. అన్ని విషయాల్లో ఇతడిదే తుది నిర్ణయం. ఇతడి కార్యాలయం లండన్‌లోనే ఉండేది. ఇతడికి సహాయంగా 15 మంది సభ్యులతో సలహా మండలి ఏర్పాటు చేశారు. మొదటి కార్యదర్శి చార్లెస్ వుడ్.

కౌన్సిల్ చట్టం-1861

దీని ద్వారా గవర్నర్ జనరల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుల సంఖ్యను అయిదుకు పెంచి ఒక్కో సభ్యుడికి ఒక్కో అంశంపై అధికారం ఇచ్చారు. సెంట్రల్ లెజిస్లేటివ్ కౌన్సిల్ ఏర్పాటు చేశారు. దీనికి నామమాత్రపు అధికారాలు ఇచ్చారు. 1860లో బడ్జెట్ పద్ధతి ప్రవేశపెట్టారు.

కౌన్సిల్ చట్టం-1892

కౌన్సిల్ చట్టం–1861లోని లోపాలను సరిదిద్దడానికి ఈ చట్టం చేశారు. కేంద్ర శాసనసభలో అనధికార సభ్యుల సంఖ్య 10కి తగ్గకుండా 16 కంటే మించకుండా.. రాష్ట్ర శాసనసభల్లో 8 మందికి తక్కువ కాకుండా 20 మందికి మించకుండా నియంత్రించారు. ఈ చట్టం ద్వారా శాసన మండలి అధికారాలను విస్తృతం చేశారు. బడ్జెట్‌పై చర్చించడం లాంటి అధికారాలను కల్పించారు. గవర్నర్/గవర్నర్ జనరల్ ముందస్తు అనుమతితో ప్రజా ప్రయోజనాల దృష్ట్యా శాసనసభల్లో ప్రభుత్వాన్ని ఉద్దేశించి ప్రశ్నలు వేయడానికి సభ్యులకు అవకాశం కల్పించారు.

మింటో-మార్లే సంస్కరణలు-1909

సెంట్రల్, స్టేట్ లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యుల సంఖ్యను, అధికారాలను పెంచారు. తొలిసారిగా ప్రత్యక్ష ఎన్నిక విధానం ప్రవేశపెట్టారు. ముస్లింలకు ప్రత్యేకంగా నియోజకవర్గాలను ఏర్పాటు చేశారు. వైస్రాయ్, గవర్నర్ల కార్యనిర్వాహక మండలిలో తొలిసారిగా భారతీయులకు సభ్యత్వం కల్పించారు. ఈవిధంగా సభ్యత్వాన్ని పొందిన తొలి భారతీయుడు సత్యేంద్ర ప్రసాద్ సిన్హా.

మాంటెగ్-చెమ్స్‌ఫర్డ్ సంస్కరణలు-1919

ఇవి నూతన రాజ్యాంగ సంస్కరణలకు సంబంధించినవి. రాష్ట్రాల్లో ద్వంద్వ పాలనను ప్రవేశపెట్టారు. ప్రజల ద్వారా ఎంపికైన ముఖ్యమంత్రి నాయకత్వంలోని మంత్రి మండలికి విద్య, ఆరోగ్యం, పారిశుధ్యం మొదలైన అంశాలపై అధికారం కల్పించారు. వీటిని బదిలీ చేసిన అధికారాలుగా పేర్కొన్నారు. రెవెన్యూ, ఆర్థిక, శాంతి భద్రతలు మొదలైన అంశాలను రిజర్వ్‌డ్ అధికారాల పేరుతో బ్రిటిష్ గవర్నర్ చేతికి ఇచ్చారు. మత ప్రాతినిధ్యాన్ని సిక్కులు, క్రిస్టియన్లు, ఆంగ్లో–ఇండియన్లు, ఐరోపా వారికి కూడా వర్తింపజేశారు. దేశంలో మొదటిసారి కేంద్ర స్థాయిలో ద్విసభా పద్ధతిని ప్రవేశపెట్టారు. ఎగువసభను రాష్ట్రాల మండలి (కౌన్సిల్ ఆఫ్ స్టేట్స్), దిగువసభను కేంద్ర శాసనసభ (సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీ)గా వ్యవహరించారు.

భారత ప్రభుత్వ చట్టం -1935

దీని ప్రకారం అఖిల భారత సమాఖ్య ఏర్పాటుకు నిర్ణయించారు. కేంద్రం, రాష్ట్రాల మధ్య 3 జాబితాల ప్రకారం అధికార విభజన చేశారు. రాష్ట్రాల్లోని ద్వంద్వ ప్రభుత్వాన్ని రద్దుచేసి కేంద్రంలో ద్వంద్వ ప్రభుత్వాన్ని ప్రతిపాదించారు. కేంద్రంలో పాలనాంశాలను రిజర్వ్‌డు, ట్రాన్స్‌ఫర్డ్ అంశాలుగా విభజించారు. ఈ చట్టం ద్వారా బర్మాను భారతదేశం నుంచి వేరు చేశారు. ఒరిస్సా, సింధ్ అనే రెండు కొత్త ప్రావిన్సులను ఏర్పాటు చేశారు. కేంద్రంలో ఫెడరల్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, రాష్ట్రాల్లో పబ్లిక్ సర్వీస్ కమిషన్లను ఏర్పాటు చేశారు. భారతదేశంలో విత్త విధానం, రుణ నియంత్రణ కోసం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను స్థాపించారు.

- **విలియం బెంటింగ్ మనదేశంలో ఆధునిక విద్యను ప్రవేశపెట్టాడు. లార్డ్ మెకాలే దీనికి సంబంధించి సూచనలు చేశాడు.**
- **అఫ్గానిస్తాన్ - పాకిస్తాన్ మధ్య 'డ్యూరాండ్ సరిహద్దు రేఖ'ను 1892లో లార్డ్ లాన్‌డౌన్ రాజప్రతినిధి కాలంలో నిర్ణయించారు. రెండో హార్డింజ్ రాజప్రతినిధిగా ఉన్న కాలంలో చైనా - భారత్ మధ్య మెక్‌మోహన్ సరిహద్దు రేఖను నిర్ణయించారు.**
- **మొదటి ప్రపంచ యుద్ధవీరుల స్మారక చిహ్నంగా ఢిల్లీలో ఇండియాగేట్‌ను నిర్మించారు. ఈ ప్రపంచ యుద్ధ కాలంలో బ్రిటిష్ గవర్నర్ జనరల్ 'లార్డ్ చెమ్స్‌ఫర్డ్'.**
- **బ్రిటిషర్లు రూపొందించిన రాజ్యాంగ సంస్కరణ చట్టాలన్నింటిలో భారత ప్రభుత్వ చట్టం 1935 వివరణాత్మకమైంది. ఇందులో 321 ప్రకరణలు, 10 షెడ్యూళ్లు, 14 భాగాలు ఉన్నాయి.**

ప్రకటనకు బలమైన వాదనే సరైంది

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

మెంటల్ ఎబిలిటీ



ప్రకటనలు - వాదనలు

'ప్రకటనలు – వాదనలు' చాప్టర్‌లోని ప్రశ్నలు ప్రకటనల రూపంలో ఉంటాయి. ప్రకటనల కింద రెండు వాదనలు అవును లేదా కాదు అని ఇస్తారు. ఈ ప్రశ్నలకు జవాబు గుర్తించడానికి సూచనలు..

- ఈ చాప్టర్‌లోని ప్రశ్నలకు జవాబు గుర్తించేటప్పుడు ఆ జవాబు (వాదనలు) ప్రకటనకు సంబంధించి ఉండాలి. కానీ నిజ జీవితానికి సంబంధించి అన్వయించుకోకూడదు.
- బలమైన వాదనే సరైన వాదన అవుతుంది. అవును అని ఉన్నా, లేదా కాదు అని ఉన్నా బలమైన వాదనే సరైంది.
- వాదనల్లో తిరిగి ప్రశ్నించినట్టు ఉంటే ఆ వాదన సరైంది కాదు.
- వాదనలు నిజాలుగా ఉండాలి. కానీ ఊహలుగా ఉండకూడదు.

ఉదాహరణ:

ప్రకటన: భారతదేశంలో రూపాయికే కిలో బియ్యం ఇవ్వొచ్చా?

వాదన –1: అవును, పేదరిక నిర్మూలనకు కేవలం ఇదొక్కటే మార్గం.

వాదన –2: కాదు, ప్రభుత్వంపై ఇప్పటికే అధిక భారం ఉంది.

సమాధానం: 2 మాత్రమే సరైంది

వివరణ: పేదరిక నిర్మూలనకు ఇదొక్కటే మార్గం అని చెప్పడం మిగతా అంశాలను విస్మరించినట్టే అవుతుంది కాబట్టి వాదన 1 సరైంది కాదు. కానీ వాదన 2 మాత్రమే సరైంది, బలంగా ఉంది.

మాదిరి ప్రశ్నలు

కింద ప్రకటనలు, వాటి కింద రెండు వాదనలు ఉన్నాయి. ఆ వాదనలను జాగ్రత్తగా విశ్లేషించి ఏ వాదన బలమైందో, ఏది బలహీనమైందో/ పేలవమైందో గుర్తించాలి. ఆప్షన్‌ను కింది విధంగా ఎంచుకోవాలి.

1. కేవలం వాదన–1 మాత్రమే బలమైంది అయితే.
2. కేవలం వాదన–2 మాత్రమే బలమైంది అయితే.
3. రెండు వాదనలూ సరైనవి కాకపోతే.
4. రెండు వాదనలూ సరైనవి అయితే.

1. **ప్రకటన:** భారత్‌లో ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి వలస వెళ్లడం నిషేధించాలా?
వాదన –1: కాదు, ప్రతి పౌరుడు రాజ్యాంగం ప్రకారం దేశంలో ఎక్కడైనా నివసించవచ్చు.
వాదన –2: అవును, దీని ద్వారా వనరులు సద్వినియోగం అవుతాయి.
2. **ప్రకటన:** కళాశాలల్లో / యూనివర్సిటీల్లో విద్యార్థి సంఘాలు అవసరమా?
వాదన –1: లేదు, దీనివల్ల క్యాంపస్‌లో రాజకీయ వాతావరణం ఏర్పడుతుంది.
వాదన –2: అవును. ఇది అవసరం ఎందుకంటే విద్యార్థులే రేపటి రాజకీయ నాయకులు.
3. **ప్రకటన:** ఐక్యరాజ్యసమితిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం అవసరమా?
వాదన –1: అవును. భారత్ శాంతి సౌభ్రాతృత్వాన్ని కోరుకునే దేశం.
వాదన –2: కాదు. ఎందుకంటే ముందుగా భారత్‌లో పేదరికాన్ని తొలగించాలి.
4. **ప్రకటన:** పెళ్లికి ముందే కాబోయే జంటకు వైద్య పరీక్షలు అవసరమా?
వాదన –1: లేదు. అలాంటి ఆలోచన ఊహించలేనిది/ భరించరానిది.
వాదన –2: అవును. దీనివల్ల జన్యులోపాలతో పుట్టే బిడ్డల సంఖ్య తగ్గుతుంది.
5. **ప్రకటన:** ఎల్పీజీపై సబ్సిడీని విరమించాలా?
వాదన –1: లేదు. ఇది మామూలు ప్రజలపై భారాన్ని పెంచుతుంది.
వాదన –2: అవును. దీనివల్ల నిజమైన పేదలు లబ్ధిపొందడం లేదు.
6. **ప్రకటన:** కిరోసిన్‌పై సబ్సిడీ పెంచాలా?
వాదన –1: అవును. దీనిమూలంగా పేదలకు మేలు జరుగుతుంది.
వాదన –2: కాదు మన ఆర్థిక వ్యవస్థ పటిష్ఠంగా లేదు.
7. **ప్రకటన:** కత్తి కంటే కలం గొప్పదా?
వాదన –1: అవును. ఎందుకంటే రచయితలు ప్రజల ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేస్తారు.
వాదన –2: కాదు. ఎందుకంటే కత్తి బలంతో ఒక వ్యక్తి అందరినీ జయించవచ్చు.
8. **ప్రకటన:** ప్రయోగ పరీక్షల కోసం జంతువులను చంపాలా?
వాదన –1: అవును. అవి చాలా ఎక్కువ సంఖ్యలో ఉంటాయి కాబట్టి.
వాదన –2: కాదు. మేం అహింసకు సహకరిస్తాం.
9. **ప్రకటన:** సైన్యంలో చేరడానికి 18 ఏళ్ల లోపు వారిని అనుమతించాలా?
వాదన –1: లేదు. 18 ఏళ్ల లోపు వారికి శారీరక, మానసిక ఎదుగుదల తగినంత ఉండదు. కాబట్టి వారు ఆ భారాన్ని మోయలేరు.
వాదన-2: అవును. ఎక్కువ కాలం సైన్యంలో సేవ చేయడానికి, దేశంలో ఆర్మీని అభివృద్ధి చేయడానికి ఇది తోడ్పడుతుంది.
10. **ప్రకటన:** ప్రైవేటు రంగంలో కూడా బలహీన వర్గాల వారికి ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలా?
వాదన –1: లేదు. ప్రైవేటు రంగం వారు దీన్ని అంగీకరించరు.
వాదన –2: అవును. దీనివల్ల ఆర్థికంగా వెనకబడిన వర్గాల వారికి ఉపయోగకరంగా ఉంటుంది.
11. **ప్రకటన:** అన్ని పొగాకు ఉత్పత్తులను మనదేశంలో నిషేధించాలా?
వాదన –1: లేదు. దీనివల్ల నిరుద్యోగం పెరిగే అవకాశం ఉంది.
వాదన –2: కాదు. దీనివల్ల పొగాకు ఉత్పత్తుల నుంచి వచ్చే ఆదాయం ప్రభుత్వానికి సమకూరదు.
12. **ప్రకటన:** మనదేశంలో ఆదాయ పన్ను రద్దు చేయాలా?
వాదన –1: అవును. ఎందుకంటే రోజు కూలీ చేసుకునేవారికి ఇది అదనపు భారంగా మారుతుంది.
వాదన-2: లేదు. ఎందుకంటే రెవెన్యూ శాఖకు ఇది మంచి ఆదాయ వనరు అవుతుంది.
13. **ప్రకటన:** రక్షణ రంగంలా విద్యను కేంద్ర ప్రభుత్వం పరిధిలోకి తీసుకురావాలా?
వాదన –1: లేదు. విద్య రాష్ట్రానికి సంబంధించింది. దీన్ని రాష్ట్ర పరిధిలోనే ఉంచాలి.
వాదన –2: అవును. అన్ని రాష్ట్రాల్లో ఒకే విధమైన విద్యాభివృద్ధి సాధ్యపడాలంటే ఇది ఒక్కటే మార్గం.
14. **ప్రకటన:** వ్యవసాయంలో క్రిమి సంహారక మందుల వాడకం తగ్గించాలా?
వాదన –1: అవును. భూగర్భ జలాలు కలుషితం అవకుండా పరిరక్షించవచ్చు.
వాదన –2: కాదు. దీనివల్ల వ్యవసాయ ఉత్పత్తి తగ్గుతుంది.
15. **ప్రకటన:** ప్రజాస్వామ్యంలో అన్ని వార్తలు ప్రభుత్వ నియంత్రణలో ఉండాలా?
వాదన –1: అవును. ప్రత్యేకమైన వార్తలు మాత్రమే ప్రజల్ని కలవరపెడతాయి.
వాదన –2: కాదు. నియంత్రించిన వార్తలు విశ్వాసం కోల్పోతాయి.
16. **ప్రకటన:** ముంబైలో మళ్లీ పెద్ద పరిశ్రమల స్థాపన అవసరమా?
వాదన –1: అవును. వాటివల్ల కొత్తగా ఉద్యోగావకాశాలు లభ్యమవుతాయి.
వాదన –2: లేదు. వాటి వల్ల కాలుష్యం స్థాయి మరింత పెరుగుతుంది.
17. **ప్రకటన:** భారత్‌లో అన్ని రంగాల్లో కంప్యూటరీకరణ అవసరమా?
వాదన –1: అవును. వాటివల్ల పనినాణ్యత, కచ్చితత్వం పెరుగుతుంది.
వాదన –2: లేదు. దీనివల్ల ఉద్యోగాల్లో అసమానతలు పెరుగుతాయి. మానవ వనరులు నిరుపయోగం అవుతాయి.
18. **ప్రకటన:** విదేశాలతో నదుల అనుసంధానంపై ప్రణాళిక అవసరమా?
వాదన –1: అవును. ఎందుకంటే అతివృష్టి, అనావృష్టిలను ఎదుర్కొనొచ్చు.
వాదన –2: కాదు. ఎక్కువ ధనం ఖర్చు అవుతుంది.
19. **ప్రకటన:** మీడియాలో పొగాకు ఉత్పత్తుల ప్రకటనలను నిషేధించాలా?
వాదన –1: అవును. కేవలం ఇలా మాత్రమే ప్రజలను కేన్సర్ నుంచి రక్షించొచ్చు.
వాదన –2: లేదు. దీనివల్ల పొగాకు అమ్మకాలు తగ్గుతాయి.
20. **ప్రకటన:** ఎవరైతే డ్రగ్స్‌కు బానిసై ఇతరులను కూడా ఆ దురలవాట్లకు లోను చేస్తారో వారికి కఠిన శిక్షలు అమలు చెయ్యాలా?
వాదన –1: కాదు. ఎవరూ.. ఎవరి జీవితాన్ని ప్రభావితం చేయరు.
వాదన –2: అవును. ఎవరైతే వారి జీవితంతోపాటు ఇతరుల జీవితాన్ని కూడా నాశనం చేయాలనుకుంటారో వాళ్లు చాలా ప్రమాదం.
21. **ప్రకటన:** ఐదో తరగతి వరకు ఉండే అన్ని వార్షిక పరీక్షలు రద్దు చేయాలా?
వాదన –1: అవును. చిన్న వయసులో విద్యార్థులపై అధిక భారం మోపొద్దు. అలాంటి పరీక్షలు వారి శారీరక, మానసిక ఎదుగుదలపై దుష్ప్రభావం చూపుతాయి.
వాదన –2: కాదు. అలా చేస్తే విద్యార్థులు శ్రద్ధగా చదవలేరు. అయినప్పటికీ పై తరగతులకు వెళతారు. దీనివల్ల భవిష్యత్తులో చదవబోయేది సమస్యగా మారవచ్చు.
22. **ప్రకటన:** భారతదేశంలోని పత్రికలకు పూర్తి స్థాయిలో స్వేచ్ఛ స్వాతంత్ర్యాలు ఇవ్వాలా?
వాదన –1: అవును. దీనివల్ల ప్రజలు రాజకీయం గురించి పూర్తిగా తెలుసుకుంటారు.
వాదన –2: లేదు. దీనివల్ల అనేక సమస్యలు తలెత్తుతాయి.
23. **ప్రకటన:** మనదేశంలో వైద్యవృత్తిని జాతీయం చేయాలా?
వాదన –1: లేదు. ఏ దేశం ఇలాంటి ప్రజాస్వామ్య విరుద్ధ చర్యలు చేపట్టదు.
వాదన –1: అవును. దీనివల్ల అవినీతి వైద్య ప్రాక్టీషనర్‌లను తొలగించవచ్చు.

సమాధానాలు

1) 1;	2) 4;	3) 1;	4) 2;
5) 1;	6) 1;	7) 1;	8) 3;
9) 1;	10) 2;	11) 3;	12) 2;
13) 1;	14) 2;	15) 2;	16) 4;
17) 4;	18) 4;	19) 3;	20) 2;
21) 2;	22) 1;	23) 3.	

ఖండవల్లి లక్ష్మీ రంజనం ఎప్పుడు జన్మించారు?

తెలంగాణ వైతాళికులు

ఖండవల్లి లక్ష్మీ రంజనం

మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ పరిపాలనా కాలంలో తెలుగు సాహిత్యానికి, చరిత్రకు ఖండవల్లి లక్ష్మీ రంజనం విశేష సేవ చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆచార్యుడిగా పనిచేసిన ఆయన విద్యార్థుల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించారు. కర్తవ్య నిర్వహణలో అనునిత్యం అప్రమత్తంగా ఉండేవారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు భాషకు ప్రముఖ స్థానం లభించడం వెనుక ఆయన విశేష కృషి దాగి ఉంది.

ఖండవల్లి లక్ష్మీ రంజనం 1908లో తూర్పు గోదావరి జిల్లా కొత్తపేట తాలూకాలోని బెల్లంపూడిలో జన్మించారు. బెల్లంపూడి సమీపంలోని ఊడుమూడులో ప్రాథమిక విద్య, అమలాపురంలో రెండో ఫారంను అభ్యసించారు. ఆయన తండ్రయిన సూర్యనారాయణ శాస్త్రి వరంగల్ మట్టెవాడలోని త్రిలింగాంధ్రాయుర్వేద కళాశాలలో సంస్కృత పండితుడిగా పని చేసేవారు. దీంతో లక్ష్మీ రంజనం కూడా వరంగల్ వచ్చి హన్మకొండ హైస్కూల్‌లో మెట్రిక్యులేషన్ పూర్తి చేశారు. 1924లో నిజాం కళాశాలలో బీఏ సంస్కృతం చదివి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. తర్వాత సిటీ కాలేజీలో ఇంగ్లిష్ టీచర్‌గా కొంత కాలం పనిచేశారు. 1936లో ఎంఏ (తెలుగు-సంస్కృతం)లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు లెక్చరర్‌గా చేరారు. రాయప్రోలు సుబ్బారావు పదవీ విరమణ చేశాక ఆచార్య (ప్రొఫెసర్) పీఠాన్ని అధిష్ఠించారు.

ఖండవల్లికి విద్యార్థి దశ నుంచే ఆదిరాజు వీరభద్రరావు లాంటి పరిశోధకులతో, గోలకొండ పత్రికా సంపాదకులు సురవరం ప్రతాపరెడ్డి లాంటి ప్రజా సాహిత్య సేవకులతో, లోకనంది నారాయణ లాంటి సాహిత్య పోషకులతో పరిచయం ఏర్పడింది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో రెక్టార్ కిషన్ చంద్ లక్ష్మీ రంజనానికి సహాయ సహకారాలు అందజేశారు. కొమర్రాజు లక్ష్మణరాయ గ్రంథాలు ఖండవల్లిని విశేషంగా ప్రభావితం చేశాయి. ఖండవల్లి 1936 నుంచే సాహిత్యసేవ ప్రారంభించారు. 'తెలుగుదుక్కి' శీర్షికతో వ్యాసాలు ప్రచురించారు. త్రివేణి లాంటి ఆంగ్ల పత్రికల్లో ఆధునిక కవిత్వం గురించి అనేక వ్యాసాలు రాశారు.

హైదరాబాద్‌లోని శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం కార్యదర్శిగా రెండేళ్లపాటు పనిచేశారు. పుస్తకాల సేకరణ, చందాల కోసం తెలంగాణ అంతటా పర్యటించారు. వర్ధంతులు, జయంతులు ఎన్నో జరిపారు. ఆంధ్ర సారస్వత పరిషత్ సభ్యులుగా పనిచేసి దాని విస్తరణకు విశేష కృషి చేశారు. 'నిజాం రాష్ట్ర గ్రంథాలయ సంఘం' కార్యదర్శిగా కూడా పనిచేశారు. కొమర్రాజు వదిలి



పెట్టిన 'విజ్ఞాన సర్వస్వం' పూర్తి చేయాలనే ఉద్దేశంతో కొందరు మిత్రులతో కలిసి గ్రంథావలోకనం, విషయ సేకరణ ప్రారంభించారు. 1940ల్లో రెండో ప్రపంచ యుద్ధ సమయంలో విద్యుద్దీపాలు లేనందున ఆముదం దీపాల వెలుతురులోనే తన కృషిని కొనసాగించారు. 1944 నాటికి 'విజ్ఞాన సర్వస్వం' పూర్తి చేయాలని భావించారు. ఇందుకోసం 'మహారాష్ట్ర జ్ఞాన కోశ్'ని ఆధారంగా తీసుకున్నారు. నాలుగైదు సంపుటాల విషయ సేకరణ చేశారు. ముద్రణకు సిద్ధమైన ఆ సంపుటాలు చోరీకి గురికావడం వల్ల విజ్ఞాన సర్వస్వాన్ని ముద్రించడం సాధ్యపడలేదు.

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సంస్కృతి గురించి పాఠాలు బోధించారు. దానికోసం చేసిన అధ్యయన ఫలితంగానే ఆంధ్రుల చరిత్ర -సంస్కృతి, ఆంధ్ర సాహిత్య చరిత్ర సంగ్రహం లాంటి గొప్ప గ్రంథాలను రచించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక 'విజ్ఞాన సర్వస్వం' ప్రచురణ కోసం ప్రభుత్వం ద్వారా తిరిగి ప్రయత్నించారు. ఆంధ్ర సారస్వత పరిషత్ వ్యవస్థాపకులు బిరుదు వెంకటశేషయ్య, లోకనంది నారాయణ అంతకు ముందే ప్రయత్నించి విఫలమయ్యారు. మిత్రులు, అభిమానులు సహాయం చేస్తారనే నమ్మకంతో 1953లో బేతన భట్ల విశ్వనాథంతో కలిసి సంగ్రహ ఆంధ్ర విజ్ఞాన కోశ సమితి సంఘాన్ని స్థాపించారు. దీనికి మిమిడి పూడి వెంకట రంగయ్య చైర్మన్‌గా వ్యవహరించారు. ఈ సంఘం ద్వారా సంగ్రహ ఆంధ్ర విజ్ఞాన కోశం నాలుగు సంపుటాలను ప్రచురించారు.ఖండవల్లి ఆంధ్ర రచయితల సంఘానికి అధ్యక్షులుగా పనిచేసి దాని తరఫున సిద్ధేశ్వర చరిత్ర, ప్రసన్న రాఘవ నాట్య ప్రబంధం, సంస్కృతంలో అహోబిల పండితీయం (ఆంధ్ర వ్యాఖ్యా సహితం) ప్రచురించారు. ఓరియంటల్ కాలేజీని స్థాపించి 1958లో బీవోఎల్, డీవోఎల్ లాంటి ప్రాచ్యపట్టాలను విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేశారు. స్వామి వివేకానంద కమిటీ హైస్కూల్‌కు కార్యదర్శిగా పనిచేసి దాని భవనాన్ని నిర్మించారు.

ఖండవల్లి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పనిచేసిన సమయంలో తెలుగు భాషకు, తెలుగు ప్రజలకు విశేష సేవలందించారు. ఆయన ఆచార్య పదవిని చేపట్టాక ఎంఏలో సంస్కృతం లేదా ద్రావిడ భాషల్లో ఏదో ఒకటి తప్పకుండా ఎంచుకునేలా ఏర్పాటు చేశారు. తెలుగును ద్వితీయ భాష చేయడం కోసం అకడమిక్ కౌన్సిల్‌తో పోరాడి విజయం సాధించారు. పీహెచ్‌డీని ప్రవేశపెట్టారు. విద్యార్థుల్లో తెలుగంటే మన మాతృభాష అనే భావన కలిగేలా చేశారు. విద్యార్థులతో అనేక మంది కవులపై చర్చాగోష్ఠులు నిర్వహించి, పరిశోధనాభిరుచి పెంపొందించేందుకు కృషి చేశారు. మహాభారతం, నాటకాలు, కవులపై సదస్సులు నిర్వహించి వాటిని గ్రంథ రూపంలో తెచ్చారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం తరఫున ఆంధ్ర మహాభారతాన్ని పునర్ముద్రించారు. తెలంగాణ మాండలికాల అధ్యయనానికి పథకాన్ని ప్రవేశపెట్టారు. ఆంధ్రదేశ చారిత్రక భూగోళం (ది హిస్టారికల్ జాగ్రఫీ ఆఫ్ ఆంధ్ర) రచనకు ప్రయత్నం చేశారు.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర

ఇల్లిందల సరస్వతీ దేవి

ఇల్లిందల సరస్వతీ దేవి తల్లిదండ్రులు కామరాజు వెంకట లక్ష్మమ్మ, వెంకటప్పయ్య. ఈమె తండ్రి వెంకటప్పయ్య 1928లో నందిగామ తహసీల్దార్‌గా పని చేశారు. అదే సంవత్సరంలో ఇల్లిందల సీతారామరావుతో పన్నెండేళ్ల వయస్సులో సరస్వతీ దేవికి వివాహం చేశారు. అప్పుడు ఆమె రెండో ఫారం చదువుతున్నారు. ఆమె హైదరాబాద్‌లోని స్టాన్లీ గర్ల్స్ హైస్కూల్‌లో మెట్రిక్యులేషన్ వరకు చదివారు. చిన్న వయస్సులోనే తల్లి కావడంతో పై చదువులు చదవలేకపోయారు. తీరిక వేళల్లో ట్రూ స్టోరీ మేగజీన్ లాంటి కథల పత్రికలను చదివి, జిజ్ఞాసతో వాటిని అధ్యయనం చేశారు. ఆమె భర్త సీతారామరావు ఎం.సి. చేసి, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విజ్ఞానశాస్త్ర ఉపన్యాసకులుగా పని చేసేవారు. ఆయన తన భార్యను ఎంతో ప్రోత్సహించారు. సరస్వతీ దేవి తన విజ్ఞానాన్ని మహిళలు, ప్రజల సేవకు వినియోగించింది.

ఆంధ్రయువతీ మండలి స్థాపన

ఆ రోజుల్లో తెలంగాణలో మహిళల పరిస్థితి దయనీయంగా ఉండేది. ముస్లింలు చాలా ముందంజలో ఉండేవారు. కానీ హిందువుల్లోని మధ్య తరగతి మహిళలు ఎంతో వెనుకబడి ఉండేవారు. ఉన్నత తరగతి స్త్రీల సంగతి చెప్పనక్కర్లేదు. సర్వసతీ దేవి విద్యార్థి దశ నుంచే 'ఆంధ్రమహిళా సభ' కార్యకలాపాల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించేవారు. మధ్యతరగతికి చెందిన హిందూ స్త్రీల కోసం , ముఖ్యంగా తెలుగువారి ప్రగతి కోసం ప్రత్యేకంగా ఒక సంస్థను నెలకొల్పాలని ఆమె భావించారు. యల్లాప్రగడ సీతాకుమారితో కలిసి 1934లో 'ఆంధ్రయువతీ మండలి'ని హైదరాబాద్‌లో స్థాపించారు. దీనికి రంగమ్మ ఓబుల్‌రెడ్డి అధ్యక్షురాలిగా వ్యవహరించారు.

ఆంధ్రయువతీ మండలిని స్థాపించాక అందులో సభ్యులను చేర్చడం కష్టమైంది. నాటి కష్టాలను సరస్వతీ దేవి తన మాటల్లో ఇలా చెప్పారు. 'సభ్యులను చేర్చుకోవడానికి బయల్దేరే వాళ్లం. ఉన్నత కుటుంబాలకు చెందిన స్త్రీలు బయటకు వచ్చేవారు కాదు. సంస్థానాల రాణులు, జాగీర్దారిణీలు మాతో ముఖాముఖిగా మాట్లాడేవారు కాదు. పరదా వెనుక లీలగా కనిపిస్తూ చెలికత్తెల ద్వారా లేదా ఆయాలతో కబురు పంపేవారు. సభ్యత్వ జాబితాలో తమ పేర్లను బిరుదులతో సహా రాయాలని పదే పదే చెప్పేవారు. యువతీ మండలికి సురవరం ప్రతాపరెడ్డి అసతోమా సద్గమయ అనే నినాదాన్ని సూచించారు. నియమావళిని బూర్గుల రామకృష్ణారావు సిద్ధం చేశారు.' ఆంధ్రయువతీ మండలి కోసం సరస్వతీ దేవి పన్నెండేళ్ల పాటు శ్రమించారు. యువతీ మండలిలో కార్యదర్శి, ఉపాధ్యక్ష పదవులను నిర్వహించారు. బూర్గుల రామకృష్ణారావు భార్య అనంత లక్ష్మీదేవి అధ్యక్షురాలిగా ఉన్న సమయంలో 'ఆంధ్రయువతీ మండలి' కోసం బర్కత్‌పురాలో పెద్ద భవంతిని నిర్మించారు. ఇల్లిందల సరస్వతీ మండలిలో శాశ్వత సభ్యురాలు. ఈమె మండలి అభివృద్ధితోపాటు, భారత సంఘ సంక్షేమాల్లో సభ్యురాలిగా, బందిఖానాలు, ఆసుపత్రుల పర్యవేక్షకురాలిగా, శిశు సంక్షేమ సంఘ సభ్యురాలిగా ఎన్నో నూతన పథకాలను సూచించారు. ఆంధ్ర సారస్వత పరిషత్ నిర్వాహక సభ్యురాలిగా, శ్రీకృష్ణదేయరాయాంధ్ర భాషానిలయ నిర్వాహక సభ్యురాలిగా కొంత కాలం పాటు పనిచేశారు. దక్షిణ భారత హిందీ ప్రచార సభ హైదరాబాద్ శాఖకు నిర్వాహక సభ్యురాలిగా, ఉపాధ్యక్షులుగా కేంద్ర గ్రంథాలయ, శిశు శాఖ సభ్యురాలిగా ఆమె విశేష కృషి చేశారు.

సరస్వతీ దేవి రచనలు

ఆమె రచించిన మొదటి కథ, మొదటి వ్యాసం 1933లో 'గోలకొండ' పత్రికలో ప్రచురితమయ్యాయి. మహిళా, శిశు జనోద్ధరణ లక్ష్యంగా హైదరాబాద్‌లోని రేడియో కేంద్రానికి వ్యాసాలు, నాటికలు, కథలు రాశారు. జీవన సామరస్యం, నారీ జగత్తు, వెలుగు బాటలు, పండుగ బహుమతి, అక్కరకు వచ్చిన చుట్టం, ముత్యాల మనసు, పండుగ బహుమతి, జాతిరత్నాలు, బాలవీరులు మొదలైనవి ఆమె రచనలు. సరస్వతీ దేవి తల్లి వెంకట లక్ష్మమ్మ బ్రహ్మ సమాజ నాయకులైన దేశిరాజు పెదబాపయ్య సోదరి. కాబట్టి సరస్వతీ దేవికి చిన్నతనం నుంచే సంస్కరణ భావాలు అలవడ్డాయి. కానీ ఆమె ఇద్దరు పిల్లలు మరణించడంతో సనాతన సంప్రదాయాల పట్ల ఆసక్తి చూపారు. 1958లో ఆంధ్రప్రదేశ్ శాసనమండలి ఏర్పాటైనప్పుడు ఆమె చేసిన సంఘ సేవకు గుర్తుగా మండలిలో సభ్యత్వం లభించింది. సరస్వతీ దేవి తన రచనల్లో వర్తమాన సమస్యలను ప్రధానంగా చర్చించేవారు. 'నీలో చాలా శక్తి దాగి ఉంది. దాన్ని ఉపయోగించి ప్రకాశించడానికి ప్రయత్నించు. మగవారిపై కోపం వద్దు, దేన్నీ యాచించవద్దు. సంపాదించుకోవాలి' అనే సూచనలు ఆమె రచనల్లో కన్పిస్తాయి. సరస్వతీ దేవి దాదాపు మూడు దశాబ్దాల పాటు రచనలు చేశారు.

మాదిరి ప్రశ్నలు

1. ఖండవల్లి లక్ష్మీ రంజనం ఎప్పుడు జన్మించారు?
   1) 1908 2) 1925
   3) 1910 4) 1945
2. నిజాం రాష్ట్ర గ్రంథాలయ సంఘం కార్యదర్శిగా పనిచేసిందెవరు?
   1) సురవరం ప్రతాపరెడ్డి
   2) ఆదిరాజు వీరభద్రరావు
   3) కొమర్రాజు లక్ష్మణరావు
   4) ఖండవల్లి లక్ష్మీ రంజనం
3. ఆంధ్రుల చరిత్ర-సంస్కృతి, ఆంధ్ర సాహిత్య చరిత్ర సంగ్రహం గ్రంథాలు ఎవరు రచించారు?
   1) కొమర్రాజు లక్ష్మణరావు
   2) ఆదిరాజు వీరభద్రరావు
   3) ఖండవల్లి లక్ష్మీ రంజనం
   4) సురవరం ప్రతాపరెడ్డి
4. సంగ్రహ ఆంధ్ర విజ్ఞాన సర్వస్వం కోశాన్ని ఎవరు రచించారు?
   1) ఖండవల్లి లక్ష్మీ రంజనం
   2) సురవరం ప్రతాపరెడ్డి
   3) కొమర్రాజు వెంకట లక్ష్మణరావు
   4) విశ్వనాథ సత్యనారాయణ
5. హైదరాబాద్‌లో ఆంధ్రయువతీ మండలిని ఏ సంవత్సరంలో స్థాపించారు?
   1) 1942 2) 1934
   3) 1936 4) 1952
6. జాతిరత్నాలు, నారీ జగత్తు, జీవన సామరస్యం లాంటి రచనలు చేసింది ఎవరు?
   1) అనంత లక్ష్మీదేవి
   2) ఇల్లిందల సరస్వతీ దేవి
   3) ఎల్లాప్రగడ సీతాకుమారి
   4) సరోజినీ నాయుడు
7. ఆంధ్రయువతీ మండలి తొలి అధ్యక్షురాలిగా పనిచేసింది ఎవరు?
   1) ఎల్లాప్రగడ సీతాకుమారి
   2) ఇల్లిందల సరస్వతీ దేవి
   3) దుర్గాబాయి దేశ్‌ముఖ్
   4) రంగమ్మ ఓబులరెడ్డి
8. 'తెలుగుదుక్కి' శీర్షికతో వ్యాసాలు ప్రచురించింది ఎవరు?
   1) ఖండవల్లి లక్ష్మీ రంజనం
   2) ఇల్లిందల సరస్వతీ దేవి
   3) కొమర్రాజు వెంకట లక్ష్మణరావు
   4) విశ్వనాథ సత్యనారాయణ

సమాధానాలు

1) 1; 2) 4; 3) 3;
4) 1; 5) 2; 6) 2;
7) 4; 8) 1.

Although it might be possible



BANK EXAMS

ENGLISH

Model Questions

Directions (Q. No. 1-10): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. Mark (5) as your answer, if there is 'No error'.

1. This chapter briefly survey (1)/ the current (2)/ state of (3)/ European politics. (4) No error (5)

2. We surveyed 3000 smokers (1)/ and find that over (2)/ three quarters (3)/ would like to give up. (4) No error (5)

3. The police officer (1)/ was suspended (2)/ while the complaint (3)/ was investigating. (4) No error (5)

4. A number of doctors (1)/ came under (2)/ suspicion of (3)/ unethical behaviors. (4) No error (5)

5. Our staff will done (1)/ their best to make (2)/ sure you (3)/ enjoy your visit. (4) No error (5)

6. She longed to find somebody (1)/ who understand her problems, (2)/ and in him (3)/ she had found such a person. (4) No error (5)

7. Her version of events (1)/ is subtly different (2)/ for what (3)/ actually happened. (4) No error (5)

8. I tried to discuss it (1)/ with her but succeeded only (2)/ in making (3)/ her angry. (4) No error (5)

9. He's been hit (1)/ by a succession (2)/ of injuries (3)/ from he joined the team. (4) No error (5)

10. Developments (1)/ on this issue (2)/ will be dealing within (3)/ a subsequent report. (4) No error (5)

Directions (Q. No. 11-15): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

11. He suffered a _____ defeat in the election.
1) thunder 2) applaud
3) stunning 4) super
5) blast

12. The new manager has strengthened the _____ by bringing in several _____ players.
1) coach; youngest
2) players; young
3) match; youth
4) team; promise
5) side; younger

13. The author _____ the different strands of the plot together in the _____ chapter.
1) knits; late
2) stitch; conclusion
3) draws; final
4) put; terminal 5) makes; end

14. I wanted to _____ in India on the way to Australia.
1) steps 2) stop of
3) stop over 4) stop on
5) stop out

15. I have lost my key and I haven't got a _____.
1) space 2) room
3) place 4) spare
5) scope

Directions (Q. No. 16-20): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A. Dry ice was manufactured in 1925.

B. Since it evaporates instead of melting, it is cleaner to use.

C. Dry ice is made by freezing a gas called carbon dioxide.

D. Can you imagine ice that does not melt and is not wet? Then you can imagine dry ice.

E. It is more practical than ordinary ice because it takes up less space and is 142 degrees colder.

F. Dry ice is quite different from ordinary ice, which is simply frozen water.

16. What is the LAST sentence after rearrangement?
1) A 2) B 3) C 4) E 5) F

17. What is the THIRD sentence after rearrangement?
1) A 2) B 3) D 4) F 5) E

18. What is the FOURTH sentence after rearrangement?
1) A 2) C 3) D 4) E 5) F

19. What is the FIRST sentence after rearrangement?
1) B 2) A 3) C 4) D 5) F

20. What is the SECOND sentence after rearrangement?
1) A 2) B 3) C 4) E 5) F

Directions (Q. No. 21-25): Which of the phrases (1), (2), (3) and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

21. This smart washing machine will dispense an larger part of water for the load.
1) great load
2) maximum portion
3) optimal amount 4) major part
5) No correction required

22. How many countries have signing to the Kyoto protocol on climate change?
1) sign for 2) signed up
3) signed for 4) signed at
5) No correction required

23. This mark is signifying that the products conform to an approved standard.
1) was signifying
2) is significant 3) signifies
4) significantly
5) No correction required

24. More than 70,000 shopkeepers have been forced to put upon the shutter in the past year.
1) put on 2) put of 3) put in
4) put up
5) No correction required

25. The movie is now shown at all major movie theatres.
1) is showing
2) is being showing
3) is now showing
4) was showing
5) No correction required

Directions (Q. No. 26-35): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

Over one hundred years ago, the news that gold _______ (26) discovered in California electrified the ______ (27) nation. Immediately, thousands of men ______ (28) West with but one concern- to get to California before the next fellow. Everyone was ______ (29) that he would find gold and become ______ (30). _______ (31) did the travelers know about the hardships and inconveniences they would have to _______ (32): desert heat, mountain cold, miles of mud, raging rivers. ______ (33), they would be menaced by hostile Indians, ferocious beasts, starvation and disease. How many people _______ (34) in the gold rush nobody knows; what is known is that thousands of the more self-reliant travelers did get to their _______ (35), did find gold, and did become wealthy. In five years, the population of California rose from 5000 to 100000.

26. 1) had been 2) has been
3) have been 4) will be
5) would be

27. 1) complete 2) entire
3) pure 4) colossal 5) absolute

28. 1) run 2) flow 3) rushed
4) flown 5) fly

29. 1) secure 2) in no doubt
3) unsure 4) confident 5) safe

30. 1) well 2) rolling
3) steep 4) flush 5) wealthy

31. 1) Little 2) Few 3) Many
4) Much 5) Modest

32. 1) continue 2) endure
3) last 4) carry 5) go

33. 1) Also 2) Beside
3) Besides 4) Above 5) Beyond

34. 1) die 2) dye 3) dying
4) died 5) will die

35. 1) end 2) target 3) purpose
4) intention 5) destination

Directions (Q. No. 36-45): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

Sedimentation is the tendency for particles in suspension to settle out of the fluid in which they are entrained, and come to rest against a barrier. This is due to their ____ (36) through the fluid in response to the forces acting on them: these forces can be ____ (37) to gravity, centrifugal acceleration or electromagnetism. In geology sedimentation is ____ (38) used as the polar opposite of erosion, i.e., the terminal end of sediment transport. In that _____ (39) it includes the termination of transport by saltation or true bed load transport. Settling is the falling of suspended particles through the liquid, whereas sedimentation is the ____ (40) of the settling process.

Sedimentation _____ (41) pertain to objects of various sizes, ranging from large rocks in flowing water to suspensions of dust and pollen particles to cellular suspensions to solutions of single molecules such ____ (42) proteins and peptides. Even __ (43) molecules supply a sufficiently strong force to produce significant sedimentation.

The term is typically used in geology, to describe the deposition of sediment which ____ (44) in the formation of sedimentary rock, and in various chemical and environmental fields to describe the motions _____ (45) often-smaller particles and molecules.

36. 1) motion 2) proposal
3) suggestion 4) submission
5) imply

37. 1) for 2) due 3) from
4) according 5) along

38. 1) frequent 2) rare 3) often
4) usual 5) lot

39. 1) ideally 2) normally
3) direction 4) sense 5) mean

40. 1) accumulate 2) equip
3) develop 4) perpetuate
5) termination

41. 1) may 2) must 3) will
4) might 5) should

42. 1) like 2) as 3) so
4) that 5) are

43. 1) normal 2) usually
3) small 4) major
5) close

44. 1) outcome 2) comes
3) produces 4) results
5) impacts

45. 1) off 2) with 3) about
4) among 5) of

Key

1) 1; 2) 2; 3) 4; 4) 4; 5) 1;
6) 2; 7) 3; 8) 2; 9) 4; 10) 3;
11) 3; 12) 5; 13) 3; 14) 3; 15) 1;
16) 2; 17) 4; 18) 1; 19) 4; 20) 3;
21) 3; 22) 2; 23) 3; 24) 4; 25) 3;
26) 1; 27) 2; 28) 3; 29) 4; 30) 5;
31) 1; 32) 2; 33) 3; 34) 4; 35) 5;
36) 1; 37) 2; 38) 3; 39) 4; 40) 5;
41) 1; 42) 2; 43) 3; 44) 4; 45) 5.